సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 215

గురువారం 20-4-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'




రాజస్తాన్ బోల్తా

10 పరుగులతో నెగ్గిన లక్నో. రాణించిన మేయర్స్, అవేశ్ - 12లో



డిజిటల్ హైవేలు

2025 నాటికి 10 వేల కి.మీ మేర ఏర్పాటు చేయనున్న ఎన్‌హెచ్‌ఏఐ - 13లో



ఐదుగురు పోలీసుల సస్పెన్షన్

గ్యాంగ్‌స్టర్ అతీక్ అహ్మద్‌కు రక్షణ కల్పించడంలో విఫలమయ్యారంటూ ఐదుగురు పోలీసులను యూపీ ప్రభుత్వం సస్పెండ్ చేసింది.


వివరాలు 6లో ▸



క్వాంటమ్ మిషన్‌కు ఆమోదం

క్వాంటమ్ టెక్నాలజీలో శాస్త్రీయ అభివృద్ధికి ఉద్దేశించిన నేషనల్ క్వాంటమ్ మిషన్‌కు కేంద్ర మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది.

వివరాలు 6లో ▸



జోరందుకున్న నామినేషన్ల పర్వం

శిగ్గావ్ నియోజకవర్గం నుంచి కర్ణాటక సీఎం బొమ్మై, వరుణ స్థానం నుంచి మాజీ సీఎం సిద్ధరామయ్య నామినేషన్లు దాఖలు చేశారు.

వివరాలు 6లో ▸



కొత్త ఓటరండీ!

కర్ణాటకలో ఈ సారి 11 లక్షల మంది కొత్త ఓటర్లు రిజిస్టర్ చేసుకున్నట్టు కేంద్ర ఎన్నికల సంఘం గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

వివరాలు 6లో ▸



శ్రీకాకుళం జిల్లా నౌపడలో జరిగిన సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం



ఉత్తరాంధ్రలో కొత్త చరిత్ర

శ్రీకాకుళం అభివృద్ధికి మూల స్తంభమైన మూలపేట పోర్టుకు శంకుస్థాపన

రూ.4,362 కోట్లతో పోర్టు, మౌలిక వసతుల అభివృద్ధి

నౌపడ బహిరంగ సభలో సీఎం వైఎస్ జగన్

- మూలపేట పోర్టు అనుబంధ పరిశ్రమలతో స్థానికులకు భారీగా ఉపాధి
- గొట్టా బ్యారేజీ ఎత్తిపోతల పథకానికి రూ.176.35 కోట్లతో శ్రీకారం
- బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్‌కు రూ.365.81 కోట్లతో శంకుస్థాపన
- మహేంద్ర తనయ ఆఫ్‌షోర్ ప్రాజెక్టు పనులు ముందుకు
- రూ.852.45 కోట్లతో పునఃప్రారంభానికి శ్రీకారం
- త్వరలో నాగావళి–వంశధార నదుల అనుసంధానం
- 3న భోగాపురం విమానాశ్రయం, అదానీ డేటా సెంటర్‌కు శంకుస్థాపన
- అందరికీ ఆమోద యోగ్యమైన విశాఖలో సెప్టెంబర్ నుంచి మకాం
- ఇంత అభివృద్ధి.. నాడు ఎందుకు జరగలేదో ఆలోచించండి

2లో

"మనం అధికారంలోకి రాక ముందు స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు పూర్తయినా కూడా ఈ రాష్ట్రం మొత్తం మీద నాలుగు లొకేషన్లలో ఆరు పోర్టులు మాత్రమే ఉన్నాయి. మీ బిడ్డ ప్రభుత్వం వచ్చాక, ఈ 46 నెలల కాలంలో మరో నాలుగు పోర్టులు, పది ఫిషింగ్ హార్బర్లకు శ్రీకారం చుట్టాం. మరో మూడు ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి. ఇవి కాకుండా మరో ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌కు అప్రూవల్ తీసుకున్నాం. వేగవంతంగా నిర్మాణంలోకి తీసుకువస్తాం. తద్వారా పారిశ్రామికాభివృద్ధికి తీర ప్రాంతం వేదిక అవుతుంది. లక్షల మంది మన పిల్లలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి."

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

తోడేళ్లన్నీ కలిసి చీకటి యుద్ధం

- పెత్తందార్ల కోసం టీడీపీ.. పేదల కోసం నేను
- అబద్ధాలను నిజం చేయాలని వారంతా దుష్ప్రచారం
- దేవుడు, ప్రజలే నా ధైర్యం, నమ్మకం, విశ్వాసం
- మీకు మంచి జరిగితేనే నాకు తోడుగా నిలవండి
- బహిరంగ సభలో సీఎం వైఎస్ జగన్ వ్యాఖ్యలు

2లో

నల్ల 'మార్గం'లో!

'మార్గదర్శి' రశీదు డిపాజిట్ల ముసుగులో భారీగా బ్లాక్‌మనీ మార్పిడి

- ఆ నల్లధనాన్నే తమ సంస్థల్లో పెట్టుబడులుగా తరలించిన రామోజీ
- 7 బ్రాంచీల్లో సీఐడీ సోదాలు.. కీలక ఆధారాలు లభ్యం
- మరికొద్ది రోజులు కొనసాగనున్న సోదాలు




అనంతపురంలోని మార్గదర్శి కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న సీఐడీ అధికారులు

సాక్షి, అమరావతి: భారీగా నల్లధనం మార్పిడికి మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయాలు కేంద్ర స్థానంగా మారినట్లు సీఐడీ గుర్తించింది. రశీదుల రూపంలో బ్రాంచీ కార్యాలయాల నుంచి ప్రధాన కార్యాలయానికి చేరిన భారీ నిధుల వెనుక మనీ లాండరింగ్ ఉన్నట్లు వెల్లడైంది. రాష్ట్రవ్యాప్తంగా ఏడు చోట్ల మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయాల్లో సీఐడీ అధికారుల బృందం బుధవారం సోదాలు నిర్వహించి పలు కీలక పత్రాలను సేకరించింది. చందాదారుల నిధుల మళ్లింపు, అక్రమ పెట్టుబడులు, అక్రమ డిపాజిట్ల సేకరణ తదితర అభియోగాలతో ఏ–1గా మార్గదర్శి చిట్‌ఫండ్స్ చైర్మన్ చెరుకూరి రామోజీరావు, ఏ–2గా చెరుకూరి శైలజా కిరణ్, ఏ–3గా బ్రాంచీ మేనేజర్లపై కేసులు నమోదైన విషయం విదితమే. ఈ కేసులో ఇటీవల రామోజీరావు, శైలజను విచారించడంతోపాటు హైదరాబాద్‌లోని మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రధాన కార్యాలయంలో సోదాలు చేపట్టి పలు అవకతవకలను గుర్తించారు. ఆ సోదాలకు కొనసాగింపుగా తాజాగా 7 చోట్ల మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచీ కార్యాలయాల్లో ఏకకాలంలో సోదాలు జరిగాయి. విశాఖ (సీతంపేట), రాజమహేంద్రవరం (శ్యామల థియేటర్ బ్రాంచి), ఏలూరు (నర్సింగరావుపేట బ్రాంచి), విజయవాడ (లబ్బీపేట బ్రాంచి), గుంటూరు (అరండల్‌పేట), నరసరావుపేట (సత్తెనపల్లి రోడ్ బ్రాంచి), అనంతపురం (లక్ష్మీనగర్ బ్రాంచి)లోని మార్గదర్శి కార్యాలయాల్లో ఉదయం 10కి మొదలైన సోదాలు అర్ధరాత్రి దాటిన తరువాత కూడా కొనసాగుతున్నాయి. చట్ట ప్రకారం నిర్వహించాల్సిన 12 రికార్డులకు సంబంధించి అవకతవకలకు పాల్పడినట్లు సీఐడీ అధికారుల సోదాల సందర్భంగా గుర్తించినట్లు సమాచారం. ఏటా దాదాపు రూ.600 కోట్ల వరకు నగదు రూపంలో మార్గదర్శి ప్రధాన కార్యాలయానికి అక్రమంగా బదిలీ చేసినట్లు గతంలో గుర్తించారు. ఆ నిధులను బ్రాంచి కార్యాలయాల నుంచి ఏ తేదీల్లో అక్రమంగా తరలించారనే అంశాలపై తాజా సోదాల్లో ప్రధానంగా దృష్టి సారించారు. ఏటా మార్చి 31న వచ్చినట్లు చూపిస్తున్న

మిగతా 10వ పేజీలో ▶

ఇంటికో ఉద్యోగమిస్తా



- సీఎం జగన్ వాలంటీర్ ఉద్యోగం తప్ప ఒక్క ఉద్యోగం ఇవ్వలేదు
- మద్యం ధరలు పెరగడంతో యువత గంజాయికి బానిసలవుతున్నారు.. భావనపాడు పోర్టు మంజూరు చేసింది నేనే
- ప్రతిపక్ష నేత చంద్రబాబు

3లో

సిరాజ్.. 'జట్టు' సంగతులు చెప్పు

అపరిచితుడి మెసేజ్‌పై అప్రమత్తమైన క్రికెటర్

వెంటనే బీసీసీఐకి ఫిర్యాదు

12లో

ఇదండీ సంగతి



మీ మతిమరుపు వల్ల తృణమూల్ నుంచి బీజేపీలోకి.. బీజేపీ నుంచి తృణమూల్‌లోకి.. మళ్లీ ఇప్పుడు బీజేపీలోకి మారుతూనే ఉన్నారా్సర్!!

పెట్టుబడుల ఆకర్షణలో ఏపీ నంబర్ 1

2022–23లో రూ.7.65 లక్షల కోట్ల ఒప్పందాలతో దేశంలోనే అగ్రస్థానం



- రూ.4.44 లక్షల కోట్లతో రెండో స్థానంలో గుజరాత్
- గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సుతో అత్యధిక లబ్ధి పొందిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్
- దేశంలో పెట్టుబడులపై 'ప్రాజెక్ట్స్ టుడే' సర్వే నివేదిక వెల్లడి

సాక్షి, అమరావతి: దేశంలోనే అత్యధికంగా పెట్టుబడులు ఆకర్షించిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో నిలిచింది. 2022–23లో 306 ప్రాజెక్టులకు సంబంధించి రూ.7,65,030 కోట్ల విలువైన పెట్టుబడి ఒప్పందాలతో ఏపీ అగ్రస్థానంలో ఉన్నట్లు ప్రాజెక్ట్స్ టుడే తాజా సర్వే వెల్లడించింది. అంతకుముందు ఏడాది ప్రథమ స్థానంలో ఉన్న గుజరాత్‌ను అధిగమించి ఏపీ నంబర్ వన్‌గా నిలిచింది. 2022–23లో టాప్ పది రాష్ట్రాల్లో 7,376 ప్రాజెక్టులకు సంబంధించి రూ.32,85,846 కోట్ల విలువైన ఒప్పందాలు కుదరగా ఏపీ నుంచే 23 శాతానికి పైగా పెట్టుబడుల ఒప్పందాలు జరగడం విశేషం. ఏపీ ఒప్పందాలు కుదుర్చుకున్న వాటిల్లో 57 భారీ ప్రాజెక్టుల విలువ రూ.7,28,667.82 కోట్లుగా ఉంది. ఇందులో ఏడు గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులకు సంబంధించినవి కాగా మరో 18 హైడల్ ఆధారిత విద్యుత్ ప్రాజెక్టులున్నాయి.

నైపుణ్యాభివృద్ధి, లాజిస్టిక్స్‌కు డిమాండ్..

గుజరాత్ రూ.4,44,420 కోట్ల విలువైన పెట్టుబడుల ఒప్పందాలను సాధించడం ద్వారా రెండో స్థానంలో నిలిచింది. సెమీ కండక్టర్ల తయారీకి సంబంధించి గుజరాత్ మూడు భారీ ప్రాజెక్టులను ఆకర్షించింది. కర్ణాటక రూ.4,32,704 కోట్ల పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా మూడో స్థానంలో నిలిచింది. తెలంగాణ రూ.1,58,482 కోట్ల విలువైన 487 ప్రాజెక్టులతో తొమ్మిదో స్థానంలో నిలిచింది. ప్రైవేట్ రంగంలో పెట్టుబడులకు అత్యంత ఆకర్షణీయమైన రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉండగా తర్వాత స్థానాల్లో

మిగతా 5వ పేజీలో ▶

వచ్చేస్తోంది 'నానో డీఏపీ'

- అర లీటర్ డీఏపీ బాటిల్ కేవలం రూ.600లే
- డీఏపీ బస్తాతో పోలిస్తే రూ.750 తక్కువకే
- ఈ తొలకరి నుంచే అందుబాటులోకి తెస్తున్న ఇఫ్కో
- ఇప్పటికే రైతుల మన్ననలు పొందిన నానో యూరియా
- సూక్ష్మ ఎరువుల వినియోగంపై రైతుల్లో పెరుగుతున్న ఆసక్తి
- త్వరలో నానో జింక్, నానో కాపర్
- నానో ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం
- ఇందుకు ఆర్బీకే స్థాయిలో కిసాన్ డ్రోన్స్ ఏర్పాటుకు సన్నాహాలు



సాక్షి, అమరావతి: నానో యూరియా మాదిరిగానే నానో డీఏపీ (డైఅమ్మోనియం ఫాస్ఫేట్) కూడా వచ్చేస్తోంది. తొలకరి సీజన్ నుంచే నానో డీఏపీని మార్కెట్‌లోకి తీసుకొచ్చేందుకు ఇండియన్ ఫార్మర్స్ ఫెర్టిలైజర్ కో–ఆపరేటివ్ లిమిటెడ్ (ఇఫ్కో) సర్వం సిద్ధం చేసింది. 2021లో మార్కెట్‌లోకి వచ్చిన నానో యూరియా రైతుల మన్ననలు పొందుతోంది. తాజాగా ఈ ఖరీఫ్ నుంచే నానో డీఏపీని మార్కెట్‌లోకి తెచ్చేందుకు

మిగతా 2వ పేజీలో ▶



డైరెక్టర్ సుకుమార్ ఇంట్లో ఐటీ సోదాలు

టాలీవుడ్ ప్రముఖ డైరెక్టర్ సుకుమార్ ఇల్లు, మైత్రి మూవీస్ కార్యాలయాల్లో ఆదాయ పన్ను శాఖ అధికారులు సోదాలు నిర్వహించారు. ఇటీవల విడుదలైన పలు భారీ చిత్రాల నిర్మాణానికి విదేశాల నుంచి నిబంధనలకు విరుద్ధంగా డబ్బులు తీసుకువచ్చారన్న అంశంపై ఐటీ అధికారులు దృష్టి పెట్టారు. సోదాల సందర్భంగా పలు పత్రాలు, డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. వాటిపై విచారణ కోసం గురువారం కార్యాలయానికి రావాలని ఆదేశించినట్లు సమాచారం.

- వివరాలు 2లో

సింపుల్‌గా కోట్లు కొట్టేస్తున్నారు

మూడేళ్లలో దేశవ్యాప్తంగా సైబర్ మోసాల్లో రూ.731.27 కోట్లు దోపిడీ

- నమోదైన సైబర్ నేరాలు 2.13 లక్షలు
- మహారాష్ట్రలో రూ.240 కోట్లు, తమిళనాడులో రూ.69.84 కోట్లు కొట్టేశారు
- సైబర్ మోసాల నివారణకు చర్యలు
- వినియోగదారులను అప్రమత్తం చేయడంతో పాటు బ్యాంకుల్లో భద్రత చర్యలు
- కేంద్ర ఆర్థిక శాఖ వెల్లడి


14లో



సూడాన్‌లో చిక్కిన భారతీయులు

సూడాన్‌లో సైన్యం, పారామిలటరీకి మధ్య పరస్పర దాడులు కొనసాగుతున్నాయి. దీంతో అక్కడ చిక్కుకున్న భారతీయులను సురక్షితంగా తీసుకువచ్చేందుకు విదేశాంగ శాఖ సంప్రదింపుల ప్రక్రియను ముమ్మరం చేసింది. సూడాన్‌తో సంబంధాలు నెరుపుతున్న అమెరికా, బ్రిటన్, యూఏఈ, సౌదీ అరేబియాతో మంతనాలు కొనసాగిస్తోంది.

6లో



మన జనాభా 142.86 కోట్లు

జనాభాలో చైనాను దాటేసిన భారత్..

డ్రాగన్ దేశం జనాభా 142.57 కోట్లు


ఐక్యరాజ్యసమితి జనాభా విభాగం నివేదిక విడుదల

➤ 2050 నాటికి భారత్ జనాభా 166.8 కోట్లకు చేరుతుందని అంచనా. అదే సమయంలో చైనా జనాభా 131.7 కోట్లకు పడిపోతుందని నిపుణులు చెబుతున్నారు.

6లో

142 కోట్ల అవకాశాలు

➤ భారత్‌లోని 142 కోట్ల జనాభాను 142 కోట్ల అవకాశాలుగా చూడాలని యూఎన్‌ఎఫ్‌పీఏ–ఇండియా ప్రతినిధి, భూటాన్ కంట్రీ డైరెక్టర్ ఆండ్రియా వోజ్‌నార్ చెప్పారు. దేశంలో యువ జనాభా అత్యధికంగా ఉండడం గొప్ప అవకాశమని అన్నారు. 15 నుంచి 24 ఏళ్లలోపు యువత 25.4 కోట్ల మంది ఉన్నారని, నవీన ఆలోచనలు, నవీన ఆవిష్కరణలు, నూతన పరిష్కార మార్గాలకు వీరంతా వనరులేనని ఉద్ఘాటించారు.



హ్యాపీ బర్త్‌డే అమ్మ

- వైఎస్ విజయమ్మకు ముఖ్యమంత్రి జగన్ జన్మదిన శుభాకాంక్షలు



సాక్షి, అమరావతి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తన మాతృమూర్తి వైఎస్ విజయమ్మకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. 'హ్యాపీ బర్త్ డే అమ్మ' అంటూ సీఎం జగన్ బుధవారం ట్వీట్ చేశారు.

40 మంది సీనియర్ సివిల్ జడ్జీలు బదిలీ

గుంటూరు లీగల్: రాష్ట్ర వ్యాప్తంగా 40 మంది సీనియర్ సివిల్ జడ్జీలను బదిలీ చేస్తూ ఏపీ హైకోర్టు రిజిస్ట్రార్ (విజిలెన్స్) సునీత బుధవారం ఉత్తర్వులిచ్చారు. మే 2వ తేదీలోపు వీరు విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఈ నెల 22, 23న వర్షాలు

సాక్షి, అమరావతి: దక్షిణ మధ్య మహారాష్ట్ర నుంచి దక్షిణ తమిళనాడు వరకు కొనసాగుతున్న ద్రోణి ప్రభావంతో ఈ నెల 22, 23 తేదీల్లో ఏపీలోని పలుచోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. 22న ఉత్తరాంధ్ర, రాయలసీమలో అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం ఉంది. 23న ఉత్తరాంధ్ర, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. బుధవారం రాష్ట్రంలోని 9 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీచినట్లు విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ బీఆర్ అంబేద్కర్ తెలిపారు. అనకాపల్లి జిల్లాలో 8 మండలాలు, విజయనగరం ఒక మండలంలో తీవ్రవడగాడ్పులు వీచాయని చెప్పారు. మరో 93 మండలాల్లో వడగాల్పులు నమోదయ్యాయన్నారు. గురువారం 125 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని తెలిపారు.


జర్నలిస్టుల హెల్త్ స్కీం పథకం పొడిగింపు

సాక్షి,అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం వర్కింగ్ జర్నలిస్టు హెల్త్ స్కీం పథకాన్ని 2023 – 24 ఆర్థిక సంవత్సరానికి పొడిగిస్తూ జీవో జారీ చేసినట్లు సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ టి. విజయకుమార్‌రెడ్డి బుధవారం తెలిపారు. కొత్త అక్రిడిటేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకునేందుకు ఇప్పటికే మార్చి 31న జీవో జారీ చేశామన్నారు. కొత్తగా అక్రిడిటేషన్ కార్డును పొందిన వర్కింగ్ జర్నలిస్టులందరూ ఈ పథకం కింద ప్రీమియం రూ.1,250 మొత్తం www.cfms.ap. gov.in ద్వారా చెల్లించాలని కమిషనర్ విజయ కుమార్ రెడ్డి సూచించారు

సీతకొండపై బాబు బొంకు!

అబ్దుల్ కలాం పేరును మార్చారంటూ అబద్ధాలతో చంద్రబాబు ట్వీట్

- రూ.3.29 కోట్లతో సుందరంగా 'వైఎస్సార్ వ్యూ పాయింట్'
- విశాఖ జీ 20 సదస్సు సందర్భంగా తీర్చిదిద్దిన ప్రభుత్వం
- నీచ రాజకీయాల్లోకి లాగొద్దంటూ నెటిజన్ల మండిపాటు



గతంలో వ్యూ పాయింట్ దుస్థితి



అభివృద్ధి చేసిన తర్వాత కళకళలాడుతున్న వైఎస్సార్ వ్యూ పాయింట్

ఫ్యాక్ట్‌చెక్

సాక్షి, విశాఖపట్నం: నాడు రాష్ట్రపతిగా అబ్దుల్ కలామ్‌కు అవకాశం కల్పించింది తానేనంటూ తరచూ బుకాయించే చంద్రబాబు ఆయన పేరుతో తాజాగా మరోసారి బరి తెగించారు! ఇటీవల విశాఖలో జీ 20 సదస్సు సందర్భంగా బీచ్‌రోడ్డు సీతకొండ సమీపంలోని వ్యూ పాయింట్‌ని సుందరంగా తీర్చిదిద్దిన రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ వ్యూ పాయింట్‌గా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. అయితే కలాం వ్యూ పాయింట్ పేరును రాష్ట్ర ప్రభుత్వం మార్చేసిందంటూ చంద్రబాబు ట్వీట్ చేయడంపై నెటిజన్లు మండిపడుతున్నారు. చంద్రబాబు నీచ రాజకీయాలకు మహనీయుడైన కలాం పేరును వాడుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉత్తరాంధ్ర జనసైన్యం పేరుతో జనసేనకు చెందిన ఓ వ్యక్తి బుధవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో పోస్ట్ చేసిన ట్వీట్‌ను కొద్దిగా మార్చి ఇంగ్లీష్‌లో చంద్రబాబు మధ్యాహ్నం ట్వీట్ చేశారు. ఇక్కడ కూడా కాపీ, పేస్ట్‌లో చంద్రబాబుని మించినవారు లేరంటూ కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. సీతకొండ ఎదురుగా ఖాళీ స్థలం నుంచి సముద్రం అద్భుతంగా కనిపిస్తుంది. స్థానికులు దశాబ్దాలుగా దీన్ని సీతకొండ వ్యూ పాయింట్‌గానే వ్యవహరిస్తున్నారు. తాము 30 ఏళ్లుగా విశాఖలోనే ఉంటున్నామని, వ్యూ పాయింట్‌ను గత ప్రభుత్వాలు పట్టించుకోలేదని పలువురు పేర్కొంటున్నారు.


N Chandrababu Naidu
@ncbn
Saddened to see Abdul Kalam View Point in Vizag being renamed as YSR View Point. What is this psychopathic sadism to change names? This is nothing but disrespecting a much loved people's president who epitomized honesty, discipline, and perseverance.

చంద్రబాబు వేసిన ట్వీట్

రూ.3.29 కోట్లతో వ్యూ పాయింట్ అభివృద్ధి

సుందర విశాఖ సాగర తీరంలో సరైన వ్యూ పాయింట్స్ లేకపోవడంతో జీ 20 సదస్సు సందర్భంగా సీఎం జగన్ ఆదేశాల మేరకు జోడుగుళ్ల పాలెం సమీపంలోని ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా మార్చారు. చక్కటి పెయింటింగ్స్ ఏర్పాటు చేశారు. నడక దారితోపాటు మార్బుల్స్‌తో కూర్చునే బెంచీలు, లవ్ వైజాగ్ చిహ్నం తదితరాలతో తీర్చిదిద్ది వైఎస్సార్ వ్యూ పాయింట్‌గా నామకరణం చేశారు.

వచ్చేస్తోంది 'నానో డీఏపీ'

▶ మొదటి పేజీ తరువాయి

సన్నాహాలు మొదలయ్యాయి.

అర లీటర్.. 50 కేజీల బస్తాతో సమానం

గుళికల రూపంలో ఉండే సంప్రదాయ ఎరువులకు ప్రత్యామ్నాయంగా ఇఫ్కో సంస్థ రాష్ట్రీయ కెమికల్స్ అండ్ ఫెర్టిలైజర్స్‌తో కలిసి నానో టెక్నాలజీ ద్వారా ద్రవరూపంలో సూక్ష్మ ఎరువులను మార్కెట్‌లోకి తీసుకొస్తున్న విషయం విదితమే. నానో యూరియా మాదిరిగానే.. నానో డీఏపీ కూడా 500 మిల్లీ లీటర్ల బాటిల్ 50 కేజీల డీఏపీ ఎరువుల బస్తాతో సమానమని ఇఫ్కో స్పష్టం చేస్తోంది. డీఏపీ ఎరువుల బస్తా ధర మార్కెట్‌లో రూ.1,350 ధర పలుకుతోంది. నానో యూరియా అర లీటర్ బాటిల్ ధర కేవలం రూ.600 మాత్రమే. అంటే సంప్రదాయ డీఏపీ ఎరువుల బస్తాతో పోలిస్తే రూ.750 తక్కువ ధరకే మార్కెట్‌లోకి అందుబాటులోకి రాబోతుంది.

త్వరలో నానో జింక్, నానో కాపర్ కూడా..

ఎరువుల మార్కెట్ రంగంలో భారత శాస్త్రవేత్తలు నానో యూరియాను సృష్టించి ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించారు. ఇందుకుగాను ఇఫ్కో పేటెంట్ కూడా పొందింది. ఇప్పుడు శాస్త్రవేత్తల కృషితో అదే బాటలో నానో డీఏపీని మార్కెట్‌లోకి తీసుకొస్తోంది. త్వరలో నానో జింక్, నానో కాపర్‌ను కూడా అందుబాటులోకి తెచ్చేందుకు ఇఫ్కో సన్నాహాలు చేస్తోంది.

వినియోగం పెరుగుతోంది

ఖరీఫ్–2021లో మార్కెట్‌లోకి తీసుకొచ్చిన నానో యూరియా వినియోగంపై రైతుల్లో ఆసక్తి పెరిగింది. ఖరీఫ్–21లో రాష్ట్రంలో 17 వేల లీటర్ల నానో యూరియా అమ్మకు కాగా.. తరువాత ఏడాది 2.73 లక్షల లీటర్లు అమ్ముడైంది. 2022–23 ఖరీఫ్‌లో 1.25 లక్షల లీటర్లు, రబీలో 2.40 లక్షల లీటర్ల మేర విక్రయాలు జరిగాయి. సూక్ష్మ ఎరువులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున ప్రచారం చేస్తుండటంతో రైతుల్లో చైతన్యం పెరిగి 2023–24 వ్యవసాయ సీజన్ నుంచి నానో యూరియా నిల్వలను పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచేందుకు ఇఫ్కో ఏర్పాట్లు చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ఒత్తిడి మేరకు వచ్చే ఖరీఫ్ సీజన్‌లో 12.50 లక్షల లీటర్లు, రబీలో 17.50 లక్షల లీటర్లు నానో యూరియా నిల్వలు రాష్ట్రానికి కేటాయించింది. నానో యూరియాతో పాటు కొత్తగా వస్తున్న నానో డీఏపీని ఆర్బీకేల ద్వారా గ్రామ స్థాయిలో అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. వీటి వినియోగంపై ఆర్బీకేల ద్వారా విస్తృత ప్రచారం చేసేందుకు కార్యాచరణ సిద్ధమైంది.

ఎన్నో ప్రత్యేకతలు

డీఏపీ ఎరువుల వినియోగం పంటల సాగులో చాలా కీలకం. మార్కెట్‌లోకి రానున్న నానో డీఏపీ పర్యావరణానికి ఏ మాత్రం హాని కలిగించకుండా.. పంటలకు అవసరమైన పోషక అవసరాలను తీరుస్తుంది. నానో డీఏపీలో నత్రజని 8 శాతం, భాస్వరం 16%ఉంటుంది. నానో డీఏపీ కణ పరిమాణం 100 నానోమీటర్ కంటే తక్కువగా ఉండటం వల్ల విత్తనం లోపలికి, శ్వాస క్రియ ద్వారా మొక్కల లోకి సులభంగా ప్రవేశిస్తుంది. పంటలకు అవసరమైన నైట్రోజన్, భాస్వరం (ఫాస్ఫరస్ పెంటాక్సైడ్)ను సమపాళ్లలో అందిస్తుంది. మొక్కల్లో వీటి లోపాలను సరిచేస్తుంది. సమపాళ్లలో వ్యాప్తి చెందడం వల్ల విత్తన శక్తితోపాటు కిరణజన్య సంయోగ క్రియ సామర్థ్యం పెరుగుతుంది. మెరుగైన, నాణ్యమైన పంటల దిగుబడికి దోహదపడుతుంది. క్షేత్రస్థాయి పరిశీలనలో పోషక వినియోగ సామర్థ్యం 90 శాతానికి పైగానే ఉన్నట్టు నిర్ధారించారు.

ఎకరాకు బాటిల్ యూరియా వేశా

వరిలో ఎకరాకు 3–4 బస్తాల యూరియా వాడేవాళ్లం. ప్రస్తుతం ఎకరాకు ఒక బాటిల్ మాత్రమే వాడాను. చామంతి, టమోటా, మిరప తోటల్లో కూడా వాడుతున్నాను. మంచి ఫలితం కనిపిస్తోంది. మిరప కాయలో మంచి ఊట, ఎదుగుదల కన్పిస్తోంది.

– పి.నాగబాబు, నాగాయతిప్ప, కృష్ణా జిల్లా

నానో డీఏపీ రెడీ చేస్తున్నాం



నానో డీఏపీ రెడీ చేస్తున్నాం. మార్క్‌ఫెడ్ ద్వారా నానో డీఏపీని సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. దీంతో రైతులకు ఎరువుల ఖర్చులు తగ్గుతాయి. వచ్చే ఖరీఫ్ నుంచి పూర్తిస్థాయిలో నానో యూరియాను అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. డిమాండ్‌ను బట్టి నిల్వలు పెంచేందుకు కూడా సిద్ధంగా ఉన్నాం.

– టి.శ్రీధర్‌రెడ్డి, స్టేట్ మార్కెటింగ్ మేనేజర్, ఇఫ్కో

గ్రామాల్లోని వసతులపై సర్వే

- 'మిషన్ అంత్యోదయ'లో భాగంగా 182 రకాల ప్రశ్నలతో సర్వే చేస్తున్న కేంద్రం

సాక్షి, అమరావతి: 'మిషన్ అంత్యోదయ'లో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో ఉన్న వసతులపై కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ దేశవ్యాప్తంగా సర్వే నిర్వహిస్తోంది. మొత్తం 182 రకాల ప్రశ్నలతో ఈ సర్వే చేపట్టింది. జనన, మరణ, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలకు ప్రభుత్వ సేవలు అందుబాటులో ఉన్నాయా? గ్రామ పరిధిలోనే రైతులకు భూసార పరీక్షల సేవలు అందుతున్నాయా? ఎరువుల దుకాణం, పశు వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయా? లేకుంటే వాటి కోసం ఎంత దూరం వెళ్తున్నారు? గ్రామానికి సరైన రోడ్డు వసతి ఉందా? ఎంత దూరంలో రైల్వేస్టేషన్ ఉంది.. గ్రామంలోనే బ్యాంకు సేవలు అందుబాటులో ఉన్నాయా? తదితర వివరాలను గ్రామ పంచాయతీల కార్యదర్శులు కేంద్రం రూపొందించిన ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ వివరాల ఆధారంగా గ్రామ పంచాయతీలకు ర్యాంకులు ఇవ్వనున్నట్టు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ప్రకటించింది. ఈ ఏడాది ఫిబ్రవరి నెల మధ్యలో కేంద్రం ఈ సర్వే చేపట్టింది. దీని కోసం ఈ నెల 21లోగా అన్ని గ్రామ పంచాయతీల కార్యదర్శులు ఆన్‌లైన్‌లో సర్వే వివరాలు నమోదు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శులకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి శైలేష్‌కుమార్ సింగ్ బుధవారం లేఖ రాశారు. కాగా, ఏపీలో మొత్తం 13,325 గ్రామ పంచాయతీలు ఉండగా.. 12,800(96%)కు పైగా పంచాయతీల్లో సర్వే వివరాల నమోదు ప్రక్రియ పూర్తయ్యిందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ పోర్టల్‌లోని గణాంకాల ద్వారా వెల్లడయ్యింది.

తెలంగాణ

డైరెక్టర్ సుకుమార్ ఇంట్లో ఐటీ సోదాలు

- మైత్రి మూవీ మేకర్స్ కార్యాలయాల్లోనూ తనిఖీలు

సాక్షి, హైదరాబాద్: టాలీవుడ్ డైరెక్టర్ సుకుమార్ ఇల్లు, మైత్రి మూవీస్ కార్యాలయాల్లో ఆదాయపన్నుశాఖ అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఇటీవల విడుదలైన కొన్ని భారీ చిత్రాల నిర్మాణానికి విదేశాల నుంచి నిబంధనలకు విరుద్ధంగా పెద్ద మొత్తంలో డబ్బులు పెట్టుబడిగా తీసుకోవడం, వాటి పన్నుల చెల్లింపుల్లో అవకతవకలపై ఐటీ అధికారులు ఈ సోదాలు చేపట్టినట్టు తెలిసింది. సదరు చిత్ర నిర్మాణ సంస్థ భారీ చిత్రాల నిర్మాణానికి అవసరమైన డబ్బును విదేశాల నుంచి పెద్ద మొత్తంలో సేకరించిందని, ఈ సొమ్ము రూ.500 కోట్లకు పైగా ఉండడంతో ఐటీ అధికారులు ఫోకస్ పెట్టినట్టు తెలిసింది. ఆర్బీఐ నిబంధనలకు విరుద్ధంగా విదేశాల నుంచి డబ్బులు పెట్టుబడుల రూపంలో సేకరించడంతోపాటు, జీఎస్టీ చెల్లింపులలోనూ అవకతవకలు ఉన్నట్టు ఐటీ అధికారులు గుర్తించారు. ఐటీ అధికారుల బృందాలు డైరెక్టర్ సుకుమార్ ఇల్లు, మైత్రి మూవీ సంస్థ కార్యాలయాల్లో సోదాలు జరిపి పలు కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది.

మరోసారి సీఎం మానవత్వం

అనారోగ్య బాధితులకు మెరుగైన వైద్యం, తక్షణ సాయం





తమను ఆదుకోవాలని ఫ్లకార్డు ప్రదర్శిస్తున్న కార్తీక్ తండ్రి వెంకటరావు.. ఆక్సిజన్ సిలిండర్‌తో సీఎం సభా ప్రాంగణానికి వస్తున్న రవికుమార్

అరసవల్లి: శ్రీకాకుళం జిల్లా పర్యటనకు వచ్చిన సీఎం జగన్ మరోసారి తన ఉదార స్వభావాన్ని చాటుకున్నారు. దీర్ఘకాల వ్యాధులతో బాధ పడుతున్న పలువురికి మెరుగైన వైద్యం, తక్షణ సాయం అందేలా ఆదేశించారు. నౌపడ సభా వేదిక నుంచి హెలిప్యాడ్‌కు వెళ్తున్న సమయంలో టెక్కలి మండలానికి చెందిన లాల్ పండా వెంకటరావు తన కుమారుడు కార్తీక్ (9) 'తౌసిల్‌జు మాబ్–సోజియా' అనే ఎముకల వ్యాధితో ఆరేళ్లుగా బాధ పడుతున్నాడని సీఎంకు చెప్పారు. వైద్య ఖర్చులకు ఇంటిని కూడా అమ్మేశానన్నారు. సీఎం స్పందిస్తూ మెరుగైన వైద్యం అందేలా చూడాలని, తక్షణ సాయంగా రూ.5 లక్షలు ఇవ్వాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠ్కర్‌ను ఆదేశించారు. వీరి విషయం ఫాలోఅప్ చేయాలని సీఎంవో కార్యదర్శి ధనంజయరెడ్డికి సూచించారు. విజయనగరం జిల్లా సారథికి చెందిన వంజరాపు రామ్మూర్తి కుమారుడు రవికుమార్ (33) ఊపిరితిత్తుల వ్యాధి వల్ల ఆక్సిజన్ సిలెండర్ల మీదే బతుకుతున్నాడని స్థానిక సామాజిక కార్యకర్త పాలూరి సిద్ధార్థ బాధితుని తరపున సీఎంను కోరారు. తక్షణ సాయంగా రూ.లక్ష అందివ్వాలని, ప్రతి నెలా రూ.10 వేలు పింఛన్ మంజూరు చేసేలా విజయనగరం జిల్లా కలెక్టర్ నాగలక్ష్మిని ఆదేశించాలని సీఎంఓ కార్యదర్శి ధనంజయరెడ్డికి సూచించారు. బాధితులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికు కృతజ్ఞతలు తెలిపారు.

ఉత్తరాంధ్రలో కొత్త చరిత్ర

నౌపడ నుంచి సాక్షి ప్రతినిధి: మూలపేట పోర్టు, బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్, గొట్టా బ్యారేజీ ఎత్తిపోతల పథకం, మహేంద్ర తనయ ఆఫ్ షోర్ ప్రాజెక్టుల ద్వారా రానున్న రోజుల్లో ఉత్తరాంధ్ర ముఖచిత్రం పూర్తిగా మారిపోతుందని సీఎం వైఎస్ జగన్ అన్నారు. విశాఖ నుంచి 170 కిలోమీటర్లు, చెన్నై– కోల్‌కతా నేషనల్ హైవేకు కేవలం 14 కిలోమీటర్లు, ప్రధాన రైల్వే మార్గానికి 11 కిలోమీటర్ల దూరంలో 1,250 ఎకరాల విస్తీర్ణంలో నిర్మాణమవుతున్న మూలపేట పోర్టు.. రానున్న రోజుల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఇక్కడే 35 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనుందని చెప్పారు. పోర్టు ఆధారిత, అనుబంధ పరిశ్రమలు, ఇతరత్రా లక్షల్లో మన పిల్లలకు ఇక్కడే ఉద్యోగ ఉపాధి అవకాశాలు అందివచ్చే కార్యక్రమం చేపడుతున్నందుకు సంతోషంగా ఉందన్నారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గంలోని మూలపేట తీరంలో పోర్టు నిర్మాణానికి, ఎచ్చెర్ల నియోజకవర్గం బుడగట్లపాలెం వద్ద ఫిషింగ్ హార్బర్, గొట్టా బ్యారేజ్ నుంచి హిరమండలం రిజర్వాయర్ ఎత్తిపోతల పథకానికి బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. మహేంద్ర తనయ ఆఫ్ షోర్ రిజర్వాయర్ పనులను పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా సంతబొమ్మాళి మండలంలోని నౌపడ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. రాష్ట్రానికి 974 కిలోమీటర్ల సముద్రతీరం ఉంటే, అందులో ఏకంగా 193 కిలోమీటర్లు ఒక్క శ్రీకాకుళం జిల్లాలోనే ఉందన్నారు. అయినా ఒక పోర్టు కానీ, ఒక ఫిషింగ్ హార్బర్ కానీ, కనీసం ఫిష్ ల్యాండింగ్ సెంటర్ కానీ ఉండి ఉంటే ఈ జిల్లా చెన్నై, ముంబయిగా అభివృద్ధి చెంది ఉండేదని చెప్పారు. ఈ విషయం తెలిసీ కూడా దశాబ్దాలుగా ఎవ్వరూ ఈ దిశగా అడుగులు వేసి, చిత్తశుద్ధి చూపలేదన్నారు. ఈ పరిస్థితిని మారుస్తూ అడుగులు ముందుకు వేస్తున్నామన్నారు. ఇంకా ఏమన్నారంటే..

అభివృద్ధికి మూల స్తంభం

- మూలపేట ఇక మూలనున్న గ్రామం కాదు. ఇది అభివృద్ధికి మూల స్తంభంగా నిలుస్తుంది. మూలపేట, విష్ణుచక్రం గ్రామాలు రాబోయే రోజుల్లో రాబోయే తరాలకు మరో చెన్నై, ముంబయి కాబోతున్నాయి.మూలపేటలో మనం కట్టబోతున్న పోర్టు సామర్థ్యం ఏకంగా ఏడాదికి 24 మిలియన్ టన్నులు. ఈ పోర్టులో 4 బెర్తులు నిర్మిస్తున్నాం.
- ఈ రోజు నుంచి 24 నెలల్లో ఈ పోర్టు నిర్మాణం పూర్తవుతుంది. దాదాపు రూ.2,950 కోట్ల ఖర్చుతో పోర్టు నిర్మాణం చేపడుతున్నాం. ఇక్కడ ట్రాఫిక్ పెరిగి ఈ పోర్టు సామర్థ్యం వంద మిలియన్ టన్నులకు పెరిగే రోజు సమీపంలోనే ఉంది. దీన్ని ప్రధాన రహదారులతో అనుసంధానం చేయడానికి 14 కిలోమీటర్ల పొడవున రోడ్డు, 11 కిలోమీటర్ల పొడవున రైలుమార్గం నిర్మిస్తున్నాం.
- ఇక్కడికి 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న గొట్టా బ్యారేజీ నుంచి పైపులైన్ వేసి 0.5 ఎంఎల్‌డీ సామర్థ్యంతో నీటి సరఫరా చేయడానికీ శ్రీకారం చుడుతున్నాం. ఇలా మౌలిక వసతులకు, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ తదితర వ్యయాలను కలిపితే మూలపేట పోర్టు నిర్మాణానికి మనందరి ప్రభుత్వం ఖర్చు చేస్తున్న సొమ్ము రూ.4,362 కోట్లు అని చెప్పడానికి గర్వపడుతున్నా.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం వైఎస్ జగన్



గంగమ్మ తల్లికి పూజలు నిర్వహిస్తున్న సీఎం జగన్

సెప్టెంబర్ నుంచి విశాఖలో కాపురం

- ఏపీలో అతిపెద్ద నగరం మాత్రమే కాకుండా అందరికీ ఆమోదయోగ్యమైన నగరం విశాఖపట్నం. పరిపాలన వికేంద్రీకరణలో భాగంగా ఈ సెప్టెంబర్ నుంచి మీ బిడ్డ విశాఖలో కాపురం పెడతాడని తెలియజేస్తున్నా.
- ఉత్తరాంధ్రలోనే కాదు రాష్ట్రంలో ఏ ప్రాంతం తీసుకున్నా, ఏ గ్రామం తీసుకున్నా గతంలో ఎప్పుడూ చూడని విధంగా అభివృద్ధి కనిపిస్తోంది. స్కూళ్లు మారుతున్నాయి. కొత్తగా మెడికల్ కాలేజీలు కనిపిస్తున్నాయి. ఉన్న ఆస్పత్రులన్నీ రూపురేఖలు మారుతున్నాయి.
- ప్రతి ఇల్లూ అభివృద్ధి కావాలి. నా అక్కచెల్లెమ్మల ముఖంలో చిరునవ్వు కనపడాలి. 46 నెలల కాలంలో మీ బిడ్డ ప్రభుత్వం రూ.2 లక్షల కోట్లకు పైగా సొమ్మును నేరుగా అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి వేసింది.
- మీ బిడ్డ జగన్ డీబీటీ బటన్ నొక్కటం మాత్రమే కాదు... కులాలు, కుటుంబ చరిత్రలను మార్చాలన్న తపన, తాపత్రయంతో పని చేస్తున్నాడని గుర్తించాలి. నవరత్నాల పాలనతో ఇంటింటి చరిత్రను, సామాజిక వర్గాల చరిత్రను తిరగ రాస్తున్న ప్రభుత్వంగా, ప్రాంతాల చరిత్రలను, పారిశ్రామిక వాణిజ్య చరిత్రను కూడా మారుస్తున్నాం.

గంగపుత్రుల కళ్లల్లో మరింత కాంతి

గంగపుత్రుల కళ్లల్లో మరిన్ని కాంతులు నింపడానికి, మత్స్యకార సోదరులకు మరింత అండగా ఉండేందుకు మూలపేట పోర్టుతో పాటు మరో రెండు ఫిషింగ్ హార్బర్లను నిర్మిస్తున్నాం. రూ.365.81 కోట్లతో బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి ఈరోజు శంకుస్థాపన చేశాం. మంచినీళ్లపేటలో రూ.12 కోట్లతో ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నిర్మాణానికి 2019 సెప్టెంబర్‌లో శ్రీకారం చుట్టాం. దాన్ని మరో రూ.85 కోట్ల ఖర్చుతో ఫిషింగ్ హార్బర్‌గా అప్‌గ్రేడ్ చేస్తున్నాం.

రైతుల శ్రేయస్సే లక్ష్యం

- వంశధార, నాగావళి నదులు ఉన్నప్పటికీ గత పాలకుల నిర్లక్ష్యం వల్ల శ్రీకాకుళం జిల్లా ఇప్పటికీ సస్యశ్యామలం కాని పరిస్థితి. అప్పట్లో దివంగత నేత, నాన్న గారు వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో వంశధార ఫేజ్ 2, స్టేజ్ 2 కింద 33 కిలోమీటర్ల పొడవున కాలువల తవ్వకం, హిరమండలం రిజర్వాయర్‌ను 19 టీఎంసీల కెపాసిటీతో నిర్మాణ పనులకు అడుగులు వేగంగా వేయించారు. ఆయన మన మధ్య నుంచి వెళ్లిపోయాక ఆ అడుగులు ముందుకు పడలేదు.
- నేరడి బ్యారేజ్ పూర్తయితే తప్ప హిరమండలం రిజర్వాయర్‌లో 19 టీఎంసీల కెపాసిటీతో నీరు పెట్టడం సాధ్యం కాదు. మీ బిడ్డ గతంలో ఏ ముఖ్యమంత్రి చూపని చొరవ చూపించారు. ఒడిశాకు వెళ్లి అక్కడి ముఖ్యమంత్రిని కలిసి నేరడి బ్యారేజ్ గురించి మాట్లాడారు. దాని పరిస్థితి అలానే ఉన్నా మధ్యేమార్గంగా మన రైతన్నలకు ఎట్టి పరిస్థితుల్లోనూ మంచి జరగాలన్న ఉద్దేశంతో రూ.176.35 కోట్లతో గొట్టా బ్యారేజ్‌పై లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ కూడా తీసుకొస్తున్నాం.
- మరోవైపు వంశధార, నాగావళి నదుల అనుసంధానం కూడా ఆగస్టు నెలలోనే పూర్తి చేసి, జాతికి అంకితం చేస్తాం. మహానేత రాజశేఖరరెడ్డి మొదలు పెట్టిన మహేంద్ర తనయ ఆఫ్ షోర్ రిజర్వాయర్ పనులు కూడా పూర్తి చేసేందుకు, మూడు నియోజకవర్గాల రూపురేఖలను మార్చేందుకు మరో రూ.400 కోట్లు ఖర్చయ్యే పనులకు ఈ రోజు శ్రీకారం చుట్టాం.

తోడేళ్లన్నీ కలిసి చీకటి యుద్ధం

నౌపడ బహిరంగ సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్

నౌపడ నుంచి సాక్షి ప్రతినిధి/అరసవల్లి/ సంతబొమ్మాళి/కోటబొమ్మాళి: 'తమ పాలనలో ప్రజలకు ఫలానా మంచి చేశామని చెప్పుకోలేని వారు, మంచి చేయలేని వారంతా ఇప్పుడు ఏకమవుతున్నారు. మీ బిడ్డ ఒక్కడే ఒకవైపు ఉన్నాడు. తోడేళ్లలా ఏకమై ఈ రోజు ఒక అబద్ధాన్ని పదేపదే చెప్పి, అదే నిజమని నమ్మించే చీకటి యుద్ధం రాష్ట్రంలో జరుగుతోంది. ఈ చీకటి యుద్ధాన్ని గమనించండి' అని సీఎం జగన్ అన్నారు. బుధవారం ఆయన మూలపేట పోర్టు, ఇతర అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసిన అనంతరం ప్రజలనుద్దేశించి మాట్లాడారు. 'ఈ రోజు పెత్తందార్ల పక్షాన నిలబడ్డ టీడీపీకి, పేదవాడి పక్షాన నిలబడ్డ మీ బిడ్డకు మధ్య యుద్ధం జరుగుతోంది. వ్యవస్థల మేనేజ్‌ను నమ్ముకున్న వారికి, ప్రజలను నమ్ముకుని ప్రజల కోసమే బతుకుతున్న మీ బిడ్డకు మధ్య యుద్ధం జరుగుతోంది. వారి మాదిరిగా మీ బిడ్డకు ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5 లేవు. దత్తపుత్రుడూ లేడు. ఈ యుద్ధంలో నా ధైర్యం, నా నమ్మకం,నా ఆత్మవిశ్వాసం మీరు. మీ బిడ్డ నమ్ముకున్నది ఒక్క దేవుడి దయ, మీ అందరి ఆశీస్సులు మాత్రమే. తోడేళ్లన్నీ ఏకమవుతున్నాయి. కానీ మీ బిడ్డకు భయం లేదు. మీ అందరినీ నేను ఒక్కటే కోరుతున్నాను. ఈ అబద్ధాలను నమ్మకండి.వీళ్ల మాదిరిగా అబద్ధాలు చెప్పే అలవాటు మీ బిడ్డకు లేదు. మీ ఇంట్లో మంచి జరిగిందా? లేదా? అన్నది ఒక్కటే కొలమానంగా తీసుకోండి. మీ ఇంట్లో మంచి జరిగి ఉంటే మీ బిడ్డకు తోడుగా నిలబడండి. మీ ఇంట్లో మంచి జరిగి ఉంటే మీ బిడ్డకు సైనికులుగా కదలండి' అని కోరారు.



పేరుపేరునా పలకరింపు

మూలపేట పోర్టు నిర్మాణానికి భూములు ఇచ్చిన మూలపేట, విష్ణుచక్రం గ్రామాల ప్రతినిధులతో సీఎం ఆప్యాయంగా మాట్లాడారు. పేరుపేరునా పలకరిస్తూ.. భూములు ఇచ్చిన వారి త్యాగాలు చరిత్రలో నిలిచిపోతాయని చెబుతూ ధన్యవాదాలు తెలిపారు. వారంతా బహిరంగ సభలో సీఎం జగన్‌ను సత్కరించారు. సంప్రదాయ బోటు జ్ఞాపిక, శ్రీవారి ప్రతిమ అందజేశారు. కాగా, పోర్టు నిర్వాసితులు 594 మందికి నౌపడ వద్ద 58 ఎకరాల్లో పునరావాస కాలనీ నిర్మిస్తున్నారు. రూ.34.98 కోట్లతో పనుల ప్రారంభానికి సీఎం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన బహిరంగ సభలో స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రులు బొత్స , గుడివాడ, ధర్మాన, అంబటి, సీదిరి, సీఎం ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్దానంలో కిడ్నీ బాధితులకు ఊరట

- ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ బాధితుల కోసం మీ బిడ్డ ముఖ్యమంత్రి అయ్యాక మొదలు పెట్టిన కిడ్నీ రీసెర్చ్ సెంటర్ పనులు దాదాపు పూర్తయ్యాయి. జూన్‌లో ప్రారంభోత్సవం చేస్తాను.
- హిరమండలం రిజర్వాయర్ నుంచి సర్ఫేస్ వాటర్ తీసుకొచ్చే బృహత్తర కార్యక్రమానికి రూ.700 కోట్లతో నాంది పలికాం. దీన్ని జూన్ మాసంలోనే పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాను. అదే రోజున పాతపట్నం నియోజకవర్గంలో మరో రూ.265 కోట్లతో ఇదే నీటి పథకాన్ని విస్తరిస్తూ శంకుస్థాపన చేస్తాను.

ఉత్తరాంధ్ర అభివృద్ధిపై బేరీజు వేయండి

- ఉత్తరాంధ్ర జిల్లాల్లో అభివృద్ధికి సంబంధించిన పరిస్థితులను ఒక్కసారి బేరీజు వేయండి. కురుపాంలో ట్రైబల్ ఇంజనీరింగ్ కాలేజీ, పాడేరులో ట్రైబల్ మెడికల్ కాలేజీ, పార్వతీపురం, నర్సీపట్నం, విజయనగరంలో మెడికల్ కాలేజీ పనులు వేగంగా జరుగుతున్నాయి.
- ఈ ప్రాంతంలో ఈ 46 నెలల కాలంలోనే మీ బిడ్డ ప్రభుత్వం నాలుగు కొత్త మెడికల్ కాలేజీలు కడుతున్న విషయం గమనించాలి. సాలూరులో ట్రైబల్ యూనివర్సిటీకి జూన్‌లో శంకుస్థాపన చేస్తాం. మే 3వ తేదీన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి, అదానీ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేయబోతున్నాం. అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్లడానికి వీలుగా రూ.6,200 కోట్లతో ఆరు లైన్ల రహదారిని నిర్మించబోతున్నాం. తీర ప్రాంతంలో ఇలాంటి అభివృద్ధి గతంలో ఎందుకు జరగలేదో ఆలోచించండి.

క్లుప్తంగా...

'గాలి' పిటిషన్ తిరస్కరించిన సుప్రీం

సాక్షి, న్యూఢిల్లీ: బెయిల్ షరతులు సడలించాలన్న కర్ణాటక మాజీ మంత్రి గాలి జనార్దనరెడ్డి విజ్ఞప్తిని సుప్రీంకోర్టు తిరస్కరించింది. గాలి జనార్దనరెడ్డి పిటిషన్ బుధవారం జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ రవికుమార్‌ల ధర్మాసనం ముందుకు బుధవారం వచ్చింది. కర్ణాటకలోని ఎన్నికల నేపథ్యంలో బళ్లారి వెళ్లడానికి బెయిలు షరతులు సడలించాలని గాలి తరఫు న్యాయవాది ధర్మాసనాన్ని కోరారు. దీన్ని ధర్మాసనం తిరస్కరించగా..కర్ణాటక ఎన్నికల అనంతరం పిటిషన్ దాఖలు చేస్తామని న్యాయవాది చెప్పగా..దాన్ని కూడా ధర్మాసనం తిరస్కరించింది.

ముస్లింల అభివృద్ధికి వైఎస్సార్ కుటుంబం చేయూత

ఇఫ్తార్ విందులో సినీనటుడు అలీ



మాట్లాడుతున్న అలీ

నరసరావుపేట: రాష్ట్రంలోని ముస్లిం సోదరులకు నాలుగుశాతం రిజర్వేషన్ కల్పించి వారి అభివృద్ధికి దివంగత మహానేత వైఎస్సార్ కృషిచేస్తే.. ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తండ్రి వారసత్వాన్ని అనుసరిస్తూ ముస్లింల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నారని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రభుత్వ సలహాదారు, సినీనటుడు అలీ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సారథ్యంలో బుధవారం నరసరావుపేటలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్‌తో కలిసి అలీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో 40 మంది ముస్లింలు అత్యంత ప్రాధాన్యమైన పదవుల్లో ఉన్నారని చెప్పారు. తన 45 ఏళ్ల సినీ జీవితంలో 30 ఏళ్ల నుంచి వైఎస్సార్ కుటుంబంతో పరిచయం, అనుబంధం ఉన్నట్లు తెలిపారు. తన మాతృమూర్తి తరఫు బంధువులు నరసరావుపేటలో ఉన్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఆషాబేగం ఖాజావలి, పొడా చైర్మన్ మిట్టపల్లి రమేష్ పాల్గొన్నారు.

నీరా కేఫ్‌లు ప్రారంభిస్తాం

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్



కర్నూలు(అర్బన్)/ఆస్పరి (కర్నూలు): రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నీరా కేఫ్‌లను ప్రారంభిస్తామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చెప్పారు. యువగళం పేరుతో ఆయన చేపట్టిన పాదయాత్రలో భాగంగా బుధవారం ఆలూరు నియోజకవర్గంలోని పుప్పాలదొడ్డి, చిరుమానుదొడ్డి గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో ప్రజలతో ఆయన మాట్లాడుతూ రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టుల కోసం చంద్రబాబు రూ.1,100 కోట్లను ఖర్చు చేశారన్నారు. హంద్రీనీవా పనులను 90 శాతం పూర్తి చేశామని చెప్పారు. పదో తరగతి ఫెయిల్ అయిన జగన్‌కు క్రీడల విలువ ఏం తెలుస్తుందని, రాయలసీమకు స్పోర్ట్స్ యూనివర్సిటీని తీసుకొస్తామని లోకేశ్ చెప్పారు.

అధికారంలో ఉన్నప్పుడేం చేశారు?

యువగళం పాదయాత్రలో భాగంగా కర్నూలు జిల్లా ఆస్పరి మండలం ములుగుందం గ్రామానికి వచ్చిన లోకేశ్‌ను మహిళలు నిలదీశారు. లోకేశ్ గ్రామంలో మహిళల వద్దకు వెళ్లి ఈసారి తమకు అధికారం ఇవ్వాలని కోరారు. దీంతో వారు గతంలో అధికారంలో ఉన్నప్పుడు మీరు ఏంచేశారంటూ నిలదీశారు. సహనం కోల్పోయిన లోకేశ్.. ఆలూరు నియోజకవర్గం నుంచి రెండుసార్లు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేను గెలిపించారంటూ మహిళలపై మండిపడ్డారు. మహిళలు.. మీరు అధికారంలో ఉన్నప్పుడు చేసిందేమీలేదని తిరగబడడంతో ఆయన సమాధానం చెప్పలేక అక్కడ నుంచి జారుకున్నారు.

బీసీలు దూరం కావడం వల్లే టీడీపీ ఓడింది..

ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు



సాక్షి, అమరావతి/నెల్లూరు (టౌన్): రాష్ట్రంలో బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై అన్ని కుల సంఘాల నాయకులు కలిసి ఉద్యమిద్దామని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు అన్నారు. బుధవారం నెల్లూరు నగరంలోని కస్తూరిదేవి గార్డెన్‌లో టీడీపీ ఆధ్వర్యంలో చిత్తూరు, రాజంపేట, తిరుపతి, నెల్లూరు, ఒంగోలు పార్లమెంట్ పరిధిలోని బీసీల ఐక్య కార్యాచరణ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ బీసీల్లో ఐక్యత లేదన్నారు. రాజకీయంగా ఒకరు ఎదుగుతుంటే వారి మీద బీసీ వర్గాలే దాడులు చేస్తున్నాయని, అందుకే ఎదగలేక పోతున్నట్టు చెప్పారు. ఇక నుంచి రాజకీయాలకు అతీతంగా అందరం కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. 2019 ఎన్నికల్లో కొన్ని బీసీ వర్గాలు దూరం కావడం వల్లే తెలుగుదేశం పార్టీ ఓడిపోయిందన్నారు. ఇదిలా ఉండగా, లూటీ చేయడానికే సీఎం వైఎస్ జగన్ విశాఖలో కాపురం పెడుతున్నారని, ఉత్తరాంధ్రను కొల్లగొట్టేందుకే విశాఖ రాజధాని అంటూ ప్రకటనలు చేస్తున్నారని అచ్చెన్నాయుడు ఓ ప్రకటనలో ఆరోపించారు.



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్



నెల్లూరు జిల్లా బ్రాహ్మణక్రాకలో ఓ ఇంటికి స్టిక్కర్ అంటిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత వంటేరు వేణుగోపాల్‌రెడ్డి



చిత్తూరు జిల్లా నగరి పట్టణంలోని పద్మావతీ నగర్‌లో మహిళకు బ్రోచర్ అందజేస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

ఊరూరా సందడి

ప్రతి ఇంటా వైఎస్ జగన్ మాట

పండుగ వాతావరణంలో 'జగనన్నే మా భవిష్యత్తు'

ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్‌లు, కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లకు ఘన స్వాగతం

- చిరునవ్వుతో స్వాగతిస్తున్న అక్కచెల్లెమ్మలు, అన్నదమ్ములు
- నాలుగేళ్లలో ఎంతో లబ్ధి చేకూరిందని ప్రజల హర్షం
- తప్పకుండా మళ్లీ జగనే సీఎం కావాలని ఆకాంక్ష
- సీఎం పాలనకు మద్దతుగా 63 లక్షల మిస్డ్ కాల్స్
- ఈ నెల 29 వరకు కార్యక్రమం పొడిగింపు

సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం పండుగ వాతావరణంలో కొనసాగుతోంది. ప్రతి ఊళ్లోనూ సందడి నెలకొంది. సీఎం జగన్ ప్రతినిధులుగా వచ్చిన ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్‌లు, సమన్వయకర్తలు, కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లకు ప్రజలు చిరునవ్వుతో స్వాగతం పలుకుతున్నారు. పలు చోట్ల ఎదురువెళ్లి బ్రహ్మరథం పడుతున్నారు. ప్రజల వద్దకే ఎమ్మెల్యే రావడం అంటే అది కేవలం ఒక్క సీఎం జగనన్న వల్లే సాధ్యమైందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాలుగేళ్లలో ఏ మేరకు లబ్ధి కలిగిందో ప్రజలే ఆనందంగా నేతలకు వివరిస్తుండటం ప్రత్యక్షంగా కనిపిస్తోంది. అందరి బాగు కోరుకుంటున్న జగనన్ననే మళ్లీ సీఎంగా గెలిపించుకుంటామని అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లు, అవ్వాతాతలు చెబుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏప్రిల్ 7వ తేదీన 'జగనన్నే మా భవిష్యత్తు' పేరుతో మెగా పీపుల్స్ సర్వే ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రజలు వైఎస్ జగన్ ప్రభుత్వంపై ఉన్న నమ్మకాన్ని ప్రజా మద్దతు సర్వే ద్వారా నమోదు చేస్తున్నారు. ఏప్రిల్ 18 నాటికి ఏకంగా 63 లక్షల మంది 82960 82960 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇచ్చి మద్దతు తెలిపారని ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్యలు తెలిపారు. బుధవారం వారు తాడేపల్లిలో మీడియాతో మాట్లాడుతూ.. సీఎం జగన్ ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో కులం, మతం, ప్రాంతం, వర్గం, రాజకీయ పార్టీలను చూడకుండా అర్హులందరికీ లబ్ధి కలిగిస్తోందన్నారు. మలి దశ కార్యక్రమంలో ప్రతిపక్ష పార్టీలకు మద్దతుగా ఉన్న ప్రాంతాల్లోని ప్రజలకు కూడా అందించిన సంక్షేమ పథకాలను వారి ఇళ్ల వద్దకే వెళ్లి వివరిస్తామని చెప్పారు. అపూర్వ ప్రజా స్పందన చూసి ప్రతిపక్షాలు తట్టుకోలేపోతున్నాయన్నారు. సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారం చేస్తున్నాయని చెప్పారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా మోసం చేస్తే.. సీఎం జగన్ సులభతర పరిపాలన, సచివాలయం ద్వారా నేరుగా ఇంటింటికి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని చెప్పారు.



ఏలూరు జిల్లా బుట్టాయగూడెంలో స్టిక్కర్లను అంటిస్తున్న పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

ఈ నెల 29 వరకు ప్రచార కార్యక్రమం

రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల నుంచి వస్తున్న అపూర్వ స్పందన, సీఎం వైఎస్ జగన్ పాలన పట్ల విశేష సానుకూలత నేపథ్యంలో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని ఈ నెల (ఏప్రిల్) 29వ తేదీ వరకు పొడిగించారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. మెగా సర్వే ఫలితాలను కూడా అదే రోజున ప్రకటించనున్నారు.

స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిలిపివేసే వరకు పోరాటం

మే 3న రాష్ట్రవ్యాప్తంగా రాస్తారోకోలు



సంఘీభావం తెలుపుతున్న రాజకీయ పార్టీలు కార్మిక, ప్రజా సంఘాల నాయకులు

కృష్ణలంక(విజయవాడ తూర్పు): విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను కేంద్ర ప్రభుత్వం నిలిపివేసేంత వరకు పోరాడుతామని పలు రాజకీయ పార్టీలు, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు ప్రకటించారు. మే 3న రాష్ట్రవ్యాప్తంగా రాస్తారోకోలు చేసి కేంద్రానికి నిరసనలు తెలియజేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. విజయవాడలో బుధవారం విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట వేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఆందోళనల ద్వారా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరముందన్నారు. సీపీఐ కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 797 రోజులుగా పోరాటం కొనసాగుతున్నా కేంద్రం స్పందించకపోవడం దారుణమన్నారు. వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గౌతంరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఎల్లప్పుడూ కార్మికుల పక్షానే ఉంటుందన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు, టీడీపీ నేత దేవినేని ఉమా, కాంగ్రెస్ నాయకుడు నరహరిశెట్టి నరసింహారావు, రైతు సంఘం నాయకులు వై.కేశవరావు, ప్రభాకర్‌రెడ్డి, కేవీవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై చర్చకు రండి

- చంద్రబాబు, లోకేశ్ ఎక్కడికో వెళ్లి సెల్ఫీలు దిగడం కాదు
- మంగళగిరి, కుప్పంలోనైనా చర్చకు సిద్ధమే
- మే నాటికి 5 లక్షల ఇళ్లు పూర్తి చేస్తాం
- రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్



సాక్షి ప్రతినిధి, గుంటూరు/సాక్షి, నరసరావుపేట: ఎక్కడో సెల్ఫీలు దిగడం కాదని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత జరిగిన అభివృద్ధి, తెలుగుదేశం ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిపై చర్చకు రావాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ టీడీపీ అధినేత చంద్రబాబుకు, లోకేశ్‌కు సవాల్ విసిరారు. రాష్ట్రంలో ఏ గడప వద్దనైనా, కుప్పంలో అయినా మంగళగిరిలో అయినా చర్చకు సిద్ధమన్నారు. మంత్రి బుధవారం గుంటూరు, పల్నాడు జిల్లా నరసరావుపేటలో మీడియాతో మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రాష్ట్రంలో 30 లక్షల మంది పేదలకు ఒక యజ్ఞంలా రికార్డు స్థాయిలో ఇళ్ల స్థలాలు ఇచ్చామని చెప్పారు. గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డులలో సీఎం జగన్ పేరు నమోదైందని తెలిపారు. పేదలకు శాశ్వత గృహాలు ఉండాలన్న సీఎం జగన్ సంకల్పం మేరకు ఇప్పటికే 3.8 లక్షల ఇళ్లు పూర్తి చేశామని, మే నాటికి ఐదు లక్షల ఇళ్లు పూర్తి చేసి సీఎం చేతుల మీదుగా ప్రారంభిస్తామని తెలిపారు. చంద్రబాబు, ఆయన అనుచరులు శిఖండులు, రాక్షసుల్లా అడ్డుపడినా, వాటన్నింటినీ అధిగమించి ఇళ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. చంద్రబాబు ఇదేం ఖర్మరా అంటూ తిరుగుతున్నారని, ఖర్మ పట్టింది ప్రజలకు, రాష్ట్రానికి కాదని, చంద్రబాబుకి, లేకేశ్‌కేనని చెప్పారు. సీఎం వైఎస్ జగన్ బటన్ నొక్కితే ఎటువంటి వివక్ష, అవినీతి లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ అవుతోందన్నారు. ఇటువంటి పార్టీని ఓడిస్తామని ప్రగల్భాలు పలుకుతున్న చంద్రబాబుకు 175 నియోజకవర్గాల్లో అభ్యర్థులను నిలబెట్టగల దమ్ము, ధైర్యం ఉన్నాయా అని నిలదీశారు. తెలంగాణ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యలపై స్పందిస్తూ.. ఇక్కడికి వచ్చి అభివృద్ధిని చూడాలని చెప్పారు. తాము గదుల్లో కూర్చుని మాట్లాడటంలేదని, క్షేత్ర స్థాయిలో ప్రజల సమస్యలు పరిష్కరిస్తూ, అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఇతర రాష్ట్రాల సీఎంలు ఏపీ ముఖ్యమంత్రిని ఆదర్శంగా తీసుకుని ఇక్కడి సంక్షేమ పథకాలను వారి రాష్ట్రాల్లోనూ అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నారని వివరించారు.

అవినాష్‌రెడ్డిని విచారించిన సీబీఐ

- వైఎస్ వివేకా హత్య కేసు దర్యాప్తులో భాగంగా విచారణ
- కోర్టు సూచనల మేరకు విచారించిన సీబీఐ
- విచారణ మొత్తం వీడియో, ఆడియో రికార్డింగ్
- నేడు మరోమారు విచారణ

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తులో భాగంగా బుధవారం మరోమారు ఎంపీ అవినాష్‌రెడ్డి సీబీఐ విచారణకు హాజరయ్యారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం.. సీబీఐ అధికారులు బుధవారం అవినాష్‌రెడ్డిని ప్రశ్నించారు. బుధవారం ఉదయం 10.45 గంటల ప్రాంతంలో అవినాష్‌రెడ్డి కోఠిలోని సీబీఐ కార్యాలయానికి చేరుకున్నారు. 11 గంటల నుంచి సాయంత్రం 6-45 గంటల వరకు విచారణ కొనసాగింది. హైకోర్టు ఆదేశాల మేరకు ప్రశ్నలన్నింటినీ సీబీఐ అధికారులు లిఖితపూర్వకంగానే ఇచ్చినట్టు తెలిసింది. అన్ని ప్రశ్నలకు అవినాష్‌రెడ్డి స్పష్టమైన సమాధానాలు ఇచ్చినట్టు తెలిసింది. కోర్టు ఆదేశాల మేరకు విచారణ మొత్తాన్ని అధికారులు ఆడియో, వీడియో రికార్డింగ్ చేసినట్టు సమాచారం. సీబీఐ అధికారులు అవినాష్‌రెడ్డిని గురువారం మరోమారు ప్రశ్నించనున్నట్టు తెలిసింది.

భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డిని విచారించిన సీబీఐ

వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తులో భాగంగా సీబీఐ అధికారులు వైఎస్ భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్ రెడ్డిలను బుధవారం మొదటి రోజు కస్టడీలోకి తీసుకొని విచారించారు. భాస్కర్ రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డిలను కోర్టు బుధవారం నుంచి ఆరు రోజులు సీబీఐ కస్టడీకి ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో సీబీఐ అధికారులు బుధవారం ఉదయం 10-30 గంటలకు ఇద్దరినీ చంచల్‌గూడ జైలు నుంచి కస్టడీలోకి తీసుకున్నారు. అనంతరం కోఠిలోని సీబీఐ కార్యాలయానికి తీసుకువచ్చారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన విచారణ సాయంత్రం 4-10 గంటల వరకు ఐదు గంటలపాటు కొనసాగింది. వివేకానందరెడ్డి హత్య జరిగిన రోజు హత్యకు ముందు, ఆ తర్వాత జరిగిన పరిణామాలపై వారిద్దరినీ వేర్వేరుగా ప్రశ్నించి స్టేట్‌మెంట్లు నమోదు చేసినట్టు సమాచారం. గురువారం మరోమారు ఇద్దరినీ కస్టడీకి తీసుకుని విచారించనున్నారు.

ఉపాధి హామీ సాంకేతిక సహాయకుల బదిలీలపై స్టేటస్ కో

హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు.. తదుపరి విచారణ 24కి వాయిదా



సాక్షి, అమరావతి: ఉపాధి హామీ పథకం కింద వివిధ జిల్లాల్లో నియమితులైన సాంకేతిక సహాయకుల బదిలీల విషయంలో హైకోర్టు సానుకూల ఉత్తర్వులిచ్చింది. వారి బదిలీలపై యథాతథస్థితి (స్టేటస్ కో) కొనసాగించాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ వ్యవహారానికి సంబంధించిన పూర్తి వివరాలను తమ ముందుంచాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 24కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు ఇటీవల మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. తమను ఇతర జిల్లాలకు బదిలీ చేయడాన్ని సవాలు చేస్తూ అనంతపురం జిల్లాకు చెందిన పి.పురుషోత్తంనాయుడు మరో 47 మంది, కడప జిల్లాకు చెందిన యెరుకల రెడ్డి, శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన ఎస్.సంతోష్ నాయక్, కర్నూలు, ప్రకాశం జిల్లాలకు చెందిన పలువురు సాంకేతిక సహాయకులు హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు విచారణ జరిపారు. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు ఎస్.వి.సుమంత్, నర్రా శ్రీనివాస రావు వాదనలు వినిపిస్తూ నియామక సమయంలో జిల్లాను ఓ యూనిట్‌గా పేర్కొన్నారని తెలిపారు. దీని ప్రకారం బదిలీలు ఆ జిల్లాలోనే ఉండాలన్నారు. అయితే అధికారులు ఇప్పుడు జిల్లా యూనిట్ స్థానంలో రాష్ట్రాన్ని ఓ యూనిట్‌గా పేర్కొంటూ బదిలీలకు శ్రీకారం చుట్టారని తెలిపారు. ఇది ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయమన్నారు. అతి తక్కువ జీతాలతో పనిచేస్తున్న పిటిషనర్లు ఇతర జిల్లాలకు వెళ్లి పనిచేయడం ఎంతో కష్టంతో కూడుకున్నదని తెలిపారు. అందువల్ల ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోవాలని సుమంత్ న్యాయమూర్తిని అభ్యర్థించారు. బదిలీలను నిలిపేయాలని కోరారు. వాదనలు విన్న న్యాయమూర్తి, పిటిషనర్ల బదిలీల విషయంలో యథాతథస్థితి కొనసాగించాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. తదుపరి విచారణను ఈ నెల 24కి వాయిదా వేశారు.

కేజ్రీవాల్‌కు కేసీఆర్ రూ.1,000 కోట్లు ఇచ్చారు

- తోట చంద్రశేఖర్‌కు రూ.100 కోట్లు ముట్టింది
- ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్, జేడీ లక్ష్మీనారాయణ
- జనసేనను ప్రజాశాంతి పార్టీలో విలీనం చేయాలి: కేఏ పాల్
- కేంద్రానిది తొండాట: లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న కేఏ పాల్, జేడీ లక్ష్మీనారాయణ

సాక్షి, విశాఖపట్నం: తెలంగాణ రాష్ట్రాన్ని, అక్కడ ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతుల్ని కాపాడలేని కేసీఆర్ విశాఖ ఉక్కుని కాపాడతాననడం హాస్యాస్పదమని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏపాల్ ఎద్దేవా చేశారు. సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణతో కలిసి పాల్ బుధవారమిక్కడ మీడియాతో మాట్లాడారు. దళితుల పట్ల కేసీఆర్‌కు కనీస ప్రేమ లేదని, అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసినంత మాత్రాన ఆయన్ని ఎవరూ నమ్మరని పాల్ అన్నారు. ప్రధాని కావాలన్న కాంక్షతో దోచుకున్న సొమ్ముని కేసీఆర్ పంచుతున్నారన్నారు. కేసీఆర్ ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు రూ.1,000 కోట్లు, తోట చంద్రశేఖర్‌కు రూ.100 కోట్లు ఇచ్చారని ఆరోపించారు. కేసీఆర్‌ని ప్రధానిని చేస్తే విభజన సమయంలో ఏపీలో దోచుకున్న రూ.లక్షల కోట్లు పంచేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకుంటామని, ప్లాంట్‌ని అమ్ముతామంటే.. వారు అడిగిన దానికి ఐదింతలు అమెరికా ఫండ్ తెచ్చి మరీ కొంటామనీ, అది కూడా రాష్ట్ర ప్రభుత్వానికి అమ్మాలని అన్నారు. టెస్లా అధినేత ఎలెన్ మస్క్ కూడా స్టీల్‌ప్లాంట్‌కు విరాళాలిచ్చేందుకు ముందుకు వస్తున్నారని తెలిపారు. ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రక్రియ 99 శాతం జరిగిపోయిందని, కానీ కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు నాటకాలాడుతోందని అన్నారు. 14 సంవత్సరాలు సీఎంగా ఉండి ఉద్యోగాలివ్వని చంద్రబాబు ఇప్పుడు మళ్లీ బాబు వస్తే జాబు అని చెబుతున్న మాటల్ని ఎవరూ విశ్వసించి ఓటు వేయరన్నారు. కొడుకుని సీఎం చేసేందుకు ఎన్నారైల వద్ద రూ.50 కోట్లు చొప్పున చంద్రబాబు దండుకుంటున్నారని పాల్ ఆరోపించారు. వైఎస్ జగన్ సీఎం కాక ముందు దోచుకున్నారని కేసులు పెట్టిన సీబీఐ.. సీఎంగా ఉండగా రూ.లక్షల కోట్లు దోచుకున్న చంద్రబాబుని ఎందుకు విచారించడం లేదని ప్రశ్నించారు. నాలుగేళ్లుగా రోడ్ మ్యాప్ కోసం బీజేపీ చుట్టూ తిరగడాన్ని పవన్ ఆపేసి జనసేన పార్టీని ప్రజాశాంతిలో విలీనం చేయాలని చెప్పారు. సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. ప్రస్తుతం విశాఖ ఉక్కులో 300 మెట్రిక్ టన్నుల స్టీల్ డిమాండ్ ఉందన్నారు. ఇంకా 8 వేల మంది నిర్వాసితులకు న్యాయం జరగాల్సి ఉందని చెప్పారు. వాటన్నింటినీ పరిష్కరించకుండా కేంద్రం తొండాట ఆడుతోందని విమర్శించారు. స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగ కంపెనీగానే ఉండాలని, విశాఖ ఉక్కుని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరితో కలిసి పోరాటం చేస్తానని చెప్పారు.

జూన్‌లో గిరిజన వర్సిటీకి భూమి పూజ

విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ



విజయనగరం అర్బన్: విజయనగరం జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న కేంద్రీయ గిరిజన యూనివర్సిటీకి శాశ్వత వసతి కల్పనకు మెంటాడ, దత్తిరాజేరు మండలాల సరిహద్దులో సేకరించిన భూమిలో జూన్ నెలలో భూమిపూజ చేస్తామని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. విజయనగరం కలెక్టరేట్ వద్ద బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గిరిజన వర్సిటీకి 560 ఎకరాల భూమి సేకరించామని, పరిహారం చెల్లింపునకు ప్రభుత్వం రూ.23కోట్లు విడుదల చేసిందని, పంపిణీ పనులు పూర్తయిన వెంటనే భూమి పూజ చేస్తామన్నారు. వచ్చేనెల 3న భోగాపురం అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయ నిర్మాణానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భూమిపూజ చేయనున్నారని వెల్లడించారు. అదేరోజు మత్స్యకారులకు ప్రయోజనం కల్పించే బోటింగ్ జెట్టీ నిర్మాణానికి కూడా సీఎం శంకుస్థాపన చేస్తారన్నారు. ఆయన వెంట ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ దీపిక తదితరులు ఉన్నారు.

ఇంటికో ఉద్యోగమిస్తా

ప్రతిపక్ష నేత చంద్రబాబు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు/బద్వేలు అర్బన్ (వైఎస్సార్ జిల్లా): బాబు వస్తేనే జాబు వస్తుందని, చదువుకున్న ప్రతి ఇంట్లో ఒక ఉద్యోగం ఇస్తానని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. ఆయన బుధవారం ప్రకాశం జిల్లా గిద్దలూరు పట్టణంలో ఏర్పాటు చేసిన సభలో, వైఎస్సార్ జిల్లా బద్వేలులో జరిగిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని, రూ.5 వేలు వచ్చే వలంటీర్ ఉద్యోగం మాత్రమే ఇచ్చారని అన్నారు. తాను అధికారంలో ఉన్నప్పుడు నిరుద్యోగ భృతి, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇచ్చానన్నారు. హైదరాబాద్‌లో హైటెక్ సిటీ కట్టానని, ఔటర్ రింగ్ రోడ్డు వేశానని, మెట్రో రైలు తెచ్చానని చెప్పారు. వెలిగొండ ప్రాజెక్టుకు తానే శంకుస్థాపన చేశానని, 2024 ఎన్నికల్లో విజయం సాధించి తానే పూర్తి చేస్తానని చెప్పారు. పోలవరం 72 శాతం కట్టానని, ఇప్పుడు రివర్స్ టెండర్ల ద్వారా ప్రభుత్వంపై రూ.2 వేల కోట్లు అదనపు భారం పడిందని అన్నారు. భావనపాడు పోర్టును తానే మంజూరు చేశానని, ఇప్పుడు సీఎం జగన్ దానికి వేరే పేరు పెట్టి ఆయనే చేశానని చెప్పుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో మద్యం ధరలు ఎక్కువ కావటంతో యువత గంజాయికి బానిసలవుతున్నారని అన్నారు. బ్రాందీ షాపుల్లో ఫోన్ పే, గూగుల్ పే ఎందుకు పెట్టలేదంటే కొంత సొమ్ము సీఎం జగన్ ప్యాలెస్‌కు పోవాలి కాబట్టి అని విమర్శించారు. సీఎం జగన్ సంక్షేమ పథకాల పేరుతో పది రూపాయలిచ్చి ఇతర రూపాల్లో వంద రూపాయలు లాగుతున్నారని విమర్శించారు. బటన్ నొక్కుడు కాదని, బటన్ తొక్కుడు ద్వారా రూ.2 లక్షల కోట్లు దోపిడీ చేశారని ఆరోపించారు. తాను మళ్లీ అధికారంలోకి రాగానే మార్కాపురంను ప్రత్యేక జిల్లా చేస్తానని హామీ ఇచ్చారు. అమరావతి నుంచి నంద్యాలకు ఎక్స్‌ప్రెస్ హైవే మంజూరు చేస్తే దానిని కడపకు తీసుకెళ్లిన ఘనుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు.

బాబు జీవితమే కుట్రలకు కేస్ స్టడీ

ఎమ్మెల్యే టీజేఆర్



సాక్షి, అమరావతి: చంద్రబాబు జీవితం కుట్రలకు పెద్ద కేస్ స్టడీ లాంటిదని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు వ్యాఖ్యానించారు. స్లీపర్ సెల్స్‌ను ప్రవేశపెట్టి వ్యవస్థలను నాశనం చేయడం, స్టేలు తెచ్చుకుని బయట పడటం, బాధితులనే ముద్దాయిలుగా చిత్రీకరించడంలో ఆయన సిద్ధహస్తుడన్నారు. వైఎస్ వివేకా హత్య కేసులో ఒకవైపు విచారణ జరుగుతుండగా నిందితుడు దస్తగిరి గంటల కొద్దీ లైవ్‌లో ఇంటర్వ్యూలు ఇవ్వడమేంటని ప్రశ్నించారు. బుధవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. 'వెన్నుపోటు రాజకీయాలు, మీడియా మేనేజ్‌మెంట్, చట్టాలకు చిక్కకుండా నేరాలకు పాల్పడటం వంటి వాటిని విజయవంతంగా నెరవేర్చిన చంద్రబాబు జీవితం ఓ కేస్ స్టడీ లాంటిదన్నారు.

● తెలంగాణ

కర్ణాటక ఎన్నికల స్టార్ క్యాంపెయినర్‌గా రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్/సాక్షి, న్యూఢిల్లీ : కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలకు స్టార్ క్యాంపెయినర్‌గా టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డిని ఆ పార్టీ అధిష్టానం నియమించింది. గురువారంతో నామినేషన్ల గడువు ముగియనున్న నేపథ్యంలో ఆ రాష్ట్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు కాంగ్రెస్ పార్టీ.. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో పాటు మొత్తం 40 మందితో కూడిన స్టార్ క్యాంపెయినర్ల జాబితాను కేంద్ర ఎన్నికల సంఘానికి పంపింది. ఈ మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి ముకుల్ వాస్నిక్ బుధవారం ఎన్నికల సంఘానికి లేఖ రాశారు. ఇందులో ఇద్దరు తెలంగాణ నాయకులకు అవకాశం లభించింది. పీసీసీ అధ్యక్షుడితో పాటు మాజీ క్రికెటర్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహ్మద్ అజారుద్దీన్‌ను కూడా స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో చేర్చింది. ఇప్పటికే ఎనిమిది మంది రాష్ట్ర నాయకులను కాంగ్రెస్ అధిష్టానం అసెంబ్లీ, పార్లమెంటు నియోజకవర్గాల వారీగా పరిశీలకులుగా నియమించింది. కాగా, బుధవారం బెంగళూరులోని రాడిసన్ హోటల్‌లో జరిగిన ఎన్నికల సన్నాహక సమావేశానికి వీరంతా హాజరయ్యారు. ఏఐసీసీ కార్యదర్శి హోదాలో ఉన్న మాజీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు గత కొంతకాలంగా కర్ణాటక ఎన్నికల బిజీలోనే ఉన్నారు.

నల్లమల అభయారణ్యంలో మంటలు

మన్ననూర్: నాగర్‌కర్నూల్ జిల్లా నల్లమలలోని అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ అభయారణ్యంలో భారీగా మంటలు చెలరేగాయి. దాదాపు 60 హెక్టార్ల (150 ఎకరాల) విస్తీర్ణానికి పైగా అటవీ ప్రాంతం అగ్నికి ఆహుతైనట్లు అమ్రాబాద్ ఎఫ్ఆర్వో ప్రభాకర్ తెలిపారు. మంగళవారం రాత్రి తాటిగుండాల వద్ద మొదలైన మంటలు బుధవారం ఈర్లపడేల్, లంబడోని ఉతార్, జీలుగాయి కుంట, శుద్ధబొక్కలు అటవీ ప్రాంతం వరకు వ్యాపించినట్లు తెలిపారు. శాటిలైట్ ద్వారా అందిన సమాచారం మేరకు అప్రమత్తమైన అటవీశాఖ అధికారులు, సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని, మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. దాదాపు 20 మంది ఫైర్ ప్రొటెక్షన్, వాచర్లు అత్యాధునిక యంత్రాలతో 8 గంటలు శ్రమించి.. బుధవారం రాత్రి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.



అందరి సంతోషంలో మీ సంతోషాన్ని వెతుక్కోండి.
- జరాతుష్ట్ర

సాక్షి
గురువారం, 20 ఏప్రిల్ 2023

మండుటెండల్లో మహా నిర్లక్ష్యం

ప్రకృతి ప్రకోపానికి గురికావడం వేరు. పాలకుల అనాలోచిత చర్య, నిర్లక్ష్యానికి బలి కావడం వేరు. నవీ ముంబయ్‌లోని ఖార్‌ఘర్ ప్రాంతంలో ఆదివారం 38 డిగ్రీల మండుటెండలో 306 ఎకరాల్లో ఆరుబయట ప్రభుత్వం నిర్వహించిన కార్యక్రమంలో అసువులు బాసిన 13 మంది అమాయకులు అక్షరాలా పాలనా యంత్రాంగపు నిర్లక్ష్యానికి బలిపశువులే. మహారాష్ట్ర ప్రభుత్వ అత్యున్నత పౌర పురస్కారం 'మహారాష్ట్ర భూషణ్'ను సంఘ సంస్కరణవాది అప్పాసాహెబ్ ధర్మాధికారికి ప్రదానం చేసే ఆ బహిరంగ సభకు 10 లక్షల మంది హాజరయ్యారు. కేంద్ర హోమ్ మంత్రి, సీఎం లాంటి వీవీఐపీలకు ఎండ కన్నెరగని రీతిలో ఏర్పాట్లు చేసిన పెద్దలు, సామాన్యులకు నెత్తి మీద నీడ కాదు కదా.. తాగేందుకు గుక్కెడు చల్లటి మంచినీటినైనా ఏర్పాటు చేయడంలో విఫలమయ్యారంటే ఏమనాలి?

650 మంది దాకా వేసవి ఉష్ణతాపం వల్ల అస్వస్థతకు గురి కాగా, 18 మంది ఆస్పత్రి పాలైన ఆ సభావేదిక దృశ్యాలు చూస్తుంటే, ఎవరికైనా గుండె మండిపోతుంది. ఎండలు ముదిరిన వేసవిలో, మహారాష్ట్రలో ప్రచండ గ్రీష్మపవనాల ప్రభావం తప్పదని వాతావరణ శాఖ హెచ్చరించి సంగతి తెలిసీ... ఇలా మిడసరిలగ్నంలో బహిరంగ సభ పెట్టి మనుషుల ప్రాణాలతో చెలగాటమాడే హక్కు ఏ పార్టీకైనా, ఏ ప్రభుత్వానికైనా ఎవరిచ్చారు? పర్యావరణ విధ్వంసం, వాతావరణ మార్పుల వల్ల ఇప్పుడు ఏటేటా పెరుగుతున్న ఉష్ణోగ్రత, వేడిగాలులపై పాలకులు దృష్టి పెట్టాల్సిన అత్యవసరాన్ని ఈ నిర్లక్ష్యం, వ్యవస్థాగత వైఫల్యం గుర్తుచేస్తున్నాయి. ఈ ఘటన అటు పాలకులకూ, ఇటు వేసవి గడిచేకొద్దీ ఎన్నికల రాజకీయ వేడి పెరిగి, భారీ సభలకు దిగే పార్టీలకూ పాఠాలు చెబుతోంది.

మహారాష్ట్ర ఘటనలో మహాపరాధాలు అనేకం. సాయంత్రం 5 గంటలకు అనుకున్న సభను ఎందుకు ఆరు గంటలు ముందుకు జరిపినట్టు? పక్క రాష్ట్రాల నుంచి కూడా లక్షల మంది హాజరయ్యేలా ఎర్రటి ఎండలో గంటలకొద్దీ సభ పెట్టినప్పుడు నీడలో కూర్చొనే ఏర్పాటు, సక్రమంగా మంచినీటి వసతి ఎందుకు చేయలేకపోయినట్టు? ఎండ వేడి, ఉక్కపోతలతో ఉక్కిరిబిక్కిరై, దాహంతో నోరు పిడచగట్టుకుపోయి, కళ్ళు తిరిగి వడదెబ్బకూ, గుండెపోట్లకూ జనం మరణిస్తే, 'దురదృష్టకరం' అని ఒక్కమాట అనేస్తే చాలా? మృతుల కుటుంబాలకు 5 లక్షల పరిహారం ప్రకటించినంత మాత్రాన... చేసిన పాపం, ఏర్పాట్లలో చూపిన నిర్లక్ష్యం మాసిపోతాయా? ఉష్ణపవనాలపై వాతా వరణ శాఖ హెచ్చరికలను యంత్రాంగం పెడచెవిన పెట్టిన ఫలితమిది. ఇది దేశంలో అందరికీ ఓ గుణపాఠం.

తాజాగా ఏప్రిల్ 17 నుంచి అయిదురోజులు యూపీ, బెంగాల్, సిక్కిమ్, ఒడిశా, జార్ఖండ్, కోస్తా ఆంధ్రలో ఉష్ణతీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ హెచ్చరికలు రావడం గమనార్హం. గడచిన 2022లో ఏకంగా 280 రోజులు 16 రాష్ట్రాల్లో ఉష్ణ పవనాలు వీచినట్టు 'సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్' నివేదిక. ఇది గత దశాబ్దిలోకెల్లా అత్యధికం. ఒక్క మహా రాష్ట్రలోనే నిరుడు వేసవిలో 2 నెలల్లో, 4 హీట్ వేవ్స్ వచ్చాయి. 31 మంది మరణించారు. ఈ ఏడాదీ మార్చి నుంచి మే వరకు మధ్య, వాయవ్య భారతంలో గ్రీష్మ పవనాలు వచ్చే అవకాశం ఎక్కువని ఐఎండీ ఫిబ్రవరిలోనే పారాహుషార్ చెప్పింది. ఆ అంచనా సాక్ష్యమే ఇటీవలి ఎండలు, వడగాడ్పులు. ఏటేటా పెరుగుతూ, జనజీవనాన్ని ప్రభావితం చేస్తున్న ఈ వేడిమిపై పాలకులు తక్షణం దృష్టి పెట్టాలంటున్నది అందుకే!

2010లోనే ఉష్ణపవనాల తాకిడికి 800 మందికి పైగా మరణించిన అహ్మదాబాద్‌లో అక్కడి నగరపాలక సంస్థ నిపుణుల సాయంతో దేశంలోనే తొలి 'గ్రీష్మపవన కట్టడి కార్యాచరణ ప్రణాళిక' (హెచ్ఏపీ)ను రూపొందించింది. 2013 నుంచి అమలులో పెట్టి, ఏటా వెయ్యికి పైగా మరణాలను నివారిస్తోంది. జనం జీవనోపాధినీ, ఆరోగ్యాన్నీ దెబ్బతీసే ఈ వడగాడ్పులను ఎదుర్కోవడానికి ఇంకా అనేకచోట్ల వివిధ పాలనా యంత్రాంగాలు ప్రణాళికలు రూపొందించక పోలేదు. పిల్లల బడి వేళల్లో, రోజువారీ కూలీల పని వేళల్లో మార్పులు, ప్రథమ చికిత్స, మంచినీటి వసతుల ఏర్పాటు లాంటి ప్రామాణిక కార్యాచరణ విధానాలను (ఎస్ఓపీ) ఒడిశా లాంటి రాష్ట్రాలు రూపొందించాయి. అయితే, మన దేశంలో ఈ హెచ్ఏపీలను ఎక్కడికక్కడ స్థానిక అవసరాలకు తగ్గట్టు తయారు చేయట్లేదు. అది పెద్ద లోపం. నిధుల కొరత సరేసరి. పదులకొద్దీ ప్రణాళికల్ని అధ్యయనం చేసి 'సెంటర్ ఫర్ పాలసీ రిసెర్చ్' ఇది తేల్చింది. ఆ మాట మనకు మరో కనువిప్పు.

అందుకే, ఈ ప్రణాళికలన్నిటినీ జాతీయ స్థాయిలో ఒకచోట సమీకరించడం అవసరం. పారదర్శకంగా, ఆన్‌లైన్‌లో అందరికీ అందుబాటులో ఉంచి, తరచూ వాటి పనితీరును మదింపు చేయాలి. సీపీఆర్ ఆ సూచనే చేస్తోంది. అలాగే, రోజువారీ కనిష్ఠ, గరిష్ఠ ఉష్ణోగ్రతల్ని కొలిచే సంప్రదాయ విధానాలు సరిపోవు. ఒక ప్రాంతపు వేడినీ, తేమనూ కలిపి కొలిచే 'వెట్-బల్బ్' ఉష్ణోగ్రత; అలాగే గాలి వేడిమి, సాపేక్ష ఆర్ద్రత, వాయువేగాల కలయికైన ఒంటికి అనిపించే ఉష్ణోగ్రత లాంటి కొత్త విధానాల్ని అనుసరించడం మంచిది. దీనివల్ల ఒంటిపై ఉష్ణప్రభావాన్ని గ్రహించి, సునిశిత చర్యలు చేపట్టవచ్చు. ప్రజలకు వాతావరణ అక్షరాస్యత కల్పించి, అవగాహన పెంచి, అవాంఛనీయ మార్పులకు సంసిద్ధం చేయడమూ అవసరం.

అందులోనూ రానున్న కాలంలో... ప్రపంచంలో తొలిసారిగా మానవ ఉనికికే ప్రమాదమయ్యే స్థాయి ఉష్ణపవనాలు ఎదురయ్యే ప్రాంతాల్లో ఒకటి భారత్ కావచ్చని ప్రపంచ బ్యాంక్ హెచ్చరిక. పంచాగ్ని మధ్యంలో పడిపోక ముందే తెలివి తెచ్చుకొని, సత్వర కార్యాచరణకు దిగడమే విజ్ఞత. ఉదాసీనతతో, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మహారాష్ట్ర లాంటి ఘటనలే మళ్ళీ ఎదురవుతాయి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** అమావాస్య ఉ.9.44 వరకు, తదుపరి వైశాఖ శు.పాడ్యమి, **నక్షత్రం:** అశ్వని రా.11.33 వరకు, తదుపరి భరణి, **వర్జ్యం:** రా.7.37 నుండి 9.14 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.54 నుండి 10.44 వరకు, తదుపరి ప.2.53 నుండి 3.44 వరకు, **అమృతఘడియలు:** సా.4.31 నుండి 6.03 వరకు.

సూర్యోదయం : 5.45
సూర్యాస్తమయం : 6.12
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ. 6.00 నుండి 7.30 వరకు

నకిలీల తనిఖీ పేరుతో పెత్తనం?

సందర్భం



అపర్ గుప్తా

డిజిటల్ మీడియాలో వచ్చే ప్రభుత్వ వార్తల్లోని సత్యాసత్యాలను ఒక ప్రత్యేక 'ఫ్యాక్ట్ చెక్' విభాగం ద్వారా తనిఖీ చేయించేందుకు వీలుగా ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ... ఐటీ 'నియమావళి – 2023'ని సవరించడంపై పలు అభ్యంతరాలు, ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. ప్రభుత్వం హామీ ఇచ్చిన విస్తృత సంప్రదింపులు లేకుండానే నిబంధనలు రూపొందించడం భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 (1)(ఎ) పౌరులకు ప్రసాదిస్తున్న భావ ప్రకటన స్వేచ్ఛకు భంగం కలిగించేలా ఉందని సోషల్ మీడియా వెబ్‌సైట్‌లు, డిజిటల్ మాధ్యమాలు కలవరం చెందుతున్నాయి. సమాచారాన్ని తొలగించమని ఆదేశించే అధికారం కేంద్ర ప్రభుత్వానికి దఖలు పడుతున్నందునే తాజా 'ఐటీ నియమావళి, 2023' వివాదాస్పదం అయింది.

ఏప్రిల్ 6న కేంద్ర ప్రభుత్వ గెజిట్ నోటిఫికేషన్‌తో ఒక కొత్త సమాచార నియంత్రణ శక్తి ఊపిరి పోసుకుంది! ప్రాథమిక 'ఐటీ నియమావళి, 2023'కి జోడింపుగా 'మధ్యవర్తి మార్గదర్శకాలు, డిజిటల్ మీడియా నీతి నియమాలు' (ఇంటర్మీడియేటరీ గైడ్‌లైన్స్ అండ్ మీడియా ఎథిక్స్ కోడ్)ని చేర్చడం ద్వారా 'ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వశాఖ' అలాంటి నియంత్రణ శక్తి ఆవిర్భావానికి తావు కల్పించింది. ఈ కొత్త నియమావళి కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి డిజిటల్ మీడియాలో వచ్చే నకిలీ, తప్పుడు లేదా తప్పుదారి పట్టించే సమాచారాన్ని గుర్తించి, వాటిని తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఒక 'వాస్తవాల తనిఖీ' (ఫ్యాక్ట్ చెక్) విభాగం ఏర్పాటుకు అధికారాన్ని ఇస్తోంది!

సమాజ సంక్షేమాన్ని విస్మరించి, స్వేచ్ఛను హరించేందుకు (ఆర్వేలియన్) అవకాశం ఉన్న ఆ ఫ్యాక్ట్ చెక్ విభాగం... ప్రభుత్వ శాఖలు, మంత్రుల గురించి డిజిటల్ మీడియాలో వచ్చే వార్తలు, వ్యాఖ్యలు, నివేదికలు, అభిప్రాయాలను వాస్తవాల తనిఖీ పేరిట పరిశీలించి వాటిని తొలగించడం కోసం ఆన్‌లైన్ మధ్యవర్తులకు ఆదేశాలు జారీ చేస్తుంది. ఆ మధ్యవర్తులు ఆన్‌లైన్ సోషల్ మీడియా కంపెనీలు కావచ్చు. ఐ.ఎస్.పి. (ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్)లు, యాప్‌ల రూపకల్పనకు అవసరమై సాంకేతికతల్ని హోస్ట్ చేసే సంస్థలూ కావచ్చు. వాస్తవాల తనిఖీ వల్ల కచ్చితత్వ నిర్ధారణ జరుగుతుందనీ, వాస్తవాలకు మాత్రమే విస్తృతి లభించి, పాఠక పౌరులకు ఏది చేరాలో అదే చేరుతుందనీ 'ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ' ఉద్దేశం.

ఐటీ యాక్ట్, 2000లోని సెక్షన్ 79 కల్పిస్తున్న 'నియమాల రూపకల్పన అధికారాన్ని' ఉపయోగించుకుని ఈ తాజా ఐటీ నియమావళి, 2023 ఏర్పడింది. శ్రేయా సింఘాల్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం... సెక్షన్ 79, ఐ.టి. నియమావళిని అనుసరించి చట్ట విరుద్ధ చర్యలకు సంబంధించిన వాస్తవ సమాచారాన్ని కోర్టు ఉత్తర్వు ద్వారా లేదా ప్రభుత్వ విభాగం ఆదేశాల మేరకు ప్రభుత్వం పొందడానికి మధ్యవర్తులను ఏర్పరచుకోవచ్చు. అయితే రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(2)లో 'నకిలీ', 'తప్పుడు', 'తప్పుదారి పట్టించే' అనే పదాలు ప్రత్యేకించి లేవు. శాంతి భద్రతలు, దేశ సమగ్రత, నైతికత వంటి విస్తృత వర్గీకరణల కింద మాత్రమే ఐటీ నియమావళి అన్వయం అవుతుంది. అంతమాత్రాన, సరిగా లేని ఏదైనా సమాచారం లేదా ప్రకటన... నకిలీ, తప్పుడు, లేదా తప్పుదారి పట్టించేది అయిపోదు. అయితే నకిలీ, తప్పుడు, తప్పుదారి పట్టించే వర్గీకరణల కిందికి వచ్చే ప్రతి సమాచారం కూడా ఈ 'వాస్తవాల తనిఖీ' పరిధిలోకి రాకపోయినప్పటికీ రాజ్యాంగ విరుద్ధమైన నిషేధ అధికారంతో ప్రభుత్వం చర్య తీసుకునే ప్రమాదం ఉంది.

ఇక ఐటీ నియమావళి, 2023 'నకిలీ, తప్పుడు, తప్పుదారి పట్టించే' సమాచారం ఎలాంటిదన్నది నిర్వచించలేదు. 'వాస్తవాల తనిఖీ విభాగం' అర్హతల్ని, విచారణ పరిధుల్ని, విధానాలను పేర్కొనలేదు. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పి.ఐ.బి.) లో ఇప్పటికే ఉన్న తనిఖీ విభాగం గతంలో పొరబడిన సందర్భాలు కూడా ఉన్నాయి! 2020 డిసెంబర్ 16 పీఐబీ ఒక ఇంటెలిజెంట్ బ్యూరో నియామక సమాచారానికి బూటకంగా ముద్రవేసింది. అయితే ఆ మర్నాడే సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ... పీఐబీ బూటకం అని భావించిన ఆ నియామక ప్రకటన నిజమైనదేనని ప్రకటించింది. ఇదొక్కటే ఇలాంటి సంఘటన కాదు. పలు పత్రికా ప్రచురణకర్తలు ఇటువంటి వాస్తవాల తనిఖీ తొందరపాట్లపై ఫిర్యాదు చేసిన ఉదంతాలు ఉన్నాయి.



'ఐటీ నియమావళి, 2023' మొదట 2023 జనవరి 2న ఒక ముసాయిదా రూపంలో వెలువడింది. ఆ నియమావళిపై 2023 జనవరి 17 లోపు తమ అభిప్రాయాలను వెల్లడించాలని ప్రభుత్వం డిజిటల్ సంస్థలను, డిజిటల్ వినియోగదారులను కోరింది. అయితే ఆ ముసాయిదా ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీలను నియంత్రించడానికి అవసరమైన నిబంధనలను మాత్రమే కలిగి ఉంది. అభిప్రాయాల వెల్లడికి గడువు ముగియడానికి కొన్ని గంటల ముందు ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ ఆ ముసాయిదాలో 'వాస్తవాల తనిఖీ' అధికారాలను చేరుస్తూ దానిపై సంప్రదింపుల వ్యవధిని పొడిగించింది. ఈ చర్యే ఆందోళనకు దారి తీసింది. ఎడిటర్స్ గిల్డ్ జనవరి 18న ఒక ప్రకటన విడుదల చేస్తూ, తనిఖీ అధికారాల నిబంధనను వెనక్కు తీసుకోవాలని కోరింది. ఏది నకిలీ సమాచారమో తేల్చే పూర్తి నిర్ణయాధికారం ప్రభుత్వం చేతిలో ఉండకూడదని అభిప్రాయపడింది. జనవరి 19న 'డిజిపబ్'... ప్రతిపాదిత సవరణల్ని విమర్శించింది. ఆ సవరణలు భారత ప్రభుత్వానికి ఏకపక్షంగా విచక్షణాధికారాలను కట్టబెడుతున్నాయని ఆరోపించింది. జనవరి 23న ఇండియన్ న్యూస్ పేపర్ సొసైటీ... ఈ సవరణలు ప్రభుత్వ చర్యల్ని విమర్శించడాన్ని నిషేధించేందుకు అనుమతిస్తున్నాయని వాదించింది.

ఈ అభ్యంతరాలన్నిటికీ జనవరి 25న ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ సమాధానం ఇచ్చారు. ఈ ఫ్యాక్ట్ చెక్ విభాగం ఏర్పాటు ప్రతిపాదనపై ఫిబ్రవరి ఆరంభంలో పీఐబీతో ప్రత్యేక సంప్రదింపులు జరుపుతామని ప్రకటించారు. అయితే ముఖాముఖీలు గానీ, ఆన్‌లైన్ ప్రజా సంప్రదింపులు గానీ లేవు. డిజిటల్ సమాచార సంస్థలతో ప్రభుత్వం అసలు సమావేశమే అవలేదు. ''అన్నిటికన్నా ఆశ్చర్య పరుస్తున్నదేమంటే ప్రభుత్వం హామీ ఇచ్చినట్లుగా అర్థవంతమైన సంప్రదింపులేవీ జరపకుండానే ముసాయిదాలో సవరణల్ని ప్రకటించడం'' అని ఎడిటర్స్ గిల్డ్ ఏప్రిల్ 7న పేర్కొంది.

వాస్తవానికి 'ఐటీ నియమావళి, 2021'లో ప్రతి సంవత్సరం సవరణలు జరుగుతూనే ఉన్నాయి. మొదట 2021 ఫిబ్రవరి 25న ప్రభుత్వం ఆన్‌లైన్ వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లకు, డిజిటల్ న్యూస్ పోర్టల్స్‌కు ఉన్న అధికారాలను విస్తరిస్తూ నియమాల్లో మార్పులు చేసింది. ఆ మార్పులపై వ్యతిరేకత వ్యక్తం అయింది. 30 రిట్ పిటిషన్‌లు దాఖలు అయ్యాయి. వాటిపై మూడు హైకోర్టులు నిలుపుదల ఉత్తర్వులు ఇచ్చాయి. 2021 ఆగస్టు 5న బాంబే హైకోర్టు ''ఈ మార్పులు ఆలోచనా స్వేచ్ఛ కోసం ప్రజలు అలమటించేలా చేస్తాయి'' అని పేర్కొంటే, 2021 సెప్టెంబరు 17న మద్రాసు హైకోర్టు, ''ప్రభుత్వపు ఒక్క కనుసైగతో పౌరులకు సమాచారం అందుబాటులో లేకుండా పోతుంది'' అని వ్యాఖ్యానించింది. కేంద్ర ప్రభుత్వం ఈ కేసులను సవాలు చేసి వాటిని సుప్రీంకోర్టుకు బదిలీ చేయాలని కోరింది.

ఆ తర్వాత, 2022 అక్టోబర్ 28న ప్రభుత్వం మరికొన్ని సవరణల్ని ప్రవేశపెట్టింది. సోషల్ మీడియా వినియోగదారులు సమాచార నియంత్రణ నియమాలపై ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయడానికి వీలుకల్పించే ఫిర్యాదుల అప్పిలేట్ కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ కమిటీలకు 37 విజ్ఞప్తులు రాగా, వాటిల్లో 19 విజ్ఞప్తులను నిర్ణయమేమిటో వెల్లడించకుండా, ప్రజలకు వాటి యు.ఆర్.ఎల్.లను బహిర్గతం చేయకుండా అవి పరిష్కరించేశాయి! ఇదంతా 'రేస్ ఇప్సా లోక్విటూర్' (వాస్తవాలు వాటికవే మాట్లాడతాయి) అనే లాటిన్ సామెతను గుర్తు చేస్తోంది. నిజం ఏమిటో నిర్ణయించే అధికారాన్ని ప్రభుత్వ శాఖకు దఖలు పరుస్తున్న ఐటీ నియమావళి, 2023తో వాస్తవాలే మాట్లాడతాయన్న సంగతి కూడా నిర్ధారణలోకి రావచ్చు.

వ్యాసకర్త న్యాయవాది, ఇంటర్నెట్ ఫ్రీడమ్ ఫౌండేషన్ నాన్–ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్
('ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఇక్కడ తెలుసా?



అమెరికాలో నలభై శాతం మందికి మోదీ ఎవరో తెలీదని ప్యూ సర్వే వెల్లడించింది. కానీ వాళ్లు ఇండియాలో సర్వే చేసివుంటే, జో బైడెన్ ఎవరో 99 శాతం మందికి తెలీదని వెల్లడయ్యేది.
– సేవియో రోడ్రిగ్స్, జర్నలిస్ట్

పొరుగు సమస్య



తమ పొరుగు దేశాన్ని తాలిబన్లు హస్తగతం చేసుకోవడం పట్ల ఎంతో సంతోషం వ్యక్తం చేసిన పాకిస్తానీయులే, ఇంకో పొరుగు దేశంలో తొలి యాపిల్ స్టోర్ ప్రారంభం కావడం పట్ల అసూయ చెందుతున్నారు.
– సలీమ్, పాక్ వ్యాఖ్యాత

లింగాన్ని ఏం నిర్దేశించాలి?



జీవశాస్త్ర పరంగా స్త్రీ పురుష లింగ భేదం సంపూర్ణమేమీ కాదనడం అసంబద్ధం. ఇదింకా జననేంద్రియాలు ఆడా, మగా అనేది నిర్దేశించవనే హాస్యాస్పద అతివాదానికి దారి తీస్తుంది. అలాంటప్పుడు, మగవాళ్లను మగ, ఆడవాళ్లను ఆడ అని ఎందుకనడం? 'అతడు', 'ఆమె' మాటలను రద్దు చేసి, 'అది' అంటే సరిపోతుంది కదా! పాశ్చాత్య లింగ మేల్కొలుపువాదం సుప్రీంకోర్టును పీడిస్తోంది.
– కన్వల్ సిబ్బల్, మాజీ రాయబారి

చిల్ సిల్వియో!



ఇటలీ బిలియనీర్, మాజీ ప్రధానమంత్రి సిల్వియో బెర్లుస్కోనీ సెనేట్ దగ్గర సన్‌గ్లాసెస్ పెట్టుకుని కనిపించారు (ఫొటో షేర్ చేశారు). 'కంటి ఆరోగ్య' సమస్యల వల్ల ఆయన వ్యభిచార విచారణ పోస్ట్‌పోన్ అయిన తర్వాతి సంగతి ఇది.
– అలెసాండ్రా బొక్కి, జర్నలిస్ట్

మూల కారణం



ఎందుకు యువత నేరాల వైపు మళ్లుతున్నారు? 1. పేదరికం. 2. నాణ్యత లేని బడిచదువులు. 3. నిరుద్యోగం. వాళ్లను రాజకీయనాయకులు ద్వేషం వ్యాప్తిచేయడానికి వాడుకుంటున్నారు. ఎవరు దీనికి బాధ్యులు? రాజ్యం, రాజకీయ నాయకులు.
– కపిల్ సిబాల్, రాజ్యసభ ఎంపీ

తొక్కిపెడతారా?



మహారాష్ట్ర ప్రభుత్వం ఒక బహిరంగ సభను నిర్వహించడంలోని వైఫల్యం వల్ల జరిగిన తొక్కిసలాట మరణాలను కూడా ఎండదెబ్బ మరణాల్లోకి ఎందుకు తోసేస్తున్నారు? ఎందుకు కప్పిపుచ్చుకోవడం? అది కూడా ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, కేంద్ర హోంమంత్రి పాల్గొన్న సభ గురించి?
– తుషార్ గాంధీ, రచయిత

కావాలంటే చేసుకోనివ్వాలి!



వివాహం అనేది ఎంతమాత్రమూ అవసరం లేని, ఇక చెల్లుబాటు కాని వ్యవస్థ. చాలా సంతోషంగా ఉన్న వివాహితగానే ఈ మాటలు చెబుతున్నాను. అయినప్పటికీ, వివాహ సమానత్వానికి చట్టబద్ధతను దాని సంపూర్ణార్థంలో ఎవరైనా కోరుకుంటే నేను వాళ్లకు మద్దతిస్తాను. వైవాహిక స్థితిని కోరుకునేవాళ్ల పట్ల వివక్ష చూపడంలో ఏ హేతువూ లేదు.
– నిష్ఠ గౌతమ్, సంపాదకురాలు

ఇన్‌బాక్స్

బెట్టింగ్ పట్ల జర జాగ్రత్త!

ఎంతో ఉజ్వల భవిష్యత్ ఉన్న యువత 'బెట్టింగ్' ఉచ్చులో పడి డబ్బును కోల్పోవడంతో పాటు, ఇటు చదువులనూ ఆటకెక్కిస్తున్నారు. పోలీసులు బెట్టింగ్‌ను అరికట్టడానికి ఎన్ని కఠిన చర్యలు తీసుకుంటున్నప్పటికీ అవేవీ పూర్తిస్థాయిలో సత్ఫలితాలను ఇవ్వడం లేదు. బెట్టింగ్ రాయుళ్లు రకరకాల పద్ధతుల్లో బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. తమ పిల్లల నడవడికపై తల్లిదండ్రుల పర్యవేక్షణ కొరవడటం కూడా ఈ పరిస్థితికి కారణం. ఒకప్పుడు కోడిపందాలు, గుర్రపు పందాలు, ఎన్నికల ఫలితాలు వంటి వాటిలో కనిపించిన బెట్టింగ్ ఇప్పుడు ఐపీఎల్ పుణ్యమా అని క్రికెట్‌లో అధికమయ్యింది.

పిల్లలపై కోటి ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రులు కళ్లముందే తమ పిల్లలు ఈ చెడు వ్యసనానికి బలవుతుంటే చెప్పలేని బాధకు గురవుతున్నారు. సాధారణంగా బెట్టింగ్ జాడ్యం యువతకు వారి స్నేహితుల ద్వారానే అంటుకుంటూ ఉంటుంది. కాబట్టి తల్లిదండ్రులు తమ పిల్లల స్నేహితులపైనా ఒక కన్నువేసి ఉంచాలి. యువకులు, విద్యార్థులు వారు ఎంచుకునే స్నేహితుణ్ణి బట్టే జీవితంలో సగం విజయాన్ని కానీ, పతనాన్ని కానీ పొందుతారనేది గుర్తుంచుకోవాలి.

చదువు మీద శ్రద్ధ పెట్టకుండా తిరిగేవారు, నిరుద్యోగ యువతలో కొందరు బెట్టింగ్‌కు అలవాటవుతున్నారు. వీరికి పందెం కాయడానికి డబ్బులు ఇటీవల అందుబాటులోకి వచ్చిన అనేక రుణ యాప్‌లు అందిస్తున్నాయి. బెట్టింగ్‌లో డబ్బు కోల్పోయిన ఈ యువతను యాప్‌లవాళ్లు తిరిగి డబ్బులు కట్టాలని ఒత్తిడి చేయడంతో చివరికి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. లేదా పరిస్థితి విషమించిన తర్వాత యువత ఇంట్లో చెబుతున్నారు.

ఈ పరిస్థితి రాకుండా ఉండాలంటే యువత, తల్లి దండ్రులు, పోలీస్‌వారు ఎవరి పరిధిలో వారు తగిన జాగ్రత్తలు తీసుకోవలసి ఉంటుంది. అలా కానిచో బెట్టింగ్ భూతానికి లక్షలాది కుటుంబాలు బలికాక తప్పదు.

– సభావట్ కళ్యాణ్, గోవిందాయిపల్లి తాండ, రంగారెడ్డి జిల్లా

హైకోర్టుల పేర్లలో ఈ తేడాలెందుకో!


అభిప్రాయం



తడకమళ్ళ మురళీధర్

భారతదేశంలో ప్రస్తుతానికి 25 హైకోర్టులు పని చేస్తున్నాయి. కొన్ని రాష్ట్రాలకు ఒక్కో హైకోర్టు వేర్వేరుగా ఉండగా... మరి కొన్నింటికి ఉమ్మడి కోర్టులున్నాయి. మహారాష్ట్ర, గోవా, దాద్రా నగర్ హవేలి, డామన్ - డయ్యూలకు ఉమ్మడిగా బొంబాయి హైకోర్టు అధికార పరిధి కలిగి ఉంది. పశ్చిమ బెంగాల్, అండమాన్ నికోబార్‌లకు ఉమ్మడిగా కలకత్తా హైకోర్టు; అరుణాచల్‌ప్రదేశ్, అసోం, మిజోరం, నాగాలాండ్‌లకు ఉమ్మడిగా గౌహతి హైకోర్టు; కేరళ, లక్షద్వీప్‌లకు ఉమ్మడిగా కేరళ హైకోర్టు; తమిళనాడు, పుదుచ్చేరిలకు ఉమ్మడిగా మద్రాస్ హైకోర్టు ప్రాతి నిధ్యం వహిస్తున్నాయి. పంజాబ్, హర్యానా, చండీ గఢ్‌లు ఉమ్మడి పంజాబ్ హర్యానా హైకోర్టు అధికార పరిధిలో ఉన్నాయి.

కొన్ని రాష్ట్రాల్లో రాష్ట్ర రాజధాని నగరంతో పాటు ఇతర నగరాల్లో కూడా శాశ్వత హైకోర్టు బెంచ్‌లు స్థాపించారు. అవి లక్నో, ఔరంగాబాద్, నాగపూర్, పనాజీ, పోర్ట్ బ్లెయిర్, జల్పాయిగురి, ఐజ్వాల్, కోహిమా, ఇటానగర్, హుబ్బళి, కాలాబురగి (గుల్బర్గా), మదురై, ఇండోర్, గ్వాలియర్, జైపూర్ (ప్రిన్సిపల్ హైకోర్టు జోధ్‌పూర్‌లో ఉంది). మనకు స్వాతంత్ర్యం సిద్ధించక ముందే అలహాబాద్, బొంబాయి, కలకత్తా, మద్రాస్, మధ్యప్రదేశ్, పాట్నా హైకోర్టులను నెలకొల్పారు. బ్రిటిష్ ఇండియాలో ప్రెసిడెన్సీ టౌన్స్‌గా పిలిచిన కలకత్తా, బొంబాయి, మద్రాస్ నగరాల్లోని హైకోర్టులను చార్టర్డ్ హైకోర్టులుగా వ్యవహరించేవారు. క్వీన్ విక్టోరియా తన అప్రతిహత అధికారాల్ని ఉపయోగించి ఆనాటి చట్టాల ప్రకారం 1861–62 ప్రాంతంలో వీటిని నెలకొల్పింది. జమ్మూ, కశ్మీర్, లద్దాక్‌లకు ఉమ్మడి హైకోర్టు ఉంది. నైజాంల పరిపాలనలో స్థాపింపబడిన హైదరాబాద్ హైకోర్టు భారతదేశంలో హైదరాబాద్ దక్కన్ విలీనమైన తదుపరి కూడా నవంబర్ 1956 దాకా అదే పేరుతో వ్యవహరింపబడేది. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏకీకరణతో 1956 నవంబర్‌లో ఆంధ్ర హైకోర్టు హైదరాబాద్ హైకోర్టులో విలీనమై, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఏర్పడింది. రాష్ట్రాల పునర్విభజనతో తిరిగి 2019 జనవరి మొదటి తేదీ నుండి రెండు వేర్వేరు హైకోర్టులుగా విడిపోయాయి.




సంబంధిత రాష్ట్ర హైకోర్టు, రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపుల అనంతరం... హైకోర్టుల పేర్లు, స్థాపించాల్సిన నగరాన్ని కేంద్రప్రభుత్వ సిఫారసుతో రాష్ట్రపతి నిర్ణయిస్తారు. కారణమేమిటో కానీ దేశంలోని హైకోర్టుల పేర్ల విషయంలో సారూప్యత లేదు. కొన్ని హైకోర్టులను నగరాల పేర్లతో, మరికొన్నింటిని రాష్ట్రాల పేర్లతో నేటికీ పిలుస్తున్నారు. బొంబాయి నగరం 1995లో ముంబైగా మార్పు చెందింది. మద్రాస్ నగరాన్ని 1996లో చెన్నైగా మార్పు చేశారు. కలకత్తా నగరాన్ని 2001 సంవత్సరంలో కోల్‌కతాగా, అలహాబాద్ నగరాన్ని 2018లో ప్రయాగరాజ్‌గా, ఒరిస్సా రాష్ట్రం పేరును ఒడిశాగా 2011లో మార్పు చేశారు. అస్సాం రాష్ట్రాన్ని 2008 లో అసోంగా మార్పు చేసినా, హైకోర్టుకు మాత్రం గౌహతి హైకోర్టు అని పేరు పెట్టారు. అధికారిక మార్పులు చేర్పులు చేసి దశాబ్దాలు గడచినా, ఆయా హైకోర్టులకు ఇంకా పాత పేర్లే వాడకంలో ఉన్నాయి. కలకత్తా, బొంబాయి, మద్రాస్ హైకోర్టుల పేర్లను వరుసగా కోల్‌కతా, ముంబై, చెన్నై హైకోర్టులుగా మార్చాలనే సంకల్పంతో కేంద్ర మంత్రిమండలి ఆమోదించిన బిల్లును ఆ నాటి కేంద్ర న్యాయశాఖా మంత్రి రవి శంకర్ ప్రసాద్ 2016లో లోక్ సభలో ప్రవేశ పెట్టారు. ఇంతవరకు అది ఆమోదం పొందలేదు. మొత్తం మీద ప్రభుత్వం హైకోర్టుల పేర్లను నగరాల పేర్లతో కాకుండా రాష్ట్రాల పేర్లతో వ్యవహరించేలా చర్యలు తీసుకుంటే బాగుంటుంది. అప్పుడే దేశంలోని హైకోర్టుల పేర్లలో ఏకరూపత వస్తుంది. ఇదిలా ఉండగా మిగతా హైకోర్టుల పేర్లకు భిన్నంగా తెలంగాణ హైకోర్టు పేరు ఉన్నట్లు తోస్తోంది. ఇంగ్లీషులో హైకోర్టు ఆఫ్ కర్ణాటక, హైకోర్టు ఆఫ్ కేరళ... అని పేర్లు ఉండగా, వీటికి భిన్నంగా 'హైకోర్ట్ ఫర్ ది స్టేట్ ఆఫ్ తెలంగాణ' అనే పేరు స్థిరపరచి 2019 నుండి అమల్లోకి తెచ్చారు. ఈ విషయంలో కూడా చర్చ జరగాలి.

వ్యాసకర్త విశ్రాంత జిల్లా జడ్జి
మొబైల్: 98485 45970

ఆత్మబంధువు

'ఆత్మబంధువు' అంటే అత్యంత సన్నిహితమైన వాడు అని లోకంలో వాడుక. ఇది శరీరగతమైన బంధుత్వం (రక్త సంబంధం, జ్ఞాతి సంబంధం లాంటిది) కాకపోయినా, అంతకంటే సన్నిహితమైంది అని ఇక్కడ భావం.

ఆత్మబంధువు అంటే నిఘంటువులు చెప్పిన అర్థం వేరు. ఆత్మ మాతుః స్వసుః పుత్రాః, సుతాః ఆత్మపితుః స్వసుః/ఆత్మ మాతుల పుత్రాః చ, విజ్ఞేయాః ఆత్మ బాంధవాః – తన తల్లి సోదరి పుత్రులూ, తన తండ్రి సోదరి పుత్రులూ, తల్లి సోదరుడైన మేనమామ పుత్రులూ ఆత్మ బంధువులు. వాళ్ళు తన గోత్రానికి చెందిన వాళ్ళు కాకపోయినా, రక్త సంబంధం కలవాళ్ళు కనక సగోత్రీకులంతటి సన్నిహితులే.



'ఆత్మ' అనే మాటనే మనం చాలా అర్థాలలో వాడుతూ ఉంటాం. మొదటి అర్థం పరమాత్మ, జీవాత్మ, ప్రత్యగాత్మ లాంటి మాటలలో ఉన్న 'ఆత్మ'. అది సర్వాంతర్యామి. సర్వవ్యాపి. ప్రతి ప్రాణిలోనూ ఉండి చైతన్యాన్నిచ్చే తత్త్వం ఆత్మ. శరీరం నశించినప్పుడు, అది నశించదు. ఆత్మ అవినాశి, అనాది, అనంతం. ప్రతి ప్రాణిలోనూ ప్రత్యేకంగా ఉన్నట్టు తోచినా అది ఒకే ఒక అద్వితీయమైన అఖండ చైతన్యం. నామ రూపాలు లేని అగోచర తత్త్వం. కనక ఆ ఆత్మకు బంధువులూ మిత్రులూ ఉండే అవకాశమే లేదు.

ఆత్మ అంటే మరో అర్థం 'తను, తనకు తాను' అని. ఉదాహరణకు, ఆత్మహత్య అంటే తనను తాను చంపుకోవటం. అలాగే ఆత్మస్తుతి అంటే తనను తానే పొగుడుకోవటం. దీన్ని సంకర భాషలో 'సెల్ఫ్- డబ్బా' అంటుంటాం. ఆత్మ అంటే ఆ 'సెల్ఫ్'.

ఉద్ధరేత్ ఆత్మనా ఆత్మానం, న ఆత్మానం అవసాదయేత్, / ఆత్మా ఏవ హి ఆత్మనః బంధుః, ఆత్మా ఏవ రిపుః ఆత్మనః – సాధకులు తమను తామే ఉద్ధరించుకోవాలి, అంతే కానీ తమను తాము పతన దిశగా, వినాశం దిశగా తోసేసుకోగూడదు; మనిషి తనకు తానే మిత్రుడు, తనకు తానే శత్రువు– అని చెప్తుంది గీత. తనను తాను నిగ్రహించుకొనే 'ఆత్మ నిగ్రహం' కలవాడు తనకు తాను బంధువు– 'ఆత్మ బంధువు' అవుతాడు. అలా తనను నిగ్రహించుకోలేనివాడు తనకు తానే శత్రువై, తనకు తానే హాని చేసుకొంటాడు, అంటుంది (6-5,6).

– ఎం. మారుతిశాస్త్రి

క్లుప్తంగా...

చందనోత్సవానికి భారీ ఏర్పాట్లు

- 23న సింహాచలంలో చందనోత్సవం
- 1.20 లక్షల మంది వస్తారని అంచనా
- ఏర్పాట్లు పరిశీలించిన దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ

సింహాచలం: సింహాచలంలో ఈ నెల 23న జరిగే చందనోత్సవానికి భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ తెలిపారు. కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సత్యనారాయణ తొలిసారిగా సింహాచలం దేవస్థానానికి వచ్చారు. సింహగిరిపై జరుగుతున్న చందనోత్సవం ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. ఈ సారి లక్షా ఇరవై వేల మంది భక్తులు దర్శనానికి వస్తారని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. ఒకేసారి సుమారు 27 వేల మందికి పైగా భక్తులు వేచి ఉండేలా దర్శనాల క్యూలైన్లు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ప్రొటోకాల్ వీఐపీలకు, టికెట్లపై వచ్చే వీవీఐపీలకు అంతరాలయ దర్శనం కల్పిస్తామన్నారు. కొండ దిగువన 16 పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగులు, వృద్ధులకు ప్రత్యేక దర్శన సమయాలు కేటాయించనున్నట్లు చెప్పారు. తొలుత శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సత్యనారాయణ దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. స్వామి వారి ప్రసాదం, శేషవస్త్రాన్ని ఈవో త్రినాథరావు అందజేశారు.

పలాసలో భారీ అగ్ని ప్రమాదం

- కాలిబూడిదైన 90 ఎలక్ట్రికల్ బైక్‌లు, మూడు ఆటోలు



కాలిబూడిదవుతున్న ఎలక్ట్రికల్ బైకులు

కాశీబుగ్గ: శ్రీకాకుళం జిల్లా పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో బుధవారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. 14వ వార్డు భగవతీ థియేటర్ ఎదురుగా ఉన్న పెయింట్స్ దుకాణంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా బుధవారం వేకువజామున మంటలు రేగాయి. ఎవ్వరూ లేకపోవడంతో దాని పక్కనే ఉన్న ఎలక్ట్రికల్ బైకుల షోరూంకు మంటలు అంటుకున్నాయి. దానిలో ఉన్న 90 బైకులు, మూడు ఆటోలు పూర్తిగా కాలిపోయాయి. పక్కనే ఉన్న ప్రభుత్వ వైన్‌షాప్‌నకు సైతం మంటలు చేరడంతో స్థానికంగా ఉన్న వాకర్స్ స్పందించి పెట్టెలను తీసి బయట పెట్టారు. విద్యుత్ ఏఈ భూషణ రావుకు సమాచారం ఇవ్వడంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. కాశీబుగ్గ, మందస అగ్నిమాపక శకటాలు మూడు గంటల పాటు శ్రమించి మంటలు ఆర్పాయి. సుమారు రూ.85 లక్షల ఆస్తినష్టం ఏర్పడినట్లు సమాచారం.

పరీక్ష ఫలితాలు రాకుండానే అనంత లోకాలకు..

- ఇద్దరు టెన్త్ విద్యార్థుల విషాదాంతం
- నదిలో స్నానానికి దిగి ఈత రాక మృతి
- అనకాపల్లి జిల్లా నాగులాపల్లిలో విషాదం

భాను ప్రకాష్, కర్రి సంపత్ మృతదేహాలు

మునగపాక: ఆటవిడుపు కోసం నదిలో స్నానానికి దిగిన ఇద్దరు స్నేహితులు ఈత రాకపోవడంతో మునిగి మృతి చెందారు. ఈ ఘటన అనకాపల్లి జిల్లాలో జరిగింది. నాగులాపల్లికి చెందిన పొలమరశెట్టి నూకరమణ, పూర్ణ దంపతులు వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు భాను ప్రకాష్ అనకాపల్లి శ్రీ చైతన్య స్కూల్‌లో పదో తరగతి చదివి ఇటీవల పరీక్షలు రాశాడు. అదే గ్రామానికి చెందిన కర్రి గోవిందరాజు, సుజాత దంపతులు కూడా వ్యవసాయంపై ఆధారపడి కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు సంపత్ నాగులాపల్లి జేఎంజే స్కూల్‌లో పదో తరగతి చదివి ఇటీవల పరీక్షలు రాశాడు. స్నేహితులైన వీరిద్దరూ పరీక్షలు పూర్తయిన ఉత్సాహంతో బుధవారం సైకిల్‌పై సమీపంలోని ఉమ్మలాడ గొడారి ఆనకట్ట వద్ద శారదానది వద్దకు వెళ్లారు. స్నానం కోసం నదిలోకి దిగగా ఈత రాకపోవడంతో ఇద్దరూ మునిగిపోయారు. సాయంత్రం అవుతున్నా వీరు ఇంటికి రాకపోవడంతో వీరి తల్లిదండ్రులు కంగారుపడి వెతకడం ప్రారంభించారు. గొడారి ఆనకట్ట వద్ద చెప్పులు, సైకిల్ కనిపించడంతో ఆందోళనకు గురై శారదా నదిలో వెతకగా ఇద్దరి మృతదేహాలు బయటపడ్డాయి. దీంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. మునగపాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆంధ్ర ‘అమృతపాణి’కి పునర్జీవం

ఒకప్పుడు రాష్ట్రంలో విస్తృతంగా సాగు

పనామా తెగులు తట్టుకోలేక కనుమరుగైన రకం

- రెండేళ్ల క్రితం గిరిజన ప్రాంతాల్లో గుర్తించిన శాస్త్రవేత్తలు
- తెగుళ్లు తట్టుకునేలా అభివృద్ధి చేసేందుకు పరిశోధనలు
- టిష్యూ కల్చర్ కింద మొక్కలు అభివృద్ధి చేస్తున్న ఉద్యాన వర్సిటీ
- గిరిజన ప్రాంత రైతులకు పంపిణీ

సాక్షి, అమరావతి: దాదాపు మూడు దశాబ్దాల క్రితం కనుమరుగైపోయిన ఆంధ్ర ‘అమృతపాణి’ డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ శాస్త్రవేత్తల విశేష కృషి వల్ల మళ్లీ జీవం పోసుకుంటున్నది. ప్రపంచంలోనే అత్యంత అరుదైన, పురాతనమైన ఈ అరటి రకం ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే ప్రత్యేకమైంది. ఒకప్పుడు గోదావరి జిల్లాలతో పాటు ప్రతీ ఇంటి పెరట్లో విస్తృతంగా సాగయ్యేది. అలాంటి ఈ అరుదైన రకం ప్రస్తుతం అంతరించిపోయిన అరటి రకాల జాబితాలో చేరింది. 1950–60 దశకంలో ‘పనామా’ తెగులు ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా సాగులో ఉన్న ‘గ్రాస్ మైఖెల్’తో పాటు మన దేశానికి చెందిన నాన్జనుడ్ రసబలి, రస్తాలి, శబరి, అమృతపాణి వంటి రకాలు కనుమరుగైపోయాయి.

పునరుత్పత్తి కోసం విస్తృత పరిశోధనలు..

అంతరించిపోయిన ఆంధ్ర అమృతపాణి రకాన్ని పునరుత్పత్తి చేయాలన్న సంకల్పంతో ఉద్యాన వర్సిటీ గత కొన్నేళ్లుగా విస్తృత పరిశోధనలు చేస్తోంది. ఈ నేపథ్యంలో వర్సిటీకి అనుబంధంగా ఉన్న కొవ్వూరు ఉద్యాన పరిశోధనా శాస్త్రవేత్తల బృందం రెండేళ్ల క్రితం మారేడుమిల్లి మండలం కొండవాడ గ్రామంలో అరగటి సుబ్బారెడ్డి అనే గిరిజన రైతు ఇంటి పెరట్లో ఉన్న అరటి మొక్కలను చూసి ఆశ్చర్యపోయారు. మొక్కల కాండం, ఆకులు, గెల, కాయల లక్షణాలను పరిశీలించిన శాస్త్రవేత్తలు దేశవాళి అమృతపాణి రకంగా గుర్తించారు. ఈ ప్రాంతం సముద్ర మట్టానికి 300 అడుగులు ఎత్తులో ఉండడంతో ఎలాంటి పోషక, కలుపు యాజమాన్య పద్ధతులు చేపట్టకపోయినా ఎలాంటి తెగుళ్లు సోకకుండా మొక్కలు ఆరోగ్యకరంగా ఉన్నట్లు గుర్తించారు. అక్కడ నుంచి సేకరించిన మొక్కల నుంచి ఇప్పటి వరకు 3వేల టిష్యూ కల్చర్ దేశవాళి అమృత పాణి రకం మొక్కలను అభివృద్ధి చేశారు.



పరిశోధన కేంద్రంలో అభివృద్ధి చేసిన అరటి మొక్కలు

గిరిజన ప్రాంతం అనుకూలం

దేశవాళి అమృతపాణి సాగుకు గిరిజన ప్రాంతం అనువైనదిగా గుర్తించారు. ఎత్తయిన గిరిజన ప్రాంతాలు కావడంతో పాటు దట్టమైన అటవీ ప్రాంతం కావడంతో ఈ నేలలో సేంద్రీయ కర్బనం అధికంగా ఉండడం వలన మొక్కలకు అవసరమైన అన్ని రకాలైన పోషక పదార్థాలు అందుతున్నాయని గుర్తించారు. పైగా వాణిజ్యపరంగా, ఇతర ఉద్యానపంటలతో కలిపి సాగు చేయకపోవడం వలన ఈ నేలల్లో తెగుళ్లను కలిగించే శిలీంద్రాల ఉనికి లేదని గుర్తించారు.

గిరిజనులకు అదనపు ఆదాయ వనరు



అరుదైన ఈ జన్యురకాన్ని పరిరక్షించడం, విస్తృతంగా సాగులోకి తీసుకురావడం లక్ష్యంగా విస్తృత పరిశోధనలు చేస్తున్నాం. వీటి సాగుకు అనువైన గిరిజన ప్రాంతంలో ఈ రకం సాగును ప్రోత్సహించాలని సంకల్పించాం. గిరిజనులకు మంచి పోషకాహారంగానే కాకుండా అదనపు ఆదాయ వనరుగా ఉపయోగపడుతుంది.

– టి.జానకీరామ్, వీసీ, డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ

కణజాల ప్రవర్ధన పద్ధతిలో పునరుత్పత్తి



అంతరించిపోయిన ఈ అరుదైన రకాన్ని పరిరక్షిస్తున్న గిరిజన రైతు సుబ్బారెడ్డిని ముందుగా అభినందించాలి. దాదాపు ఐదారు దశాబ్దాల నుంచి పెంచుకుంటూ వాటిని పరిరక్షిస్తుండడం వలనే ఈ మొక్కల నుంచి పునరుత్పత్తి చేయగలిగే అవకాశం మనకు దక్కింది. ఈ మొక్కల నుంచి సేకరించిన మగపువ్వులలోని లేత హస్తాలను కణజాల ప్రవర్ధన పద్ధతిలో దశల వారీగా ప్రవర్ధనం చేసి ఎలాంటి తెగుళ్లు సోకని మొక్కలను పునరుత్పత్తి చేశాం.

– డాక్టర్ కె.రవీంద్రకుమార్, సీనియర్ సైంటిస్ట్, ఉద్యాన పరిశోధనా కేంద్రం, కొవ్వూరు

గిరిజన రైతులకు పంపిణీ

అల్లూరి సీతారామరాజు జిల్లా పెదగెద్దాడ పంచాయతీ పరిధిలో వెయ్యి టిష్యూ కల్చర్ అమృతపాణి మొక్కలను వంద మంది గిరిజన రైతులకు ఇటీవలే ఉద్యాన వర్సిటీ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఎస్టీ సబ్ ప్లాన్ కింద మరో 2వేల మొక్కలను జూన్‌లో పంపిణీ చేసేందుకు ప్రణాళిక రూపొందించారు.



ఉద్యాన పరిశోధన కేంద్రంలో టిష్యూ కల్చర్ ద్వారా అభివృద్ధి చేస్తున్న అమృత పాణి అరటి మొక్కల

అమృతపాణికి ఎన్నో ప్రత్యేకతలు



ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే ప్రత్యేకమైన ఈ రకానికి వాణిజ్యపరంగా మంచి డిమాండ్ ఉంది. ఇతర రాష్ట్రాలలోని రస్తాలి, రసబలె, రసకేళి, మల్బోగ్, సాప్కాల్, మార్తమాన్, దూద్ సాగర్ వంటి రకాల లక్షణాలను పోలి ఉంటుంది. 11–12 నెలల కాలపరిమితితో 2.5–3 మీటర్లు ఎత్తు వరకు పెరుగుతూ సగటున 15–18 కిలోల బరువైన గెలలు వేస్తుంది. కాయలు లేత దశలో పసుపు ఆకుపచ్చ రంగులో, పక్వదశలో లేత పసుపువర్ణం నుండి బంగారు వర్ణంలోకి మారతాయి. పలుచని తొక్కతో ప్రత్యేకమైన రుచి, సువాసన కలిగి ఉంటాయి. పక్వ దశలో పండ్లు గెల నుంచి రాలిపోయే లక్షణం ఉండడంతో దూర ప్రాంత రవాణాకు అనుకూలం కాదు.

తిమ్మమ్మ మర్రిని పర్యాటకంగా అభివృద్ధి చేయాలి

- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పంచాయతీ పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు

సాక్షి, అమరావతి: శ్రీసత్యసాయి జిల్లా ఎంపీ కుంట మండలంలోని తిమ్మమ్మ మర్రిమాను కోట, తిమ్మమ్మ మర్రిమాను, గంగరాజు బాల వీరయ్య స్వామి దేవాలయాలను జాతీయ స్మారక చిహ్నాలుగా ప్రకటించాలని అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పంచాయతీ పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు కోరారు. ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం ఢిల్లీలోని కేంద్ర పురావస్తు శాఖ ఏడీజీ గురుమిత్ సింగ్‌ను కలిసి లేఖను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వీరాంజనేయులు మాట్లాడుతూ.. తిమ్మమ్మ మర్రిమాను ఎంతో ఘన చరిత్ర ఉన్న ప్రాంతమని, విజయనగర సామ్రాజ్యంలో 1,336 నుంచి ఉందన్నారు. తిమ్మమ్మ తల్లి ఇక్కడే 1,356లో సతీ సహగమనం చేసినట్లు చరిత్ర చెబుతుందని చెప్పారు. ఇంతటి చారిత్రక ప్రదేశాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెలుగులోకి తీసుకురావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు.

పెట్టుబడుల ఆకర్షణలో ఏపీ నంబర్ 1

▶ మొదటి పేజీ తరువాయి

కర్ణాటక, గుజరాత్, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాలు న్నాయి. కోవిడ్ సంక్షోభం ముగిసిన తరువాత దేశంలో ప్రైవేట్ పెట్టుబడులు బాగా పెరిగినట్లు సర్వే పేర్కొంది. 2022–23లో మొత్తం రూ.36.99 లక్షల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలు జరిగాయి. ఇందులో ప్రైవేట్ రంగ పెట్టుబడుల విలువ రూ.25,31,800 కోట్లు కాగా కేంద్ర ప్రభుత్వ పెట్టుబడులు రూ.5,62,083 కోట్లు, రాష్ట్రాల పెట్టుబడులు రూ.6,05,790 కోట్లుగా ఉన్నట్లు తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కూడా పెద్దఎత్తున పెట్టుబడులు కుదిరే అవకాశం ఉంది. నైపుణ్యాభివృద్ధి, లాజిస్టిక్స్ రంగాలపై దృష్టిసారించిన రాష్ట్రాలు ప్రైవేట్ పెట్టుబడులను అధికంగా ఆకర్షించనున్నట్లు సర్వే పేర్కొంది.

2022-23 పెట్టుబడుల ఒప్పందాల్లో టాప్ 10 రాష్ట్రాలు

రాష్ట్రం	ప్రాజెక్టుల సంఖ్య	విలువ రూ.కోట్లల్లో
ఆంధ్రప్రదేశ్	306	7,65,030
గుజరాత్	1,008	4,44,420
కర్ణాటక	992	4,32,704
మహారాష్ట్ర	1,639	3,71,195
ఒడిశా	489	3,64,984
ఉత్తరప్రదేశ్	690	2,39,683
రాజస్థాన్	597	2,13,200
తమిళనాడు	561	1,73,494
తెలంగాణ	487	1,58,482
మధ్యప్రదేశ్	607	1,22,655
మొత్తం	7,376	32,85,847

విశాఖ సదస్సుతో ఏపీకి గరిష్ట ప్రయోజనం

దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలు పెట్టుబడుల ఆకర్షణ కోసం గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్స్ నిర్వహించగా అందులో అత్యధికంగా లబ్ధి పొందిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని సర్వే తెలిపింది. విశాఖలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో 386 ఒప్పందాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రూ.13.11 లక్షల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలను కుదుర్చుకుంది. అయితే ఈ సర్వేలో కొన్ని ప్రాజెక్టుల ఒప్పందాలను పరిగణలోకి తీసుకోలేదని అధికారులు తెలిపారు.

వారణాసి ప్రత్యేక రైలు ప్రారంభం

- విశాఖపట్నం నుంచి వారణాసికి ప్రత్యేక వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు ఏర్పాటు

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): గంగా పుష్కరాల సందర్భంగా విశాఖపట్నం నుంచి వారణాసి(కాశీ)కి ప్రత్యేక వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలును బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రైల్వేస్టేషన్‌లో వాల్తేర్ డివిజన్ డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి మాట్లాడుతూ వారణాసి వెళ్లే యాత్రికుల కోసం ప్రస్తుతం వీక్లీ స్పెషల్ రైలును ప్రారంభించామని, దీన్ని రెగ్యులర్ రైలుగా నడపాలని ఇప్పటికే ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో స్టేషన్ రీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా మరో రెండు లైన్లు, ప్లాట్‌ఫాంలు అందుబాటులోకి వస్తే మరిన్ని కొత్త రైళ్లు విశాఖ నుంచి, విశాఖ మీదుగా నడిపేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రధాన ప్రాజెక్టులకు ఇటీవల రైల్వే బోర్డు ఆమోదం తెలియజేసిందని, త్వరలోనే ఇవి కూడా పూర్తయి అందుబాటులోకి వస్తే మరిన్ని రైళ్ల రాకపోకలకు మార్గం సుగమం అవుతుందన్నారు. అలాగే ప్రస్తుతం నడుస్తున్న వాటికి అదనంగా బుధవారం నుంచి విశాఖపట్నం–బనారస్–విశాఖపట్నం (08588 /08589) వీక్లీ స్పెషల్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. విశాఖపట్నం–బనారస్(08588) వీక్లీ స్పెషల్ రైలు ప్రతీ బుధవారం మధ్యాహ్నం 12.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు సాయంత్రం 4.30 గంటలకు వారణాసి చేరుకుంటుందని, ఈ స్పెషల్ రైలు మే 17వ తేదీ వరకు నడుస్తుందన్నారు. తిరుగు ప్రయాణంలో బనారస్–విశాఖపట్నం(08587) వీక్లీ స్పెషల్ ప్రతీ గురువారం సాయంత్రం 6 గంటలకు బనారస్‌లో బయల్దేరి మరుసటిరోజు రాత్రి 8.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుందని చెప్పారు. ఈ స్పెషల్ రైలు మే 18వ తేదీ వరకు నడుస్తుందన్నారు. ఈ స్పెషల్ రైళ్లు ఇరువైపులా సింహాచలం, కొత్తవలస, విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురం, రాయగడ, మునిగుడ, కేసింగ, టిట్లాఘడ్, బాలంగీర్, బార్‌గడ్ రోడ్, సంబల్‌పూర్, జార్సుగుడ, రూర్కెలా, హతియా, రాంచీ, మురి, బర్‌కకనా, లతేహార్, డాల్టన్‌గంజ్, గార్వరోడ్, డెహ్రీ ఆన్‌సన్, ససరం, భభువా రోడ్, పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ, వారణాసి స్టేషన్‌లలో ఆగుతాయని తెలిపారు.



డీఆర్ఎం అనూప్ కుమార్ సత్పతి

విశాఖ వేదికగా పాలన హర్షణీయం

- 934వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: సెప్టెంబర్ నుంచి విశాఖ వేదికగా పాలన సాగిస్తానని సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రకటించడం హర్షణీయమని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్‌యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 934వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో బుధవారం పలువురు మాట్లాడారు. ప్రపంచ మేధావి భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ రాజ్యాంగం వేదికగా సూచించిన వికేంద్రీకరణ ఫలాలు ఏపీ ప్రజలకు అందనున్నాయని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాజకీయంగా ఎదుర్కోలేక రాష్ట్రంలో కొంతమంది వ్యక్తులు కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారని, వారందరికీ తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు. వ్యవస్థలను ప్రభావితం చేస్తూ రాష్ట్రంలో అభూత కల్పనలకు చంద్రబాబు ఆయన ఎల్లో మీడియా శ్రీకారం చుట్టారని మండిపడ్డారు. 934 రోజులుగా ఉద్యమం చేస్తున్న తమ బహుజనుల కలలు ఫలించి విజయం సాధించామని, అంబేడ్కర్ ఆశయ సాధనలో భాగంగా వికేంద్రీకరణ దిశగా ప్రభుత్వం వేసిన అడుగులు ఫలించి 5 కోట్ల మంది ప్రజల ఆశయాలు నెరవేరనున్నాయని తెలిపారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, పులి దాసు, ఈపూరి ఆదాం, బేతపూడి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

మంటలకు 11 నెలల చిన్నారి ఆహుతి

- విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధం
- మంటలు చెలరేగి ఉయ్యాలలోని చిన్నారి మృతి

బుట్టాయగూడెం (జీలుగుమిల్లి): ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధం కాగా మంటల్లో చిక్కుకుని ఉయ్యాలలో నిద్రిస్తోన్న చిన్నారి కాలి మృతి చెందింది. స్థానికులు కథనం మేరకు..తాటిరామన్నగూడెంకు చెందిన తాటి విజయ్ బుధవారం కూలి పనులకు వెళ్లాడు. అతడి భార్య మౌనిక పెద్ద కుమార్తె జ్ఞానేశ్వరి (3)తో పాటు 11 నెలల చిన్న కుమార్తె హనీను తీసుకుని ఉపాధి హామీ పనులకు వెళ్లింది. పనులు ముగించుకుని మధ్యాహ్నం ఇంటికి వచ్చిన మౌనిక..హనీని ఉయ్యాలలో పడుకోబెట్టింది. ఇంట్లో గ్యాస్ అయిపోవడంతో కరెంట్ కుక్కర్‌లో అన్నం పెట్టి పెద్ద కూతురిని తీసుకుని పక్కింట్లో ఉన్న తన మావయ్యకు భోజనం పెట్టేందుకు వెళ్లింది. ఈ సమయంలో కరెంట్ కుక్కర్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగి తాటాకు ఇళ్లంతా వ్యాపించాయి. తల్లితో పాటు ఇరుగుపొరుగు వారు మంటలను అదుపు చేసి ఉయ్యాలలోని హనీని కాపాడేందుకు యత్నించారు. అప్పటికే చిన్నారి శరీరం 80% కాలిపోవడంతో తెలంగాణలోని అశ్వారావుపేట ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక వైద్యం అనంతరం వైద్యులు మెరుగైన వైద్యానికి జంగారెడ్డిగూడెం ప్రభుత్వాస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడికి తీసుకువెళుతుండగా మార్గమధ్యలో చిన్నారి మృతి చెందింది.



చిన్నారి (ఫైల్)

పెళ్లికి కట్నంగా శునకాలు

గంగిరెద్దుల కుటుంబాల్లో తరాలుగా ఆచారం



సిరిసిల్ల: శునకాలను కొందరు అభిరుచికొద్దీ, ఇంకొందరు ఇంటికి రక్షణ కోసం పెంచుకుంటారన్న విషయం తెలిసిందే. కానీ.. శునకరాజాలను ఆస్తిగా భావిస్తూ.. ఆడపిల్లలకు కట్నంగా కూడా ఇచ్చే కుటుంబాలు కూడా ఉన్నాయి. వాళ్లెవరూ, వారి జీవనశైలి ఏమిటి? తెలుసుకోవాలనుకుంటున్నారా..!

రాజన్న సిరిసిల్ల జిల్లాలో మూడు గ్రామాల్లో భిక్షాటన చేస్తూ జీవనం సాగించే గంగిరెద్దుల కుటుంబాలు ఉన్నాయి. కోనరావుపేట మండలం కొండాపూర్, బావుసాయిపేట, చందుర్తి మండలం రామారావుపల్లె గ్రామాల్లో దాదాపు వంద కుటుంబాలు నివసిస్తున్నాయి. ఈ మూడు పల్లెలకు చెందిన గంగిరెద్దుల కుటుంబాల వారు జిల్లావ్యాప్తంగా భిక్షాటన చేస్తారు. ఆహారాన్ని సేకరించి కుక్కలను పోషిస్తారు. ఈ కుక్కలను వేటకు, వారు నివాసం ఉండే గుడారాల రక్షణకు ఉపయోగిస్తారు. ఒక్కో కుటుంబంలో ఐదు నుంచి పది, పదిహేను, ఇరవై.. శునకాలను పెంచుతుంటారు. అయితే శునకాలనే ఆస్తిలాగా భావించే ఈ ఆచారం గంగిరెద్దుల కుటుంబాల్లో తరతరాలుగా కొనసాగుతోంది. ఎన్ని ఎక్కువ శునకాలను పెంచితే అంత ఆస్తిపరులన్న మాట. వారు పోషిస్తున్న శునకాల సంఖ్యను బట్టే ఆ కుటుంబపెద్దకు వారి కులంలో గౌరవం లభిస్తుంది. ఇవన్నీ ఒక ఎత్తయితే.. ఆడపిల్లలకు పెళ్లిలో కట్నంగా శునకాలను ఇచ్చే సంప్రదాయం ఈ కుటుంబాల్లో ఉంది. అయితే ఇప్పుడిప్పుడే ఆ కుటుంబాల్లో మార్పు వస్తోంది. వ్యవసాయం చేస్తూ కొందరు.. చిన్న చిన్న బుట్టల్లో ప్లాస్టిక్ సామాగ్రి, కొబ్బరి కుడుకలకు చక్కెర అమ్ముతూ కొందరు జీవనం సాగిస్తున్నారు.

ఒకప్పుడు ఎక్కువగా ఉండేవి..

మాకు కుక్కలను పెంచడం ఆనవాయితీగా వస్తోంది. ఒకప్పుడు ఇంకా ఎక్కువ కుక్కలుండేవి. ఇంటి ముందు ఎన్ని ఎక్కువ కుక్కలుంటే అంత విలువ ఉండేది. ఇప్పుడు కూడా ఉన్నాయి. కానీ తక్కువ. కాలం మారినా.. మాకు కుక్కలు ఉండాల్సిందే.

– టేకుమల్ల రాజయ్య, సంచార జీవి.

మేం తినేదే వాటికి పెడతాం..

ఇప్పుడు నా దగ్గర నాలుగు కుక్కలు ఉన్నాయి. మేం ఏం తింటే అదే వాటికి పెడతాం. మాతోనే ఉంటాయి. మేం ఏ ఊరికి వెళ్తే.. ఆ ఊరికి మా వెంట వస్తాయి. ఇవి మా పెద్దల నుంచి వస్తున్న ఆస్తి.

– టేకుమల్ల లచ్చయ్య, కొండాపూర్.

కుక్కలే మాకు ధనం..


మునుపు ఎక్కువ కుక్కలను పెంచేటోళ్లం. షికారి చేసేవాళ్లం. కానీ ఇప్పుడు మావోళ్లు సోకులకు వచ్చిండ్రు. కుక్కలను ఎక్కువ సాదుత లేరు. వ్యవసాయం చేస్తుండ్రు. కుడుకలకు చక్కెర అమ్ముతూ.. బతుకుతుండ్రు. బిచ్చం ఎత్తడం లేదు. అయినా మాకు కుక్కలతోనే ధనం.

– గంట లచ్చయ్య, బావుసాయిపేట.

‘లక్’ పట్టు లక్కబొమ్మ

విపో నిర్వహిస్తున్న పోటీలో ఏటికొప్పాక వీడియోకు స్థానం





సాక్షి, విశాఖపట్నం: లక్క బొమ్మల తయారీలో మేటిగా ప్రసిద్ధికెక్కిన ఏటికొప్పాక గ్రామ మహిళలు ఇప్పుడు ప్రపంచ మేధోసంపత్తితో పోటీ పడుతున్నారు. పిల్లల నుంచి పెద్దల వరకూ చూపుతిప్పుకోనివ్వని అద్భుతమైన బొమ్మల తయారీతో కొత్త ప్రపంచాన్ని సృష్టిస్తున్న ఇక్కడి మహిళల కష్టం ‘సాగా ఆఫ్ ఉమెన్ ఇన్ ఏటికొప్పాక’ (ఏటికొప్పాక మహిళల విజయగాథ) పేరుతో టాప్–10 నుంచి టాప్–1లో నిలిచేందుకు అడుగులు వేస్తోంది. ప్రపంచ మేధో సంపత్తి సంస్థ (విపో) నిర్వహిస్తున్న ఈ పోటీలకు దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ నీలిమ భోగాది సమర్పించిన డాక్యుమెంటరీ ప్రపంచ దేశాలతో పోటీపడుతోంది. ఏటికొప్పాక లక్క బొమ్మలకు నాలుగు దశాబ్దాల చరిత్ర ఉంది. తొలుత రెండు కుటుంబాలతో ప్రారంభమైన బొమ్మల తయారీ ఇప్పుడు 200కి పైగా కుటుంబాలతో విస్తరించింది. వందలాది కుటుంబాలకు పరోక్షంగా ఉపాధి అందిస్తోంది. ఒకప్పుడు బొమ్మల్లో రాజ్యమేలిన లక్కబొమ్మకు క్రమంగా ఆదరణ తగ్గిపోయింది. ఫలితంగా పురుషులంతా.. ఇతర ప్రాంతాలకు పనుల కోసం వలస వెళ్లిపోయారు. ఈ క్రమంలో బొమ్మల తయారీ బాధ్యతని మహిళలు తీసుకున్నారు.

సాగా ఆఫ్ ఉమెన్ ఇన్ ఏటికొప్పాక

ఏటికొప్పాక లక్క బొమ్మలకు 2017లో జియోగ్రాఫికల్ ఇండికేషన్ వచ్చింది. చెట్ల వేర్లు, విత్తనాలు, బెరడు, పూలు, కొమ్మలు, ఆకుల నుంచి సహజ సిద్ధమైన రంగులు తయారు చేసి బొమ్మలకు ఏటికొప్పాక బొమ్మలకు అద్దుతున్నారు. ఈ పురాతన కళను మహిళలే పునరుద్ధరిస్తున్న నేపథ్యంలో తన పీహెచ్‌డీ కోసం జియోగ్రాఫికల్ ఇండికేషన్ సబ్జెక్ట్‌లో ఉప్పాడ పట్టు, ఏటికొప్పాక లక్కబొమ్మల్ని ఎంపిక చేసుకున్నారు విశాఖ నగరానికి చెందిన డాక్టర్ నీలిమ. విపో సంస్థ నిర్వహిస్తున్న పోటీల గురించి తెలుసుకున్న నీలిమ ఏటికొప్పాక బొమ్మల తయారీపై వీడియో డాక్యుమెంటరీ సిద్ధం చేసి పోటీలకు పంపించారు. ప్రపంచవ్యాప్తంగా 10 దేశాలకు చెందిన 10 వీడియోల్ని తుది పోటీలకు ఎంపిక చేయగా.. ఇందులో నీలిమ పంపిన ‘సాగా ఆఫ్ ఉమెన్ ఇన్ ఏటికొప్పాక’ కూడా ఎంపికైంది. ఐక్యరాజ్య సమితి ప్రత్యేక ఏజెన్సీగా.. వరల్డ్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ ఆర్గనైజేషన్ (విపో) సేవలందిస్తోంది. ఈ ఏడాది మేధో సంపత్తిలో మహిళల పాత్ర, వారి ఆవిష్కరణలు, సృజనాత్మకతను వేగవంతం చేసే విషయంలో ప్రతి ఒక్కరూ విజేతలే అనే థీమ్‌తో పోటీలు నిర్వహిస్తోంది. పోటీలకు 193 సభ్య దేశాల నుంచి వందలాది వీడియోలు రాగా.. టాప్‌టెన్‌లో ఏటికొప్పాక వీడియోకు స్థానం లభించింది. ఈ పది వీడియోలపై ఓటింగ్ నిర్వహించి.. వాటిలో టాప్–3ని ఎంపిక చేస్తారు. ఓటింగ్‌కు ఈ నెల 23వ తేదీ వరకూ గడువు విధించారు. ఈ నెల 26న విజేతలను ప్రకటించనున్నారు.

క్లుప్తంగా...

ధనుర్ధారిగా అయోధ్య రాముడు

అయోధ్య: ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో నిర్మాణంలో ఉన్న రామమందిరంలో ప్రతిష్ఠించబోయే రాముడి విగ్రహం ధనుర్ధారిగానే ఉండనుంది. పవిత్ర కృష్ణశిలలో 5 అడుగుల ఎత్తుతో విగ్రహాన్ని తొలుస్తారు. రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు తాజా భేటీలో విగ్రహం రూపురేఖలను ఖరారు చేశారు. రాముడు విల్లుబాణాలు చేబూని నిలబడినట్లుగా విగ్రహం ఉంటుందని ట్రస్టు సభ్యుడు స్వామి తీర్థ ప్రసన్నాచార్య బుధవారం చెప్పారు. వచ్చే సంక్రాంతి నాటికి మందిర నిర్మాణం పూర్తవుతుందని ట్రస్టు ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ వెల్లడించారు.

క్వాంటమ్ మిషన్‌కు ఆమోదం



న్యూఢిల్లీ: క్వాంటమ్ టెక్నాలజీలో శాస్త్రీయ, పారిశ్రామిక పరిశోధనలు, అభివృద్ధికి ఉద్దేశించిన నేషనల్ క్వాంటమ్ మిషన్(ఎన్‌క్యూఎం)కు కేంద్ర మంత్రివర్గం బుధవారం ఆమోదముద్ర వేసింది. దీనికి వచ్చే ఆరేళ్లలో రూ.6,003.65 కోట్లు వెచ్చిస్తారు. ఈ రంగంలో పరిశోధనలతో దేశంలో మరింత ఆర్థిక ప్రగతి సాధ్యమవుతుందని కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి జితేంద్ర సింగ్ చెప్పారు. క్వాంటమ్ కంప్యూటింగ్, క్వాంటమ్ కమ్యూనికేషన్, క్వాంటమ్ సెన్సింగ్ అండ్ మెట్రాలజీ, క్వాంటమ్ మెటీరియల్స్ అండ్ డివైజెస్ విభాగాల్లో నాలుగు థీమాటిక్ హబ్స్(టీ-హబ్స్) నెలకొల్పనున్నట్లు తెలియజేశారు. సినిమాటోగ్రఫీ (సవరణ) బిల్లు-2023కు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. సినిమాల పైరసీకి అడ్డుకట్ట వేసే కఠిన నిబంధనలను బిల్లులో చేర్చినట్లు కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ తెలిపారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ఈ బిల్లును ప్రవేశపెడతామని చెప్పారు. ప్రస్తుతమున్న యూ, ఏ, యూఏ అని కాకుండా ప్రేక్షకుల వయసుల విభాగం ఆధారంగా సినిమాలను వర్గీకరించనున్నట్లు పేర్కొన్నారు.

ఎలాంటి ఆపదనైనా ఆర్మీ ఎదుర్కోగలదు: రాజ్‌నాథ్

న్యూఢిల్లీ: సరిహద్దు వెంట ఎలాంటి పరిణామాలనైనా సమర్థంగా ఎదుర్కోగల సత్తా సైన్యం సొంతమని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ అన్నారు. ఆయన బుధవారం ఆర్మీ కమాండర్స్ సదస్సులో మాట్లాడారు. చైనాతో సరిహద్దు వెంట ఉద్రిక్తత సద్దుమణగలేదు. అందుకే మన భారతసైన్యం తన నిరంతర అప్రమత్తతను కొనసాగించాల్సిందే' అని ఆర్మీ టాప్ కమాండర్లను ఆదేశించారు.

కొత్తా ఓటరండీ!

పార్టీలు ఏం చేస్తాయన్నది కాదు.. యువతకి ఏం కావాలో ముఖ్యం. కర్ణాటక ఎన్నికల్లో మెజార్టీ మార్కు దాటాలంటే ఫస్ట్ టైమ్ ఓటర్లే కీలకం

కొత్తగా ఓటు హక్కు పొందడం అంటే ఎవరెస్ట్ శిఖరం ఎక్కినంత ఆనందం. తల్లిదండ్రులు చెప్పారనో, స్నేహితులు సిఫారసు చేశారనో ఎవరికి పడితే వారికి నేటి తరం ఓటు వెయ్యరు. సొంతంగా ఆలోచించి తమకు నచ్చిన అభ్యర్థికి తొలిసారి ఓటు వేస్తే ఆ కిక్కే వేరబ్బా అంటున్నారు. ఓటు వెయ్యడంలో ఉదాసీనత మచ్చుకైనా లేదు. ఉరిమే ఉత్సాహంతో చూపుడు వేలి మీద సిరా గుర్తు చూపిస్తూ ఫొటోలు దిగి ఓట్ల పండుగను సంబరంగా చేసుకుంటున్నారు. కర్ణాటకలో మెజార్టీ మార్కు దాటడానికి అత్యంత కీలకమైన కొత్త ఓటర్ల మదిలో ఏముంది ?



బెంగళూరులోని మహారాణి క్లస్టర్ యూనివర్సిటీలో విద్యార్థిని ఎంజే గుణ. కొద్ది రోజుల క్రితమే ఆమెకు 18 ఏళ్లు నిండాయి. మొదటిసారిగా ఓటు హక్కు వినియోగించుకునే చాన్స్ వచ్చింది. ఎప్పుడెప్పుడు తమ నాయకుడ్ని ఎన్నుకునే రోజు వస్తుందాని ఆమె ఉత్కంఠగా ఎదురు చూస్తోంది. ఆమె ఉద్దేశంలో నాయకుడంటే బాగా చదువుకుని, దార్శనికుడై ఉండాలి. "నేను ఓటు వేసే ముందు ఏ పార్టీ అని కూడా చూడను. మా నియోజకవర్గానికి అభ్యర్థి ఏం చేస్తాడన్నదే ముఖ్యం. ఆ తర్వాత అభ్యర్థి బ్యాక్‌గ్రౌండ్, విద్యార్హతలు, గతంలో చేసిన పని, భవిష్యత్‌లో ఏం చేయగలడు వంటివన్నీ చూశాకే ఓటేస్తా"అని ఆమె కచ్చితంగా చెప్పింది. సునీత అనే మరొక ఫస్ట్ టైమ్ ఓటరు సరైన వ్యక్తిని ఎంపిక చేసుకునే సామర్థ్యం మనకున్నప్పుడే రాష్ట్రం, దేశం సరైన మార్గంలో వెళతాయని చెప్పుకొచ్చింది. వీరి మాటలు వింటే సంప్రదాయంగా రాజకీయ వ్యూహాలు రచిస్తూ, తాయిలాల ఆశ చూపిస్తూ వెళ్లే పార్టీల వైపు వీరు చూసే చాన్సే లేదు.

గత ఎన్నికల్లో...

మొదటి సారి ఓటు వేసే వారిలో కొత్త ఉత్సాహం, ఓటు వెయ్యాలన్న తపన ఎక్కువ ఉంటుంది. వారు తప్పనిసరిగా ఓటు వెయ్యడానికి పోలింగ్ కేంద్రాలకు కదిలి వెళతారు. గత 3 ఎన్నికల్లోనూ కొత్త ఓటర్లు ఓటు వేసే విధానాన్ని విశ్లేషిస్తే వారి నాడి పట్టుకోవడం కష్టమనే అభిప్రాయం కలుగుతుంది. సీఎస్‌డీఎస్-లోక్‌నీతి పోస్ట్ పోల్ సర్వే కొత్త ఓటరు అండదండ లేనిదే ఏ పార్టీ కూడా మెజార్టీ మార్క్ సాధించలేదు.

2008

ఎన్నికల్లో బీజేపీ మెజార్టీ మార్కుకి కేవలం మూడు సీట్ల దూరంలో నిలిచిపోయింది. ఈ ఎన్నికల్లో పార్టీకి వచ్చిన సగటు ఓటు షేరు కంటే కొత్త ఓటరు వేసిన ఓట్ల వాటా (మొత్తం పోలయిన కొత్త ఓటర్ల ఓట్లలో) ఎక్కువగా ఉంది. కొత్త ఓటర్ల ఓటు షేర్ మూడు శాతం ఎక్కువగా ఉంది.

2013

అసెంబ్లీ ఎన్నికల్లో కొత్త ఓటర్లు కాంగ్రెస్ వైపు స్వల్పంగా మొగ్గు చూపించారు. ఆ పార్టీకి వచ్చిన సగటు ఓట్ల కంటే కొత్త ఓటర్లు కాంగ్రెస్‌కు వేసిన ఓటు షేరు ఒక్క శాతం అధికంగా ఉంది. హస్తం పార్టీ గద్దెనెక్కింది.

2018

బీజేపీ మెజార్టీ మార్కుకి 9 సీట్ల దూరంలో ఉండిపోయింది. దీనికి కారణం కొత్త ఓటర్లేనని సీఎస్‌డీఎస్-లోక్‌నీతి గణాంకాల్లో తేలింది. బీజేపీకి పోలయిన సగటు ఓట్ల కంటే కొత్త ఓటర్ల షేరు ఆరు శాతం తక్కువగా ఉంది. హంగ్ అసెంబ్లీ ఏర్పడింది.

2013, 2018 ఎన్నికల్లో జేడీ(ఎస్) పార్టీకి సగటు ఓటు షేర్ కంటే తొలిసారి ఓటు హక్కు వినియోగించుకున్న వారి ఓటు షేర్ నాలుగు శాతం అధికంగా ఉంది. దీంతో పట్టణ యువత జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ కంటే ప్రాంతీయ పార్టీ వైపు మొగ్గు చూపిస్తున్నారని తేలుతోంది.

కర్ణాటకలో ఈ సారి 11 లక్షల మంది కొత్త ఓటర్లు రిజిస్టర్ చేసుకున్నట్టు కేంద్ర ఎన్నికల సంఘం గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 2018లో 7.7 లక్షలుంటే ఈ సారి వారి సంఖ్య 11 లక్షలకు చేరుకుంది. ప్రతీ సారి ఎన్నికల్లోనూ కొత్త ఓటర్లు నిర్ణయాత్మక శక్తిగా ఉన్నారు. కొత్త ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగరు. మనీ, మద్యం కంటే అభివృద్ధికే అధిక ప్రాధాన్యం ఇస్తారు. సోషల్ మీడి

కొత్త ఓటరు ఎటుంటే..

యాలో యాక్టివ్‌గా ఉంటూ మంచి, చెడులను తామే విశ్లేషించుకునే శక్తి సామర్థ్యాలున్నవారు. ఓపెన్ మైండ్‌తో ఉంటారు. పార్టీలు వారిని తమ వైపు తిప్పుకునే ప్రయత్నాలైతే చేస్తున్నాయి. కర్ణాటకలో ఏదైనా పార్టీ మెజార్టీ మార్కు దాటాలంటే కొత్త ఓటర్లు అత్యత కీలకమని రాజకీయ విశ్లేషకుడు సందీప్ శాస్త్రి అభిప్రాయపడ్డారు.

పార్టీల కొత్త పంథా..!

మేము ఏం చేస్తాం అన్నది కాదు.. మీకేం కావాలన్నదే ముఖ్యం అని కొత్త ఓటర్ల మనసులో ఏముందో పార్టీలు తెలుసుకునే ప్రయత్నాలు చేస్తున్నాయి. కొత్త ఓటర్లను ఆకర్షించడానికి కాంగ్రెస్ పార్టీ ''సెలబ్రేట్ యువర్ ఓటు''అనే ప్రచారాన్ని ప్రారంభించింది. 18-23 మధ్య వయసున్న వారే లక్ష్యంగా చేసుకొని వారికి ఏం కావాలో తెలుసుకునే ప్రయత్నాలు చేస్తోంది. వాతావరణ మార్పుల వల్ల కలిగే దుష్పరిణామాలను అరికట్టడం, అందరికీ ఉన్నత విద్యనభ్యసించే అవకాశాన్నివ్వడం ప్రస్తుతం యువత ఆశిస్తుందని తెలుసుకొని ఆ దిశగా వ్యూహాలు పన్నుతోంది. దాంతో పాటు నిరుద్యోగులు తల్లిదండ్రులకి భారంగా మారకుండా రెండేళ్ల పాటు నెలకి రూ.3 వేల భృతి ఇస్తామని హామీ ఇచ్చింది. భారతీయ జనతా పార్టీ యువ సంవాద్ కార్యక్రమం ద్వారా కొత్త ఓటర్ల ఆశలు, ఆకాంక్షల్ని తెలుసుకునే ప్రయత్నాలు చేస్తోంది.కొత్త ఓటర్లను దృష్టిలో ఉంచుకునే బీజేపీ సిట్టింగ్‌లను కాదని అత్యధికంగా 60 మంది కొత్త ముఖాలకు టికెట్లిచ్చింది. జేడీ(ఎస్) పంచరత్న రథయాత్రలో యువతకే అత్యధిక ప్రాధాన్యమిచ్చింది. కుమారస్వామి ప్రచారంలో యువతతోనే మాట్లాడుతూ వారి నాడి తెలుసుకునే ప్రయత్నం చేశారు. ఇక ఆమ్ ఆద్మీ పార్టీ కొత్త ఓటర్లు తమ వైపేనని ధీమాతో ఉంది. ఢిల్లీ, పంజాబ్‌లో యువ ఓటర్లను అధికంగా ఆకర్షించిన ఆప్ ఈసారి ఉన్నత విద్య అభ్యసించిన వారికే ఎక్కువగా టిక్కెట్లు ఇచ్చింది.

సాక్షి, నేషనల్ డెస్క్

జన భారతం

మన దేశ జనాభా 142.86 కోట్లు

- జనాభాలో చైనాను దాటేసిన భారత్
- డ్రాగన్ దేశం జనాభా 142.57 కోట్లు
- భారత్‌లో 25 శాతం మంది 14 ఏళ్లలోపువారే
- దేశంలో 65 ఏళ్లు దాటిన వృద్ధులు కేవలం 7 శాతం
- 34 కోట్ల మందితో మూడోస్థానంలో అమెరికా
- ఐక్యరాజ్యసమితి జనాభా విభాగం నివేదిక విడుదల



న్యూఢిల్లీ: ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశం ఏమిటి? చైనా కాదు. ఇకపై భారత్ అని చెప్పుకోవాలి. పోటీ పరీక్షల్లో ఈ ప్రశ్న అడిగితే భారత్ అని సమాధానం రాయాలి. జనాభాలో చైనాను భారతదేశం దాటేసింది. మన దేశ జనాభా రికార్డు స్థాయిలో 142.86 కోట్లకు చేరింది. 142.57 కోట్ల మందితో ప్రపంచంలో రెండో అత్యధిక జనాభా కలిగిన దేశంగా చైనా నిలిచింది. భారత్ కంటే చైనా జనాభా 29 లక్షలు తక్కువగా ఉంది. 34 కోట్ల మందితో అగ్రరాజ్యం అమెరికా అత్యధిక జనాభా కలిగిన మూడో దేశంగా రికార్డుకెక్కింది. ఐక్యరాజ్యసమితి పాపులేషన్ ఫండ్(యూఎన్ఎఫ్‌పీఏ) స్టేట్ ఆఫ్ ద వరల్డ్ పాపులేషన్ రిపోర్టు-2023ను తాజాగా విడుదల చేసింది. ప్రపంచ దేశాల జనాభా గణాంకాలను వెల్లడించింది. ఇందులో పలు ఆసక్తికరమైన అంశాలు ఉన్నాయి.

- దేశ జనాభాలో 65 ఏళ్లు దాటినవారు 2063 నాటికి 20 శాతం, 2100 నాటికి 30 శాతానికి చేరుతారని అంచనా. అంటే శతాబ్దాంతం దాకా మనది యువ భారత్‌గానే ఉంటుంది.
- జనాభా విషయంలో రాష్ట్రాల మధ్య వ్యత్యాసాలు ఉన్నాయి. కేరళ, పంజాబ్‌లో వృద్ధుల జనాభా అధికంగా ఉంది.
- బిహార్, ఉత్తరప్రదేశ్‌లో యువ జనాభా ఎక్కువగా ఉన్నట్లు తేలింది.
- ఐక్యరాజ్యసమితి 1950 నుంచి ప్రపంచ దేశాల జనాభా గణాంకాలను సేకరిస్తోంది.
- ఐక్యరాజ్యసమితి జనాభా జాబితాలో భారత్‌కు మొదటి స్థానం దక్కడం ఇదే తొలిసారి.
- 1950లో చైనా జనాభా 55.2 కోట్లు కాగా, భారత్ జనాభా 35.3 కోట్లు ఉండేది. అంటే 73 ఏళ్ల తర్వాత చైనాను భారత్ అధిగమించినట్లు స్పష్టమవుతోంది.
- 2022లో భారత్ జనాభా 141.2 కోట్లు కాగా, చైనా జనాభా 142.6 కోట్లుగా ఉంది.
- 2050 నాటికి భారత్ జనాభా 166.8 కోట్లకు చేరుతుందని అంచనా. అదే సమయంలో చైనా జనాభా 131.7 కోట్లకు పడిపోతుందని నిపుణులు చెబుతున్నారు.
- 1950 నుంచి ప్రపంచ జనాభా క్రమంగా పెరుగుతోంది. 2020లో మాత్రం ఈ పెరుగుదల రేటు ఒక శాతం లోపే ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది.
- ప్రపంచ జనాభా గత ఏడాది నవంబర్‌లో 800 కోట్లు దాటిందని ఐక్యరాజ్యసమితి నివేదిక స్పష్టం చేసింది.
- ఆధునిక కాలంలో మనుషుల సగటు జీవిత కాలం మెరుగవుతోంది. అదే క్రమంలో భారత్‌లో కూడా పురుషుల సగటు ఆయుర్దాయం 71 ఏళ్లు, మహిళల సగటు ఆయుర్దాయం 74 ఏళ్లుగా ఉన్నట్లు నివేదిక తెలియజేసింది.
- ప్రపంచ జనాభా ప్రస్తుతం 804.5 కోట్లు ఉన్నట్లు అంచనా. ఇందులో మూడింట ఒక వంతు జనాభా కేవలం భారత్, చైనాలోనే ఉండడం గమనార్హం.
- చైనా, అమెరికాలతో పోలిస్తే భారత్‌లో జననాల రేటు అధికంగా ఉంది.
- భారత మహిళ తన జీవిత కాలంలో సగటున ఇద్దరు పిల్లలకు జన్మనిస్తోంది. చైనాలో ఇది 1.2గా, అమెరికాలో 1.6గా ఉంది.

క్వాలిటీ ముఖ్యం: చైనా

బీజింగ్: జనాభాలో భారత్ తమను అధిగమించడాన్ని చైనా తేలిగ్గా కొట్టిపారేసింది. క్వాంటిటీ, కాదు, క్వాలిటీ ముఖ్యమని చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి వాంగ్ వెన్‌బిన్ అన్నారు. ''జనాభా అవసరమే అయినప్పటికీ వారిలో ప్రతిభా పాటవాలు సైతం కావాలి. మా దేశంలో 90 కోట్ల మందితో నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తి ఉంది'' అన్నారు. ప్రజల్లో నైపుణ్యాలను పెంచితే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు.

అతీక్ హత్య కేసులో ఐదుగురు పోలీసుల సస్పెన్షన్

ప్రయాగ్‌రాజ్: గ్యాంగ్‌స్టర్ అతీక్ అహ్మద్ పోలీసు వలయం మధ్యే హత్యకు గురవడాన్ని యూపీ పోలీస్ విభాగం సీరియస్‌గా తీసుకుంది. దీనిపై దర్యాప్తు చేస్తున్న సిట్ సిఫార్సు మేరకు ఐదుగురు పోలీసులను సస్పెండ్ చేసినట్టు ఉన్నతాధికారి ఒకరు బుధవారం చెప్పారు. సస్పెన్షన్ వేటు పడిన వారిలో షాగంజ్ పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జ్ అశ్వనీకుమార్ సింగ్, ఒక సబ్‌ఇన్‌స్పెక్టర్, ముగ్గురు కానిస్టేబుళ్లు ఉన్నారు. గత శనివారం ప్రయాగ్‌రాజ్‌లో రాత్రివేళ మెడికల్ చెకప్ కోసం అతీక్, అతని సోదరుడు అష్రాఫ్‌లను పోలీసులు వైద్యకళాశాలకు తీసుకెళ్తుండగా మీడియా సమక్షంలోనే ముగ్గురు నేరగాళ్లు పాయింట్‌బ్లాంక్ రేంజ్‌లో కాల్పులు జరిపి హత్యచేయడం తెల్సిందే.

లైంగికత స్వతఃసిద్ధమైనది

వివక్షకు ప్రాతిపదిక కారాదు • సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

- కోర్టు ఆమోదిస్తే సమాజమూ అంగీకరిస్తుంది
- స్వలింగ వివాహాలపై పిటిషనర్ల వాదన
- రాష్ట్రాలనూ ప్రతివాదులుగా చేర్చాలి: కేంద్రం
- ఇప్పటికే వాటి వైఖరి కోరినట్టు వెల్లడి



న్యూఢిల్లీ: స్వలింగ బంధాల విషయంలో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ''లైంగిక లక్షణాలు, మొగ్గుదలల మీద వ్యక్తులకు అదుపు ఉండదు. అవి స్వతఃసిద్ధమైనవి. కనుక వాటి ప్రాతిపదికన ప్రభుత్వాలు ఎవరి పట్లా వివక్ష చూపజాలవు'' అని స్పష్టం చేసింది. స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కల్పించాలంటూ దాఖలైన పిటిషన్లపై సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ సారథ్యంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ముందు బుధవారం రెండో రోజు కూడా వాదనలు కొనసాగాయి. ఈ పిటిషన్లు పట్టణ, ఉన్నత వర్గ ధోరణిని ప్రతిబింబిస్తున్నాయన్న కేంద్రం వాదనను ధర్మాసనం తోసిపుచ్చింది. స్వలింగ ధోరణి పట్టణ, ఉన్నత వర్గాలకే పరిమితమైనదన్న వాదనను బలపరిచే సాక్ష్యాలేవీ కేంద్రం చూపలేకపోయిందని పేర్కొంది. ''లైంగిక ధోరణి స్వతఃసిద్ధ భావనే తప్ప దానికి సామాజిక, వర్గ ప్రాతిపదికలేవీ ఉండవన్న సీనియర్ న్యాయవాది ఎ.ఎం.సింఘ్వి వాదనతో ఏకీభవిస్తున్నాం. స్వేచ్ఛాయుత వాతావరణం కారణంగా పట్టణ ప్రాంతాల్లో ఈ ధోరణులు ఎక్కువగా బయటికి కన్పిస్తుండవచ్చు'' అని అభిప్రాయపడింది. స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కల్పిస్తే స్త్రీ పురుషుల పెళ్లీడు, దత్తత వంటివాటిపై పడే ప్రభావంతో పాటు తెరపైకి రాగల పలు ఇతర పరిణామాలను కూడా ధర్మాసనం లోతుగా చర్చించింది. 'స్వలింగ జంట ఆడయినా, మగయినా పిల్లలను దత్తత తీసుకోవచ్చు. పెరిగే క్రమంలో తమ తల్లుల/తండ్రుల లైంగిక ధోరణి తాలూకు ప్రభావం ఆ పిల్లల మనసులపై ఎలా ఉంటుందన్నది ఆలోచించాల్సిన అంశమే'' అని అభిప్రాయపడింది.

పార్లమెంటులో ప్రాతినిధ్యం లేకే...: సుప్రీంకోర్టే చొరవ తీసుకుని స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కల్పించాలని పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ విజ్ఞప్తి చేశారు. 142వ అధికరణ కింద రాజ్యాంగం కల్పించిన ప్లీనరీ అధికారాలను వినియోగిస్తూ ఈ మేరకు నిర్ణయం తీసుకోవాలని కోరారు. ''అత్యున్నత న్యాయస్థానికి ఉన్న ప్రతిష్ఠ, నైతికత దృష్ట్యా సమాజమూ ఈ నిర్ణయాన్ని అంగీకరించి స్వలింగ వివాహాలను ఆమోదిస్తుందన్న విశ్వాసముంది. తద్వారా వారూ సమాజంలో గౌరవప్రదమైన జీవనం గడపగలరు. వితంతు వివాహాలకూ తొలుత సామాజిక ఆమోదం లేదు. కానీ చట్టం చేశాక ఆమోదం లభించింది'' అని కోర్టు దృష్టికి తెచ్చారు. కేసులో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను కూడా ప్రతివాదులుగా చేర్చాలంటూ సుప్రీంకోర్టులో కేంద్రం తాజాగా తాజా అఫిడవిట్ దాఖలు చేసింది. స్వలింగ వివాహాలపై వైఖరి తెలపాల్సిందిగా రాష్ట్రాలకు లేఖ రాశామని, వాటి అభిప్రాయాలతో నివేదిక సమర్పించేందుకు అనుమతించాలని కోరింది.

సాయిబాబాపై పునర్విచారణ

బాంబే హైకోర్టుకు సుప్రీం ఆదేశం • విడుదల తీర్పు కొట్టివేత

న్యూఢిల్లీ: మావోయిస్టులతో లింకుల కేసులో ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ జి.ఎన్.సాయిబాబాను నిర్దోషిగా పేర్కొంటూ బాంబే హైకోర్టు వెలువరించిన తీర్పును సుప్రీంకోర్టు కొట్టేసింది. గత ధర్మాసనం కాకుండా వేరే ధర్మాసనంతో కేసుపై నాలుగు నెలల్లోపు మళ్లీ విచారణ మొదలుపెట్టాలని బాంబే హైకోర్టును ఆదేశించింది. ఈ కేసులో సాయిబాబాను 2014లో పోలీసులు అరెస్టు చేశారు. చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం ప్రకారం విచారణకు అనుమతి తీసుకోలేదంటూ బాంబే హైకోర్టు ఆక్షేపించింది. కనుక మొత్తం విచారణనే రద్దు చేస్తున్నట్టు పేర్కొంది. సాయిబాబాను విడుదల చేయాలని గత అక్టోబర్ 14న ఆదేశించింది. ఈ తీర్పును మహారాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసింది.

సూడాన్‌లో చిక్కిన మనోళ్లు

సురక్షితంగా రప్పించే యత్నాల్లో భారత్ • ముమ్మర సంప్రదింపులు



ఖార్తూమ్: సూడాన్ సైన్యం, పారామిలటరీ విభాగమైన తక్షణ మద్దతు దళం(ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్స్)కు మధ్య కొనసాగుతున్న పరస్పర దాడులతో నెలకొన్న కల్లోల పరిస్థితులు అక్కడి భారతీయులకు కష్టాలు తెచ్చిపెట్టాయి. ఇరు వర్గాల కాల్పులు, బాంబుల మోతతో ఉన్నచోటు నుంచి కనీసం బయటకురాలేక బిక్కుబిక్కుమంటూ సాయం కోసం అర్థిస్తున్నారు. దీంతో దౌత్యమార్గంలో వారిని సురక్షితంగా స్వదేశానికి తీసుకొచ్చేందుకు భారత్ ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. కాల్పుల విరమణకు అమెరికా వంటి దేశాలు పిలుపునిచ్చినా కొద్ది గంటలకే అది విఫలమై గడిచిన 24 గంటల్లోనే మరో 100 మంది ప్రాణాలు కోల్పోయారు. దీంతో పరిస్థితి చేయి దాటేలోపే భారతీయులను వెనక్కితీసుకురావాలనే భారత్ కృతనిశ్చయంతో ఉందని భారత విదేశాంగ శాఖ వర్గాలు బుధవారం వెల్లడించాయి. కర్ణాటక సంప్రదాయ మూలిక వైద్యం చేసే 31 మంది 'హక్కీ పిక్కీ' గిరిజనులుసహా 60 మంది భారతీయులు సూడాన్‌లో చిక్కుకున్నారని వారి గురించి పట్టించుకోండని ఆ రాష్ట్ర మాజీ సీఎం సిద్ధరామయ్య కోరడం, ఈ విషయాన్ని రాజకీయం చేయొద్దని ఇప్పటికే విదేశాంగ మంత్రి జైశంకర్ వ్యాఖ్యానించడం తెల్సిందే. సూడాన్ ఘర్షణల్లో ఇప్పటిదాకా దాదాపు 270 మంది ప్రాణాలు కోల్పోయారు. రాజధాని ఖార్తూమ్‌లో జరిగిన కాల్పుల్లో ఒక మాజీ భారతీయ సైనికుడు ఆల్బర్ట్ అగస్టీన్ చనిపోయారు. 1,800 మందికిపైగా గాయాలపాలయ్యారని ఐక్యరాజ్యసమితి ప్రకటించింది.

అమెరికా, బ్రిటన్, సౌదీ, యూఏఈతో మంతనాలు

సూడాన్‌తో సంబంధాలు నెరుపుతున్న అమెరికా, బ్రిటన్, సౌదీ అరేబియా, యూఏఈ దేశాలతో భారత విదేశాంగ శాఖ మంతనాలు కొనసాగిస్తోంది. క్షేత్రస్థాయిలో భారతీయుల రక్షణకు సాయపడతామని జైశంకర్‌కు సౌదీ, యూఏఈ విదేశాంగ మంత్రులు హామీ ఇచ్చారు. సూడాన్‌లో భారతీయ ఎంబసీ అక్కడి భారతీయులతో వాట్సాప్ గ్రూప్‌లుసహా పలు మార్గాల్లో టచ్‌లోనే ఉంది. ' మా నాన్న వ్యాపార నిమిత్తం అక్కడికెళ్లి శనివారమే ముంబైకి రావాల్సింది. సూడాన్ ఎయిర్‌పోర్ట్‌లో ఉండగా చివరి నిమిషంలో విమానం రద్దయిందని చెప్పి అక్కడి అధికారులు ఎయిర్‌పోర్ట్ నుంచి వెళ్లగొట్టారు. హోటల్‌కు కాలినడకనే వెళ్లారు. ఇప్పుడు అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన పరిస్థితి ఏంటో తెలీడం లేదు' అని 63 ఏళ్ల వ్యక్తి కూతురు మానసి సేథ్ వాపోయారు. 'అక్కడంతా ఆటవిక రాజ్యమే. ప్రాణాలకు విలువే లేదు. స్వయంగా సైనికులే లూటీ చేస్తూ అపహరణలకు పాల్పడుతున్నారు. ఖర్తూమ్ హోటల్‌లో నా భర్త చిక్కుకుపోయారు. బాంబుల దాడి భయంతో హోటల్‌లోని అతిథులంతా బేస్‌మెంట్‌లో దాక్కున్నారు' అని మరో మహిళ పీటీఐకి చెప్పారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో వీధుల్లో రాకపోకలు కూడా కష్టమేనని భారత విదేశాంగ శాఖ చెబుతోందంటే అక్కడి పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

ఎవరీ హక్కీ పిక్కీలు ?

గుజరాత్ నుంచి శతాబ్దాల క్రితం కర్ణాటకకు హక్కి పిక్కి అనే గిరిజన తెగ ప్రజలు వలసవచ్చారు. అడవుల్లో ఉంటూ మూలికా వైద్యం చేస్తారు. వీరికి సొంత భాష 'వగ్రీబూలి'తోపాటు తెలుగు, కన్నడ, తమిళం, మలయాళం వచ్చు. పేద ఆఫ్రికా దేశం సూడాన్‌లో ఖరీదైన ఇంగ్లిష్ మందులు, వైద్యం పొందగల స్తోమత ఉన్న జనాభా చాలా తక్కువ. అందుకే స్థానికులు చవక వైద్యం వైపు మొగ్గుచూపుతారు. అందుకే వారికి తమ సంప్రదాయ వైద్యం చేసేందుకు సుదూరంలోని సూడాన్‌కు ఈ కర్ణాటక గిరిజనులు చేరుకున్నారు.

ఎందుకీ గొడవ ?

ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రధాని అబ్దల్లా హమ్దోక్‌ను గత ఏడాది సైన్యం, ఆర్ఎస్ఎఫ్ గద్దెదించి పాలనను తమ చేతుల్లోకి తీసుకున్నాయి. తాజాగా ఆర్ఎస్ఎఫ్‌ను సైన్యంలో విలీనం చేయాలని సైన్యాధ్యక్షుడు జనరల్ అబ్దుల్ ఫతాహ్ అల్-బుర్హాన్ ప్రతిపాదించగా ఆర్ఎస్ఎఫ్ చీఫ్ జనరల్ మొహమ్మద్ హమ్దాన్ దగాలో తీవ్రంగా వ్యతిరేకించారు. దీంతో ఇరు సాయుధ విభాగాల మధ్య అగ్గి రాజుకుంది.

150 ఏళ్ల క్రితమే సూడాన్‌కు వలసలు

ప్రస్తుతం సూడాన్‌లో దాదాపు 4,000 మంది భారతీయులున్నారు. వీరిలో 1,200 మంది శాశ్వత స్థిరనివాసం ఏర్పరచుకున్నారు. వీరి కుటుంబాలు 150 ఏళ్ల క్రితమే అక్కడికి వలసవెళ్లాయి. ఇక మిగతావారు సూడాన్ ఆర్థిక రంగం వంటి పలు వృత్తుల్లో ఉద్యోగాల కోసం వెళ్లారు. కొందరు ఐక్యరాజ్యసమితి కార్యక్రమాలు, అంతర్జాతీయ సంస్థల్లో పనిచేస్తున్నారు.



ఫెన్సింగ్ దాటుకుని వైట్‌హౌస్‌లోకి ప్రవేశించిన చిన్నారిని ఎత్తుకుని తీసుకొస్తున్న యూఎస్ సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు. అత్యంత పకడ్బందీగా ఉంటుందని భావించే ఫెన్సింగ్ గుండా ఆ బాలుడు సునాయాసంగా దూరాడట. కాసేపు కలకలం అనంతరం బాలున్ని తల్లిదండ్రులకు అప్పగించారు.

ఉక్రెయిన్ చేతికి 'పేట్రియాట్'

కీవ్: అమెరికా అత్యాధునిక పేట్రియాట్ గైడెడ్ క్షిపణి వ్యవస్థ ఉక్రెయిన్ చేతికొచ్చింది. దీంతో రష్యా యుద్ధమూకలను మరింత దీటుగా ఎదుర్కొంటామని ఉక్రెయిన్ రక్షణ మంత్రి ఒలెక్సీ రెజ్నికోవ్ బుధవారం ట్వీట్‌చేశారు. ' భూతలం నుంచి గగనతలంలోకి ప్రయోగించే పేట్రియాట్ క్షిపణి వ్యవస్థ రాకతో మా గగనతలానికి మరింత రక్షణ చేకూరింది' అని ఆయన అన్నారు. శత్రు సేనల నుంచి దూసుకొచ్చే క్షిపణులు, స్వల్ప శ్రేణి బాలిస్టిక్ మిస్సైళ్లను ఈ వ్యవస్థతో కూల్చేయొచ్చు. క్రూయిజ్ క్షిపణులు, స్వల్ప శ్రేణి మిస్సైళ్లతోనే ఉక్రెయిన్ పౌర మౌలిక వసతులు ముఖ్యంగా విద్యుత్ సరఫరా వ్యవస్థలను రష్యా ధ్వంసం చేస్తున్న విషయం విదితమే. అందుకే జనావాసాలు, మౌలిక వసతుల రక్షణ కోసం కొంతకాలంగా పేట్రియాట్ సిస్టమ్స్ సరఫరా చేయాలని అమెరికాను ఉక్రెయిన్ కోరుతోంది. ఇన్నాళ్లకు అవి ఉక్రెయిన్ చేతికొచ్చాయి.



అలస్కా మీదుగా ఆకాశంలో కన్పించిన వింత వలయమిది. స్పేస్ ఎక్స్ రాకెట్ అంతరిక్షంలోకి దూసుకెళ్లే క్రమంలో ఆకాశంలో అత్యంత ఎత్తులో వదిలేసిన అదనపు ఇంధనం గడ్డకట్టి ఇలా అందమైన వింత వలయంగా ఆకృతి దాల్చిందని సైంటిస్టులు వివరించారు.

శిగ్గావ్‌లో బొమ్మై.. వరుణ నుంచి సిద్ధు

కర్ణాటకలో జోరందుకున్న నామినేషన్ల పర్వం



నామినేషన్ వేస్తున్న సీఎం బొమ్మై. చిత్రంలో నడ్డా, సినీ నటుడు సుదీప్

శిగ్గావ్/మైసూరు: కర్ణాటకలో అభ్యర్థుల నామినేషన్ల పర్వం ఊపందుకుంది. శిగ్గావ్ నియోజకవర్గ నుంచి సీఎం బసవరాజ్ బొమ్మై, వరుణ నుంచి మాజీ సీఎం, కాంగ్రెస్ సీనియర్ నేత సిద్ధరామయ్య బుధవారం నామినేషన్లు వేశారు. బొమ్మై వెంట బీజేపీ చీఫ్ జేపీ నడ్డాతో పాటు ప్రముఖ కన్నడ నటుడు కిచ్చా సుదీప్ కూడా ఉన్నారు. ఇవే తన చివరి ఎన్నికలని సిద్ధరామయ్య చెప్పారు. ఇక బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన మాజీ సీఎం జగదీష్ శెట్టార్ కూడా హుబ్బళిలో నామినేషన్ వేశారు.

బీజేపీ స్టార్ క్యాంపెయినర్ జాబితాలో మోదీ, కేంద్ర మంత్రులు

కర్ణాటకలో బీజేపీ 40 మంది స్టార్ క్యాంపెయినర్ల జాబితా విడుదల చేసింది. ప్రధాని మోదీ, పార్టీ చీఫ్ నడ్డా, కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్‌సింగ్, గడ్కరీ, నిర్మలా సీతారామన్, స్మృతీ ఇరానీ, ధర్మేంద్ర ప్రధాన్, మన్‌సుఖ్ మాండవీయ, ప్రహ్లాద్ జోషి, యూపీ, మధ్యప్రదేశ్, అసోం సీఎంలు యోగి ఆదిత్యనాథ్, శివరాజ్‌సింగ్, హిమంత బిశ్వ శర్మ తదితరులు ఇందులో ఉన్నారు.

దేశవ్యాప్తంగా భగభగలు

న్యూఢిల్లీ: భానుడి ప్రతాపంతో దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలు అల్లాడిపోతున్నాయి. రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో, ఒడిశాలోని బారిపడలో 44.5 డిగ్రీలు నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. ఢిల్లీలో కొన్ని రోజులుగా 40 డిగ్రీలకు పైగానే నమోదవుతున్నాయి. ఈశాన్య రాష్ట్రాల్లోనూ ఎండ ప్రచండంగా ఉంది. దాంతో త్రిపురలో 'స్టేట్ స్పెసిఫిక్ డిజాస్టర్' ప్రకటించారు. కేరళలోనూ ఎండలు మండుతున్నాయి. పశ్చిమ బెంగాల్, ఏపీ, బిహార్ తదితర రాష్ట్రాల్లో తీవ్ర వడగాడ్పులు రెండు రోజులుంటాయని ఏపీలో ఈ నెల 21, 22ల్లో వర్షం పడొచ్చని వాతావరణ శాఖ చెప్పింది.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
గురువారం : 20 ఏప్రిల్ 2023

హస్తం స్టార్ ప్రచారకులు వీరే

బనశంకరి: ఎన్నికల ముమ్మర ప్రచారానికి కాంగ్రెస్ పార్టీ 40 మంది స్టార్ క్యాంపెయినర్లను బుధవారం ప్రకటించింది. ఆ జాబితాలో సోనియాగాంధీ, ప్రియాంకగాంధీ, నటి రమ్య, జగదీశ్ షెట్టర్, అశోక్ గెహ్లాట్, పృథ్వీరాజ్ చౌహాన్, మాజీ క్రికెటర్ మహమ్మద్ అజారుద్దీన్, కన్నయ్యకుమార్ తదితరులు ఉన్నారు.

జేడీఎస్ మూడో జాబితా

జేడీఎస్ 59 మంది అభ్యర్థులతో మూడో జాబితాను విడుదల చేసింది. బీజేపీని వీడి జేడీఎస్‌లోకి చేరిన ఎమ్మెల్సీ ఆయనూరు మంజునాథ్‌కు శివమొగ్గ నగర టికెట్ ఇచ్చారు.

న్యూస్‌రీల్

డిపాజిట్ సొమ్ముగా నాణేలు



యంకప్ప చెల్లించిన నాణేలను లెక్కిస్తున్న అధికారి

రాయచూరు రూరల్: యాదగిరిలో స్వతంత్ర అభ్యర్థి యంకప్ప వినూత్నంగా నామినేషన్ వేశారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో రామసముద్రకు చెందిన యంకప్ప నామినేషన్ డిపాజిట్ మొత్తంగా రూ.10 వేలను చెల్లించాడు. అయితే అవన్నీ కూడా ఒక్క రూపాయి నాణేలే. ఏడాదిగా పాదయాత్ర చేస్తూ జనం నుంచి రూ.1 నాణేలను దానంగా స్వీకరించి ఎన్నికల్లో పోటీకి నిలిచానన్నారు. కాగా అభ్యర్థి చెల్లించిన నాణేలను లెక్కించడానికి అధికారులకు మూడు గంటల సమయం పట్టింది.

హాసన్ ప్రచారంలో భవాని



స్వరూప్‌కు ఓటేయాలని చెబుతున్న భవాని

యశవంతపుర: హాసన్ జేడీఎస్ టికెట్‌పై సందిగ్ధత తొలగింది. ఇక్కడి నుంచి పోటీకి హెచ్‌డీ రేవణ్ణ సతీమణి భవాని ఎంతో ప్రయత్నం చేసినా మామ హెచ్‌డీ దేవెగౌడ టికెట్ ఇవ్వలేకపోయారు. ఆ టికెట్ హెచ్‌పీ స్వరూప్‌కు లభించింది. హాసన్ జేడీఎస్ ఎమ్మెల్యేగా గతంలో మూడుసార్లు ఎన్నికైన ప్రకాష్ తనయుడే స్వరూప్. కాగా, అభ్యర్థి స్వరూప్ తనకు కొడుకులాంటి వాడని భవాని పేర్కొన్నారు. బుధవారం హాసన్ పట్టణంలో ఎన్నికల ప్రచారంను నిర్వహించారు. స్వరూప్‌కు మద్దతుగా ఆమె ప్రచారంలో పాల్గొన్నారు. ఆయనకు టికెట్ ఇవ్వాలని తానే సూచించినట్లు భవాని తెలిపారు. ఇప్పటివరకు జరిగిన పరిణామాలను మరిచి స్వరూప్ గెలుపు కోసం కార్యకర్తలు శ్రమించాలని కోరారు.

కాల్పుల మధ్యలో చిక్కుకున్నాం

- నూడాన్‌లోని కన్నడిగుల ఆందోళన

శివాజీనగర: ఆఫ్రికాలోని సూడాన్ దేశంలో అల్ ఫషీర్ నగరంలో తిరుగుబాటు నెలకొనగా, అక్కడ చిక్కుకొన్న 31 మంది కన్నడిగులు కాపాడాలని విన్నవించారు. ఫోటోలు, వీడియోలను తమవారికి పంపారు. తీవ్రమైన కాల్పులు జరుగుతున్నాయి. తమను తక్షణమే కాపాడాలని కోరారు. భారతీయులు ఉన్న ఇళ్లపై కాల్పులు జరిగాయి. పరిస్థితి విషమించింది, ఆహారం, నీరు కూడా దొరకడం లేదని వాపోయారు. 31 మందిలో శివమొగ్గకు చెందిన 7 మంది, దావణగెరె జిల్లా చెన్నగిరికి చెందిన 5 మంది, మైసూరు హుణసూరుకు చెందిన 19 మంది ఉన్నారు. వీరంతా హక్కి పక్కి వర్గానికి చెందినవారు కాగా ఔషధాల అమ్మకం కోసం సూడాన్‌కు వెళ్లి చిక్కుకొన్నారు.

సంతానం లేదని శిశువు కిడ్నాప్

- మహిళ అకృత్యం, అరెస్టు



యశవంతపుర: బెంగళూరు వాణీవిలాస్ ఆస్పత్రిలో 3 రోజుల క్రితం శిశువు అపహరణకు గురికాగా వీవీ పురం పోలీసులు విచారణ జరిపి శిశువును రక్షించి, కిడ్నాపర్‌ను అరెస్ట్ చేశారు. బిడ్డలు లేరనే కారణంగా రామనగరకు చెందిన రశ్మి అనే మహిళ శిశువును ఎత్తుకెళ్లింది. వాణీవిలాస్ ఆస్పత్రిలో తుమకూరుకు చెందిన సుమా ఈ నెల 7న మగ బిడ్డకు జన్మనిచ్చింది. బిడ్డకు రక్తం తక్కువగా ఉన్నందున ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా 15న తెల్లవారుజామున రశ్మి ఈ శిశువును ఎత్తుకెళ్లింది. గోరగుంటెపాళ్య, బనశంకరి ప్రాంతంలో తిరిగి అక్కడి నుంచి బస్‌లో రామనగరకు వెళ్లింది. పోలీసులు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఆరు వందల కెమెరాలను పరిశీలించి మంగళవారం నిందితురాలిని పట్టుకున్నారు. రశ్మిని అరెస్టు చేసి విచారణ చేపట్టారు.

చీపురు పార్టీకి మద్దతివ్వాలి

శివాజీనగర: నగరంలోని పులకేశినగర విధానసభా నియోజకవర్గంలో ఆప్ అభ్యర్థి సురేశ్ రాథోడ్ బుధవారం భారీ రోడ్ షో నిర్వహించి నామినేషన్ దాఖలు చేశారు. పార్టీ జాతీయ నేత రాఘవ్ చడ్డా పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు జేసీబీ పార్టీల అవినీతి పాలనతో విసుగెత్తారని, మురికిని వదలగొట్టేందుకు చీపురు పార్టీకి మద్దతునివ్వాలని ఆయన విన్నవించారు. 40 శాతం లంచాల ప్రభుత్వం కాకుండా ఢిల్లీ, పంజాబ్‌లో అధికారంలో ఉన్న 100 శాతం నిజాయితీ కలిగిన ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు.

తారాస్థాయికి నామినేషన్ల సందడి

- దాఖలుకు నేడే ఆఖరు
- గురువారం మంచిరోజు కాదని బుధవారమే తరలిన అభ్యర్థులు
- బలప్రదర్శనగా ర్యాలీలు

శివాజీనగర: ప్రతిష్టాత్మక అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి ముఖ్యఘట్టమైన నామినేషన్ల పర్వం పతాకస్థాయికి చేరుకుంది. వందలాది మంది అభ్యర్థులు ఆలయాల్లో పూజలు, ర్యాలీలు చేస్తూ సందడి సృష్టించారు. మే 10న జరిగే విధానసభా ఎన్నికలకు నామినేషన్ సమర్పణ ఆఖరి రోజైన గురువారం అమావాస్య, గ్రహణం ఉండటంతో బుధవారమే సమర్పణ జోరుగా సాగింది. సీఎల్పీ నేత సిద్దరామయ్య, మాజీ సీఎం జగదీశ్ శెట్టర్, విజయేంద్రతో పాటు పలువురు హేమాహేమీలు నామినేషన్‌లు సమర్పించారు. గురువారం అమావాస్యతో పాటు గ్రహణం కూడా ఉండడంతో శుభకార్యాలు చేయరు. దీంతో ముందురోజే చోటా మోటా నేతలు సహా ప్రముఖులు నామినేషన్లకు పరుగులు తీశారు.

శికారిపురలో విజయేంద్ర..

శివమొగ్గ: శికారిపుర నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా బీవై విజయేంద్ర బుధవారం నామినేషన్ వేశారు. అంతకుముందు శికారిపుర పట్టణంలో దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఊరేగింపుగా తాలూకా కార్యాలయం వరకు వెళ్లి నామినేషన్ సమర్పించారు. ఊరేగింపులో మాజీ సీఎం బీఎస్ యడియూరప్ప, సోదరుడు, ఎంపీ రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు. యడియూరప్ప మాట్లాడుతూ ఈసారి బీజేపీ స్పష్టమైన మెజారిటీతో అధికారంలోకి వస్తుందని అన్నారు.

పూజలు చేసి సిద్దరామయ్య..

మైసూరు: కాంగ్రెస్ నాయకుడు సిద్ధరామయ్య వరుణ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిగా బుధవారం నామినేషన్ సమర్పించారు. అంతకుముందు సొంతూరు సిద్ధరామనహుండిలోని శ్రీ సిద్ధరామేశ్వర స్వామి దేవస్థానానికి కుటుంబంతో వెళ్లి పూజలు చేశారు, ఆపై చాముండిబెట్టకు వెళ్లి నాడదేవత శ్రీ చాముండేశ్వరి దేవీ దర్శనం చేసుకున్నారు. తరువాత నంజనగూడుకు వెళ్లి అక్కడ గోళూరు సర్కిల్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్నారు. కార్యకర్తలతో ఊరేగింపుగా వెళ్లి నంజనగూడు టీపీ ఆఫీసులో నామినేషన్ పత్రాలను సమర్పించారు.



శికారిపురలో బీజేపీ అభ్యర్థి విజయేంద్ర నామినేషన్ ర్యాలీ



తుమకూరు జిల్లా కొరటగెరెలో కాంగ్రెస్ అభ్యర్థి పరమేశ్వర్ ర్యాలీ దృశ్యం

జగదీశ్ శెట్టర్ నామినేషన్

బీజేపీని విడిచి కాంగ్రెస్‌లో చేరి హుబ్లీ సెంట్రల్ నియోజకవర్గ కాంగ్రెస్ టికెట్ పొందిన మాజీ ముఖ్యమంత్రి జగదీశ్ శెట్టర్ బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. వరుణ, చామరాజనగర రెండూ నియోజకవర్గాల నుంచి పోటీ చేయనున్న మంత్రి వీ.సోమణ్ణ చామరాజనగరలో నామినేషన్ వేశారు. కార్కళలో మంత్రి సునీల్‌కుమార్, మంత్రి సీసీ పాటిల్ నరగుందలో నామినేషన్లను సమర్పించారు. నగరంలో పులకేశినగర ఎమ్మెల్యే అఖండ శ్రీనివాస్ మూర్తి కాంగ్రెస్ టికెట్ దక్కకపోవడంతో స్వతంత్ర అభ్యర్థిగా పోటీలోకి దిగారు. భారీ ఊరేగింపుతో వచ్చి నామినేషన్ దాఖలు చేశారు. బెళగావిలో మరాఠా అభ్యర్థుల నామినేషన్‌లో కోలాహలం మిన్నంటింది.

బుధవారం సాయంత్రం నాటికి దాఖలైన మొత్తం నామినేషన్లు 1,110

బీజేపీ	164
కాంగ్రెస్	147
జేడీఎస్	108
ఆప్	91
బీఎస్పీ	46
గుర్తింపు లేని పార్టీలు	193
స్వతంత్రులు	359
సీపీఎం-1, ఎన్‌సీపీ-1	



హావేరి జిల్లా శిగ్గాంవిలో సీఎం బొమ్మై నామినేషన్ ర్యాలీలో సందోహం



బెళగావి రూరల్‌లో ఎంఈఎస్ అభ్యర్థి ఊరేగింపులో మహిళలు

సీఎం బొమ్మై నామినేషన్ దాఖలు



సాక్షి, బళ్లారి: ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై సొంత నియోజకవర్గమైన శిగ్గాంవిలో బుధవారం నామినేషన్ సమర్పించారు. ఈ సందర్భంగా వేలాది మందితో ర్యాలీ నిర్వహించారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జయప్రకాష్ నడ్డాతో పాటు ప్రముఖ సినీ నటుడు కిచ్చ సుదీప్ హాజరయ్యారు. ర్యాలీలో నడ్డా మాట్లాడుతూ అవినీతి అంటే కాంగ్రెస్ పార్టీకి పెట్టింది పేరు అని, ఆ పార్టీని కూకటివేళ్లతో పెకలించాలన్నారు. బొమ్మై మాట్లాడుతూ తాము చేపట్టిన అభివృద్ధి పనులతో పాటు ప్రధాని మోదీ, నటుడు సుదీప్‌లు ఈ ఎన్నికల్లో ప్రచారం నిర్వహిస్తున్నందున కచ్చితంగా రాష్ట్రంలో అధికారంలోకి వస్తామన్నారు. బొమ్మై నామ్ కే వాస్తే సీఎం కాదని కామ్‌కే వాస్తే సీఎం అని సుదీప్ పేర్కొన్నారు.

రేపు విజయపురకు అమిత్‌షా



బందోబస్తు ఏర్పాట్ల పరిశీలన

విజయపుర: దేవనహళ్లి విధానసభ నియోజకవర్గంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. విజయపుర పట్టణంలో శుక్రవారం మధ్యాహ్నం 3.45 గంటలకు అమిత్ షా వస్తారు. ప్రచార ర్యాలీలో పాల్గొంటారు. ఈ క్రమంలో బందోబస్తు ఏర్పాటుకు ఎస్పీ, డీఎస్పీ, ఎస్‌జీపీ అధికారులు విజయపురకు వచ్చారు. బస్టాండ్, టౌన్ సర్కిల్, కోలార్ రోడ్డు తదితర ప్రాంతాల్లో బందోబస్తు కోసం పరిశీలించారు.

బళ్లారి పర్యటనకు సుప్రీం నో

సాక్షి, బళ్లారి: మాజీ మంత్రి, కేఆర్‌పీపీ అధ్యక్షుడు గాలి జనార్దనరెడ్డికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. బళ్లారి నగర నియోజకవర్గం నుంచి తన సతీమణి గాలి లక్ష్మీఅరుణ అభ్యర్థినిగా పోటీ చేసినందున, ఆమె తరపున ప్రచారం చేసేందుకు బళ్లారికి వెళ్లడానికి అనుమతించాలని ఆయన ఇటీవల సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. బుధవారం విచారణ చేసిన న్యాయమూర్తి.. ఆ పిటిషన్‌ను తిరస్కరించారు. దీంతో ఆయన బళ్లారిలో ప్రచారం చేయడం సందేహాస్పదమైంది.

టపాసుల గోదాము విస్ఫోటం

మైసూరులో దుర్ఘటన

- ఆకాశాన్నంటిన పొగ, మంటలు
- చుట్టుపక్కల భవనాలకు నష్టం

మైసూరు: మైసూరు హెబ్బాళ పారిశ్రామికవాడ రాణా మద్రాస్ వద్ద బాణసంచా గోదాములో బుధవారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం చోటుచేసుకోగా భీకరమైన పేలుళ్లు, ఆకాశాన్నంటే పొగతో చుట్టుపక్కల ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. గోదాము పక్కనే ఉన్న కలప ఫ్యాక్టరీ ఈ మంటలకు పూర్తిగా దగ్ధమైంది. మంటలు తలెత్తగానే అన్ని గోదాముల నుంచి సిబ్బంది బయటికి పరుగులు తీశారు. టపాసులు పెద్ద శబ్దంతో పేలుతూ మంటలు, పొగ వ్యాపించాయి. ఏం జరిగిందోనని చుట్టుపక్కల ప్రాంతాల భయంతో హడలిపోయారు.

15 ఫైరింజన్లతో నియంత్రణ

ఎన్నికల సీజన్ కావడంతో గోదాములో చాలా పెద్ద ప్రమాణంలో టపాసులను నిల్వ ఉంచారు. మంటలు ఏవిధంగా ఏర్పడ్డాయి అనేది తెలియరాలేదు. సమాచారం అందిన వెంటనే 15 ఫైరింజన్లతో చేరుకుని మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. కొన్ని గంటలపాటు శ్రమించాక మంటలు ఆరిపోయాయి. బాణసంచా పొగల వల్ల కొన్నికిలోమీటర్ల పరిధిలో గంధకం వాసన, కళ్లమంటలు వంటి సమస్యలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. గోదాముకు ఆనుకుని ఉన్న సుమారు 50 భవనాలు దెబ్బతిన్నట్లు అంచనా. ఆస్తినష్టం భారీగానే ఉండవచ్చు. అదృష్టవశాత్తు ఎవరికీ గాయాలు కాలేదు.



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది



బాణాసంచా గోడౌన్‌లో పేలుళ్ల దృశ్యం





పేలుడు ధాటికి ధ్వంసమైన గోదాము (కింద వృత్తంలో) ప్రమాదం జరిగిన గోదాము

అందరూ ఓటేయాలి

ఇది అభ్యర్థుల ర్యాలీ కాదు.. ఉద్యోగులది. ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటేయాలని చిక్కమగళూరులో ప్రభుత్వ ఉద్యోగుల ఊరేగింపు. స్వీప్ ఆధ్వర్యంలో ర్యాలీ సాగింది



చెత్త గోల



స్వచ్ఛ బెంగళూరు ఎక్కడ..? బుధవారం ఐటీ సిటీలోని చామరాజపేటెలో రోడ్డుపక్కన పేరుకున్న చెత్తరాశి. అలాగే ఎన్నికల ప్రచారానికి వెళ్తున్న ఓ పార్టీ కార్యకర్తలు

వ్యాన్‌లో 40 కేజీల బంగారం

- చిక్కమగళూరు జిల్లాలో సీజ్

యశవంతపుర: చిక్కమగళూరు జిల్లా తరీకెరె తాలూకా ఎంసీ హళ్లి పోలీసు చెక్‌పోస్ట్‌లో ఎన్నికల అధికారులు ఒకటీ రెండు కాదు ఏకంగా 40 కేజీల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఒక వ్యాన్‌లో బెంగళూరు నుంచి శివమొగ్గకు తరలిస్తుండగా మంగళవారం రాత్రి తనిఖీ చేయగా 40 కేజీల బంగారం లభించింది. జీఎస్‌టీ చెల్లించకుండా అక్రమంగా తరలిస్తున్నట్లు తెలియడంతో సీజ్ చేశారు. వాహనం డ్రైవర్‌ను అరెస్టు చేశారు.

బెంగళూరులో నగదు, బంగారం..

బెంగళూరు నగర పరిధిలో మంగళవారం తనిఖీలలో రూ.3.24 కోట్ల విలువైన నగదు, బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. హెబ్బాళలో రూ.67.54 లక్షలు విలువగల 1.448 కేజీల బంగారం, చిక్కపేటలో రూ.1.49 కోట్లు విలువగల మూడు కేజీల బంగారం, శాంతినగరలో రూ.4.79 లక్షలు విలువగల 7.999 కేజీల బంగారాన్ని పట్టుకున్నారు. బెంగళూరు నగర జిల్లా పరిధిలో రూ.30 లక్షలు నగదు, రామనగర రూ.1.97 కోట్ల నగదు, మహదేవపురలో 26.62 లక్షలు నగదును సీజ్ చేసినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.



స్వాధీనం చేసుకున్న బంగారు వెండి ఆభరణాలు

వ్యాన్‌లో 8 కేజీల బంగారం

బనశంకరి: ఎన్నికల అధికారుల తనిఖీలలో భారీమొత్తంలో బంగారం దొరుకుతోంది. బెంగళూరు వివేక్ నగరలో బుధవారం సోదాల్లో 8 కిలోల బంగారు ఆభరణాలు, 46 కిలోల వెండి సొత్తు లభించింది. అనుమానాస్పదంగా వచ్చిన ఈచర్ వ్యాన్‌ని పోలీసులు అడ్డుకుని పరిశీలించగా ఎలాంటి రికార్డులులేని బంగారు, వెండి ఆభరణాలు పెద్దమొత్తంలో కనిపించాయి. తూకం వేయగా 8 కేజీల బంగారు నగలు, 46 కేజీల వెండి సొత్తుగా తేలింది. వాటిని సీజ్ చేసి కేసు నమోదు చేసి ఎన్నికల కమిషన్ కు సమాచారం అందించారు. ఈచర్‌లోని ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎక్కడి నుంచి తెచ్చారు, ఎక్కడికి తీసుకెళ్తున్నారు అనేది విచారణ చేపట్టారు.

గోదాములో వేలాది కుట్టుమిషన్లు

రూ.42.92 లక్షల విలువచేసే కుట్టు మిషన్లు, టిఫిన్ బాక్సులను బెళగావి సవదత్తి సంభవ టింబర్‌యార్డు గోదాములో పట్టుకున్నారు. రూ.23,84,272 లక్షల విలువచేసే 1,012 కుట్టుమిషన్లు, రూ.11,27,840 విలువచేసే 1,060 ఐరన్ స్టాండ్లు జేడీఎస్ అభ్యర్థి సౌరవ్‌చోప్రా ఫోటోతో కూడిన రూ.3.24 లక్షల విలువచేసే టిఫిన్ బాక్సులు దొరికాయి. అన్నింటినీ సీజ్ చేసి కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

బీజేపీ అభ్యర్థి ర్యాలీ



ఊరేగింపుగా వెళుతున్న అభ్యర్థి సుధాకర్

గౌరిబిదనూరు: నియోజకవర్గంలో ప్రజలు మార్పును కోరుకొంటూ ఉన్నారు, గత 20 ఏళ్లే ఏ అభివృద్ధి జరగలేదు. ఇక్కడి ప్రజలు మార్పుతో పాటు అభివృద్ధిపై ఆశలు పెట్టు కొన్నారు అని చిక్కబళ్లాపురం ఎమ్మెల్యే ఆరోగ్యశాఖా మంత్రి డా సుధాకర్ అన్నారు. బుధవారం బిజెపి అభ్యర్థి డా శశిధర్ నామినేషన్ ఊరేగింపులో పాల్గొని ప్రసంగించారు. వేలాదిమంది కార్యకర్తలతో అయ్యప్ప స్వామి దేవాలయం నుంచి తాలూకాఫీసుకు ర్యాలీ చేరింది. శశిధర్ అధికారులకు నామినేషన్ పత్రాలను అందజేశారు. రవినారాయణ రెడ్డి, రమేశ్ రావ్ శేల్కే, మార్కెట్ మోహన్, శివశంకర్ పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

- అభ్యర్థి గాలి సోమశేఖరరెడ్డి



ప్రచారం చేస్తున్న అభ్యర్థి గాలి సోమశేఖర రెడ్డి, చిత్రంలో న్యాయవాదులు

సాక్షి,బళ్లారి: నగరాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రతి ఒక్కరూ బీజేపీ కమలం గుర్తుకు ఓటు వేయాలని ఎమ్మెల్యే, ఆ పార్టీ అభ్యర్థి గాలి సోమశేఖరరెడ్డి పేర్కొన్నారు. ఆయన బుధవారం నగరంలోని వివిధ వార్డుల్లో ఎన్నికల ప్రచారం జోరుగా నిర్వహించడంతో పాటు కోర్టులో న్యాయవాదుల సంఘం కార్యాలయంలోకి వెళ్లి ప్రతి ఒక్క లాయర్‌ను కలిసి తనకు మద్దతు ఇవ్వాలని విన్నవించారు. మేధావులు విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయాలన్నారు. దేశాభివృద్ధికి మోదీ చేస్తున్న కృషికి మద్దతుగా నిలవాలన్నారు. కేంద్రంలోను, రాష్ట్రంలోను అధికారంలో ఉంటేనే అభివృద్ధి సాధ్యమని గుర్తు చేశారు. ఈసందర్భంగా న్యాయవాదులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బైక్‌లు ఢీకొని ఇద్దరి దుర్మరణం



మరణించిన యువకులు

రాయచూరు రూరల్: ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు దుర్మరణం పాలైన ఘటన మంగళవారం రాత్రి జిల్లాలోని సిరవార తాలూకా నీలోగల్లు వద్ద చోటు చేసుకుంది. వేర్వేరు బైక్‌లపై వెళుతున్న సిరవార తాలూకా ముర్కిగుడ్డ తాండాకు చెందిన రవి(18), కనగావికి చెందిన రామణ్ణ(22) నీలోగల్లు వద్దకు రాగానే పరస్పరం బలంగా ఢీకొనడంతో తీవ్ర గాయాలతో మరణించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సిరవార పోలీసులు తెలిపారు.

స్వతంత్రుని నామినేషన్

బాగేపల్లి: బాగేపల్లి విధానసభ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా ఆర్.మిథున్ రెడ్డి నామినేషన్‌ను దాఖలు చేశారు. పట్టణంలోని డాక్టర్ హెచ్ఎస్ సర్కిల్ నుంచి ప్రధాన రోడ్డులో ఊరేగింపుగా సాగారు. ఎన్నికల అధికారి శివకుమార్‌కు మిథున్‌రెడ్డి నామినేషన్ పత్రాలను సమర్పించారు. అనంతరం డిపో రోడ్డులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు.

బీజేపీ అభ్యర్థిగా సి.మునిరాజు

బాగేపల్లి బీజేపీ అభ్యర్థిగా సి.మునిరాజు బుధవారం నామినేషన్ సమర్పించారు. వేలాది కార్యకర్తలు, మద్దతుదారులతో ఊరేగింపు నిర్వహించారు. ఆయన వెంటన మంత్రి సుధాకర్, ఎంపీ పీసీ మోహన్, ఎమ్మెల్సీ చలవాది నారాయణ స్వామి, బీజేపీ జిల్లాధ్యక్షుడు రామలింగప్ప తదితరులు ఉన్నారు.

కుల ప్రమాణపత్రం రద్దుకు వినతి



వినతిపత్రం సమర్పిస్తున్న నారాయణ నాయక్ తదితరులు

రాయచూరు రూరల్: 2018 అసెంబ్లీ ఎన్నికల్లో మాన్వి నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన డా.తనుశ్రీ కుల ప్రమాణ పత్రం రద్దు చేయాలని మహర్షి వాల్మీకి సంఘం డిమాండ్ చేసింది. బుధ వారం జిల్లాధికారి కార్యాలయం వద్ద జిల్లా సంచాలకుడు నారాయణ నాయక్ మాట్లాడారు. బీదర్ జిల్లాలో గోండుకులం(బీసీలు) పేరుతో ఎస్టీ ప్రమాణపత్రాన్ని తెచ్చి పోటీ చేశారన్నారు. అందువల్ల తనుశ్రీ ప్రమాణపత్రాన్ని రద్దు చేయాలని కోరుతూ స్థానికాధికారికి వినతి పత్రం సమర్పించారు.

హోరెత్తిన నామినేషన్ల పర్వం

- పోటాపోటీగా అభ్యర్థుల నామినేషన్
- నేటితో నామపత్రాల సమర్పణకు తెర

సాక్షి,బళ్లారి: వచ్చే నెల 10న జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు ఈనెల 20వ తేదీ గురువారంతో నామినేషన్లు సమర్పించేందుకు గడువు ముగుస్తుండడంతో ఆఖరు రోజున అమావాస్య రావడంతో బుధవారమే ఉమ్మడి జిల్లాలో అభ్యర్థులు పోటాపోటీగా నామినేషన్లు సమర్పించారు. జిల్లాలోని గ్రామీణ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరపున బీ.నాగేంద్ర నగరంలో పెద్ద ఎత్తున భారీ జన సందడిలో ఊరేగింపుతో తరలివచ్చి నామినేషన్ వేశారు. వేలాది మంది అభిమానులు, కార్యకర్తలు కాంగ్రెస్ జెండాలను పట్టుకుని నగరంలో ఊరేగింపు నిర్వహించిన అనంతరం జిల్లాధికారి కార్యాలయ ఆవరణలో సంబంధిత ఎన్నికల అధికారి నామినేషన్ అందజేశారు.

ఆప్ అభ్యర్థి దొడ్డ కేశవరెడ్డి నామినేషన్

బళ్లారిఅర్బన్: ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి ఆదేశాల మేరకు బళ్లారి నగర అసెంబ్లీ ఆప్ అభ్యర్థిగా దొడ్డ కేశవరెడ్డి బుధవారం సిటీ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ రుద్రేష్‌కు నామినేషన్ పత్రాలను అందజేశారు. పార్టీ ప్రముఖులు మల్లప్ప, కిరణ్‌కుమార్, మంజునాథ్, ఖలందర్ బాష పాల్గొన్నారు.

జోరుగా నామినేషన్లు దాఖలు

రాయచూరు రూరల్: నగరంలో స్వతంత్ర అభ్యర్థిగా రవి బోసురాజ్ నామినేషన్ వేశారు. బుధవారం అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో నగర ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) అభ్యర్థి వీరేష్ యాదవ్, నగర జేడీఎస్ అభ్యర్థి వినయ్ కుమార్ ఎన్నికల అధికారి రజనీకాంత్‌కు, మాన్విలో స్వతంత్ర అభ్యర్థిగా తనుశ్రీ, మాన్విలో బీజేపీ అభ్యర్థిగా బీ.వీ.నాయక్, గ్రామీణ బీజేపీ అభ్యర్థి తిప్పరాజ్, కాంగ్రెస్ అభ్యర్థి బసనగౌడ తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల అధికారి శశికాంత్‌కు నామినేషన్ పత్రాలను అందించారు.

గంగావతిలో పరణ్ణ మునవళ్లి నామినేషన్

గంగావతి: బీజేపీ అభ్యర్థి పరణ్ణ మునవళ్లి తన నామినేషన్‌ను దాఖలు చేశారు. ఆయన వేలాది మంది మద్దతుదారులతో కలిసి ఏపీఎంసీ కార్యాలయం నుంచి ఊరేగింపుగా విచ్చేసి అక్కడి నుంచి తన వాహనంలో తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని నామినేషన్‌ను సమర్పించారు.



బళ్లారి గ్రామీణ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న నాగేంద్ర



హొసపేటెలో అధికారికి నామినేషన్ అందిస్తున్న బీజేపీ అభ్యర్థి సిద్దార్థసింగ్

కాంగ్రెస్ అభ్యర్థి ఇక్బాల్ అన్సారి నామినేషన్

గంగావతిలో కాంగ్రెస్ అభ్యర్థి ఇక్బాల్ అన్సారి తన నామినేషన్‌ను దాఖలు చేశారు. ఆయన తన నివాసం వద్ద నుంచి వేలాది మంది మద్దతుదారులతో సీపీయూ సర్కిల్ వరకు ఊరేగింపుగా విచ్చేసి అక్కడి నుంచి తన వాహనంలో తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి నామినేషన్ అందజేశారు. గంగావతిలో ఆమ్ఆద్మీ పార్టీ అభ్యర్థి శరణప్ప సజ్జిహోల నామినేషన్‌ను దాఖలు చేశారు. ఆయన తన మద్దతుదారులతో ఆటోలో విచ్చేసి నామినేషన్‌ను సమర్పించారు.

విజయనగరలో సిద్దార్థసింగ్ నామినేషన్

హొసపేటె: విజయనగర జిల్లా హొసపేటె నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి సిద్దార్థసింగ్ బుధవారం తన నామినేషన్‌ను సండూరు రోడ్డులోని అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో ఎన్నికల అధికారికి అందజేశారు. అంతకు ముందు అభ్యర్థి సిద్దార్థసింగ్ తన తండ్రి మంత్రి ఆనంద్‌సింగ్, తల్లి లక్ష్మీ, సతీమణితో కలిసి కుటుంబ సమేతంగా హంపీ విరుపాక్షేశ్వర స్వామి ఆలయంలో బీ.ఫాంకు ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం నగరంలోని పునీత్ క్రీడామైదానం నుంచి కార్యకర్తలతో కలిసి భారీ ఊరేగింపు చేపట్టారు.

జేడీఎస్ అభ్యర్థి రాజునాయక్ నామినేషన్

కంప్లి: కంప్లి క్షేత్ర జేడీఎస్ అభ్యర్థిగా రాజప్ప(రాజు నాయక్) బుధవారం నామినేషన్ వేశారు. ఉద్భవ గణపతి ఆలయంలో పూజలు నిర్వహించి జోడెడ్ల బండిపై ఊరేగింపుగా మున్సిపల్ కార్యాలయంలోని ఎన్నికల కార్యాలయంలో ఎన్నికల అధికారిణి డాక్టర్ నయనకు నామినేషన్ అందజేశారు. ఎమ్మెల్సీ టీఏ శరవణ, జేడీఎస్ ప్రముఖులు హేమయ్యస్వామి, దీపా శ్రీనాయక్, అయోధి హరీష్, రుక్మిణి కృష్ణా నాయక్, జేడీఎస్ ప్రముఖులు డీ.అంబణ్ణ, జగదీష్ పూజార్, హేమరెడ్డి, విశ్వనాథస్వామి, నారాయణ రెడ్డి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి బీ.ఎం.నాగరాజ నామినేషన్

సిరుగుప్ప: నగరంలోని క్రీడాంగణం నుంచి తాలూకా ఎన్నికల అధికారి కార్యాలయం వరకు వేలాది సంఖ్యలో అభిమానులు, కార్యకర్తలతో కలిసి ప్రముఖ వీధుల గుండా ఊరేగింపు జరిపి కాంగ్రెస్ అభ్యర్థి బీ.ఎం.నాగరాజ బుధవారం మధ్యాహ్నం తాలూకా ఎన్నికల కార్యాలయంలో ఎన్నికల అధికారికి తన నామినేషన్ పత్రాలను సమర్పించారు.

కొప్పళలో బీజేపీ అభ్యర్థిని నామినేషన్

గంగావతి రూరల్: కొప్పళలో బుధవారం బీజేపీ అభ్యర్థిని మంజుల అమరేశ్ కరడి నామినేషన్ సమర్పించారు. ఈసందర్భంగా ఊరేగింపులో కొప్పళ ఎంపీ కరడి సంగణ్ణ, ఎమ్మెల్సీ హేమలత నాయక, జిల్లా అధ్యక్షులు దొడ్డనగౌడ పాటిల్, యువ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు మహాలక్ష్మి కందారి, నగరాభివృద్ధి ప్రాధికార అధ్యక్షుడు మహంతేశ్ పాటిల్‌తోపాటు వేలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు.



గంగావతిలో అధికారికి నామినేషన్ అందిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి ఇక్బాల్ అన్సారి



గంగావతిలో అధికారికి నామినేషన్‌ను దాఖలు చేస్తున్న, బీజేపీ అభ్యర్థి పరణ్ణ మునవళ్లి



రాయచూరు గ్రామీణలో నామినేషన్ వేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి బసనగౌడ దద్దల్



బళ్లారిలో ఆప్ అభ్యర్థి దొడ్డకేశవరెడ్డి నామినేషన్ పత్రాలను సమర్పిస్తున్న దృశ్యం



కంప్లిలో ఎన్నికల అధికారిణికి నామినేషన్‌ను అందిస్తున్న జేడీఎస్ అభ్యర్థి రాజునాయక్



కొప్పళలో అధికారికి నామినేషన్ అందిస్తున్న బీజేపీ అభ్యర్థి మంజులా అమరేశ్ కరడి



సిరుగుప్పలో ఎన్నికలఅధికారికి నామినేషన్‌ను అందజేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి బీ.ఎం.నాగరాజ

బీజేపీలోకి బీవీ నాయక్ చేరిక

- మాన్విలో నామినేషన్ దాఖలు

రాయచూరు రూరల్: జిల్లాలో నామినేషన్ల పర్వం ముగింపు దశకు చేరుకుంది. ఒక వైపు మాజీ ఎంపీ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు బీ.వీ.నాయక్ పార్టీకి, డీసీసీ అధ్యక్ష పదవికి రాజీనామా చేసి మంగళవారం రాత్రి హుబ్లీలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, రాష్ట్రాధ్యక్షుడు నళిన్‌కుమార్ కటీల్, ముఖ్యమంత్రి బసవరాజ బొమ్మై, మాజీ ఎమ్మెల్యే బసవనగౌడతో కలిసి పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. బీజేపీ అధిష్టానం ఆయనను మాన్వి నియోజకవర్గ అభ్యర్థిగా ప్రకటించి టికెట్‌ను అందించింది. దీంతో మాన్వి నుంచి పోటీ చేయడానికి వీలుగా బుధవారం ఆయన మాన్విలో తన నామినేషన్‌ను వేశారు. మరో వైపు రాయచూరు నగర కాంగ్రెస్ అభ్యర్థి ఎంపికపై కసరత్తు సాగుతోంది. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి బోసురాజ్ కాంగ్రెస్ టికెట్ కోసం ఒత్తిడి చేస్తుండగా పార్టీ నాయకత్వం మైనార్టీలకు టికెట్ కేటాయించాలని తీర్మానించినట్లు తెలిసింది.



నడ్డా, బొమ్మై, కటీల్, జోషిల సమక్షంలో కాషాయ కండువా ధరించిన బీవీ నాయక్

ఈ ఎన్నికల్లో నాకు మద్దతివ్వండి

- కేఆర్పీపీ అభ్యర్థిని గాలి లక్ష్మీ అరుణ



ప్రచారంలో పాల్గొన్న గాలి లక్ష్మీ అరుణ

సాక్షి,బళ్లారి: తన భర్త గాలి జనార్దనరెడ్డితో లబ్ధి పొందిన వారంతా ఎన్నికల్లో తమకు దూరమయ్యారని, మీ అందరి సహకారంతో ఎన్నికల బరిలో ఒంటరిగా నిలిచిన తనకు ప్రతి ఒక్కరు మద్దతివ్వాలని కేఆర్పీపీ నగర అభ్యర్థిని గాలి లక్ష్మీ అరుణ అన్నారు. ఆమె బుధవారం 7వ వార్డులోని బాపూజీ నగర్ తదితర కాలనీల్లో పుట్‌బాల్ చేత పట్టుకుని ఇంటింటా విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేశారు. ఈసారి ఎన్నికల్లో పుట్‌బాల్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. తనను గెలిపిస్తే నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. ఈసందర్భంగా పార్టీ జిల్లా ప్రముఖులు ఉమారాజ్, హంపీ రమణ, లలిత శ్రీదేవి, వాసురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా సురేష్‌బాబు ప్రచారం

కంప్లి: మీ అందరూ ఆశీర్వదించి ఈ సారి తనను గెలిపించి మీ సేవాభాగ్యం కల్పించాలని బీజేపీ అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే సురేష్‌బాబు ఓటర్లను కోరారు. క్షేత్రంలోని ప్రతి గ్రామంలో ఆయన పర్యటించి, ఎన్నికల గుర్తు కమలాన్ని చూపుతూ ఈ గుర్తుకే ఓటు వేయాలని అభ్యర్థించారు.

జేడీఎస్‌కు అధికారం తథ్యం

శ్రీనివాసపురం: రాష్ట్రంలో ఈసారి జేడీఎస్ అధికారంలోకి రావడం ఖాయమని బీజేపీ అభ్యర్థి జి కె వెంకట శివారెడ్డి తెలిపారు. బుధవారం తాలూకాలోని గౌనిపల్లి గ్రామంలో ఎన్నికల ప్రచార ర్యాలీలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే కె ఆర్ రమేష్‌కుమార్ తాము కాంగ్రెస్‌లో ఉండి నాలుగు తరాలకు సరిపోయేంత సంపాదించుకున్నామని చెప్పడం ద్వారా తాము అవినీతిపరులమని తామే ప్రకటించుకున్నారన్నారు. పంచరత్న రథయాత్ర, జలధారె పథకాలు గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. పంచరత్న పథకంలో విద్య, ఆరోగ్యం, మహిళా సబలీకరణ తదితర అంశాలకు ప్రాధాన్యతనిచ్చారన్నారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి జేడీఎస్‌ను అధికారంలోకి తేవాలని కోరారు. జేడీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి వి శివారెడ్డి, తూపల్లి నారాయణస్వామి, నాగరాజ్, జీపీ అధ్యక్షుడు శేషాద్రి పాల్గొన్నారు.

శెట్టర్ ఎట్టి పరిస్థితిలోను గెలవరాదు

- పార్టీ శ్రేణులకు నడ్డా సూచన

హుబ్లీ: మాజీ సీఎం శెట్టర్ ఎట్టి పరిస్థితిలోను గెలవరాదని జాతీయ అధ్యక్షులు నడ్డా పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆయన మంగళవారం హుబ్లీలోని అరవింద బెల్లద నివాసంలో బీజేపీ కీలక నేతల సమావేశంలో రాజకీయ పరిణామాల గురించి చర్చించారు. ఆయన మాట్లాడుతూ శెట్టర్ గెలవకుండా పార్టీ పటిష్టవ్యూహం రూపొందించిందన్నారు. కాగా ఈ సమావేశంలో నడ్డా పార్టీ శ్రేణులకు పలు సూచనలు చేసినట్లు తెలిసింది. ఈ సమావేశంలో సీఎం బసవరాజ్ బొమ్మై, కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి, మంత్రి గోవింద కారజోళ, శెట్టర్ ప్రత్యర్థి మహేష్ టెంగినకాయి తదితరులు పాల్గొన్నారు.

బస్సులో తరలిస్తున్న రూ.60.50 లక్షలు సీజ్

గంగావతి రూరల్: రోజురోజుకు పెరుగుతున్న కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల వేడికి తోడు ఎన్నికల అక్రమాలు కూడా పెరుగుతున్నాయి. బుధవారం సింధనూరు వైపు నుంచి వస్తున్న ఓ ప్రైవేట్ బస్సులో డబ్బు తరలిస్తున్నట్లు కొప్పళ జిల్లా ఎస్పీకి అందిన పక్కా సమాచారం మేరకు నగరానికి సమీపంలోని విద్యానగర్‌లో ఎన్నికల అధికారుల బృందం, పోలీసులు ప్రైవేట్ బస్సును ఆపి తనిఖీ చేసి పత్రాలు లేకుండా డబ్బు తరలిస్తున్నట్లు గుర్తించారు. కలబుర్గి జిల్లా హరగర గ్రామానికి చెందిన విజయ్‌కుమార్ లక్ష్మికాంత్ అనే వ్యక్తి వద్ద నుంచి ఎలాంటి పత్రాలు లేకుండా ఓ ప్రైవేట్ బస్సులో తరలిస్తున్న రూ.60.50 లక్షల నగదు దొరకడంతో సీజ్ చేశారు. ఈ నగదుకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

29 నామినేషన్లు దాఖలు-

కోలారు: జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో బుధవారం ఒకే రోజు 29 నామినేషన్లు దాఖలయ్యాయి. జిల్లాలో ఇంతవరకు మొత్తం 80 నామినేషన్లు నమోదయ్యాయి. శ్రీనివాసపురంలో 2, మాలూరులో 6, ముళబాగిలులో 8, కేజీఎఫ్‌లో 6, కోలారులో 3 నామినేషన్లతో కలిపి మొత్తం 29 నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్ దాఖలు చేయడానికి 20వ తేదీ గురువారం ఆఖరు రోజు కావడంతో గురువారం మరిన్ని నామినేషన్లు దాఖలవనున్నాయి. కోలారు కాంగ్రెస్ అభ్యర్థిగా కొత్తూరు మంజునాథ్‌ను ప్రకటించినా ఆయన ఇంకా నామినేషన్ వేయలేదు. గురువారం ఆయన పార్టీ బి.ఫారంతో వెళ్లి నామినేషన్ దాఖలు చేసే అవకాశం ఉంది.

మంచినీటి సమస్య శాశ్వతంగా తీరుస్తాం

- బీజేపీ అభ్యర్థి గాలి సోమశేఖరరెడ్డి
- నగరాభివృద్ధిపై ప్రణాళిక విడుదల

సాక్షి,బళ్లారి: 2060 వరకు నగరంలో మంచినీటి సమస్య తలెత్తకుండా శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టామని బీజేపీ అభ్యర్థి, ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి పేర్కొన్నారు. ఆయన బుధవారం తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ నగరాభివృద్ధి, గతంలో చేసిన అభివృద్ధి పనుల గురించి వివరించారు. ఈసారి ఎన్నికల్లో గెలిచిన తర్వాత తాను చేపట్టబోయే అభివృద్ధి పనులకు సంబంధించి ఎన్నికల ప్రణాళికను విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ నగర ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని, ఎవరు ఫోన్ చేసినా రిసీవ్ చేసుకుని సమస్యలు పరిష్కరిస్తానని జనం గుర్తించడంతో తన గెలుపు సులభతరం అవుతోందన్నారు. కేఎంఈఆర్‌సీ నిధులతో నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. నగరాభివృద్ధికి యడియూరప్ప, శ్రీరాములు ఎంతో సహకారం అందించారని గుర్తు చేశారు. కేఆర్‌పీపీలో చేరాలని తనను ఆహ్వానించినా తనకు రాజకీయంగా ఎదగడానికి సహకరించిన బీజేపీని వదిలిరానని చెప్పానన్నారు. కేఆర్‌పీపీతో అంతర్గత ఒప్పందం కుదుర్చుకున్నామన్న ప్రచారం అవాస్తవమన్నారు. ఎన్నికల ప్రచారానికి ప్రధాని మోదీ, యూపీ సీఎం యోగి, మాజీ సీఎం యడియూరప్ప, సినీ నటుడు కిచ్చా సుదీప్‌లను ఆహ్వానించామని, వారు వస్తారనే నమ్మకం ఉందన్నారు. ఈ ఒక్కసారి తనకు నగర వాసులు అవకాశం కల్పిస్తే తాను ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలను సంపూర్ణంగా అమలు చేస్తానన్నారు. జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు వీరశేఖరరెడ్డి, కార్పొరేటర్ మోత్కర్ శ్రీనివాసరెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ నేత దారుణహత్య



హతుడు ప్రవీణ్(ఫైల్)

హుబ్లీ: ధార్వాడ జిల్లా కొటూరు జీపీ ఉపాధ్యక్షుడు, బీజేపీ యువమోర్చా ప్రధాన కార్యదర్శి దారుణ హత్యకు గురైన ఘటన ధార్వాడ తాలూకా కొటూరు గ్రామంలో జరిగింది. హతుడు ప్రవీణ్ కమ్మార. దుండగులు ప్రవీణ్ కడుపులో చాకుతో పొడిచారు. దీంతో తీవ్రంగా గాయపడిన ప్రవీణ్ ఎస్‌డీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. పరారైన దుండగుల కోసం గాలిస్తున్నారు. గరగ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. కాగా ఈ హత్యపై కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి ఆస్పత్రి వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ మృతుని కుటుంబానికి అన్ని విధాలా తాను, ఎమ్మెల్యే న్యాయం చేస్తామని, అండగా ఉంటామని తెలిపారు. ఎమ్మెల్యే అమృతదేశాయి మాట్లాడుతూ ప్రవీణ్‌ను జాగ్రత్త ఉండాలని సూచించామని, అయినా ఘోరం జరిగిపోయిందని విచారం వ్యక్తం చేశారు.

కోలారు వార్తలు...


కోలారులో నామినేషన్ కోలాహలం



కోలారులో నామినేషన్ దాఖలుకు ర్యాలీగా వెళుతున్న బీజేపీ అభ్యర్థి వర్తూరు ప్రకాష్

కోలారు: నగరంలో బీజేపీ అభ్యర్థి వర్తూరు ప్రకాష్ బుధవారం భారీ ర్యాలీతో తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి రెండో సెట్ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఉదయం కోలారమ్మ, కొండరాజనహళ్లి ఆంజనేయస్వామి తదితర ఆలయాల్లో పూజలు నిర్వహించిన అనంతరం బంగారుపేటె సర్కిల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు అపార సంఖ్యలో కార్యకర్తల జయజయధ్వానాల మధ్య భారీ ర్యాలీ నిర్వహించారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఎంపీ మునిస్వామి తదితరులతో కలిసి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ వేసిన అనంతరం బయట ఆయన విలేకరులతో మాట్లాడారు. తనకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు. ఈసారి తన గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఎంపీ ఎస్.మునిస్వామి మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కేవలం బీజేపీ వల్లనే సాధ్యం అని, ప్రజలు జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లోను పార్టీ అభ్యర్థులను గెలిపించి రాష్ట్రంలో పార్టీని మళ్లీ అధికారంలోకి తేవాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా బీజేపీ అధ్యక్షుడు డాక్టర్ వేణుగోపాల్, ఓం శక్తి చలపతి, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జేడీఎస్ అభ్యర్థి రమేష్‌బాబు నామినేషన్



కేజీఎఫ్‌లో నామినేషన్ దాఖలు చేస్తున్న జేడీఎస్ అభ్యర్థి డాక్టర్ రమేష్‌బాబు

కేజీఎఫ్: కేజీఎఫ్ నియోజకవర్గం నుంచి జేడీఎస్ అభ్యర్థిగా బుధవారం డాక్టర్ రమేష్‌బాబు నామినేషన్ దాఖలు చేశారు. ఉదయం నగరంలోని వెంకటరమణ స్వామి ఆలయం సర్కిల్ నుంచి తమ అపార మద్దతుదారులతో పాదయాత్రగా తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి నామినేషన్ పత్రాలను అందజేశారు. అనంతరం మాట్లాడిన రమేష్ బాబు నియోజకవకర్గంలో కాంగ్రెస్, జేడీఎస్‌ల మధ్యే ప్రధానంగా పోటీ ఉంటుందన్నారు. కుమారస్వామి పథకాలను మెచ్చి ప్రజలు జేడీఎస్‌ను గెలిపిస్తారన్నారు. ఈ సందర్భంగా తాలూకా జేడీఎస్ అధ్యక్షుడు పి.దయానంద్, మనోహర్ రెడ్డి, రామరెడ్డి తదితరులు ఉన్నారు.

60 ఏళ్ల వయసు మహిళ నామినేషన్



మాలూరులో ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలను అందజేస్తున్న నారాయణమ్మ

మాలూరు: తాలూకాలోని నంబిగానహళ్లికి చెందిన చిక్కమరియప్ప భార్య 60 ఏళ్ల వయస్సుగల నారాయణమ్మ అనే మహిళ ఎద్దుల బండిలో తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. నారాయణమ్మ తప్పెట్లతో ఎద్దుల బండిని ఎక్కి నామినేషన్ దాఖలు చేయడానికి రావడం విశేషం. నామినేషన్ వేసిన అనంతరం మాట్లాడిన నారాయణమ్మ తాలూకాలో అవినీతి అక్రమాలు పెరిగి పోయాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో సామాన్య ప్రజల పనులు ఏవీ సరిగా కావడం లేదు. తాను కూడా భూమి విషయంలో గత 20 ఏళ్లుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఇంతవరకు సమస్య పరిష్కారం కాలేదన్నారు. ప్రభుత్వ పథకాలు ఏవీ ప్రజలకు సక్రమంగా అందడం లేదు. తాలూకా ప్రజలు తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రభుత్వ సౌలభ్యాలు సక్రమంగా అందిస్తానని, ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానని తెలిపారు.

కాంగ్రెస్ అభ్యర్థి రమేష్‌కుమార్ నామినేషన్

శ్రీనివాసపురం: శ్రీనివాసపురం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే కె ఆర్ రమేష్‌కుమార్ కాంగ్రెస్ అభ్యర్థిగా బుధవారం తన అపార మద్దతుదారులతో కలిసి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం మాట్లాడిన రమేష్‌కుమార్ తాలూకాలో గత పదేళ్లుగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించానన్నారు. ప్రభుత్వ సౌలభ్యాలను, పథకాలను ప్రజలకు సకాలంలో సక్రమంగా అందించామన్నారు. అభివృద్ధి పనులకు ప్రాధాన్యత నిచ్చానని, వసతి పథకంలో భాగంగా ఇళ్లు లేని వారికి ఇళ్లు నిర్మించి ఇచ్చామన్నారు. ప్రతిపక్షాలు తనపై అకారణంగా అపప్రచారం చేస్తూ ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తున్నారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో తనను ప్రజలు అత్యధిక మెజారిటీతో మళ్లీ గెలిపించడం ద్వారా ప్రజా సేవ చేయడానికి అవకాశం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా జెడ్పీ మాజీ అధ్యక్షుడు శ్రీనివాసన్ తదితరులు ఉన్నారు.

శ్రీనివాసపురంలో..

శ్రీనివాసపురం: శ్రీనివాసపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా గుంజూరు శ్రీనివాసరెడ్డి బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు ఎమ్మెల్సీ వై ఎ నారాయణస్వామి తదితరులు అభ్యర్థితో కలిసి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి నామినేషన్ ప్రక్రియలో పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థిగా మంజునాథ్‌గౌడ నామినేషన్



మాలూరులో నామినేషన్ దాఖలు చేస్తున్న బీజేపీ అభ్యర్థి కేఎస్ మంజునాథ్‌గౌడ

మాలూరు: మాలూరు నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా కెఎస్ మంజునాథ్‌గౌడ బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. ఉదయం పట్టణంలోని మారికాంబ ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం బృహత్ ర్యాలీగా వెళ్లి నామినేషన్ పత్రాలను అందజేశారు. నామినేషన్ అనంతరం మాట్లాడిన ఎంపీ ఎస్ మునిస్వామి మాలూరు నుంచి మంజునాథ్‌గౌడ 30 వేల పైచిలుకు ఓట్లతో విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. అభ్యర్థి మంజునాథ్‌గౌడ మాట్లాడుతూ ఈ ఎన్నికలలో ప్రజలు తనను మంచి మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వేణుగోపాల్, ఎమ్మెల్సీ లెహర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సెల్‌ఫోన్ల రికవరీ ఇక ఈజీ

- ఈ పోర్టల్‌ను ప్రారంభించిన డీజీపీ



ఈ పోర్టల్‌ను ప్రారంభిస్తున్న డీజీపీ ప్రవీణ్ సూద్

మైసూరు: సెల్‌ఫోన్ పోగొట్టుకుపోయినా, చోరీకి గురైనా ఆందోళన అవసరం లేదు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పోలీసులు గాలించి రికవరీ చేస్తారు. మైసూరు నగరపోలీసు కమిషనర్ కార్యాలయంలో ఈ కొత్త టెక్నాలజీ ఈ–పోర్టల్‌ను డీజీపీ ప్రవీణ్ సూద్ ప్రారంభించారు. ఫోన్‌ను పోగొట్టుకున్నవారు 6363255135 నంబర్‌కు hi అని టెక్ట్స్ మెసేజ్ చేస్తే లింక్ వస్తుంది. దానిని ఓపెన్ చేసి అడిగిన వివరాలు పొందుపరచాలి. అనంతరం మొబైల్ ఆచూకీ కోసం పోలీసులు ప్రయత్నిస్తారు. కార్యక్రమంలో నగర పోలీసు కమిషనర్ బి.రమేశ్, దక్షిణ వలయ ఐజీపీ ప్రవీణ్ మధుకర్ పవార్ పాల్గొన్నారు.

చెన్నపట్టణలో ప్రధాని ప్రచారం!

దొడ్డబళ్లాపురం: చెన్నపట్టణలో ప్రధాని నరేంద్రమోదీ ఎన్నికల ప్రచారం చేయనున్నారు. బీజేపీ అభ్యర్థి సీపీ యోగేశ్వర్ గెలుపు కోసం శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. మే నెల మొదటి వారంలో రామనగర జిల్లాలోని కనకపుర, చెన్నపట్టణ, మాగడి పట్టణాలలో ప్రధాని మోదీ తమ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ఎన్నికల ప్రచారం చేయనున్నారు. చెన్నపట్టణలో జేడీఎస్ అభ్యర్థిగా కుమారస్వామి పోటీ చేస్తుండడం తెలిసిందే.

ఆయనూరుకు జేడీఎస్ టికెట్

శివమొగ్గ: శివమొగ్గ నగర విధానసభ నియోజకవర్గంలో జేడీఎస్ టికెట్‌పై నెలకొన్న సందిగ్ధం వీడింది. బీజేపీ నుంచి వచ్చిన ఆయనూరు మంజునాథ్‌కు జేడీఎస్ టికెట్ ఖరారు చేసింది. దీంతో టికెట్ కోసం తీవ్రంగా శ్రమించిన కేబీ ప్రసన్నకుమార్ కలలు కల్లలయ్యాయి. తొలుత కాంగ్రెస్ పార్టీలోకి వెళతారని భావించిన ఆయనూరు మంజునాథ్‌ను చివరికి జేడీఎస్ టికెట్ వరించింది. బీజేపీలో టికెట్ దక్కకపోవడంతో కాంగ్రెస్ పార్టీ వైపు చూశారు. అయితే అక్కడ కూడా టికెట్ కేటాయింపు జాప్యం జరుగుతుండడంతో జేడీఎస్ వైపు అడుగులు వేశారు.

రెడ్లతోనే నా రాజకీయ జీవితం

పావగడ: స్థానిక రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నాయకుల నుంచే తన రాజకీయ జీవితం ప్రారంభమైందని ఎమ్మెల్యే వెంకటరమణప్ప అన్నారు. స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన రెడ్ల సముదాయ సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక ఎత్తినహళ్లి నరసింహారెడ్డి ప్రోత్సాహంతో రాజకీయాల్లోకి వచ్చానన్నారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా రెండు సార్లు మంత్రిగా పదవులు చేపట్టడం రెడ్ల చలువే అన్నారు. రెడ్లు దానవంతులు, త్యాగనిరతులు, ధైర్యవంతులని కొనియాడారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తన కుమారుడు వెంకటేశ్ గెలిపించాలని కోరారు. తాలూకా రెడ్డి జన సంఘం అధ్యక్షుడు చంద్రశేఖరరెడ్డి, నాగార్జున రెడ్డి, శంకరరెడ్డి. సుధాకరరెడ్డి, లాయర్ వెంకట్రామిరెడ్డి, సణ్ణరామిరెడ్డి పాల్గొన్నారు.

ఇండిపెండెంట్‌గా సొగడు శివణ్ణ



నామినేషన్ పత్రాలు అందజేస్తున్న దృశ్యం

తుమకూరు: బీజేపీ టికెట్ దక్కక పోవడంతో సీనియర్ నాయకుడు మాజీ మంత్రి సొగడు శివణ్ణ తిరుగుబావుటా ఎగురవేశాడు. తుమకూరు నగర విధానసభ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బుధవారం నామినేషన్ దాఖలుచేశారు.

వేశ్యావాటికపై పోలీసుల దాడి

మైసూరు: మైసూరు కాళిదాస రోడ్డు 8వ క్రాస్‌లో ఒక ఇంటిలో నిర్వహిస్తున్న వేశ్యావాటికపై సీసీబీ పోలీసులు దాడి చేశారు. ఆరుగురు యువతులకు విముక్తి కల్పించి వ్యభిచార దందా నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.9 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

మచ్చలేని నేత పిళ్ల మునిశ్యామప్ప



మాట్లాడుతున్న చేతన్‌గౌడ, పిళ్ల మునిశ్యామప్ప

విజయపుర: మాజీ ఎమ్మెల్యే, దేవనహళ్లి బీజేపీ అభ్యర్థి పిళ్ల మునిశ్యామప్ప మచ్చలేని నేత అని ఆ పార్టీ ముఖ్య నేత చేతన్ గౌడ అన్నారు. బుధవారం పట్టణ సమీపంలోని భట్రేనహళ్లి గ్రామంలోశ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించి బీజేపీ ప్రచార వాహనాలను ప్రారంభించారు. పిళ్ల మునిశ్యామప్ప మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉందని, రాష్ట్రంలో మరోమారు బీజేపీ అధికారంలోకి వస్తే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.

బెంగళూరులో ఐటీ సోదాల కలకలం

- కాంగ్రెస్ నేత కేజీఎఫ్ బాబు ఇంట్లో డీడీలు, చీరలు లభ్యం



కేజీఎఫ్ బాబు నివాసంలో లభ్యమైన డీడీలు, పట్టుచీరలు

బనశంకరి: రాష్ట్ర శాసనసభ ఎన్నికలు ప్రారంభమైన వెంటనే బడా వ్యాపారవేత్త, కాంగ్రెస్ నాయకుడు కేజీఎఫ్ బాబుకు ఐటీ అధికారులు షాక్ ఇచ్చారు. బుధవారం బెంగళూరు నగరంలో బాబుతో పాటు పలువురు కాంగ్రెస్ నేతల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. బెంగళూరులో 50 చోట్ల ఐటీ అధికారులు తెల్లవారుజాము నుంచి ఏకకాలంలో దాడులు ప్రారంభించారు.

ఇంట్లో భారీగా డీడీలు, పట్టుచీరలు

హైగ్రౌండ్స్ వద్ద గల బాబు నివాసమైన రుక్సానా ప్యాలెస్‌లో సోదాల్లో 2 వేలకు పైగా డిమాండ్ డ్రాఫ్ట్స్ (డీడీలు), 5 వేల పట్టుచీరలను ఐటీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఉమ్రా ఫౌండేషన్ పేరుతో తలా రూ.1,105 విలువచేసే డీడీలను ఇంట్లో ఉంచారు. అలాగే ఒక్కోపట్టు చీర విలువ రూ.5 వేలని గుర్తించారు. డీడీలు, పట్టుచీరలు, కేజీఎఫ్ బాబు స్టిక్కర్ తో కూడిన ఎన్నికల ప్రచార సామగ్రి ఒకేచోట ఉంచారు. డీడీల్లో చిక్కపేటే నివాసుల పేరు ఉన్నట్లు లభ్యమైంది. అలాగే యూసుఫ్‌షరీఫ్ అనే కాంగ్రెస్ నేత, వ్యాపారవేత్త ఇంట్లోనూ సోదాలు జరిగాయి.

బీజేపీ నేత బైక్ షోరూంపై

చామరాజనగర బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు, పారిశ్రామికవేత్త వృషభేంద్రప్ప కు చెందిన బైక్ షోరూమ్ పై ఐటీ అధికారులు దాడిచేసి ఆస్తివివరాలు సమాచారం సేకరించారు. మరింత విచారణకు ఐటీ ఆఫీసుకు రావాలని సూచించారు. గత మూడురోజులనుంచి ఎక్కువమంది ప్రజలు షోరూమ్‌ను సందర్శించారని ఫిర్యాదు మేరకు దాడులు జరిగాయి.

బీజేపీకి గుణపాఠం తప్పదు



రోడ్‌షోలో సౌమ్యారెడ్డి, రామలింగారెడ్డి

బనశంకరి: జయనగర కాంగ్రెస్ అభ్యర్థి సౌమ్యారెడ్డి బుధవారం తన తండ్రి, మాజీ మంత్రి రామలింగా రెడ్డి, నేత ఎస్.నాగరాజ్ తదితరులతో కలిసి రోడ్‌షో నిర్వహించారు. సౌమ్యారెడ్డి మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. మాజీ సీఎం సిద్దరామయ్య జనరంజక పాలన అందజేశారన్నారు. అనేక సంక్షేమ పథకాలు అమలు అయ్యాయన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయమన్నారు.

కాంగ్రెస్‌లో పార్టీలో చేరిక



పార్టీలోకి చేరినవారితో నేతలు వాసుదేవరెడ్డి, అనిల్ రెడ్డి తదితరులు

బొమ్మనహళ్లి : బొమ్మనహళ్లి నియోజకవర్గం హెచ్ఎస్ఆర్ లేఔట్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు టి.వాసుదేవరెడ్డి ఆధ్వర్యంలో సుమారు 500 మందికిపైగా యువకులు బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అధికార ప్రతినిధి అనిల్ రెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. మాజీ కౌన్సిలర్ నాగరాజు, అనిల్ రెడ్డి, త్యాగరాజు, రంగన్న పాల్గొన్నారు.

చెన్నాపురలో చిరుత సంచారం

దొడ్డబళ్లాపురం: దొడ్డ తాలూకా చెన్నాపుర గ్రామంలో చిరుత సంచారం గ్రామస్తులను భయభ్రాంతులకు గురి చేస్తోంది. మంగళవారం రాత్రి గ్రామ శివార్లలోని రైతు మునికృష్ణకు చెందిన పశువుల కొట్టంలోకి చొరబడిన చిరుత... పశువులను బలితీసుకుంది. బుధవారం అటవీశాఖ అధికారులు వచ్చి గ్రామ శివారులో బోను ఏర్పాటు చేశారు. చిరుతను పట్టుకునే వరకూ గ్రామస్తులు ఒంటరిగా తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అటవీశాఖ అధికారులు కోరారు.

బైక్‌ను ఢీకొన్న జేసీబీ.. విద్యార్థి మృతి

మైసూరు: జేసీబీ బైక్‌ను ఢీకొని విద్యార్థి ప్రాణాలు కోల్పోయాడు. ఈఘటన నంజనగూడు తాలూకా మరళూరు–హళ్లికెరెహుండి గ్రామాల మధ్య జరిగింది. మరళూరు గ్రామానికి చెందిన శివణ్ణ కుమారుడు నందీశ (18) పీయూసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. తోటలో పని చేస్తుండగా తండ్రి పిలిచాడని ఇంటికి బైక్‌పై వెళుతుండగా అతి వేగంగా వచ్చిన జేసీబీ ఢీ కొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నందీశ మృతి చెందాడు. నంజనగూడు ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

అట్టహాసంగా ఎస్ఆర్ విశ్వనాథ్ నామినేషన్



యలహంక బీజేపీ అభ్యర్థి ఎస్ఆర్ విశ్వనాథ్ నామినేషన్‌కు తరలివచ్చిన కార్యకర్తలు



నామినేషన్ పత్రాలు అందజేస్తున్న బీజేపీ అభ్యర్థి ఎస్ఆర్.విశ్వనాథ్, వాణిశ్రీవిశ్వనాథ్ దంపతులు



కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ పత్రాలు అందజేస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి జి.పరమేశ్వర



నామినేషన్ దాఖలు చేస్తున్నతుమకూరు గ్రామీణ జేడీఎస్ అభ్యర్థి గౌరీశంకర్

బనశంకరి: గడువు ముగుస్తుండటంతో విధానసభ నామినేషన్ల దాఖలు కార్యక్రమం జోరందుకుంది. యలహంక నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి ఎస్ఆర్. విశ్వనాథ్ బుధవారం భారీ సంఖ్యలో అభిమానులతో కలిసి ర్యాలీగా వచ్చి నామినేషన్ వేశారు. యలహంకలోని కొండప్పలేఔట్ గణపతి ఆలయంలో ఎమ్మెల్యే తన సతీమణితో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఓపెన్‌టాప్ వాహనంపై మదర్‌డైరీ సర్కిల్ నుంచి సావర్కర్ బ్రిడ్జ్ మీదుగా మినీ విధానసౌధ చేరుకొని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈసారి లక్ష మెజారిటీతో గెలుపొందడమే తన లక్ష్యమన్నారు. కొందరు అభ్యర్థులు బయటినుంచి వచ్చి ఇక్కడ నామినేషన్ వేశారని, కానీ ఓటర్లు తనను వదులుకోరని తెలిపారు. పార్టీ కార్యకర్తలే తనకు స్టార్ క్యాంపెయన్లు అని అన్నారు. వారే ఇంటింటికి వెళ్లి ప్రచారం చేస్తున్నారన్నారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగిఆదిత్యనాథ్ ఇక్కడ ప్రచారానికి వచ్చే అవకాశం ఉందని తెలిపారు.

తుమకూరు: కొరటగెరె కాంగ్రెస్ అభ్యర్థిగా మాజీ ఉప ముఖ్యమంత్రి డాక్టర్ జి.పరమేశ్వర బుధవారం నామినేషన్ వేశారు. తుమకూరు నగర గొల్లహళ్లి ఇంటి నుంచి సిద్దగంగా మఠానికి చేరుకుని శ్రీ శివకుమార స్వామీజీ సమాధికి ప్రత్యేక పూజలు చేసి అనంతరం సిద్ధలింగ స్వామీ ఆశీస్సులు అందుకున్నారు. కొరటగెరె తాలూకా క్యామేనహళ్లి ఆంజనేయ స్వామి, కట్టె గణపతి ఆలయాల్లో పూజలు చేశారు. అనంతరం ఊరేగింపుగా మినీ విధానసౌధకు వెళ్లి నామినేషన్ల దాఖలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ మరోసారి అధికారంలోకి వస్తుందన్నారు. తాను నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులు తన విజయానికి కారణమవుతాయన్నారు.

తుమకూరు: తుమకూరు గ్రామీణ జేడీఎస్ అభ్యర్థిగా డీసీ గౌరిశంకర్ నామినేషన్ దాఖలు చేశారు. బుధవారం ఆయన ఎన్నికల అధికారి శివప్పకు నామినేషన్ పత్రాలు సమర్పించారు. ముఖ్య నేతలు బెళగుంప వెంకటేశ్, పాలికె సభ్యుడు శ్రీనివాస్, నరుగనహళ్లి విజయకుమార్, తన్వీర్ రెహమాన్ తదితరులు ఉన్నారు.

బెంగళూరులో భానుడి ప్రతాపం

శివాజీనగర: రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భానుడు ప్రతాపం చూపుతున్నాడు. బెంగళూరులో ఒకే రోజు మూడు డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు పెరిగాయి. 36 డిగ్రీలకు చేరుకున్నాయి. చల్లటి వాతావరణానికి అలవాటుపడిన నగరవాసులు ఉష్ణోగ్రతలు కాస్త పెరిగినా వేసవి తాపానికి లోనవుతున్నారు. అంతర్జాతీయ విమానాశ్రయం దేవనహళ్లి పరిధిలో 35 డిగ్రీల సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. రాయచూరులో 41 డిగ్రీలు, బళ్లారిలో 40, విజయపురలో 40.4 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సెల్సియస్, కల్బుర్గిలో 41.5 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. దీంతో ప్రజలు బయటకు రావాలంటే జంకుతున్నారు. బయటకు వెళ్లిన వారు 11 గంటలలోపే ఇళ్లకు చేరుకుంటున్నాయి. దీంతో మధ్యాహ్నానికి రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి.

ఆగడాలు మితిమీరినందునే మట్టుబెట్టారు

- రౌడీషీటర్ కార్తీక్ హత్యకేసులో నిందితుల అరెస్ట్

బనశంకరి: బెంగళూరు నగరం జోగుపాళ్యలో ఈనెల 11న చోటు చేసుకున్న హలసూరు రౌడీషీటర్ కార్తీక్ హత్యోదంతాన్ని పోలీసులు ఛేదించారు. ఈ కేసుకు సంబంధించి జాన్సన్, మగ్గేశ్, కార్తీక్, అరుణ్‌తో సహా ఆరుగురు నిందితులను హలసూరుపోలీసులు అరెస్ట్ చేశారు. పుట్టినరోజు స్టేటస్ పెట్టలేదని, బ్యానర్ కట్టలేదని హతుడు కార్తీక్...తన స్నేహితుడైన జాన్సన్‌ను అర్ధనగ్నంగా మార్చి దాడిచేశాడు. ఆ దృశ్యాలను వీడియో తీశాడు. అదేవిధంగా స్నేహితుడు మగ్గేశ్‌తో గొడవ పడి అతన్ని కూడా అర్ధనగ్నంగా మార్చి దాడి చేశాడు. అంతేగాకుండా జోగుపాళ్యకు చెందిన కొందరు యువకులను హత్యచేస్తానని బెదిరింపులకు పాల్పడ్డాడు. ఆగడాలను భరించలేని నిందితులు అతన్ని ఇంటివద్దనే హత్య చేశారని పోలీసులు తెలిపారు.

జైలు నుంచి నామినేషన్

యశవంతపుర: దక్షిణకన్నడ జిల్లా పుత్తూరు నియోజకవర్గానికి చెందిన శాఫీ బెళ్లారె అనే రిమాండ్ ఖైదీ జైలు నుంచి తన ఏజెంట్ ద్వారా నామినేషన్ దాఖలు చేశారు. బీజేపీ నాయకుడు ప్రవీణ్ నెట్టారు హత్య కేసులో ఇతను ప్రధాన నిందితుడు. ఎన్ఐఏ ఇతన్ని విచారణ చేపట్టి జైలుకు తరలించింది. ఎస్‌డీపీఐ కార్యకర్త అయిన ఈయన అదే పార్టీ తరఫున నామినేషన్ దాఖలు చేశారు.

పులకేశీనగర నుంచి ఏఐఏడీఎంకే పోటీ

శివాజీనగర: విధానసభ ఎన్నికల్లో తమిళనాడుకు చెందిన ఏఐఏడీఎంకే అభ్యర్థి బరిలోకి దిగారు. బెంగళూరులోని పులకేశీనగర నియోజకవర్గం నుంచి ఏఐఏడీఎంకే రాష్ట్ర ప్రెసిడియం అధ్యక్షుడు డీ అన్బరసన్ పోటీ చేయనున్నారు. ఈ విషయాన్ని ఆ పార్టీ ప్రధానకార్యదర్శి ఎడప్పాడి కే పళనిస్వామి బుధవారం చెన్నైలో ప్రకటించారు.

స్వాతంత్య్ర సంగ్రామంలో మాతృభావన

విజయపుర: స్వాతంత్య్ర సంగ్రామంలో మాతృభావన ఎక్కువగా పెరిగిందని, ఈ సమయంలో మహిళలకు ఎక్కువగా అవకాశాలు, అధికారాలు, హక్కులు ఇచ్చినట్లు బెంగళూరు గాంధీభవన్ కర్ణాటక గాంధీ స్మారక నిధి గౌరవ కార్యదర్శి ఇందిరా కృష్ణప్ప తెలిపారు. స్వాతంత్య్ర పోరాట సమయంలో అసమానత, అస్పృశ్యత వంటి సామాజిక రుగ్మతలను పారదోలేందుకు నాంది పలికిందని తెలిపారు. మంగళవారం పట్టణ రోటరీ పాఠశాల సభాంగణంలో రోటరీ విజయపుర ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉపన్యాస కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు.

కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్



నామినేషన్ పత్రాలు అందజేస్తున్న రఘునాథనాయుడు

బనశంకరి: పద్మనాభనగర నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా వీ.రఘునాథనాయుడు అట్టహాసంగా నామినేషన్ వేశారు. తొలుత దేవగిరి వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపుగా కిమ్స్‌కాలేజీ వెనుక ఉన్న ఎన్నికల అధికారి కార్యాలయంలో నామినేషన్ పత్రాలు అందజేశారు. ఊరేగింపులో భారీ సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

జేడీఎస్ అభ్యర్థి ...



నామినేషన్ దాఖలు చేస్తున్న కే నారాయణరాజు

బొమ్మనహళ్లి : బొమ్మనహళ్లి జేడీఎస్ అభ్యర్థిగా కే. నారాయణ రాజు బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. రాజ్యసభ మాజీ సభ్యుడు డి.కుపేంద్రరెడ్డి, మద్దతుదారులతో కలిసి ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయానికి వెళ్లి నామినేషన్ పత్రాలు అందజేశారు. అనంతరం నారాయణరాజు మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి ఇల్లు తనకు తెలుసన్నారు. నగరసభ స్థాయీ సమితి అధ్యక్షుడిగా అనేక అభివృద్ధి పనులు చేపట్టానన్నారు. మాజీ సీఎం కుమారస్వామి చేపట్టిన పథకాలు జేడీఎస్‌ను గెలిపిస్తాయన్నారు. త్యాగరాజు, ఆర్ఎంఎస్ రమేశ్ పాల్గొన్నారు.

దొంగ అరెస్ట్, నగలు స్వాధీనం

యశవంతపుర: బెంగళూరులోని కస్తూర్బా నగర్‌లోని ఓ ఇంటిలో మార్చి 28న చోరీకి పాల్పడిన శిరసి నెహ్రూ నగరకు చెందిన యాసిన్ బాబాసాబ్ షేక్ అనే దొంగను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడినుంచి రూ.30 వేల నగదు, 7.35 లక్షల విలువైన బంగారు నగలు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

హోసూరు వార్తలు..

మేయర్‌కు సమస్యల వెల్లువ

హోసూరు: హోసూరు కార్పొరేషన్ పరిధిలో బుధవారం మేయర్ ఎస్.ఏ.సత్య, కమిషనర్ స్నేహ అధికారులతో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. 22వ వార్డు తదితర ప్రాంతాల్లో పర్యటించి తాగు నీరు, రోడ్ల వసతి, వీధి దీపాలు తదితర మౌలిక వసతులపై స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. మేయర్, కమిషనర్‌లు వస్తున్నారని తెలిసి ప్రజలు పెద్ద ఎత్తున చేరుకొని సమస్యలను ఏకరువు పెట్టారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పారిశుద్ధ్య కమిటీ అధ్యక్షులు ఎన్.ఎస్.మాదేశ్వరన్, గృహ వసతి సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో 20 ఏళ్ల జైలుశిక్ష

హోసూరు: కళాశాల విద్యార్థినిపై లైంగిక దాడి చేసిన నిందితునికి 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ కృష్ణగిరి కోర్టు న్యాయమూర్తి తీర్పునిచ్చారు. వివరాల మేరకు తిరుపత్తూరు జిల్లా గంగరై ప్రాంతానికి చెందిన చిరంజీవి (28), క్రిష్ణగిరికి చెందిన 17 ఏళ్ల కళాశాల విద్యార్థినితో సన్నిహితంగా మాట్లాడుతూ పెళ్లి చేసుకొంటానని ఆశ చూపి 2021 ఆగస్టు 9వ తేదీ అత్యాచారానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకొన్న విద్యార్థిని తల్లిదండ్రులు కృష్ణగిరి మహిళా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని చిరంజీవిని అరెస్ట్ చేశారు. ఈ కేసు కృష్ణగిరి కోర్టులో జరుగుతూ వచ్చింది. మంగళవారం సాయంత్రం కేసును విచారణ జరిపిన న్యాయమూర్తి ఉమాదేవి.. నిందితుడికి రూ. 2 వేల జరిమానాతో పాటు 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

అభివృద్ధి పనుల తనిఖీ

హోసూరు: హోసూరు కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ దీపక్‌జేకప్ బుధవారం తనిఖీ చేశారు. హోసూరు యూనియన్‌లో వివిధ పథకాల ద్వారా రూ. 5.18 కోట్ల ఖర్చుతో పనులు జరుగుతున్నాయి. అందివాడి ప్రభుత్వ పాఠశాలలో రూ. 48 లక్షల ఖర్చుతో జరుగుతున్న వంటగది నిర్మాణం, ప్రహరీ ఏర్పాటు పనులను పరిశీలించారు. ఆటల మైదానంలో జరుగుతున్న ఈత కొలను ఏర్పాటు పనులు, జుజువాడి, ఆనంద్‌నగర్ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో హోసూరు కమిషనర్ స్నేహ, సబ్‌కలెక్టర్ శరణ్య, అధికారులు అజిత, శ్రీనివాసన్, రాజేంద్రన్, సుబ్రమణి పాల్గొన్నారు.

వ్యాపారికి రూ.7.50 లక్షలు బురిడీ

హోసూరు: తక్కువ ధరకే సిమెంట్ సరఫరా చేస్తామని వ్యాపారిని నమ్మించి రూ.7.50 లక్షలు కాజేసిన నిందితుల వైనమిది. హోసూరు దగ్గర అందివాడి ప్రాంతానికి చెందిన వ్యాపారి చెన్నబసప్ప (20) భవన నిర్మాణాలకు ఉపయోగించే వస్తువులను విక్రయిస్తాడు. 1వ తేదీ అతని సెల్‌ఫోన్ నంబర్‌కు వచ్చిన మెసేజ్‌లో తక్కువ ధరకే సిమెంట్ అందజేస్తామని, అధిక లాభం అందుతుందని తెలిపారు. వారి మాటలు నమ్మిన చెన్నబసప్ప రూ.7.50 లక్షలను వారు చెప్పిన బ్యాంకు ఖాతాకు జమ చేశాడు. తరువాత మోసగాళ్ల నంబర్ స్విచ్ ఆఫ్ రావడంతో కంగుతిన్న బాధితుడు కృష్ణగిరి క్రైం బ్రాంచ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

శిథిలావస్థలో పేదల గృహాలు



ఇళ్లను పరిశీలిస్తున్న చైర్మన్ కేశవమూర్తి

కెలమంగలం: డెంకణీకోట తాలూకా కెలమంగలం సమితిలోని దొడ్డతిమిజేపల్లి గ్రామంలో శిథిలావస్థకు చేరుకొన్న ఆదిద్రావిడుల గృహాలను బుధవారం యూనియన్ చైర్మన్ కేశవమూర్తి పరిశీలించారు. ఆదిద్రావిడుల కోసం గత 1997లో ప్రభుత్వం పక్కాభవనాలు నిర్మించి ఇచ్చింది. ప్రస్తుతం ఈ భవనాల్లో పెచ్చులూడి కమ్మీలు తేలాయి. వర్షం వస్తే కూలిపోతాయని భయం భయంగా గడుపుతున్నట్లు నివాసితులు తెలిపారు. బాధితులు వర్షాకాలంలో ఇళ్లలో ఉండరాదని, నివాసానికి ప్రత్యేక స్థలాన్ని కేటాయిస్తామని, ఈ విషయాన్ని పై అధికార్ల దృష్టికి తీసుకెళ్లి పక్కా భవనాల నిర్మాణానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. .కార్యక్రమంలో పంచాయతీ అధ్యక్షులు కల్లై సెల్వి, బీడీవో శాంతలక్ష్మి, కార్యదర్శి గోవిందరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ నియామకపత్రాలతో వంచన

శివాజీనగర: ఉద్యోగాలు ఇస్తామని చెప్పి నకిలీ నియామక పత్రాలు సృష్టించి వంచనకు పాల్పడ్డారు. ఘటనపై బెస్కాం విధానసౌధ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వంచకుల ముఠా నిరుద్యోగులను సంప్రదించి కేపీటీఎస్ఎల్, బెస్కాంలో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి నకిలీ నియామకపత్రాలు అంటగట్టారు. వాటిని తీసుకొని నిరుద్యోగులు కార్యాలయానికి వెళ్లగా ఈ వంచన వెలుగు చూసింది. బెస్కాం ఎండీ మహంతేశ్ బీళగి సూచనల మేరకు జనరల్ మేనేజర్ సీ.ఎన్.మంజునాథ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నకిలీ నియామకపత్రాలకు సంబంధించి 5 కేసులు తమ దృష్టికి వచ్చాయని జనరల్ మేనేజర్ తెలిపారు.

బీజేపీ టికెట్ కోసం సెల్ టవర్ ఎక్కి హల్‌చల్

యశవంతపుర: విధానసభ ఎన్నికల్లో అజ్జంపుర నుంచి బీజేపీ తరపున టికెట్ కావాలని కోరుతూ ఓ వ్యక్తి సెల్ టవర్ ఎక్కి హల్‌చల్ చేశాడు. ఈ ఘటన చిక్కమగళూరు జిల్లా అజ్జంపుర తాలూకా శివని రైల్వేస్టేషన్ సమీపంలో జరిగింది. రంగప్ప బోవి అనే వ్యక్తి బుధవారం స్థానికంగా ఉన్న సెల్ టవర్ ఎక్కాడు. అజ్జంపుర నుంచి తనకు టికెట్ ఇస్తామని బీజేపీ మోసం చేసిందని ఆరోపించాడు. టికెట్ ఇవ్వాలని, లేనిపక్షంలో కిందకు దూకుతానని హెచ్చరించాడు. పోలీసులు నచ్చజెప్పి కిందకు దించి స్టేషన్‌కు తరలించారు.

మరోమారు అవకాశం ఇవ్వండి

శివాజీనగర: శివాజీనగర కాంగ్రెస్ అభ్యర్థి రిజ్వాన్ హర్షద్ బుధవారం నియోజకవర్గ పరిధిలోని సంపంగిరామ్ నగరలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా పలుచోట్ల బీజేపీకి చెందిన నాయకులు ఎమ్మెల్యే రిజ్వాన్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మూడున్నర సంవత్సరాల కాలావధిలో అనేక అభివృద్ధి పనులు చేపట్టానని,మరింత అభివృద్ధి కోసం మరోసారి తనకు అవకాశం కల్పించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ బెంగళూరు నగర అధ్యక్షుడు శేఖర్, సంపంగిరామనగర బ్లాక్ అధ్యక్షురాలు సుమతి ధనుంజయ, మాజీ కార్పొరేటర్ వసంతకుమార్ పాల్గొన్నారు.

ఇంటిని కొనుగోలు చేసిన నటుడు ఉపేంద్ర

యశవంతపుర: కత్రిగుప్పెలో నివాసం ఉంటున్న నటుడు, ప్రజాకీయ పార్టీ అధ్యక్షుడు ఉపేంద్ర సదాశివనగరలో సాంకీ ట్యాంక్ సమీపంలో ఖరీదైన ఇంటిని కొనుగోలు చేశారు. డాక్టర్ రాజ్ కుమార్‌తో పాటు సినీ రంగానికి చెందిన అనేక మంది ప్రముఖులు ఇక్కడ నివాసం ఉంటున్నారు. ఇటీవల గృహ ప్రవేశం జరిగింది. సినీ కళాకారులు, సాంకేతిక నిపుణులను మాత్రమే ఆహ్వానించారు.

జల్లికట్టు ఎద్దు దాడిలో వృద్ధుడు మృతి

కృష్ణగిరి: కృష్ణగిరి సమీపంలో మంగళవారం జరిగిన జల్లికట్టును తిలకించేందుకెళ్లిన వృద్ధునిపై ఎద్దు దాడి చేయడంతో మృతి చెందాడు. వివరాల మేరకు కృష్ణగిరి సమీపంలోని పెద్దగుట్టూరు గ్రామంలో జరిగిన మారియమ్మ ఆలయ జాతర సందర్భంగా ఎద్దుల పండుగను నిర్వహించారు. ఈ జల్లికట్టులో 350కి పైగా జల్లికట్టు ఎద్దులను తీసుకెళ్లి పరుగెత్తించారు. జల్లికట్టును తిలకించేందుకు వేలాది మంది వచ్చారు. ఈ సమయంలో పరుగెత్తుతున్న ఓ ఎద్దు జనాల మీదకు వెళ్లి కొమ్ములతో దాడి చేసింది. కృష్ణగిరి సమీపంలోని సిప్పాయ్యూరు గ్రామానికి చెందిన మునిస్వామి (65) అనే వృద్ధునికి కొమ్ములు తగిలి తీవ్రంగా గాయపడగా, అతన్ని స్థానికులు బోలుపల్లి వద్ద ప్రభుత్వ కళాశాల ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన డాక్టర్లు అప్పటికే చనిపోయాడని తెలిపారు. కురుబరపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

దోమ.. ప్రాణాంతకం!



మానవ రోగ నిరోధక శక్తిపై దోమ పోటు



సాక్షి, అమరావతి: దోమ.. చూడటానికి చిన్నప్రాణే. కానీ.. ప్రపంచాన్ని వణికిస్తోంది. దోమను ప్రపంచంలోనే అత్యంత ప్రాణాంతకమైన ప్రాణిగా వర్జీనియా విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు ప్రకటించారు. రోగాలను మోసుకు రావడంలో ముందుండే దోమలు ఇప్పుడు మనిషి రోగనిరోధక వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీస్తున్నట్టు వెల్లడించారు. దోమ లాలాజలంలోని ఆర్ఎన్ఏ మానవ రోగ నిరోధక(ఇమ్యూనిటీ) వ్యవస్థను తీవ్రంగా నాశనం చేస్తున్నట్టు అధ్యయనంలో గుర్తించారు.

సరికొత్త చికిత్సకు మార్గం

దోమల ద్వారా సంక్రమించే వ్యాధులతో ఏటా ప్రపంచవ్యాప్తంగా 7.25 లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఇందులో మలేరియాతో మరణించే వారి సంఖ్య 6 లక్షలు ఉన్నట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. ఇక డెంగీ వ్యాధి బారిన పడుతున్న వారు 400 మిలియన్ల మంది ఉంటున్నారు. తీవ్రమైన జ్వరం, వాంతులు, చర్మంపై మచ్చలు వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. కొన్ని సందర్భాలలో అంతర్గత రక్తస్రావంతో పాటు కొందరు ప్రాణాలు కోల్పోతున్నారు. డెంగీ వైరస్‌కు పూర్తిస్థాయిలో చికిత్స అందుబాటులోకి రాలేదని, డెంగీ లక్షణాలను తగ్గించే వైద్య పద్ధతులను మాత్రమే అనుసరిస్తున్నట్టు వర్జీనియా శాస్త్రవేత్తల బృందం పేర్కొంది. ప్రస్తుత అధ్యయనం ద్వారా డెంగీ చికిత్సకు, ఔషధాల తయారీకి కొత్త మార్గం లభించినట్టయిందని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆశాభావం వ్యక్తం చేసింది.

వెలుగులోకి కొత్త విషయాలు

ఇటీవల వర్జీనియా శాస్త్రవేత్తలు డెంగీ వైరస్‌పై పరిశోధనలు చేయగా.. కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. దోమల లాలాజలంలోని వైరల్ ఆర్ఎన్ఏ మనిషిలోని రోగ నిరోధక వ్యవస్థను అడ్డుకుంటున్నట్టు తేలింది. వర్జీనియా విశ్వవిద్యాలయానికి చెందిన బయోకెమిస్ట్ తానియా స్ట్రిలెట్స్ నేతృత్వంలోని బృందం మూడు వేర్వేరు విశ్లేషణ పద్ధతుల ద్వారా దోమ సెలైవా(లాలాజలం)పై అధ్యయనం చేశారు. ఇందులో నిర్దిష్ట రకమైన వైరల్ ఆర్ఎన్ఏ (రిబోన్యూక్లియిక్ యాసిడ్)ను గుర్తించారు. ఇందులో 'ఎక్స్‌ట్రా సెల్యులర్ వెసికిల్స్' అని పిలిచే మెంబ్రేన్ (పొర) కంపార్ట్‌మెంట్లలో సబ్ జెనోమిక్ ఫ్లేవివైరల్ ఆర్ఎన్ఏ (ఎస్ఎఫ్ ఆర్ఎన్ఏ) ద్వారా డెంగీ వైరస్ వేగంగా వ్యాప్తి చెందుతోందని గుర్తించారు. వైరస్ ఇన్ఫెక్షన్ స్థాయిని ఎస్ఎఫ్ ఆర్ఎన్ఏ పెంచిందని బృందం ధ్రువీకరించింది. ఇది దోమ లాలాజలంలో ఉంటుందని, మనిషి రోగ నిరోధక శక్తిని ఎస్ఎఫ్ ఆర్ఎన్ఏ శక్తివంతంగా అడ్డుకుంటోందని తానియా స్ట్రిలెట్స్ వెల్లడించారు. ఈ సబ్ జెనోమిక్ ఫ్లేవివైరల్ ఆర్ఎన్ఏను కీటకాల ద్వారా సంక్రమించే జికా, ఎల్లో ఫీవర్ వంటి రోగాల్లో కూడా గుర్తించారు. దోమ కుట్టినప్పుడు డెంగీ ఉన్న లాలాజలాన్ని శరీరంలోకి చొప్పిస్తుందని, దాన్ని అడ్డుకునేందుకు మానవ శరీరంలో ఉండే రోగనిరోధక వ్యవస్థ చేసే దాడిని లాలాజలంలోని ఎస్ఎఫ్ ఆర్ఎన్ఏ అడ్డుకుంటోందని తేల్చారు.

దిగుబడులు ఘనంగా..

- 2021–22లో 368.83 లక్షల టన్నుల దిగుబడులు
- అదే 2020–21లో అయితే 314.78 లక్షల టన్నులు
- ఈ స్థాయిలో పెరగడం ఇదే తొలిసారి
- 2022–23లో 400 లక్షల టన్నులు దాటే అవకాశముందని అంచనా
- నాలుగేళ్లలో 20 శాతం మేర పెరుగుదల
- ఏటా విస్తరిస్తున్న ఉద్యాన పంటల సాగు..

సాక్షి, అమరావతి: ఉద్యాన పంటల సాగు.. దిగుబడుల్లో ఆంధ్రప్రదేశ్ రికార్డులు తిరగరాస్తోంది. పండ్ల దిగుబడుల్లో అయితే రాష్ట్రం జాతీయ స్థాయిలో మరోసారి తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. లాభసాటి కాని వ్యవసాయ పంటల స్థానంలో ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 44 నెలలుగా తీసుకున్న చర్యలు, ఇస్తున్న ప్రోత్సాహకాల ఫలితంగా సాగు విస్తీర్ణం పెరిగింది. ఆర్బీకేల ద్వారా గ్రామస్థాయిలో నిర్వహిస్తున్న తోటబడుల ద్వారా ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటించేలా చేయడంతో దిగుబడులు గణనీయంగా పెరుగుతున్నాయి.

రికార్డు స్థాయిలో 17% వృద్ధి

2021–22లో ఉద్యాన పంటల తుది దిగుబడి అంచనాలను ప్రభుత్వం విడుదల చేసింది. 2020–21లో 44.90 లక్షల ఎకరాల్లో సాగవగా, 314.78 లక్షల టన్నుల దిగుబడులు నమోదయ్యాయి. ● అదే 2021–22లో 45.60 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగవగా ఏకంగా 368.83 లక్షల టన్నుల దిగుబడులు వచ్చాయి.

- 2020–21తో పోలిస్తే సాగు విస్తీర్ణం 70వేల ఎకరాల్లో పెరిగితే దిగుబడులు ఏకంగా 54 లక్షల టన్నుల మేర పెరిగాయి. ● ఇలా ఏకంగా 17% వృద్ధి రేటుతో ఆల్‌టైం రికార్డు నమోదైంది. ● ఏడాదిలో దిగుబడులు ఈ స్థాయిలో పెరగడం ఇదే తొలిసారి. ● 2022–23లో 400 లక్షల టన్నుల దిగుబడులు నమోదయ్యే అవకాశాలున్నాయని చెబుతున్నారు.

పంట పండిన పండ్లు.. గుబాళించిన పూలు..

ఇక పండ్ల దిగుబడుల్లో ఏపీ తన స్థానాన్ని పదిలపర్చుకుంది. 2020–21లో 178.86 లక్షల టన్నుల దిగుబడులు నమోదైతే.. 2021–22లో ఏకంగా 203.35 లక్షల టన్నులు దిగుబడులొచ్చాయి. ఇది కూడా ఓ రికార్డు అని చెబుతున్నారు. అలాగే, గతంలో ఎన్నడూ లేనివిధంగా పూలు కూడా గుబాళించాయి. పండ్లతో పోటీపడేలా వీటి దిగుబడులొచ్చాయి. 2020–21లో 44వేల ఎకరాల్లో పూల మొక్కలు సాగవగా, 2.80 లక్షల టన్నుల దిగుబడులు నమోదయ్యాయి. అదే 2021–22లో సాగు విస్తీర్ణం 1.04 లక్షల ఎకరాలకు పెరగగా, దిగుబడులు ఏకంగా 8.67 లక్షల టన్నులు నమోదయ్యాయి. ఇక ఆయిల్‌పామ్, కొబ్బరి, జీడిమామిడి, కోకో వంటి ప్లాంటేషన్ పంటల దిగుబడులు 2020–21లో 43.52 లక్షల టన్నులు నమోదైతే 2021–22లో ఏకంగా 57.56 లక్షల టన్నులు నమోదయ్యాయి. ఇక కూరగాయల విషయానికొస్తే 2020–21లో 72.92 లక్షల టన్నుల దిగుబడులొస్తే 2021–22లో 77 లక్షల టన్నులు నమోదయ్యాయి.

దిగుబడులు పెరగడానికి కారణాలు..

ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం విధివిధానాల్లో మార్పులు తీసుకురావడంతో పాటు నాణ్యమైన దిగుబడులు సాధించేందుకు ఆర్బీకేల ద్వారా గ్రామస్థాయిలో సాగులో మెళకువలు నేర్పేందుకు పెద్దఎత్తున తోటబడులు నిర్వహించింది. పంటలకు అదనపు విలువ జోడించేందుకు గ్రామస్థాయిలో మౌలిక వసతులు కల్పించడం, మార్కెటింగ్ సౌకర్యాలు మెరుగుపర్చడం వంటి చర్యలు సత్ఫలితాలిచ్చాయి. ఈ కారణంగానే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత కొత్తగా 4 లక్షల ఎకరాలు సాగులోకి వచ్చాయి. మరోవైపు.. స్ట్రాబెర్రీ, నట్‌మెగ్, సిన్నామన్, డ్రాగన్ ఫ్రూట్, అవకాడో, జామూన్, కరండ, చెర్రీ వంటి విదేశీ పండ్ల సాగు కూడా విస్తరిస్తోంది.

గడిచిన నాలుగేళ్లలో పెరిగిన ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం, దిగుబడులిలా..

సంవత్సరం	హెక్టార్లు (లక్షల్లో)	దిగుబడులు (లక్షల టన్నుల్లో)
2018-19	41.4	305.20
2019-20	44.6	312.34
2020-21	44.87	314.79
2021-22	45.60	368.83

పెరిగిన పండ్ల సాగు విస్తీర్ణం.. దిగుబడుల వివరాలు..

సంవత్సరం	హెక్టార్లు (లక్షల్లో)	దిగుబడులు (లక్షల టన్నుల్లో)
2018-19	7.05	176.44
2019-20	7.40	182.06
2020-21	7.39	178.86
2021-22	7.91	203.35

కొండంత మత సామరస్యం


గుణదల కొండపై ఉన్న మసీదు



గుణదల కొండ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. గుణదల కొండ అంటే మేరీమాత పుణ్యక్షేత్రంగానే అందరికీ తెలుసు. కానీ ఆలయాలు, మసీదులు కూడా ఇదే కొండపై మరో వైపున విరాజిల్లుతున్నాయి. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని గుణదల కొండ సుమారు మూడు కిలోమీటర్లకు పైగా పొడవుతో మొగల్రాజపురం, క్రీస్తురాజపురం, అంబేడ్కర్‌నగర్ ప్రాంతాల్లో విస్తరించి ఉంది. ఈ కొండపై ప్రముఖ క్రైస్తవ ఆధ్యాత్మిక కేంద్రమైన మేరీ మాత ఆలయం ఉండగా.. మొగల్రాజపురం వైపు శ్రీభవానీ ఆలయం ఉంది. ఇంద్రకీలాద్రిపై ఉన్న దుర్గాదేవి రాత్రివేళ ఇక్కడకు వస్తారని భక్తుల నమ్మకం. ఇదే కొండకు ఆనుకొని శ్రీ వాగ్దేవి జ్యోతిర్లింగ క్షేత్రం(శివగిరి) ఉంది. అలాగే 6వ డివిజన్ పరిధిలో ముత్యాలమ్మ, భాగీ రత్తమ్మ, శ్రీకృష్ణుడు, వినాయకుడి ఆలయాలున్నాయి. కొండ దిగువ భాగంలో క్రీస్తురాజపురం, సున్నపు బట్టీల సెంటర్, మారుతీనగర్‌లలో మసీదులున్నాయి. నిత్యం ఎంతోమంది వీటిని సందర్శిస్తూ పూజలు, ప్రార్థనలు నిర్వహిస్తుంటారు.

– మొగల్రాజపురం (విజయవాడ తూర్పు)


గుణదల కొండపై ఉన్న శివగిరి దేవస్థానం


గుణదల కొండపై ఉన్న మేరీ మాత ఆలయం

తిరుపతి ఐఐఎస్ఈఆర్ డైరెక్టర్‌గా శంతను భట్టాచార్య


బాధ్యతలు తీసుకుంటున్న శంతను భట్టాచార్య

సాక్షి, అమరావతి/తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐఐఎస్ఈఆర్) డైరెక్టర్‌గా శంతను భట్టాచార్య నియమితులయ్యారు. కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు భట్టాచార్య బుధవారం ఐఐఎస్ఈఆర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ప్రతిష్టాత్మక ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ బెంగళూరులో డిపార్టుమెంట్ ఆఫ్ ఆర్గానిక్ కెమిస్ట్రీలో ప్రొఫెసర్‌గా ఇప్పటివరకు ఆయన బాధ్యతలు నిర్వర్తించారు. ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్స్, ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ, వరల్డ్ సైన్స్ అకాడమీలలో ఫెలోషిప్‌ను సాధించారు. 2003లో సైన్స్ టెక్నాలజీ రంగంలో సీఎస్ఐఆర్ శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డును పొందారు.

'అవి కోవిడ్ మరణాలు కాదు'

సాక్షి, అమరావతి: కోవిడ్ కారణంగా రాష్ట్రంలో కొత్తగా మరణాలు నమోదైనట్లు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ జె.నివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాకినాడలో ర్యాపిడ్ పరీక్షలో పాజిటివ్ వచ్చిన 21 ఏళ్ల ప్రసాద్ వైరల్ న్యూమోనియా కారణంగా, ఆర్టీపీసీఆర్ పరీక్షలో పాజిటివ్ వచ్చిన 26 ఏళ్ల సందీప్ నెక్రోటైజింగ్ ప్యాంక్రియాలైటిస్ కారణంగా మరణించినట్లు కాకినాడ జీజీహెచ్ సూపరింటెండెంట్ నివేదిక ఇచ్చినట్టు వివరించారు. విశాఖపట్నంలో 21 ఏళ్ల పి.చింటో కూడా వైరల్ న్యూమోనియాతో మరణించినట్టు కేజీహెచ్ సూపరింటెండెంట్ నివేదిక ఇచ్చారని తెలిపారు. చింటోకి ఆర్టీపీసీఆర్ పరీక్షలో నెగటివ్ నిర్ధారణ అయినట్టు ఆయన పేర్కొన్నారు.

రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు

ప్రధాన కేంద్రాల్లో బుధవారం నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు(డిగ్రీల్లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
రెంటచింతల	44.8	27.1
కర్నూలు	43.0	26.2
మార్కాపురం	43.0	25.0
రాజమహేంద్రవరం	42.0	27.0
కడప	42.0	23.0
విజయవాడ	41.0	26.0
ఏలూరు	41.0	26.0
తిరుపతి	41.0	24.0
విజయనగరం	40.0	30.0
శ్రీకాకుళం	40.0	24.0
నెల్లూరు	39.3	25.9
విశాఖపట్నం	38.8	25.2

ఉన్నత విద్యా కోర్సుల్లో ప్రాంతీయ భాషల్లో పరీక్షలు

- ఆంగ్ల మాధ్యమం కోర్సులైనా విద్యార్థులు మాతృభాషలో పరీక్ష
- అన్ని విశ్వవిద్యాలయాలకు యూజీసీ లేఖ
- స్థానిక భాషలను ప్రోత్సహించడంలో భాగంగా కొత్త విధానం
- ఉన్నత విద్యలో చేరికలు పెరుగుతాయని భావన



సాక్షి, అమరావతి: ఉన్నత విద్యా సంస్థల్లో వివిధ కోర్సులను ఇంగ్లిష్ మాధ్యమంలో బోధిస్తున్నప్పటికీ, పరీక్షలను విద్యార్థులు వారి మాతృభాషగా ఉన్న ప్రాంతీయ భాషలో రాసేందుకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) అనుమతించింది. విద్యార్థులు కోర్సులను ఆంగ్ల మాధ్యమంలో చదువుతున్నప్పటికీ, వారు పరీక్షలలో ప్రాంతీయ భాషను ఎంచుకొనేందుకు అవకాశమివ్వాలని అన్ని సెంట్రల్ వర్సిటీలు సహా అన్ని విశ్వవిద్యాలయాలకు బుధవారం లేఖ రాసింది. స్థానిక భాషల్లో ఉన్నత విద్యా కోర్సులను ప్రోత్సహించేందుకు, బోధనాభ్యసన ప్రక్రియల్లో విద్యార్థులు మరింత చురుగ్గా పాల్గొనేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు యూజీసీ పేర్కొంది. ప్రొఫెషనల్, నాన్ ప్రొఫెషనల్ కోర్సుల్లో స్థానిక భాషలను ప్రోత్సహించాలన్న నూతన విద్యా విధానం మార్గదర్శకాల ప్రకారం ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. పాఠ్య పుస్తకాలను స్థానిక భాషల్లో రూపొందించడం, ఇతర భాషల నుంచి ప్రామాణిక పుస్తకాలను బోధనలో వినియోగించడానికి ఈ విధానం ఉపకరిస్తుందని యూజీసీ అభిప్రాయపడింది.

స్థానిక భాషలకు పెరుగుతున్న ప్రాధాన్యత

వివిధ పోటీ పరీక్షల్లో, ఉద్యోగ రాత పరీక్షల్లో ఉన్నత విద్యా కోర్సుల్లో స్థానిక భాషలకు అవకాశం కల్పించాలని వివిధ రాష్ట్రాల నుంచి డిమాండ్లు వస్తున్న నేపథ్యంలో యూజీసీ నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది. ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఐటీ తదితర జాతీయ విద్యా సంస్థల్లో ప్రవేశానికి నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) పరీక్షలను గతంలో హిందీ, ఇంగ్లిష్, గుజరాతీ భాషల్లో నిర్వహించేవారు. తరువాత పశ్చిమబెంగాల్, తమిళనాడు సహా పలు రాష్ట్రాల నుంచి వారి ప్రాంతీయ భాషల్లో ఆ పరీక్షలు నిర్వహించాలని డిమాండ్లు వచ్చాయి. దీంతో జేఈఈ పరీక్షలను 13 ప్రాంతీయ భాషల్లో నిర్వహిస్తున్నారు. స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ నిర్వహించే వివిధ పరీక్షలు, ఇతర ఉద్యోగ పరీక్షలను కూడా ప్రాంతీయ భాషల్లో నిర్వహించాలని కేంద్రం ఆదేశాలు ఇచ్చింది. ఇదే తరహాలో వివిధ విశ్వవిద్యాలయాల్లోనూ వివిధ కోర్సుల్లో స్థానిక భాషల్లో పరీక్షలు రాసుకొనేలా యూజీసీ నిర్ణయం తీసుకుంది. స్థానిక భాషలో పరీక్ష రాస్తే విద్యార్థులు తాము నేర్చుకున్న అంశాలను సంపూర్ణంగా సమాధానాలుగా రాయగలుగుతారని, వారిలోని పరిజ్ఞానాన్ని మరింత లోతుగా మూల్యాంకనం చేసేందుకు కూడా ఇది ఉపకరిస్తుందని యూజీసీ అభిప్రాయపడింది. ఉన్నత విద్యలో చేరికలను పెంచేందుకు కూడా ఇది ఉపకరిస్తుందని వివరించింది. ప్రస్తుతం ఉన్నత విద్యలో గరిష్ట చేరికలు 27 శాతం కాగా, దీన్ని 2035 నాటికి 50 శాతానికి పెంచాలన్నది నూతన విద్యా విధానం లక్ష్యమని, దీనిని సాధించడానికి నూతన విధానం ఉపకరిస్తుందని పేర్కొంది.

దళిత యువతిని దగా చేసిన టీడీపీ నేత

- న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు
- నరసరావుపేటలో కేసు నమోదు




టీడీపీ అధినేత చంద్రబాబు, లోకేష్‌లతో శాఖమూరి నవీన్ (ఫైల్)

నరసరావుపేట టౌన్: పెళ్లి కాలేదని మాయమాటలు చెప్పి దళిత యువతిని దగా చేసిన తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు శాఖమూరి మారుతి నవీన్ బండారం బట్టబయలైంది. తనకు న్యాయం చేయాలని బాధితురాలు బుధవారం రాత్రి పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నరసరావుపేటలోని చంద్రబాబు కాలనీకి చెందిన ఓ దళిత యువతి ఆర్కెస్ట్రాలో పాటలు పాడేది. ఆమెకు రొంపిచర్ల మండలం సుబ్బాయపాలెంకు చెందిన తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు శాఖమూరి మారుతి నవీన్‌తో నాలుగేళ్ల క్రితం పరిచయమైంది. తనకు వివాహం కాలేదని నమ్మబలికిన నవీన్ ఆమెతో సహజీవనం చేశాడు. ఆమె గర్భం దాల్చడంతో తక్కువ కులం దానివని దూషిస్తూ ఆమెను వదిలించుకునే ప్రయత్నం చేశాడు. ఆమె కేసు పెడతానని చెప్పగా.. 2019 అక్టోబర్ 24న పెద్దల సమక్షంలో పెళ్లి చేసుకున్నాడు. అనంతరం బరంపేటలో కాపురం పెట్టాడు. 2020 మార్చిలో ఆమెకు బాబు జన్మించాడు. కాగా, నవీన్‌కు అప్పటికే మరో యువతితో వివాహమైన విషయం బాధితురాలికి తెలిసింది. ఈ విషయంపై నిలదీయడంతో దళిత యువతిని మానసికంగా వేధింపులకు గురిచేస్తూ వచ్చాడు. ఆ తర్వాత ఇంటికి రాకుండా ఫోన్ స్విచ్‌ఆఫ్ చేశాడు. వేరే నంబర్‌ను వినియోగిస్తున్నాడని తెలిసి ఫోన్ చేయగా ఇంటికి వచ్చి ఆమెపై దాడి చేసి బలవంతంగా ఇంటినుంచి బయటకు నెట్టాడు. ఎవరికైనా చెబితే చంపుతానని బెదిరింపులకు పాల్పడ్డాడు. ఈ మేరకు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ వీరేంద్రబాబు బుధవారం తెలిపారు.

నవీన్‌పై పేకాట, బెట్టింగ్ కేసులు

నవీన్‌పై గతంలో క్రికెట్ బెట్టింగ్, పేకాట నిర్వహణ కేసులు నమోదయ్యాయి. అయినప్పటికీ టీడీపీ ముఖ్యనేతలు అతడికి రాష్ట్ర పదవి కట్టబెట్టి, పదవిలోనే కొనసాగిస్తున్నారు. దళిత యువతిని మోసం చేసి రోడ్డు పాల్జేయడంపై దళిత సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. నిందితుణ్ణి అరెస్ట్ చేసి బాధిత మహిళకు న్యాయం చేయాలని పలువురు దళిత నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

కస్తూరిబా బాలికా విద్యాలయాల్లో ప్రవేశ గడువు 30 వరకు పొడిగింపు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని కస్తూరిబా బాలికా విద్యాలయాల్లో ప్రవేశాల గడువును ఈనెల 30 వరకు పొడిగిస్తున్నట్టు సమగ్ర శిక్ష సంచాలకుడు బి.శ్రీనివాసరావు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ 30వ తేదీవరకు ఉంటుందని తెలిపారు. పేద, అనాథ, బడిబయటి పిల్లలు, మధ్యలో బడిమానేసిన బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. దరఖాస్తులను 'హెచ్‌టీటీపీఎస్://ఏపీకేజీబీవీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఐఎన్/.' వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థినులకు ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం పంపిస్తామని తెలిపారు. సందేహాలుంటే 9490782111 లేదా 9494383617, 9441270099, 9441214607 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వేసవి సెలవుల్లో 'వియ్ లవ్ రీడింగ్'

- మే 1 నుంచి జూన్ 10 వరకు విద్యాశాఖ పలు కార్యక్రమాలు

సాక్షి, అమరావతి: వేసవి సెలవుల్లో విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా పఠనాసక్తిని పెంపొందించుకుని అదనపు పరిజ్ఞానాన్ని ఆర్జించేలా 'వియ్ లవ్ రీడింగ్' కార్యక్రమాన్ని అమలు చేయాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో ఇందుకోసం విద్యార్థులను సమాయత్తం చేయనుంది. దీనిపై సమగ్ర కార్యాచరణ ప్రణాళికను పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ విడుదల చేశారు. మే 1నుంచి జూన్ 10వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని కొనసాగించనున్నారు. దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని విద్యాశాఖ ప్రాంతీయ జాయింట్ డైరెక్టర్లు, డీఈవోలు, డీవైఈవోలు, ఎంఈవోలను ఆదేశించారు. అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఎంఈవోలు సమావేశాలు నిర్వహించి ఈ కార్యక్రమాన్ని అమలు చేయడానికి వినూత్న వ్యూహాలను రూపొందించాలన్నారు.

కేంద్ర విద్యా సంస్థల అభివృద్ధికి కృషి

కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి దేవ్‌సిన్హ్ జే చౌహాన్


ఐఐటీ తిరుపతి ప్రాంగణంలో కేంద్ర మంత్రి దేవుసిన్హ్ జే చౌహాన్

ఏర్పేడు(తిరుపతి జిల్లా): దేశంలోని అన్ని కేంద్ర విద్యాసంస్థలను అధునాతనంగా అభివృద్ధి చేసేందుకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ కృషి చేస్తున్నట్లు కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి దేవ్‌సిన్హ్ జే చౌహాన్ అన్నారు. బుధవారం ఏర్పేడు మండలంలోని తిరుపతి ఐఐటీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థులను అంతర్జాతీయ ప్రమాణాలతో తయారు చేసి మేక్ ఇన్ ఇండియాలో భాగంగా స్వదేశీకరణతో భారతదేశాన్ని అగ్రగామిగా నిలపాలని విద్యా సంస్థలను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. 5డీ అభివృద్ధి, జనాభా, డిజిటలైజేషన్, 5జీ టెక్నాలజీ అందించడం, సాంకేతికత, పారదర్శక పాలన కేంద్ర ప్రభుత్వం ధ్యేయమన్నారు. సోలార్, 5జీ సాంకేతికత, నీటి నిల్వ కోసం ఐఐటీ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన చెరువులను సృష్టించడంపై ఐఐటీ డైరెక్టర్ కె.ఎన్.సత్యనారాయణను అభినందించారు. 2016 నుంచి ఐఐటీలో జరిగిన అభివృద్ధి పనులను గురించి ఇన్‌చార్జి డైరెక్టర్ శశిగుమ్మాను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల తరగతి గదులు, వసతి గృహాలు, ల్యాబ్స్, గ్రంథాలయం, క్రీడా మైదానాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఐఐటీ తిరుపతి డీన్ వెంకయ్య పాల్గొన్నారు. కాగా, కేంద్ర మంత్రి దేవ్‌సిన్హ్ చౌహాన్ బుధవారం శ్రీవారిని దర్శించుకున్నారు.

నల్ల 'మార్గం'లో!


విజయవాడలో మార్గదర్శి ఆఫీస్ నుంచి బయటికి వెళ్తున్న సీఐడీ అధికారి

▶ మొదటి పేజీ తరువాయి

దాదాపు రూ.500 కోట్లకు పైగా చెక్కులకు సంబంధించిన వివరాలను సంబంధిత బ్రాంచి కార్యాలయాల రికార్డుల్లో నమోదు చేస్తున్నారా? అనే అంశాన్ని పరిశీలించారు. ఇక రశీదుల రూపంలో డిపాజిట్లు వివిధ బ్రాంచి కార్యాలయాల నుంచి ప్రధాన కార్యాలయానికి వచ్చినట్లు మార్గదర్శి చూపిస్తోంది. అయితే అందుకు సంబంధించిన రికార్డులు బ్రాంచి కార్యాలయాల్లో లేవని వెల్లడైనట్లు తెలుస్తోంది. రశీదు రూపంలో సేకరించిన అక్రమ డిపాజిట్ల నిధులనే రామోజీరావు తమ కుటుంబ సంస్థల్లోకి మళ్లించినట్లు సీఐడీ గుర్తించింది. ప్రధాన కార్యాలయం, బ్రాంచీల రికార్డులకు పొంతన లేదని వెల్లడైంది. తాజా సోదాల్లో కీలక పత్రాలు, హార్డ్‌డిస్క్‌లను స్వాధీనం చేసుకున్నారు.

ఆడిటర్ శ్రావణ్‌కుమార్‌కు షరతులతో బెయిల్

విశాఖ లీగల్: మార్గదర్శి చిట్‌ఫండ్ కేసులో ఆడిటర్ కె.శ్రావణ్‌కుమార్‌కు షరతులతో కూడిన బెయిల్ మంజూరైంది. పోలీసు కస్టడీ ముగియడంతో విశాఖ ఒకటో అదనపు జిల్లా న్యాయమూర్తి తిరుమలరావు బెయిల్ మంజూరు చేశారు. శ్రావణ్‌ను ఈనెల 12వ తేదీన సీఐడీ అధికారులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచిన విషయం తెలిసిందే.

పోలీసుల కోసం కియా రెండురకాల వాహనాలు

సాక్షి, అమరావతి: దేశంలో పోలీసు శాఖ కోసం కియా సంస్థ కొన్ని ప్రత్యేక సదుపాయాలతో రూపొందించి, త్వరలో ఆవిష్కరించనున్న రెండురకాల వాహనాలను డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. పెట్రోలింగ్, ఇంటర్‌సెప్టర్ అవసరాల కోసం అత్యంత ఆధునిక సదుపాయాలతో కియా సంస్థ ఆ వాహనాలను రూపొందించింది. సంస్థ ప్రతినిధులు ఆ వాహనాల పనితీరును డీజీపీకి వివరించారు. ఇంకా ఏవైనా అవసరమైతే సూచించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కియా సంస్థ ప్రతినిధులు మిచెల్ షోన్, ప్రీతం రెడ్డి, పోలీసు ట్రాన్స్‌పోర్ట్ ఎస్పీ శివరెడ్డి పాల్గొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
బెంగళూరు
గురువారం ॥ 20-4-2023

సైబర్ టాక్

ఫోన్ పోతే.. ఇలా వెతకండి!



షాపింగ్ నుంచి ఇంటికి వచ్చిన వసుధ తెచ్చిన వస్తువులన్నీ లోపల సర్దేసి, వచ్చి కూచుంది. సడెన్‌గా ఏదో గుర్తుకువచ్చినట్టు అయ్యి ఫోన్ కోసం వెతికింది. చూస్తే, ఎక్కడా కనిపించలేదు. బ్యాగ్, ఇంటి లోపల అంతా చెక్ చేసింది. ఫోన్ కనపడకపోయేసరికి ఒక్కసారిగా మైండ్ బ్లాంక్ అయ్యింది. ఖరీదైన ఫోన్, అందులో వందలాది కాంటాక్ట్ నంబర్లు, ముఖ్యమైన ఫొటోలు.. అనుకునేసరికి కాసేపటి వరకు ఏం చేయాలో అర్థం కాలేదు. తన ముఖ్యమైన డేటా పోతే వచ్చే సమస్యలు తలుచుకుని చెమటలు పట్టేశాయి.

• • •

వసుధ సమస్య చాలామంది ఎదుర్కొనే ఉంటారు. ఈ సమస్య నుంచి ఎలా బయటపడాలి? ఫోన్ ట్రాక్ చేయాలన్నా, మన వ్యక్తిగత డేటా సురక్షితంగా ఉండటానికి మార్గమే లేదా? అనుకునేవారికి సరైన సమాధానంగా సిఇఐఆర్ వరదాయినిగా మారింది. సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్ట్రీ (సిఇఐఆర్)ని ఎలా ఉపయోగించాలో తెలుసుకుందాం.

• • •

నకిలీ మొబైల్ ఫోన్‌ల క్రయవిక్రయాలకు అడ్డుకట్టవేయడానికి, మొబైల్ ఫోన్ దొంగతనాన్ని అరికట్టడానికి, వినియోగదారుల ప్రయోజనాలను పరిరక్షించడానికి, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల ద్వారా చట్టబద్ధమైన రక్షణ కలిగించడానికి సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్ట్రీ (సిఇఐఆర్)ని డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ (డాట్) ఏర్పాటు చేసింది.

సిఇఐఆర్ పోర్టల్ ప్రయోజనాలు:

https://ceir.gov.in పోర్టల్ పోగొట్టుకున్న లేదా దొంగలించిన మొబైల్ పరికరాలను ట్రాక్ చేయడానికి ఐఎమ్ఇఐ నంబర్‌ను ఉపయోగిస్తుంది. సిఇఐఆర్ ద్వారా మొబైల్ పరికరం బ్లాక్ చేశాక, అది ఏ భారతీయ నెట్‌వర్క్ కంపెనీకి కనెక్ట్ చేయలేరు. ఆ పరికరాన్ని ఇక తిరిగి ఉపయోగించలేనిదిగా మార్చేస్తుంది.

పోర్టల్‌లో మొబైల్ ఫోన్‌ను బ్లాక్ చేయడానికి..

- ముందుగా పోలీస్ స్టేషన్‌కి వెళ్లి ఎఫ్ఐఆర్ ఫైల్ చేయాలి. లేదా కోల్పోయిన డివైజ్ సర్టిఫికెట్ లేదా మీ అక్నాలెడ్జ్ కాపీని తీసుకోవాలి.
- మీ సర్వీస్ ప్రొవైడర్ నుంచి డూప్లికేట్ సిమ్ తీసుకోవాలి.
- సిఇఐఆర్ పోర్టల్‌కు లాగిన్ అయ్యి, కంప్లైంట్ కాపీ, ఐడెంటిటీ (ఆధార్ కార్డ్) ప్రూఫ్‌ని యాడ్ చేయాలి.
  https://www.ceir.gov.in/Request/CeirUserBlockRequestDirect.jsp
- మీ ఫారమ్ సబ్‌మిట్ చేసిన తర్వాత మీ రిక్వెస్ట్ ఐడీ జనరేట్ అవుతుంది.
- మొబైల్ నంబర్‌ను బ్లాక్ చేయడానికి తగిన కారణం ఏంటో తెలియజేయాలి.
- మీ రిజిస్టర్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. దానిని ఎంటర్ చేసి, సబ్‌మిట్ చేయాలి.

ఐఎమ్ఇఐ నంబర్‌ను చెక్ చేయడానికి..

- ముందు పోర్టల్‌కి లాగిన్ అవ్వాలి.
  https://ceir.gov.in/ Device/CeirIMEIVerification.jsp
- మీ మొబైల్ నెంబర్‌ను ఎంటర్ చేయాలి.
- మీ మొబైల్‌కి ఓటీపీ వస్తుంది. ఆ ఓటీపీని ఎంటర్ చేయాలి.
- 15 అంకెల ఐఎమ్ఇఐ నంబర్‌ను నమోదు చేసి, చెక్ రిక్వెస్ట్ అనే దానిపై క్లిక్ చేయాలి.
- ఐఎమ్ఇఐ నంబర్ ధ్రువీకరణ అవుతుంది.

సిఇఐఆర్ పోర్టల్‌లో మీ రిక్వెస్ట్ స్టేటస్ చెక్ చేయడానికి..

- పోర్టల్‌లోకి లాగిన్ అవ్వాలి.
  https://ceir.gov.in/Request/CeirRequestStatus.jsp
- రిక్వెస్ట్ స్టేటస్ ఆప్షన్‌ను చెక్ చేస్తే, తెలిసిపోతుంది.

బ్లాక్ చేస్తే.. పనిచేయదు

బ్లాక్ లిస్ట్ చేసిన మొబైల్ పరికరాలను షేర్ చేయడానికి నెట్‌వర్క్ ఆపరేటర్‌లకు సెంట్రల్ సపోర్ట్ సిస్టమ్‌గా సేవలందిస్తూ, అన్ని మొబైల్ ఆపరేటర్ల ఇంటర్నేషనల్ మొబైల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ (ఐఎమ్ఇఐ) డేటాబేస్‌లకు లింక్ చేస్తుంది. సబ్‌స్క్రయిబర్ ఐడెంటిటీ మాడ్యూల్ (సిమ్) కార్డ్ మార్చినప్పటికీ ఒక నెట్‌వర్క్‌లోని బ్లాక్ చేసిన పరికరాలు ఇతర నెట్‌వర్క్‌లలో పనిచేయవని ఇది నిర్ధారిస్తుంది.

పోర్టల్‌లో రికవరీ మొబైల్ ఫోన్‌ని అన్‌బ్లాక్ చేయడానికి..

https://ceir.gov.in/Request/CeirUserUnblockRequestDirect.jsp పోర్టల్‌కు లాగిన్ అవ్వాలి.

- రిక్వెస్ట్ ఐడీని ఎంటర్ చేయాలి.
- మొబైల్ నంబర్‌ను అన్‌బ్లాక్ చేయడానికి కారణాన్ని ఇవ్వాలి.

డివైజ్‌ను గుర్తించాక డేటాను తొలగించడానికి..

- ఆండ్రాయిడ్ డివైజ్ డేటాను లాక్ లేదా ఎరేజ్ చేయడానికి
  https://support.google.com/accounts/answer/6160491?hl=en
- ఐ ఫోన్ అయితే.. iCloud.com లో ఫైండ్ మై ఐఫోన్ అని సెర్చ్ చేసి, డేటా తొలగించాలి.
  https://support.apple.com/en-in/guide/icloud/mmfc0ef36f/icloud

పోయిన మొబైల్ డేటా సురక్షితంగా ఉంచడానికి..

- ఈ పోర్టల్ పూర్తిగా చట్టబద్ధమైనది. ఫోన్ ట్రాక్ చేయడానికి మాత్రమే ఉపయోగిస్తుంది. మీ డేటా, యాప్స్‌ను డీకంపైల్ చేయదు.
  https://reports.exodus-privacy.eu.org/en/
- మీ మొబైల్ నంబర్‌లను నిర్ధారించడానికి, తీసేయడానికి టెలికాం విభాగాం అనుమతిస్తుంది.
  https://tafcop.dgtelecom.gov.in
- ఎస్సెమ్మెస్‌లు, బల్క్ ఎస్సెమ్మెస్‌లు పంపిన వారిని గుర్తించడానికి అనుమతిస్తుంది.
  https://smsheader.trai.gov.in
- ఎస్సెమ్మెస్, వాట్సప్, ఇమెయిల్‌లో వచ్చిన షార్ట్ లింక్స్ మీ వ్యక్తిగత డేటాను డామేజీ చేయవచ్చు. అందుకని, షార్ట్ లింక్స్ పూర్తి యుఆర్ఎల్ వివరాలను https://isitphishing.org/ ద్వారా చెక్‌చేయవచ్చు.
- యాంటీవైరస్, యాంటీ మాల్వేర్, సెక్యూరిటీ యాప్‌లను ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసి ఉంటే వాటిని గుర్తించడంలో సహాయపడుతుంది.
- అన్ని అప్లికేషన్లు, సోషల్‌మీడియా, ఇమెయిల్ అకౌంట్స్ కోసం రెండంచెల ప్రామాణీకరణను ఉపయోగిస్తే, డేటా సురక్షితంగా ఉంటుంది.



ఇన్‌పుట్స్: **అనీల్ రాచమల్ల**, డిజిటల్ వెల్‌బియింగ్ ఎక్స్‌పర్ట్, ఎండ్ నౌ ఫౌండేషన్

● చేతన

అపూర్వ అక్షరయానం

అక్షరం అంటే తిరుగులేని వజ్రాయుధం.

చిత్రం అంటే వంద పదాల ప్రతిబింబం.

దేబస్మిత దాస్‌గుప్తా దగ్గర ఆ రెండు శక్తులు కలగలిసిన 'అక్షర చిత్రం' అనే అపూర్వ శక్తి ఉంది.

గ్రాఫిక్ నవల రచయిత్రిగా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన స్మిత తాజాగా 'టెర్మినల్-3' గ్రాఫిక్ నవలతో పలకరించింది...

కోల్‌కత్తాకు చెందిన దేబస్మిత దాస్‌గుప్తాకు చిన్న వయసులోనే కళతో పరిచయం ఏర్పడింది. తండ్రి నాటకరంగ కళాకారుడు. ఆయనతోపాటు నాటకాల రిహార్సల్స్‌కు వెళ్లేది. బలమైన సామాజిక సందేశంతో కూడిన నాటకాలు అవి. అలా స్మితకు సామాజిక స్పృహ చిన్న వయసులోనే ఏర్పడింది.

కొన్ని సంవత్సరాల క్రితం...

స్మిత ఒక సదస్సులో అఫ్గానిస్థాన్‌కు చెందిన ఉమెన్ రైట్స్ ఛాంపియన్ షబానా బసిజి ఉపన్యాసం విన్నది.

తాలిబన్‌ల తొలి పాలనలో షబానా చదువు అటకెక్కే పరిస్థితి వచ్చింది. చాలామంది తండ్రులు రాజీపడి పిల్లల చదువును మాన్పించారు. షబానా తండ్రి మాత్రం 'ససేమిరా' అన్నాడు.

'ఏ పరిస్థితి ఎదుర్కోవడానికైనా సిద్ధం' అంటూ కూతురిని పట్టుదలగా చదివించాడు.

కూతురుపై తండ్రి ప్రేమ, సవాళ్లకు వెనకాడని నైజం స్మితను చలింపజేసింది. ఈ తండ్రి-కూతురు కథకు బొమ్మలు వేసి ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేస్తే ప్రపంచం నలుమూలల నుంచి అనూహ్యమైన స్పందన వచ్చింది.

'ద్వేషం కంటే ప్రేమ వందల రెట్లు శక్తిమంతమైనది'

'ఎక్కడైతే విద్య ఉంటుందో అక్కడ ఆశ ఉంటుంది. ఆత్మబలం ఉంటుంది'

'మార్పుని పరిశీలించే అబ్జర్వర్‌ని మాత్రమే కాదు. ఛేంజ్‌మేకర్‌ని కూడా'... ఇలాంటి మాటలు ఆకట్టుకుంటాయి.

ఫేస్‌బుక్‌లో వచ్చిన స్పందన ఉత్సాహంతో ఇలాంటి తండ్రీకూతుళ్ల స్టోరీల కోసం వెదికి పట్టుకుంది. వాటికి 'మై ఫాదర్' పేరుతో ఆన్‌లైన్ ఇల్లస్ట్రేషన్ సిరీస్ మొదలుపెట్టింది.

ఆలోచనలు, హక్కులు, చైతన్యం... మహిళలకు సంబంధించిన సకల కోణాలకు ఈ సిరీస్ వేదికగా నిలిచింది.

సోషల్ మీడియాకు మాత్రమే పరిమితం కాకుండా స్థానిక సంస్థలు, కమ్యూనిటీలతో కలిసి కోల్‌కత్తా, దిల్లీ, ముంబై... మొదలైన నగరాల్లో ఆర్ట్‌క్యాంప్‌లు నిర్వహించింది.

తండ్రి-కూతురు బంధాల బలోపేతం లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఈ ఆర్ట్ క్యాంప్‌లకు మంచి స్పందన లభించింది. బాల్యవివాహల నుంచి వరకట్నం వరకు రకరకాల అంశాలపై చర్చ జరిగింది.

మాస్ కమ్యూనికేషన్ చదువుకున్న స్మిత సింగపూర్ కేంద్రంగా పనిచేస్తున్న ఏషియా-యూరప్ ఫౌండేషన్‌తో పాటు ఎన్నో అంతర్జాతీయ సంస్థలతో కలిసి పనిచేసింది.

'ఆర్ట్స్ పాజిటివ్' అనే స్వచ్ఛంద సంస్థకు శ్రీకారం చుట్టి ఇలస్ట్రేటెడ్ బేస్డ్ సోషల్ క్యాంపెయిన్ నిర్వహిస్తోంది.

అనగనగా ఒకరోజు...

న్యూ దిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో 'న్యూ దిల్లీ టు శాన్‌ఫ్రాన్సిస్కో' ఎయిర్ ఇండియా ఫ్లైట్ ఆలస్యానికి సంబంధించిన ప్రకటన వినిపించింది.

టెర్మినల్-3 వెయింటింగ్ హాల్‌లో కూర్చున్న ఒక తల్లి ఒడిలోని పాప గుక్కపట్టి ఏడుస్తోంది. పాపకు పాలు పట్టడానికి తల్లి విఫలప్రయత్నం చేస్తోంది. హాల్లో కూర్చున్న వారిలో కొందరు పాప ఏడుపు విని అసహనానికి గురవుతున్నారు.



దేబస్మిత దాస్‌గుప్తా



శ్రీనగర్‌కు చెందిన ఆ తల్లి పేరు...ఖ్వాబ్ నజీర్. వయసు పదిహేడు సంవత్సరాలు.

శ్రీనగర్‌లో ఉండే ఖ్వాబ్ నజీర్ దిల్లీ విమానాశ్రయానికి ఎందుకు వచ్చింది? ఆమె ఎందుకు ఆందోళనగా ఉంది? అసలు ఆమె ఎవరు? అనేది తెలుసుకోవాలంటే 'టెర్మినల్-3'కు వెళ్లాల్సిందే.

దేబస్మిత దాస్‌గుప్తా రాసిన తాజా గ్రాఫిక్ నవల... టెర్మినల్-3

కాశ్మీర్ లోయ నేపథ్యంగా సాగే ఈ గ్రాఫిక్ నవల ఖ్వాబ్ నజీర్ పాత్ర ద్వారా ఎన్నో సామాజిక అంశాలపై సూటిగా మాట్లాడకుండానే మాట్లాడుతుంది. ఇక చిత్రాల ద్వారా చలనచిత్రాన్ని చూసిన అనుభూతి కలుగుతుంది.



బాల్టీ గోష్

రంజాన్ స్పెషల్ రెసిపీ

కావలసినవి: మటన్ - అర కేజీ; నూనె- 5 టేబుల్ స్పూన్‌లు; ఉల్లిపాయలు - 2 (చిన్న ముక్కలు తరగాలి); అల్లంవెల్లుల్లి పేస్ట్ - 2 టేబుల్ స్పూన్‌లు; మిరప్పొడి- 2 టీ స్పూన్‌లు; ధనియాల పొడి- టీ స్పూన్; ఉప్పు- టీ స్పూన్ లేదా రుచిని బట్టి; యాలకులు - 3; లవంగాలు - 3; దాల్చిన చెక్క - అంగుళం ముక్క; జీలకర్ర - అర టీ స్పూన్; బిర్యానీ ఆకు - 1; పెరుగు- 3 టేబుల్ స్పూన్‌లు; టొమాటో ప్యూరీ- టేబుల్ స్పూన్ (అవసరమైతేనే); పచ్చిమిర్చి- 4; కొత్తిమీర తరుగు- 4 టేబుల్ స్పూన్‌లు; గరం మసాలా పొడి- అర టీ స్పూన్; నిమ్మకాయ - 1.

తయారీ: ● మటన్‌ని శుభ్రం చేసి ప్రెషర్ కుక్కర్‌లో ఉడికించి పక్కన పెట్టుకోవాలి. ● మందపాటి బాణలిలో నూనె వేడి చేసి ఉల్లిపాయ ముక్కలు వేసి వేయించాలి. అందులోనే అల్లంవెల్లుల్లి పేస్ట్ కూడా వేసి పచ్చి వాసన పోయే వరకు వేయించి అందులో ముందుగా ఉడికించి సిద్ధంగా ఉంచిన మటన్ (నీటితో సహా) వేయాలి. ఆ తర్వాత మిరప్పొడి, ధనియాల పొడి, ఉప్పు, యాలకులు, లవంగాలు, దాల్చిన చెక్క, జీలకర్ర, బిర్యానీ ఆకు వేసి కలిపి కప్పు నీటిని పోసి ఉడికించాలి. ● ఇప్పుడు టొమాటో ప్యూరీ సిద్ధం చేసుకోవాలి. రెండు టొమాటోలను వేడి నీటిలో ఉడికించి తొక్క, గింజలు తొలగించి మిక్సీలో గ్రైండ్ చేసి పక్కన పెట్టుకోవాలి. అలాగే పెరుగును చిలికి పక్కన పెట్టాలి. ● మాంసం ముక్కలకు మసాలాలు బాగా పట్టి, ముక్క మెత్తబడిన తరవాత అందులో పచ్చిమిర్చి, పెరుగు, టొమాటో ప్యూరీ వేసి కలిపి మంట తగ్గించి మరికొంత సేపు ఉడికించాలి. చివరగా కొత్తిమీర వేసి కలిపి మూత పెట్టి స్టవ్ ఆపేయాలి. మెల్లగా వేడి తగ్గే కొద్దీ కర్రీ రుచి ఇనుమడిస్తుంది.

ఇది బిర్యానీ, బగారా రైస్, చపాతీ, పుల్కాల్లోకి కూడా మంచి కాంబినేషన్.

● ఎంపవర్‌మెంట్

ఇల్లాలి ఇంటికల నిజం చేసింది ఇలా...

'ఇల్లు కట్టి చూడు' అన్నారు పెద్దలు. అయితే చాలామందికి ఇంటి కల 'కల'కు మాత్రమే పరిమితమైపోతుంది, గృహరుణాల ద్వారా గ్రామీణ ప్రాంతాలలోని ఎంతోమంది మహిళల సొంత ఇంటి కలను నిజం చేసింది కాజల్ ఇల్మీ...



గ్రామీణ మహిళలతో కాజల్ ఇల్మీ

మధ్యప్రదేశ్‌లోని దేవాస్ గ్రామానికి చెందిన బబిత సిసోదియ, రాజస్థాన్‌లోని గంగానగర్‌కు చెందిన బల్జీందర్ కౌల్ సొంత ఇంటి కల ఎప్పటికప్పుడు దూరం అవుతూనే ఉంది. ఏవో కారణాల వల్ల అందాల్సిన రుణం అందడం లేదు.

'ఇక ఇది అయ్యేది కాదు' అని వారు నిరాశలోకి జారుకునే సమయంలో ఎడ్‌హెరింగ్ టు విజన్ ఆఫ్ ఇన్‌క్లూజన్ ఆఫ్ మాసెస్ (ఏవీఐవోఎం) వేగుచుక్కలా కనిపించింది. 'ఏవీఐవోఎం' అందించిన రుణాలతో తమ సుదీర్ఘ కాల సొంత ఇంటి కలను ఆ ఇద్దరే కాదు ఎన్నో గ్రామాలలో ఎంతోమంది మహిళలు నిజం చేసుకోగలిగారు.

గ్రామీణ ప్రాంతాలు, ఒక మాదిరి పట్టణాలలోని మహిళలకు గృహరుణాలు అందించడానికి కాజల్ ఇల్మీ 'ఏవీఐవోఎం' అనే హౌజింగ్ ఫైనాన్స్ కంపెనీని ప్రారంభించింది.

చైనా, డెన్మార్క్, యూఎయి, ఒమన్, బహ్రెయిన్, మంగోలియా, హాంకాంగ్‌లాంటి ఎన్నోచోట్ల చదువుకున్న కాజల్ ఒకరకంగా చెప్పాలంటే ప్రపంచాన్ని చదివింది. గత పన్నెండు సంవత్సరాలుగా మానవ హక్కుల ఉద్యమాలలో చురుగ్గా పాల్గొంటోందామె.

దేశంలోని ప్రసిద్ధ కంపెనీలలో పది సంవత్సరాలకు పైగా పనిచేసిన కాజల్ 'ఏవీఐవోఎం' ఆలోచన చేసినప్పుడు 'చాలా పెద్ద రిస్క్' అన్నారు చాలామంది.

సరియైన డాక్యుమెంటేషన్ లేకపోవడం, తిరుగు చెల్లింపు సామర్థ్యంపై సంశయాల వల్ల హెచ్‌ఎఫ్‌సీ(హౌజింగ్ ఫైనాన్స్ కంపెనీ)లు, ప్రభుత్వరంగ సంస్థలు గ్రామీణప్రాంతాల వారికి రుణాలు ఇవ్వడానికి వెనకడుగు వేస్తున్నాయి. దీన్ని పట్టించుకోకుండా 'ఏవీఐవోఎం'కు శ్రీకారం చుట్టి విజయపథంలో నడుస్తోంది కాజల్.

'రన్ బై ఉమెన్ ఫర్ ఉమెన్' నినాదంతో మొదలైన ఈ కంపెనీకి పద్నాలుగు రాష్ట్రాలలో శాఖలు ఉన్నాయి. వీటిని శక్తి శాఖలు అని పిలుస్తారు. ఈ శాఖలలో పనిచేసే 55,000 మంది మహిళలను 'శక్తి'గా వ్యవహరిస్తారు.

ఫ్లెక్సిబుల్ లోన్ ఇన్‌స్టాల్‌మెంట్ ప్లాన్‌తో 'ఏవీఐవోఎం' రీపేమెంట్ స్ట్రక్చర్‌కు రూపకల్పన చేసింది.

50,000 మంది కస్టమర్‌లలో 30 కేసులలో రీపేమెంట్ అనేది ఆలస్యం అవుతోంది.

శానిటేషన్ లోన్స్‌పై ప్రత్యేకదృష్టి సారించింది కంపెనీ.

'మహిళలకు శానిటేషన్ సౌకర్యం అనేది అత్యవసరం. ఎన్నో బడులలో టాయిలెట్ సదుపాయం లేకపోవడం వల్ల ఆడపిల్లలు చదువు మానేస్తున్నారు' అంటున్న కాజల్ స్థానిక పాఠశాలలో శానిటేషన్ సౌకర్యాల ఏర్పాటుకు కృషి చేస్తోంది.

కంపెనీ వల్ల పేద, మధ్యతరగతి సొంత ఇంటికల నెరవేరడం ఒక కోణం అయితే, ఎన్నో గ్రామాలలో ఎంతోమంది మహిళలకు ఉపాధి దొరకడం మరో కోణం.

'ఒకప్పుడు నేను మా వాడలో కొద్దిమందికి మాత్రమే తెలుసు. కంపెనీలో ఉద్యోగం వల్ల జరిగిన పెద్ద మార్పు ఏమిటంటే ఇప్పుడు ఊళ్లో ప్రతి ఒక్కరికీ నేను తెలుసు. ఇది ఒక రకంగా గర్వంగా ఉంది' అంటోంది బ్రాంచ్ మేనేజర్‌గా పనిచేస్తున్న మధ్యప్రదేశ్‌లోని అగర్వాడా గ్రామానికి చెందిన విశాల.

చాలామంది మహిళలు భర్త పేరు లేదా ఇతర కుటుంబ సభ్యుల పేరు మీద రుణాలు తీసుకోవడాన్ని కాజల్ గమనించింది.

దీన్ని దృష్టిలో పెట్టుకొని తమ పేరు మీదే రుణం తీసుకునేలా, ఆస్తిలో సహ-యజమానిగా ఉండేలా మహిళలను ప్రోత్సహించింది.

'భర్తతో విభేదాల వల్ల ఇల్లు దాటి బయటికొచ్చిన వారు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇంటి యాజమాన్య హక్కు తమకు కూడా ఉంటే ఎవరికీ భయపడాల్సిన అవసరం ఉండదు. దీంతోపాటు మహిళలు ఆస్తిలో భాగం అయితే రుణాలు తీసుకోవడం సులువు అవుతోంది' అంటోంది కాజల్.

'మహిళలతో సానుకూల మార్పు సాధ్యపడుతుంది' అంటున్న కాజల్ ఇల్మీ 2023 చివరికల్లా లక్ష టాయిలెట్‌ల నిర్మాణానికి ఫండింగ్ చేయాలనేది లక్ష్యంగా నిర్ణయించుకుంది. 2026 కల్లా గ్రామీణప్రాంతాలలో అత్యధిక మంది మహిళలకు ఉపాధి కల్పించాలనేది ఆమె రెండో స్వప్నం. ఆమె కల నెరవేరాలని ఆశిద్దాం.

బ్యూటిప్



బంగాళాదుంప గుజ్జు, శనగ పిండి, అలొవెరా జెల్ కలిపి మిశ్రమం తయారుచేసుకోవాలి. దీనిని ముఖానికి, మెడకు ప్యాక్‌లా వేసుకొని, పదినిమిషాల తర్వాత శుభ్రపరుచుకోవాలి.

● విశేషం

సంబల్‌పురీ చీరకట్టి సంబురంగా పరుగెట్టీ





మధుస్మిత జెన

మొన్నటికి మొన్న గ్వాలియర్‌లో...

చీరె ధరించి ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో పాల్గొని సంభ్రమాశ్చర్యాలకు గురి చేశారు మహిళామణులు.

తాజాగా...

మాంచెస్టర్ మారథాన్‌లో చీరె ధరించి పాల్గొని 'శభాష్' అని ప్రశంసలు అందుకుంటోంది మధుస్మిత జెన...

చిన్నప్పటి నుంచి మధుస్మితకు పరుగెత్తడం అంటే ఇష్టం. ఆ ఇష్టమే తనకు ప్రత్యేకమైన గుర్తింపును తీసుకువచ్చింది.

మాంచెస్టర్‌లో హైస్కూల్ టీచర్‌గా పనిచేస్తున్న మధుస్మిత జెన నార్త్ వెస్ట్ ఇంగ్లాండ్ ఒడియా కమ్యూనిటీలో క్రియాశీల కార్యకర్త.

ప్రపంచవ్యాప్తంగా ఎన్నో మారథాన్‌లు, అల్ట్రా మారథాన్‌లలో పాల్గొంది. తాజాగా మాంచెస్టర్‌లో 42.5 కి.మీల మారథాన్‌లో పాల్గొంది. ఈసారి మాత్రం అందరూ ఆశ్చర్యపడేలా చేసింది. అభినందనలు అందుకుంది.

ఈసారి ప్రత్యేకత...సంబల్‌పురీ చీర కట్టి మారథాన్‌లో పాల్గొంది మధుస్మిత.

'అంతదూరం చీరతో పరుగెత్తడం సులువేమీ కాదు' అంటున్న మధుస్మిత సంతోషం ప్లస్ సంకల్ప బలంతో నాలుగు గంటల యాభైనిమిషాలలో లక్ష్యాన్ని పూర్తి చేసింది.

'చీరతో మారథాన్‌లో పాల్గొనడం అసాధ్యం అనేది చాలామంది నమ్మకం. ఇది తప్పని రుజువు చేయాలనుకున్నాను' అంటుంది 41 సంవత్సరాల మధుస్మిత.

'తనలోని ప్రతిభతో ఎప్పుడూ ఎంతోమందికి స్మిత స్ఫూర్తి ఇస్తుంటుంది. ఆమె విజయానికి గర్విస్తున్నాం' అంటున్నాడు ఒడియా కమ్యూనిటీ మాజీ కార్యదర్శి సుకాంత్ కుమార్ సాహు.

ఒడిశాలోని కుసుప్పూర్ గ్రామానికి చెందిన మధుస్మితకు తల్లి, అమ్మల ద్వారా చీరెపై ఇష్టం ఏర్పడింది. ఇంగ్లాండ్‌లో ప్రత్యేకమైన సందర్భాలు, వేసవిలో చీర ధరిస్తుంది మధుస్మిత.



నాలుగో సీడ్ జోడీపై బోపన్న ద్వయం గెలుపు

బార్సిలోనా ఓపెన్ ఏటీపీ-500 టెన్నిస్ టోర్నీలో రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. బుధవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్లో బోపన్న-ఎబ్డెన్ ద్వయం 7-6 (7/4), 3-6, 10-8తో 'సూపర్ టైబ్రేక్'లో నాలుగో సీడ్ మాట్ పావిచ్-నికోలా మెక్టిక్ (క్రొయేషియా) జోడీపై సంచలన విజయం సాధించింది. 97 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్లో బోపన్న ద్వయం మూడు ఏస్లు సంధించింది. తమ సర్వీస్ను రెండుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్ను ఒకసారి బ్రేక్ చేసింది.

'టాప్' ర్యాంక్లోనే సూర్యకుమార్ యాదవ్



అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ టి20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్లో భారత క్రికెటర్ సూర్యకుమార్ యాదవ్ తన టాప్ ర్యాంక్ను నిలబెట్టుకున్నాడు. బుధవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్లో సూర్యకుమార్ 906 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. పాకిస్తాన్ బ్యాటర్లు మొహమ్మద్ రిజ్వాన్ (798 పాయింట్లు), బాబర్ ఆజమ్ (769 పాయింట్లు) వరుసగా రెండు, మూడు ర్యాంకుల్లో ఉన్నారు. విరాట్ కోహ్లి 15వ ర్యాంక్లో మార్పు లేదు.

భారత జట్లకు నిరాశ



జ్యోతి సురేఖ

అంటాల్యా (తుర్కియే): ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్-1 టోర్నీలో కాంపౌండ్ టీమ్ విభాగంలో భారత మహిళల, పురుషుల జట్లకు నిరాశ ఎదురైంది. మహిళల టీమ్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ, అదితి, అవ్నీత్ కౌర్లతో కూడిన భారత జట్టు క్వార్టర్ ఫైనల్లో నిష్క్రమించింది. క్వాలిఫయింగ్లో టాప్ ర్యాంక్లో నిలిచిన భారత జట్టుకు నేరుగా క్వార్టర్ ఫైనల్ ఆడే అవకాశం లభించింది. మాడిసన్ కాక్స్, డానిలె లుట్జ్, కాసిడి కాక్స్లతో కూడిన అమెరికా జట్టు 233-225 పాయింట్ల తేడాతో భారత జట్టును ఓడించింది. ఓజస్ ప్రవీణ్ దేవ్తలె, రజత్ చౌహాన్, ప్రథమేశ్ సమాధాన్ జావ్కర్లతో కూడిన భారత పురుషుల కాంపౌండ్ జట్టు రెండో రౌండ్లో 234-236 పాయింట్ల తేడాతో చైనీస్ తైపీ జట్టు చేతిలో ఓడిపోయింది.

సుదిర్మన్ కప్ బ్యాడ్మింటన్ టోర్నీకి భారత జట్టు ఎంపిక



న్యూఢిల్లీ: ప్రపంచ బ్యాడ్మింటన్ మిక్స్డ్ టీమ్ చాంపియన్షిప్ సుదిర్మన్ కప్లో పాల్గొనే భారత జట్టును ప్రకటించారు. మే 14 నుంచి 21 వరకు చైనాలోని సుజౌలో ఈ టోర్నీ జరుగుతుంది. గ్రూప్ 'సి'లో మలేసియా, చైనీస్ తైపీ, ఆస్ట్రేలియా జట్లతో భారత జట్టు ఆడుతుంది. పురుషుల, మహిళల సింగిల్స్, పురుషుల డబుల్స్, మహిళల డబుల్స్, మిక్స్డ్ డబుల్స్లో ఒక్కో మ్యాచ్ జరుగుతుంది.

భారత జట్టు: ప్రణయ్, కిడాంబి శ్రీకాంత్ (పురుషుల సింగిల్స్), పీవీ సింధు, అనుపమ (మహిళల సింగిల్స్), సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి, ఎంఆర్ అర్జున్-ధ్రువ్ కపిల (పురుషుల డబుల్స్), పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ, అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో (మహిళల డబుల్స్), తనీషా క్రాస్టో-సాయిప్రతీక్ (మిక్స్డ్ డబుల్స్).

రాజస్తాన్ బోల్తా

- 10 పరుగులతో నెగ్గిన లక్నో
- రాణించిన మేయర్స్, అవేశ్
- చేతులెత్తేసిన రాయల్స్ బ్యాటర్లు



లక్నో ఆటగాళ్ల సంబరం

జైపూర్: మైదానంలో మెరుపులు... గ్యాలరీలో ప్రేక్షకుల అరుపులు కరువైన ఈ ఐపీఎల్ మ్యాచ్లో లక్నో సూపర్ జెయింట్స్ 10 పరుగుల తేడాతో రాజస్తాన్ రాయల్స్పై గెలిచింది. మొదట బ్యాటింగ్కు దిగిన లక్నో సూపర్ జెయింట్స్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 154 పరుగులు చేసింది. మేయర్స్ (42 బంతుల్లో 51; 4 ఫోర్లు, 3 సిక్సర్లు) రాణించాడు. అశ్విన్ 2 వికెట్లు పడగొట్టాడు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన రాజస్తాన్ 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 144 పరుగులకే పరిమితమైంది. యశస్వి జైస్వాల్ (35 బంతుల్లో 44; 4 ఫోర్లు, 2 సిక్స్లు), బట్లర్ (41 బంతుల్లో 40; 4 ఫోర్లు, 1 సిక్స్) మెరుగ్గా ఆడారు. అవేశ్ ఖాన్ 3 వికెట్లు, 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' స్టొయినిస్ 2 వికెట్లు పడగొట్టారు.

మేయర్స్ అర్ధశతకం



మేయర్స్

మెయిడిన్ ఓవర్తో మొదలైన లక్నో ఇన్నింగ్స్లో మెరుపులు తక్కువే! కేఎల్ రాహుల్, కైల్ మేయర్స్ ఇద్దరు పవర్ హిట్టర్లు పవర్ ప్లేలో ఉన్నప్పటికీ చేసింది 37 పరుగులే! 8, 9వ ఓవర్లలో ఇద్దరు సిక్స్లు, ఫోర్లు బాదడంతో స్కోరు వేగం పుంజుకుంది. కానీ తర్వాత రాజస్తాన్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో 10 ఓవర్లకు పైగానే ఓపెనింగ్ జోడీ ఉన్నా చెప్పుకోదగ్గ స్కోరేం రాలేదు. రాహుల్ (32 బంతుల్లో 39; 4 ఫోర్లు, 1 సిక్స్)ను హోల్డర్ పెవిలియన్ చేర్చడంతో 82 పరుగుల ఓపెనింగ్ భాగస్వామ్యం ముగిసింది. ఇది మంచి ఆరంభమే అయినా... సూపర్ జెయింట్స్ మాత్రం దీన్ని భారీస్కోరుగా మలుచుకోలేకపోయింది. మేయర్స్ 40 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. అశ్విన్ ఒకే ఓవర్లో దీపక్ హుడా (2), మేయర్స్ వికెట్లను పడేశాడు. స్టొయినిస్ (16 బంతుల్లో 21; 2 ఫోర్లు), పూరన్ (20 బంతుల్లో 29; 2 ఫోర్లు, 1 సిక్స్) పెద్దగా మెరిపించలేకపోయారు. సందీప్ శర్మ వేసిన ఆఖరి ఓవర్లో స్టొయినిస్ కీపర్ క్యాచ్తో నిష్క్రమించగా, పూరన్, యుధ్వీర్ (1) రనౌటయ్యారు.

శుభారంభం వచ్చినా...

రాజస్తాన్ ఇన్నింగ్స్ కూడా లక్నోలాగే సాగింది. దంచికొట్టే ఓపెనర్లు బట్లర్, యశస్వి జైస్వాల్ 11 ఓవర్లకు పైగా క్రీజులో ఉన్నప్పటికీ ప్రేక్షకుల్ని ఊపేసే మెరుపులేమీ కనిపించలేదు. పవర్ ప్లేలో ఓపెనింగ్ జోడీ 47 పరుగులు చేసింది. పిచ్ పరిస్థితుల దృష్ట్యా ఇద్దరు చూసుకొని ఆడారు. సగం ఓవర్లు (10) ముగిసేసరికి 73/0 స్కోరు చేసింది. స్టొయినిస్ 12వ ఓవర్లో జైస్వాల్ డీప్ మిడ్వికెట్ మీదుగా భారీ సిక్సర్ కొట్టాడు. కానీ అదే ఓవర్లో అవేశ్కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. దీంతో 87 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యం ముగిసింది. ఇంత దాకా బాగానే ఉన్నా... వరుస ఓవర్లలో కీలకమైన సామ్సన్ (2), బట్లర్ వికెట్లను కోల్పోవడంతో రాజస్తాన్కు లక్ష్యం కష్టమైంది. 15వ ఓవర్లో జట్టు స్కోరు 100 దాటింది. 30 బంతుల్లో 51 పరుగులు చేయాల్సిన దశలో డాషింగ్ బ్యాటర్ హెట్మైర్ (2) భారీషాట్కు యత్నించి నిష్క్రమించడంతో ఓటమి ఖాయమైంది. 'ఇంపాక్ట్ ప్లేయర్' పడిక్కల్ (21 బంతుల్లో 26; 4 ఫోర్లు) అడపాదడపా కొట్టిన బౌండరీలు జట్టును గెలిపించలేకపోయాయి.

స్కోరు వివరాలు

లక్నో సూపర్ జెయింట్స్ ఇన్నింగ్స్: రాహుల్ (సి) బట్లర్ (బి) హోల్డర్ 39; మేయర్స్ (బి) అశ్విన్ 51; బదోని (బి) బౌల్ట్ 1; దీపక్ హుడా (సి) హెట్మైర్ (బి) అశ్విన్ 2; స్టొయినిస్ (సి) సామ్సన్ (బి) సందీప్ 21; పూరన్ (రనౌట్) 29; కృనాల్ పాండ్యా (నాటౌట్) 4; యుధ్వీర్ (రనౌట్) 1; ఎక్స్ట్రాలు 6; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 154. వికెట్ల పతనం:** 1-82, 2-85, 3-99, 4-104, 5-149, 6-153, 7-154. **బౌలింగ్:** బౌల్ట్ 4-1-16-1, సందీప్ శర్మ 4-0-32-1, అశ్విన్ 4-0-23-2, చహల్ 4-0-41-0, హోల్డర్ 4-0-38-1.

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: యశస్వి జైస్వాల్ (సి) అవేశ్ (బి) స్టొయినిస్ 44; బట్లర్ (సి) బిష్ణోయ్ (బి) స్టొయినిస్ 40; సంజూ సామ్సన్ (రనౌట్) 2; పడిక్కల్ (సి) పూరన్ (బి) అవేశ్ 26; హెట్మైర్ (సి) రాహుల్ (బి) అవేశ్ 2; పరాగ్ (నాటౌట్) 15; ధ్రువ్ జురేల్ (సి) హుడా (బి) అవేశ్ 0; అశ్విన్ (నాటౌట్) 3; ఎక్స్ట్రాలు 12; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 144. వికెట్ల పతనం:** 1-87, 2-93, 3-97, 4-104, 5-141, 6-141. **బౌలింగ్:** నవీనుల్ హక్ 4-0-19-0, యుధ్వీర్ 2-0-27-0, అవేశ్ ఖాన్ 4-0-25-3, స్టొయినిస్ 4-0-28-2, రవి బిష్ణోయ్ 4-0-25-0, అమిత్ మిశ్రా 2-0-15-0.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
రాజస్తాన్	6	4	2	8	1.043
లక్నో	6	4	2	8	0.709
చెన్నై	5	3	2	6	0.265
గుజరాత్	5	3	2	6	0.192
పంజాబ్	5	3	2	6	-0.109
ముంబై	5	3	2	6	-0.164
కోల్కతా	5	2	3	4	0.320
బెంగళూరు	5	2	3	4	-0.318
హైదరాబాద్	5	2	3	4	-0.798
ఢిల్లీ	5	0	5	0	-1.488

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్రేట్

ఐపీఎల్లో నేడు

పంజాబ్ × బెంగళూరు (మ. గం. 3:30 నుంచి)
ఢిల్లీ × కోల్కతా (రాత్రి గం. 7:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

సిరాజ్...'జట్టు' సంగతులు చెప్పు

- అపరిచితుడి మెసేజ్పై అప్రమత్తమైన పేసర్
- వెంటనే బోర్డుకు ఫిర్యాదు



న్యూఢిల్లీ: భారత క్రికెట్లో మళ్లీ ఫిక్సింగ్ కలకలం! అయితే ఈసారి క్రికెట్ బోర్డు తక్షణ చర్యలతో మొగ్గలోనే తుంచేసింది. నిలకడైన ప్రదర్శనతో అగ్రశ్రేణి సీమర్గా ఎదుగుతున్న హైదరాబాదీ మొహమ్మద్ సిరాజ్ ఇప్పుడు టీమిండియాలో స్థిరమైన ఆటగాడు. దీంతో హైదరాబాద్కే చెందిన ఓ డ్రైవర్ అతని వ్యక్తిగత ఫోన్నంబర్ తెలుసుకొని వాట్సాప్ సందేశాలు పంపాడు. జట్టు అంతర్గత సమాచారం ఇస్తే పెద్ద మొత్తంలో డబ్బులు చెల్లిస్తానని మెసేజ్ చేశాడు. ఆస్ట్రేలియా పర్యటనలో వన్డే సిరీస్ జరుగుతున్న సమయంలో సిరాజ్కు వాట్సాప్ మెసేజ్లు చేశాడు. వెంటనే 29 ఏళ్ల సీమర్ భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ)కి సమాచారమిచ్చాడు. అప్రమత్తమైన బోర్డు అవినీతి నిరోధక విభాగం (ఏసీయూ) స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సైబర్ పోలీసులు డ్రైవర్ కదలికలపై నిఘా వేసి ఆంధ్రప్రదేశ్లో పట్టుకున్నారు. విచారణలో నిందితుడికి ఫిక్సింగ్, ఇతరత్రా నేర చరిత్ర లేదని తేలింది. క్రికెట్ బెట్టింగ్కు అలవాటు పడిన అతను అదే వ్యసనంగా మారి పెద్ద మొత్తంలో డబ్బు కోల్పోయాడు. దీంతో తీవ్రమైన ఆర్థిక కష్టాల్లో ఉన్నానని, జట్టు సంగతులు చెప్పి సాయం చేయాలని సిరాజ్ను సంప్రదించినట్లు తెలిసింది. ఈ వ్యవహారం ప్రస్తుత ఐపీఎల్కు సంబంధించిన అంశం కాదని ఏసీయూ అప్రమత్తతతో నిందితుడిని అరెస్టు చేసినట్లు బోర్డు వర్గాలు తెలిపాయి.

'రెస్ట్ ఆఫ్ ద వరల్డ్' జట్టుదే చెస్ టైటిల్



అస్తానా: కజకిస్తాన్, రెస్ట్ ఆఫ్ ద వరల్డ్ మహిళల జట్ల మధ్య జరిగిన చెస్ టోర్నమెంట్లో 'రెస్ట్ ఆఫ్ ద వరల్డ్' జట్టు పైచేయి సాధించి టైటిల్ దక్కించుకుంది. బుధవారం ముగిసిన టోర్నీలో 'రెస్ట్ ఆఫ్ ద వరల్డ్' జట్టు బ్లిట్జ్ ఈవెంట్లో 38.5-25.5 పాయింట్ల తేడాతో... ర్యాపిడ్ ఈవెంట్లో 34.5-29.5 పాయింట్ల తేడాతో కజకిస్తాన్ జట్టును ఓడించింది. భారత గ్రాండ్మాస్టర్, ఆంధ్రప్రదేశ్ అమ్మాయి ద్రోణవల్లి హారిక, తమిళనాడుకు చెందిన మహిళా గ్రాండ్మాస్టర్ (డబ్ల్యూజీఎం) సవితాశ్రీ 'రెస్ట్ ఆఫ్ ద వరల్డ్' జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. హారిక, సవితాశ్రీలతోపాటు నానా జాగ్నిడ్జె (జార్జియా), హూ ఇఫాన్ (చైనా), గునె మమద్జాదా (అజర్బైజాన్), సోకా గాల్ (హంగేరి), అఫ్రూజా ఖమ్దమోవా (ఉజ్బెకిస్తాన్), నుర్గుల్ సలిమోవా (బల్గేరియా) కూడా 'రెస్ట్ ఆఫ్ ద వరల్డ్' జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. కజకిస్తాన్ జట్టు తరఫున దినారా, బిబిసారా, మెరూర్ట్, జన్సాయా అబ్దుమలిక్, జెనియా బలబయేవా, లియా, అలువా నుర్మనోవా, జరీనా పోటీపడ్డారు.

వార్నర్ స్థానం పదిలం



మెల్బోర్న్: భారత్తో జరిగే ప్రపంచ టెస్ట్ చాంపియన్షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ కోసం.. ఇంగ్లండ్లో జరిగే యాషెస్ సిరీస్ కోసం ఆస్ట్రేలియా జట్టును ప్రకటించారు. 17 మంది సభ్యులతో కూడిన ఈ జట్టులో కొంతకాలంగా ఫామ్లో లేని స్టార్ ప్లేయర్ డేవిడ్ వార్నర్కు చోటు లభించింది. డబ్ల్యూటీసీ ఫైనల్ జూన్ 7 నుంచి 11 వరకు లండన్లోని ఓవల్ మైదానంలో జరుగుతుంది. అనంతరం జూన్ 16 నుంచి బర్మింగ్హామ్లో ఇంగ్లండ్తో జరిగే తొలి టెస్ట్తో యాషెస్ సిరీస్ మొదలవుతుంది. డబ్ల్యూటీసీ ఫైనల్ కోసం 15 మందితో తుది జట్టును మే 28న ప్రకటిస్తామని క్రికెట్ ఆస్ట్రేలియా తెలిపింది.

ఆస్ట్రేలియా టెస్ట్ జట్టు: కమిన్స్ (కెప్టెన్), బోలండ్, క్యారీ, గ్రీన్, హారిస్, హాజల్వుడ్, హెడ్, ఇంగ్లిస్, ఖ్వాజా, లబుషేన్, లయన్, మిచెల్ మార్ష్, మర్ఫీ, రెన్షా, స్మిత్, స్టార్క్, వార్నర్.

సినిమా


వెయ్యిమంది ఫైటర్స్తో...



● రామ్చరణ్

దాదాపు వెయ్యిమంది ఫైటర్స్తో పోరాడటానికి రెడీ అవుతున్నారట రామ్చరణ్. శంకర్ దర్శకత్వంలో రామ్చరణ్ హీరోగా రూపొందుతున్న సినిమా 'గేమ్ చేంజర్'. ఇందులో కియారా అద్వానీ హీరోయిన్గా నటిస్తున్నారు. 'దిల్' రాజు, శిరీష్లు నిర్మిస్తున్నారు. తాజాగా 'గేమ్ చేంజర్' క్లైమాక్స్ చిత్రీకరణ కోసం చిత్ర యూనిట్ రెడీ అవుతున్నట్లు తెలిసింది. హైదరాబాద్ శివార్లలో ఆల్రెడీ ఈ ఫైట్ కోసం సెట్ వర్క్ కూడా పూర్తి చేశారట. ఈ నెల చివరి వారంలో ప్రారంభం కానున్న ఈ క్లైమాక్స్ చిత్రీకరణ వచ్చే నెల తొలి వారం వరకూ జరుగుతుందని సమాచారం. కాగా ఈ ఫైట్ చిత్రీకరణలో దాదాపు వెయ్యిమంది స్టంట్మ్యాన్లు పాల్గొంటారట. అలాగే 'కేజీఎఫ్' యాక్షన్ కొరియోగ్రాఫర్స్ అన్బు అండ్ అరివు ఈ క్లైమాక్స్ ఫైట్ను కొరియోగ్రాఫ్ చేయనున్నట్లు సమాచారం. ఈ పొలిటికల్ యాక్షన్ డ్రామాలో రామ్చరణ్ ద్విపాత్రాభినయం చేస్తున్నారనే టాక్ వినిపిస్తున్న సంగతి తెలిసిందే.

మళ్లీ వస్తున్న రానా నాయుడు



● వెంకటేశ్, రానా

రానా నాయుడు మళ్లీ వస్తున్నాడు. వెంకటేశ్, రానా లీడ్ రోల్స్లో నటించిన వెబ్ సిరీస్ 'రానా నాయుడు'. అమెరికన్ టీవీ సిరీస్ 'రే డొనోవన్' ఆధారంగా రూపొందిన ఇండియన్ వెర్షన్ 'రానా నాయుడు'కు కరణ్ అన్షుమాన్, సుపర్ణ్ వర్మ దర్శకత్వం వహించారు. ఇందులో సెలబ్రిటీల సమస్యలు తీర్చే వ్యక్తి రానా నాయుడు పాత్రలో రానా, అతని తండ్రి నాగ నాయుడు పాత్రలో వెంకటేశ్ నటించారు. ఈ వెబ్ సిరీస్ తొలి సీజన్ ఓటీటీ ప్లాట్ఫామ్ నెట్ఫ్లిక్స్లో మార్చి 10 నుంచి స్ట్రీమింగ్ అవుతున్న విషయం తెలిసిందే. 'రానా నాయుడు' సెకండ్ సీజన్ త్వరలోనే వీక్షకుల ముందుకు రానుంది. "సీజన్ 2 కోసం నాయుడూస్ బిజీగా ఉన్నారు. త్వరలోనే 'రానా నాయుడు' సెకండ్ సీజన్ రాబోతోంది" అని హీరో రానా పేర్కొన్నారు.

ఆదిపురుష్లో భాగం కావడం అదృష్టం - ప్రభాస్



"న్యూయార్క్లోని ట్రిబెకా ఫిల్మ్ ఫెస్టివల్లో 'ఆదిపురుష్' చిత్రం వరల్డ్ ప్రీమియర్ను ప్రదర్శించనుండటం గర్వంగా ఉంది. మన దేశ నైతికతకు అద్దం పట్టే ఈ సినిమాలో భాగం కావడం నా అదృష్టం" అన్నారు ప్రభాస్. ఓం రౌత్ దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా నటించిన 'ఆదిపురుష్' చిత్రం జూన్ 16న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. కాగా జూన్ 7 నుంచి 18 వరకు జరిగే ట్రిబెకా ఫెస్టివల్లో భాగంగా జూన్ 13న 'ఆదిపురుష్' చిత్రం వరల్డ్ ప్రీమియర్ని (త్రీడీ) ప్రదర్శించనున్నారు. ఈ సందర్భంగా ప్రభాస్ మాట్లాడుతూ– "మన భారతీయ చిత్రాలను ఇతర దేశాల్లో చూడటం, ముఖ్యంగా 'ఆదిపురుష్' ప్రపంచ స్థాయికి చేరుకోవడం ఒక నటుడిగానే కాకుండా భారతీయుడిగా గర్వంగా ఉంది" అన్నారు. "'ఆదిపురుష్' సినిమా కాదు.. భారతదేశ స్ఫూర్తితో ప్రతిధ్వనించే కథ. మన సంస్కృతిలో బాగా పాతుకుపోయిన కథను ప్రపంచ వేదికపై ప్రదర్శించబోతుండటం హ్యాపీ" అన్నారు ఓం రౌత్. "భారతీయ సినిమాను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లడం మనందరికీ నిజంగా గర్వకారణం" అన్నారు నిర్మాత భూషణ్ కుమార్. కృతీ సనన్, సైఫ్ అలీ ఖాన్, సన్నీ సింగ్ నటించిన ఈ చిత్రానికి నిర్మాతలు: భూషణ్ కుమార్, క్రిషణ్ కుమార్, ఓం రౌత్, ప్రసాద సుతారియా, రెట్రోఫిల్స్ రాజేష్ నాయర్, యూవీ క్రియేషన్స్ ప్రమోద్, వంశీ.

నాకు మళ్లీ మాటలు నేర్పించారు - సాయిధరమ్ తేజ్

"బైక్ డ్రైవ్ చేసేటప్పుడు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మన కుటుంబాల కోసమైనా హెల్మెట్ పెట్టుకోవాలి. నాకు యాక్సిడెంట్ జరిగినప్పుడు హెల్మెట్ కాపాడింది" అని సాయిధరమ్ తేజ్ అన్నారు. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర బ్యానర్లో కార్తీక్ దండు దర్శకత్వంలో సాయిధరమ్ తేజ్, సంయుక్తా మీనన్ జంటగా నటించిన చిత్రం 'విరూపాక్ష'. బాపినీడు .బి సమర్పణలో బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 21న విడుదల కానుంది. "భారీ యాక్సిడెంట్ తర్వాత విడుదలవుతున్న ఈ సస్పెన్స్ థ్రిల్లర్ పట్ల చాలా కాన్ఫిడెంట్గా ఉన్నాను. దర్శకుడు సుకుమార్ స్క్రీన్ప్లే ఈ సినిమాను మరో స్థాయికి తీసుకుని వెళ్లింది" అంటూ మరిన్ని విశేషాలను సాయిధరమ్ తేజ్ ఈ విధంగా చెప్పారు.




● 1989–90 మధ్య ఓ గ్రామం అనుమానాస్పద హత్యలతో భయానకంగా మారుతుంది. హత్యలు ఎవరు చేశారు? గ్రామానికి చేతబడి ఎందుకు చేశారన్న వాటిని వెతుకుతూ హీరో చేసే ప్రయాణమే 'విరూపాక్ష' సినిమా. నేను చేతబడిని నమ్మను. ఆంజనేయుడ్ని నమ్ముతాను. ఆయన తోడుంటే మనకు ఏం కాదని నమ్ముతాను. విరూపాక్ష అంటే రూపం లేని కన్ను అని అర్థం. శివుడి పేరు. రూపం లేని వాటితో హీరో చేసే సంఘర్షణ ప్రేక్షకులను థ్రిల్ చేస్తుంది.

● యాక్సిడెంట్ తర్వాత నేను సినిమాలు చేస్తానా... లేదా అని చాలామంది సందేహించారు. యాక్సిడెంట్ నాకు చాలా నేర్పింది. మా అమ్మ నన్ను ఈ వయసులో చిన్న పిల్లోడిలా చూసుకుంటూ నా మాటలు తడబడుతున్నా ధైర్యం నింపి ప్రోత్సహించారు. 36 ఏళ్ల వయసులో నాకు మళ్లీ మాటలు నేర్పించారు. ఈ ప్రపంచంలో అమ్మ తర్వాతే ఎవరైనా. ● ఈ సినిమా కోసం వర్క్ షాప్స్ చేసిన సమయంలో నా పరిస్థితి అంత బాగా లేదు. నేను చేయలేని పరిస్థితుల్లో ఉన్నా అడ్జస్ట్ అయ్యారు. మా నిర్మాతలు ఎంతో సపోర్టివ్గా నిలిచారు. ● 'విరూపాక్ష'ని 'కాంతార'తో పోల్చలేం. 'కాంతార' ఓ క్లాసిక్. 'విరూపాక్ష' సస్పెన్స్ థ్రిల్లర్గా వైవిధ్యంగా ఉంటుంది. దర్శకుడు కార్తీక్ కథ చెబుతున్నప్పుడే కొత్త అనుభూతికి గురయ్యాను. కథలో కొత్త క్యారెక్టర్స్ రావడం.. ట్విస్టులతో చిత్రం వేగంగా వెళుతుంది. ప్రతి 20 నిమిషాలకు కొత్తదనంతో కథ సాగుతుంది. ● 1989లలో అబ్బాయి–అమ్మాయి మధ్య ప్రేమ ఎలా ఉంటుందో, ఆ సమయంలో గ్రామాల్లో ఎలాంటి పరిస్థితులు ఉండేవో చూపించాం. చేతబడులు, మూఢనమ్మకాల గురించి చెప్పాం. నాకు హారర్ సినిమాలంటే భయం. ఆ భయానికి విరుగుడుగా నేను హనుమంతుణ్ణి నమ్ముతాను.

● తెలుగు సినిమా స్థాయిని 'ఆర్ఆర్ఆర్' ప్రపంచ స్థాయికి తీసుకెళ్లింది. 'విరూపాక్ష'ని పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ చేయాలనుకున్నాం. కానీ కుదరలేదు. ముందు ఇంట గెలవాలని అనుకుంటున్నాం. తెలుగులో రిలీజ్ చేశాక అన్ని భాషల్లో రిలీజ్ చేస్తాం.

● జీవితం అంటే కష్టాలు వస్తాయి.. వాటిని ఎదుర్కొని ముందుకు వెళ్లడమే. యాక్సిడెంట్ తర్వాత మా మామయ్య మెగాస్టార్ చిరంజీవి గారు సిరివెన్నెల గారి పాటలోని స్ఫూర్తి నింపే 'ఎప్పుడూ ఒప్పుకోవద్దురా ఓటమి.. ఎప్పుడూ వదులుకోవద్దురా ఓరిమి' అంటూ మెసేజ్ చేశారు. అందరి ఆదరాభిమానాల వల్ల యాక్సిడెంట్ తర్వాత మీ ముందు ఇలా ఉన్నాను. నా జీవితం దాదాపు సవాళ్లతోనే నిండింది. సవాళ్లు లేకుంటే లైఫ్ చప్పగా అనిపిస్తుంది. ● ఇప్పుడు నా మెచ్యూరిటీ పెరిగింది. అందరినీ నవ్విస్తూ, హ్యాపీగా ఉంచాలని అనుకుంటున్నాను. సినిమా సక్సెస్ అయితే అందరం హ్యాపీ. రికార్డ్స్ బద్దలు కొట్టాలనుకోవడం లేదు. ఎందుకంటే ప్రతీ వారం ఓ రికార్డ్ బ్రేక్ అవుతుంటుంది.

సంతోషం.. బాధ



● 'ప్రేమ విమానం' ఫస్ట్ లుక్

సంగీత్ శోభన్, శాన్వీ మేఘన హీరో హీరోయిన్లుగా, అనసూయ భరద్వాజ్, 'వెన్నెల' కిశోర్ లీడ్ రోల్స్లో నటించిన వెబ్ ఫిల్మ్ 'ప్రేమ విమానం'. బాల నటులు దేవాన్ష్ నామా, అనిరుధ్ నామా కీలక పాత్రలు చేశారు. సంతోష్ కటా దర్శకత్వంలో దేవాన్ష్ నామా సమర్పణలో అభిషేక్ పిక్చర్స్, జీ5లపై అభిషేక్ నామా నిర్మిస్తున్న వెబ్ ఫిల్మ్ ఇది. బుధవారం (ఏప్రిల్ 19) అభిషేక్ నామా బర్త్ డే సందర్భంగా 'ప్రేమ విమానం' ఫస్ట్ లుక్ పోస్టర్ను రిలీజ్ చేశారు. "ఫ్లైట్ ఎక్కి కొత్త జీవితాన్ని ప్రారంభించాలనుకునే ఓ ప్రేమ జంట, ఎలాగైనా విమానం ఎక్కాలని ప్రయత్నించే ఇద్దరు పిల్లలు.. ఇలా వివిధ వ్యక్తుల ప్రయాణంలో వచ్చే మలుపులు, సంతోషాలు, బాధలు.. వంటి ప్రేక్షకులను మెప్పించే అన్ని అంశాలు ఇందులో ఉన్నాయి" అని యూనిట్ పేర్కొంది.

సందేశంతో...



● అమర్ దీప్, అశ్విని రెడ్డి

అమర్ దీప్, అశ్విని రెడ్డి హీరో హీరోయిన్లుగా శివప్రసాద్ చలువాది దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'అభిలాష'. సీహెచ్ శిరీష నిర్మించిన ఈ సినిమా ట్రైలర్ లాంచ్ వేడుక హైదరాబాద్లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నటుడు పృథ్వీ ఈ సినిమా సీడీ, ట్రైలర్ను రిలీజ్ చేసి, "ఓ మంచి పాయింట్తో తీసిన ఈ చిత్రం ట్రైలర్ బాగుంది" అన్నారు. "వల్గారిటీ లేకుండా విద్యకు ఉన్న ప్రాధాన్యాన్ని సందేశాత్మకంగా ఈ సినిమాలో చూపించాం" అన్నారు శివ ప్రసాద్. "'బలగం' సినిమా కోవలో ఈ సినిమా కూడా విజయం సాధిస్తుంది" అన్నారు నిర్మాత సీహెచ్ శిరీష.

యువత సినీపరిశ్రమకు రావాలి

- సీఐఐ దక్షిణ్ సమ్మిట్లో నిర్మాత అల్లు అరవింద్



● కార్తీ, సెల్వమణి, టీజీ త్యాగరాజన్, అల్లు అరవింద్, ఉదయనిధి స్టాలిన్, ప్రేమ్ రక్షిత్

"దక్షిణాది సినిమాలు అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటడం గొప్ప విషయం. యువత సినిమా పరిశ్రమకు రావాలి. 'ఆర్ఆర్ఆర్, 'ది ఎలిఫెంట్ ఆఫ్ విస్పరర్స్' ఆస్కార్ అవార్డులు సాధించడం గర్వకారణం" అన్నారు నిర్మాత అల్లు అరవింద్. బుధవారం చెన్నైలో జరిగిన సీఐఐ (కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ) దక్షిణ్ సమ్మిట్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. సీఐఐ దక్షిణ్ చైర్మన్, మేనేజింగ్ పార్ట్నర్ టీజీ త్యాగరాజన్ నేతృత్వంలో రెండు రోజుల పాటు జరగనున్న ఈ సదస్సు ప్రారంభోత్సవంలో తమిళనాడు మంత్రులు ఉదయనిధి స్టాలిన్, స్వామినాథన్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సీఐఐ దక్షిణ్ కమిటీ సభ్యురాలు సుహాసిని, నిర్మాత అల్లు అరవింద్, ఫెఫ్సీ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి, నటులు కార్తీ, రిషబ్ శెట్టి, నటి మంజు వారియర్, దర్శకుడు వెట్రిమారన్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సెల్వమణి మాట్లాడుతూ– "తమిళ చిత్రాల షూటింగ్లు తమిళనాడులో అధికంగా జరిగేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి. ఇప్పటివరకూ దక్షిణాదిలో 50 వేల చిత్రాలు రూపొందాయి. అయితే సినిమాలనే నమ్ముకున్న కార్మికులకు ప్రోత్సాహం లేదు. వారి కోసం తమిళనాడు సినీ కార్మికుల డెవలప్మెంట్ కార్పొరేషన్ను ఏర్పాటు చేయాలి" అన్నారు. మంత్రి ఉదయనిధి స్టాలిన్ మాట్లాడుతూ – "తమిళనాడు ప్రభుత్వం, ముఖ్యమంత్రి స్టాలిన్ సినీ పరిశ్రమకు అండగా ఉంటారు. సెల్వమణి తదితరులు పేర్కొన్న అంశాల గురించి చర్చించి, చర్యలు తీసుకుంటాం" అన్నారు. 'ఆర్ఆర్ఆర్' చిత్రంలోని 'నాటు నాటు...' పాట నృత్యదర్శకుడు ప్రేమ్ రక్షిత్, 'ది ఎలిఫెంట్ ఆఫ్ విస్పరర్స్' షార్ట్ ఫిలిం దర్శకురాలు కార్తీకీలను సత్కరించారు.

సాక్షి బిజినెస్
గురువారం
20-4-2023

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్‌ ▽	159	59,568
నిఫ్టీ ▽	41	17,619

మరిన్ని బిజినెస్‌ వార్తల కోసం 'సాక్షి ప్లస్‌' చూడండి

విదేశీ సూచీలు (బుధ రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్‌	12,175	△	22
డోజోన్స్‌	33,913	▽	63
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,899	▽	11
డాక్స్‌	15,895	△	13
షాంఘై	3,370	▽	23
నికాయ్‌	28,607	▽	52

•అమెరికా •బ్రిటన్‌ •జర్మనీ •చైనా •జపాన్‌

బులియన్‌ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారట్‌)	59,921	▽	672
బంగారం (22 క్యారట్‌)	59,681	△	669
వెండి (కిలో)	73,775	▽	867

మలబార్‌ గోల్డ్‌ అండ్‌ డైమండ్స్‌ ప్రచారకర్తగా నటి అలియా భట్‌



హైదరాబాద్‌: మలబార్‌ గోల్డ్‌ అండ్‌ డైమండ్స్‌ తన ప్రచారకర్తగా బాలీవుడ్‌ నటి అలియా భట్‌ను నియమించుకుంది. సంస్థ 30 ఏళ్ల వేడుకల సందర్భంగా అలియాతో జట్టు కట్టినట్లు గ్రూప్‌ చైర్మన్‌ ఎం.పీ. అహ్మద్‌ తెలిపారు. ''అందం, అభినయంతో సినీ ప్రేక్షకుల్ని రంజింపచేస్తున్న అలియా..., సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేసి సంస్థ ఉత్పత్తులను కస్టమర్లకు మరింత చేరువ చేస్తుంది. మా లక్ష్యాల సాధనకు నటిగా, వ్యక్తిగా ఆమె మరింత బలాన్ని చేకూరుస్తుంది'' అని అహ్మద్‌ విశ్వాసం వ్యక్తం చేశారు. అనిల్‌ కపూర్‌, కరీనా కపూర్‌, కార్తీ వంటి నటీనటులు బ్రాండ్‌ ప్రచారకర్తలుగా ఉన్న మలబార్‌ గోల్డ్‌ అండ్‌ డైమండ్స్‌ కుటుంబంలోకి చేరుతున్నందుకు సంతోషంగా ఉందని అలియా అన్నారు.

లలితా జ్యువెల్లరీ అక్షయ తృతీయ ఆఫర్లు

హైదరాబాద్‌: అక్షయ తృతీయ పండుగ సందర్భంగా లలితా జ్యువెల్లరీ ప్రత్యేకమైన ఆఫర్లు ప్రకటించింది. అన్ని బంగారు నగలకు తరుగులో 1% తగ్గింపు ఇస్తుంది. వజ్రాభరణాలకు క్యారెట్‌లో రూ.2000 తగ్గింపు అందిస్తుంది. ఇప్పటికే ప్రారంభమైన ఈ ఆఫర్‌ ఏప్రిల్‌ 24 వరకూ కొనసాగుతుంది. కస్టర్లంతా ఈ అద్భుతమైన ఆఫర్‌ను వినియోగించుకోవాలని కంపెనీ చైర్మన్‌ ఎం.కిరణ్‌ కుమార్‌ తెలిపారు. అందరి ఇళ్లలో బంగారం, వజ్రాలు, వెండి నిండాలని అక్షయ తృతీయ సందర్భంగా కుబేర లక్ష్మీని ప్రార్థిస్తున్నానని ఆయన పేర్కొన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్‌-నెక్‌ / 100కు రూ.లలో)

20-4-2023	
విశాఖ	375-00
చిత్తూరు	408-00
ఈస్ట్‌, వెస్ట్‌ గోదావరి	345-00
విజయవాడ	345-00
రిటైల్‌ ధర (డజను)	60.00
19-4-2023 ఫామ్‌ ధర...	
హైదరాబాద్‌	350-00
వరంగల్‌	352-00
రిటైల్‌ ధర	4.10

టీసీఎస్‌ నంబర్‌ 1



- పనిచేయడానికి ఉత్తమ కంపెనీ
- లింక్డ్‌ఇన్‌ జాబితాలో చోటు

ముంబై: దేశంలో పనిచేయడానికి అత్యుత్తమ కంపెనీగా టీసీఎస్‌ గుర్తింపు పొందింది. పనిచేయడానికే కాకుండా, కెరీర్‌లో పురోగతికీ టీసీఎస్‌ మెరుగైన కంపెనీగా లింక్డ్‌ఇన్‌ 2023 నివేదిక తెలిపింది. టీసీఎస్‌ తర్వాత అమెజాన్‌, మోర్గాన్‌ స్టాన్లీ లింక్డ్‌ఇన్‌ జాబితాలో మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి. గతేడాది లింక్డ్‌ఇన్‌ జాబితాలో టెక్‌ కంపెనీల ఆధిపత్యం ఎక్కువగా ఉండగా, ఈ ఏడాది జాబితాలో మార్పు స్పష్టంగా కనిపించింది. ఆర్థిక సేవల కంపెనీలు, ఆయిల్‌ అండ్‌ గ్యాస్‌, ప్రొఫెషనల్‌ సేవలు, తయారీ, గేమింగ్‌ కంపెనీలకూ చోటు దక్కింది. 25 కంపెనీల్లో 10 ఫైనాన్షియల్‌ సర్వీసెస్‌, బ్యాంకింగ్‌, ఫిన్‌టెక్‌ నుంచే ఉన్నాయి. మాక్వేర్‌ గ్రూప్‌ 5వ స్థానంలో ఉంటే, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ 11, మాస్టర్‌కార్డ్‌ 12, యుబి 14వ స్థానంలో నిలిచాయి. 20వ స్థానంలో డ్రీమ్‌11, 24వ స్థానంలో గేమ్స్‌ 24/7 ఉన్నాయి. ఈ జాబితాలో గేమింగ్‌ కంపెనీలకు చోటు లభించడం మొదటిసారి. ఈ రంగానికి పెరుగుతున్న ప్రజాదరణను ఇది తెలియజేస్తోంది. ఇన్‌స్టంట్‌ గ్రోసరీ డెలివరీ సంస్థ జెప్టో 16వ స్థానం దక్కించుకుంది.

ఈ తరహా నైపుణ్యాలకు డిమాండ్‌..

లింక్డ్‌ఇన్‌ జాబితాలో చోటు సంపాదించుకున్న టెక్నాలజీ కంపెనీలు ఎక్కువగా.. ఆర్టిఫీషియల్‌ ఇంటెలిజెన్స్‌ (ఏఐ), రోబోటిక్స్‌, ఎలక్ట్రానిక్స్‌, సాఫ్ట్‌వేర్‌ టెస్టింగ్‌, కంప్యూటర్‌ సెక్యూరిటీ నైపుణ్యాలున్న మానవ వనరుల కోసం చూస్తున్నాయి. ఫైనాన్షియల్‌ రంగానికి చెందిన కంపెనీలు కమర్షియల్‌ బ్యాంకింగ్‌, ఫైనాన్షియల్‌ అకౌంటింగ్‌, గ్రోత్‌ స్ట్రాటజీస్‌ తెలిసిన వారికి ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఇండస్ట్రియల్‌ డిజైన్‌, గేమ్‌ డెవలప్‌మెంట్‌ నిపుణులకూ డిమాండ్‌ నెలకొంది. ఇంజనీరింగ్‌, కన్సల్టింగ్‌, ప్రొడక్ట్‌ డెవలప్‌మెంట్‌, విక్రయాలు, డిజైన్‌, ఫైనాన్స్‌, ఆపరేషన్స్‌పై ఎక్కువగా కంపెనీలు పెట్టుబడులు పెడుతున్నాయి. బెంగళూరు కేంద్రంగా పనిచేసే కంపెనీలు, ఆ తర్వాత ముంబై, హైదరాబాద్‌, ఢిల్లీ, పుణెకు చెందినవి నిపుణులను నియమించుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నాయి.

10 వేల కిలోమీటర్ల డిజిటల్‌ హైవేలు

- 2025 నాటికి ఎన్‌హెచ్‌ఏఐ లక్ష్యం
- హైదరాబాద్‌-బెంగళూరు కారిడార్‌ పైలట్‌ ప్రాజెక్టుగా ఎంపిక



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఇంటర్నెట్‌ కనెక్టివిటీని విస్తరించే క్రమంలో 'డిజిటల్‌ హైవే'ల నిర్మాణంపై ప్రభుత్వ రంగ నేషనల్‌ హైవేస్‌ అథారిటీ (ఎన్‌హెచ్‌ఏఐ) మరింతగా దృష్టి సారిస్తోంది. ఇందులో భాగంగా 2024-25 నాటికల్లా 10,000 కిలోమీటర్ల మేర ఆప్టిక్‌ ఫైబర్‌ కేబుల్స్‌ (ఓఎఫ్‌సీ) నెట్‌వర్క్‌పరమైన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయనుంది. ఎన్‌హెచ్‌ఏఐలో భాగమైన నేషనల్‌ హైవేస్‌ లాజిస్టిక్స్‌ మేనేజ్‌మెంట్‌ (ఎన్‌హెచ్‌ఎల్‌ఎంఎల్‌) ఒక ప్రకటనలో ఈ వివరాలు వెల్లడించింది. దీని ప్రకారం డిజిటల్‌ హైవే అభివృద్ధికి సంబంధించి పైలట్‌ ప్రాతిపదికన 512 కిలోమీటర్ల హైదరాబాద్‌-బెంగళూరు కారిడార్‌ను, 1,367 కిలోమీటర్ల ఢిల్లీ-ముంబై ఎక్స్‌ప్రెస్‌వేను ఎంపిక చేసినట్లు పేర్కొంది.

సిప్‌ @ రూ.1.56 లక్షల కోట్లు

- 2022-23లో వచ్చిన పెట్టుబడులు
- 25 శాతం వృద్ధి నమోదు
- నెలవారీగా రూ.13వేల కోట్లకుపైనే

న్యూఢిల్లీ: మ్యూచువల్‌ ఫండ్స్‌లో పెట్టుబడులకు సిస్టమ్యాటిక్‌ ఇన్వెస్ట్‌మెంట్‌ ప్లాన్‌ (సిప్‌)ను ఎంపిక చేసుకునే వారి సంఖ్య పెరుగుతోంది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో (2022-23) సిప్‌ ద్వారా రూ.1.56 లక్షల కోట్ల పెట్టుబడులు మ్యూచువల్‌ ఫండ్స్‌ పథకాల్లోకి వచ్చినట్టు 'యాంఫి' గణాంకాలు పరిశీలిస్తే తెలుస్తోంది. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో సిప్‌ పెట్టుబడులు రూ.1.24 లక్షల కోట్లతో పోలిస్తే 25 శాతం వృద్ధి కనిపించింది. మార్కెట్లలో అస్థిరతలను అధిగమించేందుకు సిప్‌ మెరుగైన సాధనమని తెలిసిందే. దీనివల్ల మార్కెట్లు పడినప్పుడు, పెరుగుతున్నప్పుడు కూడా పెట్టుబడులు కొనసాగుతాయి కనుక కొనుగోలు సగటుగా మారుతుంది. 2020-21లో సిప్‌ పెట్టుబడులు రూ.96,080 కోట్లుగా ఉన్నాయి. అంటే ఏటేటా సిప్‌



పెట్టుబడులు వృద్ధి చెందుతున్నట్టు స్పష్టమవుతోంది. 2016-17లో ఉన్న రూ.43,921 కోట్ల పెట్టుబడులతో పోలిస్తే మూడు రెట్లు పెరిగాయి. ప్రతి నెలా సిప్‌ రూపంలో వచ్చే పెట్టుబడులు సైతం మార్చి నెలకు రూ.14,276 కోట్లుగా నమోదయ్యాయి. నెలవారీ గరిష్ఠ సిప్‌ పెట్టుబడులు ఇవే. గత ఆర్థిక సంవత్సరం మొత్తం మీద సగటున ప్రతి నెలా రూ.13,000 కోట్ల చొప్పున వచ్చాయి. ఇన్వెస్టర్లు దీర్ఘకాల వృద్ధి పట్ల నమ్మకంగా ఉన్నారని, అందుకే ఏకమొత్తంలో కంటే సిప్‌ రూపంలో పెట్టుబడులకు ఆసక్తి చూపిస్తున్నారని కోటక్‌ మహీంద్రా ఏఎంసీ సేల్స్‌ అండ్‌ మార్కెటింగ్‌ హెడ్‌ మనీష్‌ మెహతా తెలిపారు.

''గడిచిన ఆర్థిక సంవత్సరం మొత్తం మీద మార్కెట్లు అస్థిరంగానే ఉన్నాయి. అయినా కానీ, దేశీయ మార్కెట్‌ పట్ల ఇన్వెస్టర్లు నమ్మకాన్ని ప్రదర్శిస్తున్నారు. పెట్టుబడులకు మ్యూచువల్‌ ఫండ్స్‌ను ప్రాధాన్య మార్గంగా చూస్తున్నారు''అని ఫయర్స్‌ రీసెర్చ్‌ హెడ్‌ గోపాల్‌ కావలిరెడ్డి తెలిపారు. మ్యూచువల్‌ ఫండ్స్‌ సంస్థల నిర్వహణలోని మొత్తం సిప్‌ పెట్టుబడులు గడిచిన ఆర్థిక సంవత్సరంలో 18 శాతం పెరిగి రూ.6.83 లక్షల కోట్లకు చేరాయి. మొత్తం సిప్‌ ఖాతాల సంఖ్య 6.36 కోట్లకు చేరుకుంది.

ప్రధానితో యాపిల్‌ సీఈవో భేటీ

నేడు ఢిల్లీలో స్టోర్‌ ప్రారంభం



న్యూఢిల్లీ: అమెరికన్‌ టెక్‌ దిగ్గజం యాపిల్‌ స్టోర్స్‌ ప్రారంభం కోసం భారత పర్యటనలో ఉన్న కంపెనీ సీఈవో టిమ్‌ కుక్‌ బుధవారం ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. విద్య, తయారీ, పర్యావరణం తదితర అన్ని రంగాల్లోనూ టెక్నాలజీ సానుకూల ప్రభావం చూపాలన్న ప్రధాని ఆకాంక్షే తమ లక్ష్యం కూడా అని ఈ సందర్భంగా ట్విట్టర్‌లో ట్వీట్‌ చేశారు. భారత్‌లో తమ కార్యకలాపాలు విస్తరించడానికి, మరింత పెట్టుబడులు పెట్టడానికి కట్టుబడి ఉన్నామని ఆయన పేర్కొన్నారు. టిమ్‌ కుక్‌తో భేటీలో వివిధ అంశాలపై చర్చించినట్లు, భారత్‌లో చోటు చేసుకుంటున్న టెక్నాలజీ ఆధారిత మార్పులను ప్రస్తావించినట్లు ప్రధాని కూడా ట్వీట్‌ చేశారు. యాపిల్‌ భారత్‌లో తమ రెండో స్టోర్‌ను నేడు (గురువారం) న్యూఢిల్లీలో ప్రారంభించనుంది. ఈ సందర్భంగా టిమ్‌ కుక్‌ స్వయంగా కస్టమర్లను ఆహ్వానించనున్నారు. ఇందుకోసం బుధవారం న్యూఢిల్లీ చేరుకున్న టిమ్‌ కుక్‌ లోధి ఆర్ట్‌ డిస్ట్రిక్ట్‌ను సందర్శించి కళాకారులను కలిశారు. దేశీయంగా తమ తొలి రిటైల్‌ స్టోర్‌ను (యాపిల్‌ బీకేసీ) ముంబైలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌ ప్రాంతంలో ఆయన మంగళవారం ప్రారంభించిన సంగతి తెలిసిందే. 2016 తర్వాత కుక్‌ భారత్‌లో పర్యటించడం ఇదే ప్రథమం.

ఐటీ, బ్యాంకింగ్‌ షేర్లలో అమ్మకాలు

- సూచీలకు మూడోరోజూ నష్టాలు
- 159 పాయింట్లు పతనమైన సెన్సెక్స్‌
- నిఫ్టీ నష్టం 41 పాయింట్లు

ముంబై: ఐటీ, ఫైనాన్స్‌, విద్యుత్‌ షేర్లలో అమ్మకాలు తలెత్తడంతో స్టాక్‌ సూచీలు మూడోరోజూ నష్టాలను చవిచూశాయి. ఇప్పటివరకు వెల్లడైన కార్పొరేట్‌ క్యూ4 ఆర్థిక ఫలితాలు మార్కెట్‌ వర్గాలను మెప్పించలేకపోయాయి. అలాగే అంతర్జాతీయ బలహీన సంకేతాలు, విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు సెంటిమెంట్‌ను బలహీనపరిచాయి. ఉదయం సెన్సెక్స్‌ 19 పాయింట్ల స్వల్ప లాభంతో 59,746 వద్ద, నిఫ్టీ ఏడు పాయింట్లు నష్టపోయి 17,653 వద్ద మొదలయ్యాయి. రోజంతా పరిమిత శ్రేణిలో కదలాడాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్‌ 292 పాయింట్ల పరిధిలో సెన్సెక్స్‌ 59,453 వద్ద కనిష్టాన్ని, 59,745 గరిష్టాన్ని నమోదు చేసింది. చివరికి 159 పాయింట్లు నష్టపోయి 59,568 వద్ద నిలిచింది. నిఫ్టీ 17,580 - 17,666 శ్రేణిలో ట్రేడైంది. ఆఖరికి 41 పాయింట్లు పతనమై 17,619 వద్ద నిలిచింది. మెటల్‌, ఫార్మా, రియల్టీ, ఇంధన షేర్లకు చెందిన మధ్య తరహా షేర్లకు కొనుగోళ్లకు మద్దతు లభించడంతో బీఎస్‌ఈ మిడ్‌క్యాప్‌ ఇండెక్స్‌ స్వల్పంగా 0.12 శాతం పెరిగింది. కార్పొరేట్‌ ఆర్థిక ఫలితాలు, ఆయా కేంద్ర బ్యాంకులు ద్రవ్య విధాన వైఖరిపై ఎదురుచూపుల నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్లు లాభ, నష్టాల మధ్య ట్రేడవుతున్నాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- నాలుగో త్రైమాసిక ఆర్థిక ఫలితాల వెల్లడి(గురువారం)కి ముందు హెచ్‌సీఎల్‌ టెక్‌ షేరు అమ్మకాల ఒత్తిడికి లోనైంది. బీఎస్‌ఈలో రెండున్నర శాతం నష్టపోయి రూ.1,038 వద్ద స్థిరపడింది.
- రియల్టీ సంస్థ ప్రెస్టీజ్‌ ఎస్టేట్స్‌ ప్రాజెక్ట్స్‌ షేరు రెండున్నర శాతం లాభపడి రూ.450 వద్ద ముగిసింది. ఆర్థిక సంవత్సరం(2022-23)లో వార్షిక ప్రాతిపదికన రూ. 12,930 కోట్ల విలువైన ఆస్తులను విక్రయించడంతో ఈ షేరుకు డిమాండ్‌ పెరిగింది.



మ్యాన్‌కైండ్‌ @ రూ. 1,026-1,080

- ఈ నెల 25-27 మధ్య ఐపీవో
- రూ. 4,326 కోట్ల సమీకరణకు రెడీ

న్యూఢిల్లీ: హెల్త్‌కేర్‌ రంగ కంపెనీ మ్యాన్‌కైండ్‌ ఫార్మా పబ్లిక్‌ ఇష్యూలో భాగంగా షేరుకి రూ. 1,026-1,080 ధరల శ్రేణి ప్రకటించింది. ఇష్యూ ఈ నెల 25న ప్రారంభమై 27న ముగియనుంది. ఐపీవోలో భాగంగా కంపెనీ మొత్తం 4 కోట్లకుపైగా ఈక్విటీ షేర్లను ఆఫర్‌ చేస్తోంది. కంపెనీ ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు వీటిని విక్రయానికి ఉంచనున్నారు. తద్వారా రూ. 4,326 కోట్లు సమీకరించాలని కంపెనీ భావిస్తోంది.

విద్య, ఉద్యోగ సమాచారం

ఎన్‌ఎఫ్‌ఎస్‌యూ, గాంధీనగర్‌లో పీజీ, పీజీ డిప్లొమా, ఇంటిగ్రేటెడ్‌ కోర్సులు

గాంధీనగర్‌లోని నేషనల్‌ ఫోరెన్సిక్‌ సైన్సెస్‌ యూనివర్సిటీ 2023 విద్యా సంవత్సరానికి సంబంధించి పీజీ, పీజీ డిప్లొమా ఇంటిగ్రేటెడ్‌ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

కోర్సుల వివరాలు

» డాక్టర్‌ ఆఫ్‌ ఫిలాసఫీ(పీహెచ్‌డీ): ఫోరెన్సిక్‌, దాని అనుబంధ శాస్త్రాలు.
» ఎంఎస్సీ: విభాగాలు: ఫోరెన్సిక్‌ సైన్స్‌/ఫోరెన్సిక్‌ బయోటెక్నాలజీ/మల్టీమీడియా ఫోరెన్సిక్స్‌/టాక్సికాలజీ/సైబర్‌ సెక్యూరిటీ/డిజిటల్‌ ఫోరెన్సిక్స్‌ అండ్‌ ఇన్ఫర్మేషన్‌ సెక్యూరిటీ/న్యూరో సైకాలజీ/క్లినికల్‌ సైకాలజీ/ఫోరెన్సిక్‌ సైకాలజీ/నానో టెక్నాలజీ/ఫుడ్‌ టెక్నాలజీ/హోంల్యాండ్‌ సెక్యూరిటీ/కెమిస్ట్రీ/ఇన్విరాన్‌మెంటల్‌ సైన్స్‌/ఫార్మాస్యూటికల్‌ కెమిస్ట్రీ.
» ఎంఏ: విభాగాలు: మాస్‌ కమ్యూనికేషన్‌ అండ్‌ జర్నలిజం/క్రిమినాలజీ/పోలీస్‌ అండ్‌ సెక్యూరిటీ స్టడీస్‌.
» బీఎస్సీ-ఎంఎస్సీ ఫోరెన్సిక్‌ సైన్స్‌
» పీజీ డిప్లొమా: విభాగాలు: ఫింగర్‌ప్రింట్‌ సైన్స్‌/ఫోరెన్సిక్‌ డాక్యుమెంట్‌ ఎగ్జామినేషన్‌/క్రైమ్‌ సీన్‌ ఫోటోగ్రఫీ/క్రైమ్‌ సీన్‌ మేనేజ్‌మెంట్‌/డీఎన్‌ఏ ఫోరెన్సిక్స్‌/ఫోరెన్సిక్‌ జర్నలిజం/ఫోరెన్సిక్‌ బాలిస్టిక్స్‌/ హ్యూమానిటేరియన్‌ ఫోరెన్సిక్స్‌/డిజాస్టర్‌ విక్టిమ్‌ ఐడెంటిఫికేషన్‌/సైబర్‌ ఫిజికల్‌ సిస్టమ్‌/సెమీ కండక్టర్‌ సెక్యూరిటీ అండ్‌ ఫోరెన్సిక్‌ ఇన్వెస్టిగేషన్‌/సైబర్‌ క్రైమ్‌ ఇన్వెస్టిగేషన్‌ ఇన్వెస్టిగేటివ్‌/సైబర్‌ టెక్నాలజీ/ఇన్వెస్టిగేటివ్‌ సైకాలజీ/సెక్యూరిటీ స్టడీస్‌/సైబర్‌ లా/డ్రగ్‌ అండ్‌ సబ్‌స్టాన్స్‌ అబ్యూస్‌ లాస్‌/ఇంటర్నెట్‌ గవర్నెన్స్‌/ఇండస్ట్రియల్‌ సేఫ్టీ, హైజీన్‌ అండ్‌ ఇన్విరాన్‌మెంటల్‌ మేనేజ్‌మెంట్‌.
» ఎంటెక్‌: విభాగాలు: సైబర్‌ సెక్యూరిటీ/ఏఐ అండ్‌ డీఎస్‌/సివిల్‌ ఇంజనీరింగ్‌/రోబోటిక్స్‌ అండ్‌ ఆటోమేషన్‌/అప్లైడ్‌ డేటా సైన్స్‌ అండ్‌ ఆర్టిఫిషియల్‌ ఇంటెలిజెన్స్‌.
» బీటెక్‌: ఎంటెక్‌ కంప్యూటర్‌ సైన్స్‌ అండ్‌ ఇంజనీరింగ్‌.
» ఎంబీఏ: విభాగాలు: ఫోరెన్సిక్‌ అకౌంటింగ్‌ అండ్‌ ఫ్రాడ్‌ ఇన్వెస్టిగేషన్‌/సైబర్‌ సెక్యూరిటీ మేనేజ్‌మెంట్‌/హాస్పిటల్‌ అండ్‌ హెల్త్‌కేర్‌ మేనేజ్‌మెంట్‌/బిజినెస్‌ అనలిటిక్స్‌ అండ్‌ ఇంటెలిజెన్స్‌.
» బీబీఏ-ఎంబీఏ: విభాగాలు: ఫోరెన్సిక్‌ అకౌంటింగ్‌ అండ్‌ ఫ్రాడ్‌ ఇన్వెస్టిగేషన్‌/ఫైనాన్షియల్‌ మేనేజ్‌మెంట్‌/బిజినెస్‌ అనలిటిక్స్‌ అండ్‌ ఇంటెలిజెన్స్‌.
» ఎంఫిల్‌ క్లినికల్‌ సైకాలజీ, బీఏ-ఎంఏ క్రిమినాలజీ, డిప్లొమా కన్సైన్‌ ఫోరెన్సిక్స్‌, ఎల్‌ఎల్‌ఎం: విభాగాలు: సైబర్‌ లా అండ్‌ సైబర్‌ క్రైమ్‌ ఇన్వెస్టిగేషన్‌/క్రిమినల్‌ లా అండ్‌ క్రిమినల్‌ జస్టిస్‌ అడ్మినిస్ట్రేషన్‌; -బీఎస్సీ-ఎల్‌ఎల్‌బీ(ఆనర్స్‌), ఎల్‌ఎల్‌బీ(ఆనర్స్‌), బీబీఏ-ఎల్‌ఎల్‌బీ(ఆనర్స్‌), ఎంఫార్మసీ(ఫోరెన్సిక్‌ ఫార్మసీ/ఫార్మాస్యూటికల్‌ క్వాలిటీ అస్యూరెన్స్‌).
» క్యాంపస్‌: గాంధీనగర్‌, ఢిల్లీ, గోవా, త్రిపుర, భోపాల్‌,పుణె, గువాహటి,మణిపూర్‌, ధార్వాడ్‌.
» అర్హత: ప్రోగ్రామ్‌ను అనుసరించి సంబంధిత విభాగంలో 10+2, డిప్లొమా, బ్యాచిలర్‌ డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులై ఉండాలి.
» ఎంపిక విధానం: పీజీ డిప్లొమా ప్రోగ్రామ్‌లో విద్యార్హత మార్కుల ఆధారంగా సీటు లభిస్తుంది. మిగిలిన కోర్సులకు వర్సిటీ నిర్వహించే నేషనల్‌ ఫోరెన్సిక్‌ అడ్మిషన్‌ టెస్ట్‌(ఎన్‌ఎఫ్‌ఏటీ)-2023, అకడమిక్‌ మార్కులు, ఇంటర్వ్యూ ఆధారంగా విద్యార్థులను ఎంపికచేస్తారు.
» ఆన్‌లైన్‌ దరఖాస్తులకు చివరితేది: 29.05.2023.
» ప్రవేశ పరీక్ష తేదీలు:01.07.2023, 02.07.2023
» వెబ్‌సైట్‌: www.nfsu.ac.in

ఎన్‌ఎస్‌ఐ, కాన్పూర్‌లో పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు

కాన్పూర్‌లోని నేషనల్‌ షుగర్‌ ఇన్‌స్టిట్యూట్‌ 2023-24 అకడమిక్‌ సెషన్‌కు గాను పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

పీజీ డిప్లొమా కోర్సులు

» పోస్టు గ్రాడ్యుయేట్‌ డిప్లొమా కోర్సు ఆఫ్‌ అసోసియేట్‌షిప్‌(షుగర్‌ టెక్నాలజీ -రెండున్నరేళ్లు)-66 సీట్లు.
» పోస్టు గ్రాడ్యుయేట్‌ డిప్లొమా కోర్సు ఆఫ్‌ అసోసియేట్‌షిప్‌(షుగర్‌ టెక్నాలజీ-ఏడాదిన్నర)-40 సీట్లు.
» పోస్టు గ్రాడ్యుయేట్‌ డిప్లొమా కోర్సు(ఇండస్ట్రియల్‌ ఫెర్మెంటేషన్‌ అండ్‌ ఆల్కహాల్‌ టెక్నాలజీ)-50 సీట్లు.
» పోస్టు గ్రాడ్యుయేట్‌ డిప్లొమా కోర్సు(షుగర్‌ కేన్‌ ప్రొడక్టివిటీ అండ్‌ మెచ్యూరిటీ మేనేజ్‌మెంట్‌)-20 సీట్లు.
» పోస్టు గ్రాడ్యుయేట్‌ డిప్లొమా కోర్సు(ఇన్‌స్ట్రుమెంటేషన్‌ అండ్‌ ప్రాసెస్‌ కంట్రోల్‌)-17 సీట్లు.
» పోస్టు గ్రాడ్యుయేట్‌ డిప్లొమా కోర్సు(క్వాలిటీ కంట్రోల్‌ అండ్‌ ఇన్విరాన్‌మెంటల్‌ సైన్స్‌)-22 సీట్లు.
» షుగర్‌ ఇంజనీరింగ్‌ సర్టిఫికేట్‌ కోర్సు-17 సీట్లు.
» షుగర్‌ బాయిలింగ్‌ సర్టిఫికేట్‌ కోర్సు-63 సీట్లు
» క్వాలిటీ కంట్రోల్‌లో సర్టిఫికేట్‌ కోర్సు-30 సీట్లు
» అర్హత: కోర్సును అనుసరించి మెట్రిక్యులేషన్‌, పన్నెండో తరగతి, సంబంధిత విభాగంలో డిప్లొమా, బ్యాచిలర్స్‌ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» ఎంపిక విధానం: ప్రవేశ పరీక్ష ఆధారంగా సీటు కేటాయిస్తారు.
» ఆన్‌లైన్‌ దరఖాస్తులకు చివరితేది: 26.05.2023.
» ప్రవేశ పరీక్ష తేది: 25.06.2023.
» వెబ్‌సైట్‌: www.nsi.gov.in

ప్రిలిమ్స్‌పై.. పట్టు సాధించేలా!

» మే 28న సివిల్స్‌ ప్రిలిమినరీ
» రెండు పేపర్లుతో 400 మార్కులకు పరీక్ష
» దాదాపు ఆరు లక్షల మంది పోటీ పడే అవకాశం
» 1:12 లేదా 1:13 నిష్పత్తిలో మెయిన్‌కు ఎంపిక
» 21 సర్వీసుల్లో 1105 పోస్టులకు ఎంపిక ప్రక్రియ

సివిల్‌ సర్వీసెస్‌ ఎగ్జామ్‌ ద్వారా ఐఏఎస్‌, ఐపీఎస్‌, ఐఎఫ్‌ఎస్‌ సహా మొత్తం 21 సర్వీసులకు యూపీఎస్సీ అభ్యర్థులను ఎంపిక చేస్తుంది. మూడంచెల ఈ ఎంపిక ప్రక్రియలో తొలిదశ పరీక్ష ప్రిలిమ్స్‌ను మే 28వ తేదీన నిర్వహించనుంది. అత్యున్నత స్థాయి సర్వీసులైన సివిల్‌ సర్వీసులకు.. ఫ్రెషర్స్‌ నుంచి రిపీటర్స్‌ వరకు లక్షల మంది పోటీ పడుతుంటారు. ఇందుకోసం ఏళ్ల తరబడి కృషి చేస్తుంటారు. పోటీ తీవ్రంగా ఉంటుంది. కాబట్టి పరీక్ష సమీపిస్తున్న నేపథ్యంలో.. సివిల్స్‌ ప్రిలిమ్స్‌లో రాణించేందుకు నిపుణులు మెలకువలు...



సివిల్‌ సర్వీసెస్‌-2023

సివిల్‌ సర్వీసెస్‌-2023 ద్వారా 21 సర్వీసుల్లో మొత్తం 1105 పోస్టులకు అభ్యర్థుల ఎంపిక జరుగుతుంది. తొలి దశ ప్రిలిమ్స్‌కు దేశవ్యాప్తంగా దాదాపు ఆరు లక్షల మంది పోటీ పడే అవకాశముంది. ప్రిలిమ్స్‌లో రాణిస్తేనే తదుపరి దశ మెయిన్స్‌కు అర్హత లభిస్తుంది. ఒక్కో పోస్టుకు 1:12.5 నిష్పత్తిలో మెయిన్స్‌కు ఎంపిక చేస్తారు. అంటే.. తొలి దశకు ఆరు లక్షల మంది హాజరైతే.. రెండో దశకు అర్హత పొందేది 14వేల మంది మాత్రమే!ఈ జాబితాలో నిలవాలంటే.. ఎంతో అప్రమత్తంగా ప్రిపరేషన్‌ సాగించాలని నిపుణులు సూచిస్తున్నారు.

మిగిలింది 40 రోజులే

సివిల్స్‌ ప్రిలిమ్స్‌ పరీక్ష తేదీ మే 28ని పరిగణనలోకి తీసుకుంటే.. అభ్యర్థులకు అందుబాటులో ఉన్న సమయం 40 రోజులు. ఎంతో విలువైన ఈ సమయాన్ని అభ్యర్థులు పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలి. విశ్లేషణాత్మక అధ్యయనం, పునశ్చరణ, సమయ పాలన, ప్రాక్టీస్‌ వంటి వాటితో నిరంతరం తమ ప్రిపరేషన్‌కు పదును పెట్టుకోవాలి.

సమయ పాలనతో.. సక్సెస్‌

ప్రిలిమ్స్‌ అభ్యర్థులు ప్రస్తుతం పేపర్‌-1 జనరల్‌ స్టడీస్‌ సిలబస్‌లోని అన్ని అంశాలను నిత్యం చదివేలా టైమ్‌ ప్లాన్‌ రూపొందించుకోవాలి. ప్రతి రోజు కనీసం ఎనిమిది నుంచి పది గంటలు ప్రిపరేషన్‌కు కేటాయించాలి. దీంతోపాటు ప్రతి వారం ప్రిపరేషన్‌ పూర్తి చేసుకున్న తర్వాత సెల్ఫ్‌ టెస్టులు, మాక్‌ టెస్టులు రాయడం కూడా ఉపకరిస్తుంది.

సమకాలీనంపై దృష్టి

ప్రస్తుత సమయంలో అభ్యర్థులు సమకాలీన అంశాలపై అవగాహనకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలి. అదేవిధంగా సిలబస్‌లో పేర్కొన్న కోర్‌ టాపిక్స్‌ను కరెంట్‌ అఫైర్స్‌తో సమ్మిళితం చేసుకుంటూ చదవాలి. ప్రిలిమ్స్‌లో ప్రశ్నలు కరెంట్‌ అఫైర్స్‌ సమ్మిళితంగా ఉంటున్నాయి. కాబట్టి ఈ ఏడాది మే ముందు నుంచి ఏడాది, ఏడాదిన్నర కాలంలోని ముఖ్యమైన కరెంట్‌ ఈవెంట్స్‌పై దృష్టి పెట్టాలి. వాటిని సంబంధిత సబ్జెక్ట్‌ అంశాలతో అనుసంధానం చేసుకుంటూ చదవాలి. నేపథ్యం,ప్రభావం, ప్రస్తుత పరిస్థితి, భవిష్యత్తు అంచనా వంటి కోణాల్లో విశ్లేషించుకోవాలి.

అనుసంధానం చేసుకుంటూ

అభ్యర్థులు ఎకానమీ-పాలిటీ, ఎకానమీ-జాగ్రఫీ, జాగ్రఫీ-ఎకాలజీ; జాగ్రఫీ-సైన్స్‌ అండ్‌ టెక్నాలజీ విభాగాలను అనుసంధానం చేసుకుంటూ ప్రిపరేషన్‌ సాగించాలి. ఫలితంగా ప్రిపరేషన్‌ పరంగా కొంత సమయం కలిసొస్తుంది. ఈ సమయాన్ని తమకు క్లిష్టంగా భావించే ఇతర అంశాలపై దృష్టి పెట్టేందుకు వినియోగించొచ్చు.

ముఖ్యాంశాల పునశ్చరణ

సబ్జెక్ట్‌ వారీగా ముఖ్యాంశాలను గుర్తించి.. వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలి.ఇప్పటికే సిద్ధం చేసుకున్న సొంతనోట్స్‌ ద్వారా పునశ్చరణకు ప్రాధాన్యం ఇవ్వాలి. గత నాలుగైదేళ్ల ప్రశ్న పత్రాలను పరిశీలించాలి. వాటిల్లో ఆయా సబ్జెక్ట్‌ల నుంచి ఎలాంటి ప్రశ్నలు అడుగుతున్నారు..ఏ అంశాలకు అధిక ప్రాధాన్యం లభిస్తుందో గుర్తించాలి. వాటికి ప్రిపరేషన్‌లో ప్రాధాన్యం ఇవ్వాలి. అంతర్జాతీయ పరిణామాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ప్రతి సబ్జెక్ట్‌ను కనీసం రెండు సార్లు పునశ్చరణ చేసేలా ప్రణాళిక రూపొందించుకోవాలి. వాస్తవానికి ప్రిలిమ్స్‌ అభ్యర్థులు ఇప్పటికే తమ ప్రిపరేషన్‌ను పూర్తి చేసుకుని ఉంటారు. కాబట్టి ఇక నుంచి పూర్తిగా రివిజన్‌పై దృష్టిపెట్టాలి.

కొత్త అంశాలకు ఇలా

ప్రిపరేషన్‌ సమయంలో అభ్యర్థులు క్లిష్టంగా భావించిన అంశాలను తర్వాత చదవచ్చనే ధోరణితో విస్మరిస్తారు. ఇలా వదిలేసిన టాపిక్స్‌కు సంబంధించి ఇప్పుడు కొత్తగా ప్రిపరేషన్‌ ప్రారంభించడం సరికాదని సబ్జెక్ట్‌ నిపుణుల అభిప్రాయం. ప్రస్తుత సమయంలో ఇప్పటికే పట్టు సాధించిన అంశాలపై మరింత లోతైన అవగాహన పెంచుకోవాలని సూచిస్తున్నారు. ఒకవేళ తప్పనిసరి పరిస్థితుల్లో కొత్త అంశాలను చదవాల్సి వస్తే.. వాటికి సంబంధించి సినాప్సిస్‌, కాన్సెప్ట్‌లపై దృష్టిపెట్టాలని పేర్కొంటున్నారు.

గత ప్రశ్న పత్రాల సాధన

ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమయంలో ప్రిలిమ్స్‌ అభ్యర్థులకు ఉపకరించే మరో సాధనం.. గత ప్రశ్న పత్రాలను ప్రాక్టీస్‌ చేయడం. ఇప్పటి నుంచి పరీక్ష ముందు రోజు వరకు ప్రతి రోజు ఒక ప్రీవియస్‌ పేపర్‌ ప్రాక్టీస్‌ చేసేలా సమయం కేటాయించుకోవాలి. దీని ద్వారా తమ బలాలు, బలహీనతలపై అవగాహన ఏర్పడుతుంది.

పేపర్‌-2ను విస్మరించొద్దు

ప్రిలిమ్స్‌లో పేపర్‌-2ను అర్హత పేపర్‌గానే పేర్కొన్నప్పటికీ.. ఇందులో 33 శాతం మార్కులు సాధిస్తేనే పేపర్‌-1 మూల్యాంకన చేస్తారు. దాని ఆధారంగానే మెయిన్స్‌కు ఎంపిక చేస్తారు. కాబట్టి పేపర్‌-2లో అర్హత మార్కులు సాధించేందుకు ప్రధానంగా మ్యాథమెటిక్స్‌,లాజికల్‌ రీజనింగ్‌ స్కిల్స్‌, ఇంగ్లిష్‌ కాంప్రహెన్షన్‌ అంశాలను ప్రాక్టీస్‌ చేయాలి.

ఇలా గుర్తుంచుకోవచ్చు

విస్తృతంగా ఉండే సిలబస్‌ అంశాలను గుర్తుపెట్టుకోవడం ఎంతో కష్టమైన పని. కాని వ్యక్తిగత మెమొరీ టిప్స్‌ ద్వారా ఈ సమస్యను అధిగమించే అవకాశం ఉంది. పాయింటర్స్‌, ఫ్లో చార్ట్స్‌, విజువలైజేషన్‌ టెక్నిక్స్‌ వంటి వాటిని అనుసరించాలి. ముఖ్యమైన సంవత్సరాలు, గణాంకాలను గుర్తుంచుకునే క్రమంలో వ్యక్తిగతంగా అన్వయించుకోవడం కూడా మరో ముఖ్యమైన మెమొరీ టిప్‌గా నిలుస్తోంది. ఇలా.. టైమ్‌ ప్లాన్‌ నుంచి రివిజన్‌ వరకు నిర్దిష్ట వ్యూహంతో అడుగులు వేస్తే ప్రిలిమ్స్‌లో విజయావకాశాలు మెరుగుపరచుకోవచ్చు.

ప్రిలిమ్స్‌.. ముఖ్య టాపిక్స్‌

కరెంట్‌ అఫైర్స్‌

• బడ్జెట్‌, ఆర్థిక సర్వే, అంతర్జాతీయ ఒప్పందాలు. • జాతీయ ప్రాధాన్యం సంతరించుకున్న అంశాలు. • ఇటీవల కాలంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విధానాలు. • గత ఏడాది కాలంలో అమల్లోకి వచ్చిన సంక్షేమ పథకాలు. • ప్రభుత్వం చేపట్టిన ముఖ్యమైన ప్రాజెక్ట్‌లు వాటి ఉద్దేశం.

చరిత్ర

• ఆధునిక చరిత్ర • జాతీయోద్యమం. • ప్రాచీన,మధ్యయుగ చరిత్రకు సంబంధించి సాహిత్యం, కళలు, మత ఉద్యమాలు, రాజకీయ-సామాజిక-ఆర్థిక చరిత్ర అంశాలు. •ఆధునిక చరిత్రలో బ్రిటిష్‌ సామ్రాజ్య స్థాపన-పరిపాలన విధానాలు; బ్రిటిష్‌ వ్యతిరేక తిరుగుబాట్లు-ఉద్యమాలు(ప్రధానంగా స్వాతంత్ర్య పోరాటం), సంస్కరణోద్యమాలు.

రాజ్యాంగం

- రాజ్యాంగం: రాజ్యాంగ పరిషత్‌, రాజ్యాంగ సవరణ ప్రక్రియ,పీఠిక,తాజా రాజ్యాంగ సవరణలు-వాటికి సంబంధించిన రాజ్యాంగ ప్రకరణలు.
- రాజకీయ వ్యవస్థ: పార్లమెంటరీ వ్యవస్థ, అర్ధ సమాఖ్య, రాష్ట్రపతి, గవర్నర్‌, పార్లమెంట్‌, రాష్ట్ర శాసనసభలు, సుప్రీంకోర్టు, హైకోర్టు, ఎన్నికల కమిషన్‌, ఆర్థిక కమిషన్‌, పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్లు, అటార్నీ జనరల్‌, అడ్వకేట్‌ జనరల్‌, వాటికి సంబంధించి రాజ్యాంగ ప్రకరణలు.
- పంచాయతీరాజ్‌ వ్యవస్థ: బల్వంత్‌రాయ్‌, అశోక్‌ మెహతా, హన్మంతరావ్‌, జి.వి.కె. రావ్‌, సింఘ్వీ కమిటీల సిఫార్సులు. 73వ రాజ్యాంగ సవరణ చట్టం. • ప్రభుత్వ విధానం: విధాన రూపకల్పన జరిగే తీరు. విధానాల అమలు, వాటి సమీక్ష. -ఇటీవల ప్రభుత్వం తీసుకున్న ముఖ్య విధాన పర నిర్ణయాలు. • కేంద్ర-రాష్ట్ర సంబంధాలు: గత కొద్ది రోజులుగా చర్చనీయాంశంగా మారిన న్యాయ వ్యవస్థ క్రియాశీలత.

ఎకానమీ

• ఆర్థికాభివృద్ధిలో సహజ వనరులు-మూలధన వనరుల పాత్ర. • ఆర్థిక వ్యవస్థలో వివిధ రంగాల ప్రగతి(వ్యవసాయ రంగం, పారిశ్రామిక రంగం, సేవారంగం). పారిశ్రామిక తీర్మానాలు-వ్యవసాయ విధానం. • బ్యాంకింగ్‌ రంగం ప్రగతి-సంస్కరణలు-ఇటీవల కాలంలో బ్యాంకింగ్‌ రంగంలో స్కామ్‌లు, ఆర్థిక వ్యవస్థపై వాటి ప్రభావం. •తాజా మానవాభివృద్ధి, ప్రపంచ అభివృద్ధి నివేదికలు.

సైన్స్‌ అండ్‌ టెక్నాలజీ

• గత ఏడాది కాలంలో ఇస్రో ప్రయోగించిన ఉపగ్రహాలు. • ఇటీవల కాలంలో సంభవిస్తున్న వ్యాధులు-కారకాలు. • సైబర్‌ సెక్యూరిటీ యాక్ట్‌. • రక్షణ రంగంలో కొత్త మిస్సైల్స్‌ ప్రయోగాలు. • జాతీయ ముఖ్యమైన వన్యమృగ సంరక్షణ కేంద్రాలు. • పర్యావరణ పరిరక్షణ ఒప్పందాలు, చర్యలు. • వివిధ ఐటీ పాలసీలు.

జాగ్రఫీ

- భౌగోళిక వనరులు, సహజ సంపద.
- పర్యావరణ సమస్యలు-ఎక్కువగా కేంద్రీకృతమైన ప్రాంతాలు, దేశాలు.
- సౌర వ్యవస్థ, భూమి అంతర్‌ నిర్మాణం, శిలలు, జియలాజికల్‌ టైం స్కేల్‌, రుతుపవనాలు, ప్రపంచ పవనాలు, చక్రవాతాలు, ఉష్ణోగ్రత విలోమం, భూకంపాలు, సునామీలు.
- మన దేశ పరిస్థితుల నేపథ్యంలో నగరీకరణ; ఆదివాసులు;రుతుపవనాలు; మాన్‌సూన్‌ మెకానిజం; నదులు; జలాల పంపిణీ; వివాదాలు.

క్లుప్తంగా...

రైల్వే స్టేషన్ల వద్ద భద్రత మరింత బలోపేతం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అన్ని రైల్వే స్టేషన్లలో భద్రతను మరింత పటిష్టం చేయనున్నారు. సీసీటీవీ కెమెరాల ఏర్పాటు, అదనపు భద్రతా సిబ్బందిని నియోగించడంతోపాటు తగిన చర్యలు తీసుకోనున్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి రైల్వే భద్రత కమిటీ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. టికెట్ లేని ప్రయాణికులకు అప్పటికప్పుడు టికెట్లు జారీ చేసే వ్యవస్థను ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. రైల్వే స్టేషన్ల ఔటర్ పాయింట్లలో జీఆర్పీ పోస్టుల ఏర్పాటు, రైల్వే స్టేషన్లలో అదనంగా హోమ్ గార్డులను నియమించనున్నారు. రైల్వే స్టేషన్లు, రైల్వే ట్రాకుల సమీపంలో అసాంఘిక శక్తులకు చోటు లేకుండా చేసేందుకు పేట్రోలింగ్‌ను, రైల్వే స్టేషన్ల బయట కూడా పోలీసు బీట్లను పెంచనున్నారు. సమావేశంలో అదనపు డీజీ (రైల్వే) కుమార్ విశ్వజిత్, అదనపు డీజీ (శాంతి, భద్రతలు) శంఖబ్రత బాగ్చి, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

22న పీఎస్ఎల్వీ సీ55 ప్రయోగం


ప్రయోగానికి సిద్ధంగా ఉన్న పీఎస్ఎల్వీ సీ-55 ఉపగ్రహ వాహకనౌక

సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఈ నెల 22న మధ్యాహ్నం 2.19 గంటలకు సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్‌లోని మొదటి ప్రయోగవేదిక నుంచి పీఎస్ఎల్వీ సీ-55 ప్రయోగాన్ని చేపట్టేందుకు సిద్ధం చేస్తోంది. ఇస్రో అంతర్భాగంగా ఉన్న న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్ వారి వాణిజ్య ఒప్పందం మేరకు ఈ ప్రయోగాన్ని చేపడుతున్నారు. ఈ ప్రయోగంలో సింగపూర్‌కు చెందిన 741 కిలోల బరువు కలిగిన టెలియోస్-02 అనే ఉపగ్రహంతో పాటు లూమిలైట్-4 అనే 16 కేజీల బుల్లి ఉపగ్రహాన్ని రోదసీలోకి పంపించనున్నారు. ఈ ప్రయోగంలో పీఎస్ఎల్వీ రాకెట్‌లో నాలుగోదశ (పీఎస్-4)ను ఒక ఎక్స్‌పర్‌మెంటల్ చేయనున్నారు. ఈ రాకెట్‌లో ఆర్బిటల్ ఎక్స్‌పర్‌మెంటల్ మాడ్యూల్ (పీవోఈఎం) అమర్చి పంపిస్తున్నారు. అంటే పోలార్ ఆర్బిట్‌లో ఇంకా ఎన్ని రకాల కక్ష్యల్లో ఉపగ్రహాలను ప్రవేశపెట్టవచ్చో పరిశోధన చేయడానికి ఈ ఎక్స్‌పర్‌మెంటల్ ప్రయోగాన్ని చేస్తున్నారు.

సింపుల్‌గా కోట్లు కొట్టేస్తున్నారు



మూడేళ్లలో దేశవ్యాప్తంగా సైబర్ మోసాల్లో రూ.731.27 కోట్లు దోపిడీ

సాక్షి, అమరావతి: ప్రపంచాన్ని వణికిస్తున్న సైబర్ నేరాలు భారతదేశంలోనూ లెక్కకు మిక్కిలిగా నమోదవుతున్నాయి. చిరు ఉద్యోగుల నుంచి బడా పారిశ్రామికవేత్తల వరకు ఎవరినీ సైబర్ నేరగాళ్లు వదలడంలేదు. కంప్యూటర్, ఫోన్లతోనే సింపుల్‌గా పని కానిచ్చేస్తూ ఏటా వందల కోట్ల రూపాయలు దోచేస్తున్నారు. ఇలా గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో దేశవ్యాప్తంగా సైబర్ మోసగాళ్లు రూ.731.27 కోట్లు దోచేశారని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. మూడేళ్లలో 2.13 లక్షల సైబర్ మోసాలు జరిగినట్లు తెలిపింది. ఏటీఎం, డెబిట్ కార్డు, క్రెడిట్ కార్డు, ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ అప్లికేషన్, బ్యాంక్ సర్వర్ నుంచి కస్టమర్ల సమాచారాన్ని హ్యాకింగ్ చేయడం ద్వారా సైబర్ మోసాలకు పాల్పడుతున్నట్లు పేర్కొంది. ఈ మోసాలను అరికట్టడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ప్రజలను హెచ్చరిస్తూ అప్రమత్తం చేస్తోందని, డిజిటల్ చెల్లింపు భద్రతా నిబంధనలను అమలు చేయాలని బ్యాంకులకు సూచించినట్లు పేర్కొంది. డిజిటల్ చెల్లింపుల వ్యవస్థల సైబర్ భద్రతను మెరుగుపరిచేందుకు, సైబర్ మోసాల నిరోధం, కంప్యూటర్ భద్రతపై జాతీయ నోడల్ ఏజెన్సీ అయిన కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ వివిధ చర్యలను చేపట్టినట్లు తెలిపింది.

మహారాష్ట్రలో అత్యధికం

గత మూడేళ్లలో మహారాష్ట్రలో అత్యధికంగా 83,974 సైబర్ మోసాలు నమోదైనట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. మహారాష్ట్రలో రూ.240 కోట్లు కొట్టేసినట్లు చెప్పింది. ఆ తరువాత తమిళనాడులో 18,981 సైబర్ మోసాల్లో రూ.69.84 కోట్లు దోచుకున్నారు. హరియాణలో 18,573 కేసుల్లో రూ.66.98 కోట్లు, కర్ణాటకలో 11,916 మోసాల్లో రూ.60.75 కోట్లు కాజేశారు. తెలుగు రాష్ట్రాల్లో సైబర్ మోసాల సంఖ్య తక్కువగానే ఉంది. తెలంగాణలో 6,900 మోసాల్లో రూ.21.76 కోట్లు కాజేశారు. ఆంధ్రప్రదేశ్‌లో 1,885 సైబర్ మోసాల్లో రూ.5.69 కోట్లు కాజేసినట్లు పేర్కొంది.

సైబర్ మోసాల కట్టడికి తీసుకున్న చర్యలు

- అన్ని రకాల సైబర్ నేరాలపై ఫిర్యాదులకు హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ద్వారా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ ప్రారంభం
- బాధితులకు సహాయం చేయడానికి టోల్ ఫ్రీ నంబర్
- వినియోగదారుల డేటాను గోప్యంగా ఉంచాలని బ్యాంకులకు సూచన
- డిజిటల్ సేవల ప్రక్రియను సురక్షితంగా ఉంచడానికి నియంత్రణ చర్యలు చేపట్టాలని బ్యాంకులకు ఆదేశం
- సైబర్ మోసాలపై అవగాహన కల్పించేందుకు బ్యాంకులు, ఏటీఎంలలో పోస్టర్లు
- అన్ని లావాదేవీలకు ఆన్‌లైన్ హెచ్చరికలను తప్పనిసరి
- లావాదేవీల మొత్తంపై రోజువారీ పరిమితులు

దేశంలో గత మూడేళ్లలో సైబర్ మోసాలు, కాజేసిన మొత్తం

సంవత్సరం	మోసాలు	కాజేసిన మొత్తం
2019-20	73,386	రూ.244.01 కోట్లు
2020-21	73,988	రూ.228.65 కోట్లు
2021-22	65,893	రూ.258.61 కోట్లు

భార్యకు భరణంగా 2.18 లక్షల 'చిల్లర'

11 బస్తాల్లో కోర్టుకు తీసుకొచ్చిన భర్త

సేలం: అభిప్రాయబేధాల కారణంగా విడిపోయిన భార్యకు ఇవ్వాల్సిన భరణాన్ని చిల్లర నాణేలుగా భర్త తీసుకువచ్చిన సంఘటన తమిళనాడులోని సేలం కోర్టులో జరిగింది. సేలం జిల్లా దేవన్నక వుండనూరు కిడయూరు మెట్టూరుకి చెందిన రాజీ (57) ఓ ప్రైవేట్ కంపెనీలో క్యాషియర్‌గా పనిచేస్తున్నాడు. అతడి భార్య శాంతి. వీరు అభిప్రాయభేదాల కారణంగా విడివిడిగా జీవిస్తున్నారు. ఈ పరిస్థితిలో భరణం కోసం శాంతి సంగగిరి 2వ క్రిమినల్ కోర్టులో కేసు వేసింది. కేసును విచారించిన న్యాయమూర్తి..శాంతికి ప్రతి నెలా రూ.73,000 జీవన భృతిగా చెల్లించాలని ఆదేశించారు. కాగా, ఆ మొత్తాన్ని రాజీ సరిగ్గా చెల్లించకపోవడంతో శాంతి సంగగిరి కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. పిటిషన్ ను విచారించిన న్యాయమూర్తి..బకాయి మొత్తాన్ని (రూ.2.18 లక్షలు) వెంటనే చెల్లించాలని రాజీని ఆదేశించారు. దీంతో బుధవారం ఉదయం రాజీ తన భార్యకు చెల్లించాల్సిన భరణం సొమ్ము రూ.2.18 లక్షలను రూ.10 నాణేలుగా 11 బస్తాల్లో కోర్టుకు తీసుకువచ్చాడు. దీంతో కోర్టు సిబ్బంది ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. కాగా, భార్యకు భరణం సొమ్మును చిల్లర రూపంలో ఇచ్చి ఆమెను భర్త అవమానించాడని కోర్టు సిబ్బంది మండిపడ్డారు.

వద్దన్నందుకు చంపేశాడు

- కొద్దిరోజులుగా చక్రవర్తిని పక్కనపెట్టిన దుర్గ
- కోపంతో ఆమె గొంతునులిమి హత్య
- చిత్తూరులో బ్యూటీషియన్ మృతిలో వీడిన మిస్టరీ


దుర్గా ప్రశాంతి (ఫైల్)
చక్రవర్తి

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో సంచలనం సృష్టించిన బ్యూటీషియన్ దుర్గాప్రశాంతి మృతి కేసులో మిస్టరీ వీడింది. దుర్గాప్రశాంతిది హత్యగా పోలీసులు తేల్చారు. ప్రాణాపాయ స్థితిలో తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నిందితుడు చక్రవర్తి నోరు విప్పడంతో అసలు విషయం బయటపడింది. కొద్దిరోజులుగా తనను పక్కకు పెట్టడం, పెళ్లి విషయాన్ని వాయిదా వేస్తూ రావడంతోనే దుర్గాప్రశాంతిని చంపేసినట్లు నిందితుడు అంగీకరించాడు. ఇక్కడ ఆస్పత్రిలో కోలుకున్న చక్రవర్తి ప్రస్తుతం పోలీసుల పహారా మధ్య తిరుపతిలోని రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

మోచేతితో గొంతుబిగించి..

చిత్తూరుకు చెందిన పోలీసు హెడ్ కానిస్టేబుల్ కుమార్తె దుర్గాప్రశాంతికి, తెలంగాణలోని కొత్తగూడేనికి చెందిన చక్రవర్తికి ఫేస్‌బుక్ ద్వారా రెండేళ్లుగా పరిచయం ఉంది. దుర్గాప్రశాంతిని పెళ్లి చేసుకోవాలనే ఉద్దేశంతో చక్రవర్తి భద్రాచలంలో ఉన్న తన తల్లిని తీసుకుని చిత్తూరు వచ్చి దుకాణం తెరచి ఇక్కడే ఉంటున్నాడు. ఇటీవల పెళ్లి ప్రస్తావన వచ్చినప్పుడల్లా తనకు కాస్త సమయం కావాలని దుర్గాప్రశాంతి కోరేది. వారం రోజులుగా వారి మధ్య విభేదాలొచ్చాయి. తనకు ఫోన్ చేయవద్దని, పెళ్లి ఇప్పుడే వద్దని ఆమె స్పష్టం చేసింది. ఈ మాటలను పట్టించుకోని చక్రవర్తి నిత్యం ఫోన్లు చేస్తుండటంతో తన మొబైల్ చాట్స్ అన్నీ డిలీట్ చేయాలని చక్రవర్తికి చెప్పి అతడి మొబైల్ నంబర్‌ను బ్లాక్ చేసింది. తనను ఎందుకు పక్కకు పెట్టావని ప్రశ్నిస్తూ, పెళ్లి చేసుకోమని కోరుతూ చక్రవర్తి మంగళవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో తన మెయిల్ నుంచి దుర్గాప్రశాంతికి ఎనిమిది పేజీల లేఖ రాశాడు. దీనికి ఆమె సమాధానం ఇవ్వలేదు. మధ్యాహ్నం ఆమె బ్యూటీపార్లర్‌లో ఉంటుందని తెలిసిన చక్రవర్తి 12.30 గంటల ప్రాంతంలో పార్లర్‌లోకి వెళ్లాడు. తనను పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేసినా దుర్గాప్రశాంతి అంగీకరించలేదు. దీంతో ఓ బ్లేడ్ తీసుకుని చేయి కోసుకున్నాడు. భయపడిన దుర్గ పార్లర్ నుంచి బయటకు పరుగెత్తేందుకు ప్రయత్నించింది. వెంటనే తన మోచేతితో దుర్గ గొంతును ఊపిరి ఆడకుండా గట్టిగా పట్టుకున్నాడు. ఆరడుగుల పొడవు, బలిష్టమైన శరీరంతో ఉన్న చక్రవర్తి పట్టు నుంచి దుర్గాప్రశాంతి తప్పించుకోలేక.. ఊపిరాడక క్షణాల్లో ప్రాణాలొదిలింది. దీంతో భయపడిన నిందితుడు తాను కూడా చనిపోవాలని బ్లేడుతో గొంతు, చేయి, శరీరంపై కోసుకుని తీవ్ర రక్తస్రావంతో పడిపోయాడు.

దిశ పోలీసుల దర్యాప్తు

ఈ కేసును చిత్తూరు దిశ పోలీసులకు అప్పగిస్తూ ఎస్పీ రిషాంత్‌రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. వన్‌టౌన్ పోలీసుల వద్ద ఉన్న సమాచారాన్ని దిశ స్టేషన్ డీఎస్పీ బాబుప్రసాద్ తీసుకున్నారు. దిశ సీఐ బాలయ్యతో కలిసి వైద్యులచే దుర్గాప్రశాంతి మృతదేహానికి పోస్టుమార్టం చేయించి, కుటుంబసభ్యులకు అప్పగించారు. నిందితుడు చక్రవర్తిపై హత్య, అట్రాసిటీ, ఆత్మహత్యాయత్నం సెక్షన్ల కింద కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.

నైపుణ్యాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శిగా సురేష్‌కుమార్

సాక్షి, అమరావతి: నైపుణ్యాభివృద్ధి, శిక్షణా శాఖ ముఖ్య కార్యదర్శిగా ఎస్.సురేష్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం పాఠశాల విద్యా కమిషనర్‌గా ఉన్న సురేష్‌కుమార్‌కు నైపుణ్యాభివృద్ధి శాఖ అదనపు బాధ్యతలను అప్పగించిన సంగతి తెలిసిందే. బుధవారం ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రధాన కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించిన అనంతరం ఆయన ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ప్రపంచంలో నైపుణ్యాల విలువ చాలా ముఖ్యమన్నారు. ప్రస్తుత కార్యక్రమాలను కొనసాగిస్తూనే విద్యార్థులకు మరింత విలువ జోడింపుపై దృష్టి సారించనున్నట్లు తెలిపారు.

గోదావరి నది తీర ప్రాంతంలో సాగుకు అనుకూలం



హెక్టారుకు రూ.26 వేల రాయితీ

సాక్షి, భీమవరం: ఒకప్పుడు మెట్ట ప్రాంతానికి మాత్రమే పరిమితమైన పామాయిల్ తోటల పెంపకంపై ఇప్పుడు డెల్టా వాసులు ఆసక్తి చూపిస్తున్నారు. గోదావరి తీరప్రాంతం పామాయిల్ సాగుకు అనుకూలమని తేలడంతో మొగల్తూరు, పోడూరు, నరసాపురం పాలకొల్లు మండలాల్లోని కొన్ని గ్రామాల్లో ఇప్పటికే రైతులు ప్రయోగాత్మకంగా పామాయిల్ పండిస్తున్నారు. జిల్లాలోని మరి కొన్ని మండలాలు కూడా పామాయిల్ సాగుకు అనుకూలమని ఉద్యానశాఖాధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ ప్రోత్సాహం కూడా తోడవడంతో లంక భూములున్న ఆచంట, పెనుగొండ, యలమంచిలి మండలాల్లోనూ సాగు చేయడానికి రైతులు మక్కువ చూపుతున్నారు.

పలు మండలాల్లో పామాయిల్ సాగుపై అవగాహన

పామాయిల్ పెంపకంపై ఇప్పటికే ఉద్యానవన శాఖ జిల్లాలోని పలు ప్రాంతాలలో అధ్యయనం చేసి సాగు చేయాలని రైతులకు సూచనలు చేసింది. దీనిలో భాగంగానే మొగల్తూరు మండలంలో ఉద్యాన శాఖ జిల్లా అధికారి దుర్గేష్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. మెట్ట ప్రాంతంలోని రైతులకు లాభదాయకంగా ఉన్న పామాయిల్ సాగును డెల్టా రైతులు చేపడితే వాణిజ్య పంటలతో సమానంగా మంచి ఆదాయం వస్తుందని చెబుతున్నారు. జిల్లా విభజన తరువాత పామాయిల్ సాగు కేవలం తాడేపల్లిగూడెం మండలంలోనే ఉండేది. జిల్లాలోని 20 మండలాల్లో 37,500 ఎకరాల్లో కొబ్బరి, కోకో, అరటి, మామిడి, తమలపాకు, నిమ్మ తదితర 32 రకాల ఉద్యాన పంటల సాగు చేస్తున్నారు. దీనిలో 4,580 ఎకరాల్లో పామాయిల్ పండిస్తున్నారు. ఉద్యానవన పంటల సాగును మరింత ప్రోత్సహించే లక్ష్యంతో పామాయిల్‌ను సాగు చేయాలని రైతులకు సూచిస్తోంది. అధిక ఆదాయం వచ్చే పంటలపై దృష్టి కేంద్రీకరించేలా ఉద్యాన శాఖ ప్రయత్నాలు ప్రారంభించింది.

థాయిలాండ్, మలేసియా నుంచి మొక్కలు

పామాయిల్ సాగు చేసే రైతులకు హెక్టారుకు రూ.26 వేలు ప్రభుత్వం రాయితీ ఇస్తుంది. వంటనూనె కొరత దృష్టిలో పెట్టుకుని పామాయిల్‌ను ప్రోత్సహించేలా చర్యలు తీసుకున్నారు. స్థానికంగా పామాయిల్ సాగు పెంచేందుకు థాయిలాండ్, మలేసియా నుంచి పామాయిల్ మొక్కలు తీసుకొచ్చి సాగు ప్రారంభించారు. పూర్వపు పశ్చిమగోదావరి జిల్లాలోని పెదవేగి కేంద్రంగా పామాయిల్ నూనె మిల్లు కూడా ప్రారంభించారు. దీనిని విభజన పశ్చిమగోదావరి జిల్లాలో విస్తరించడానికి చర్యలు చేపట్టారు. పామాయిల్ ప్రారంభంలో నాలుగేళ్లపాటు అంతర పంటలు వేసుకోవడానికి ఎకరానికి రూ.5,200లు రైతుకిస్తారు. పామాయిల్ చెట్లు ఎనిమిదో ఏట నుంచి దిగుబడినిస్తాయి. ఏడాదికి ఎకరాకు 10 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. మొక్కలు నాటిన నాలుగేళ్ల వరకు అంతర పంటలు వేసుకోవచ్చు.

పామాయిల్ సాగుకు ముందుకు రావాలి

జిల్లాలోని రైతులు ఎక్కువగా వరి, ఆక్వా, కొబ్బరి, కూరగాయలు సాగుచేస్తున్నారు. పామాయిల్ సాగుకు అనుకూలమైన భూములున్నందున రైతులు ముందుకు వస్తే ప్రభుత్వం రాయితీ ఇస్తుంది. హెక్టారుకు రూ.26 వేలు మొక్క దశ నుంచి ఎదిగే వరకు ప్రభుత్వం సహాయం అందిస్తుంది. లాభదాయమైన పామాయిల్ సాగు పట్ల ఆసక్తి ఉన్న రైతులు 79950 86770 నెంబరులో సంప్రదించాలి

మార్పు మొలకెత్తింది!

ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు ఆసక్తి

- ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం
- తగ్గుతున్న రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగం
- 2021-22లో ఉమ్మడి జిల్లాలో 5,36,648 టన్నుల ఎరువులు వాడకం
- 2022-23లో 2,57,696 టన్నులకు తగ్గుదల
- మెరుగుపడుతున్న భూఆరోగ్యం


ప్రకృతి వ్యవసాయం కింద సాగు చేసిన పంటలు

తగ్గిన పురుగు మందుల వినియోగం

రసాయన ఎరువులతో పాటు పురుగుమందుల వినియోగం కూడా తగ్గినట్లు స్పష్టమవుతోంది. 2021-22లో 1,48,629 టన్నుల పురుగు మందులను వినియోగించారు. 2022-23లో 1,41,234 టన్నుల పురుగు మందులను వినియోగించినట్లు స్పష్టమవుతోంది. 2021-22తో పోలిస్తే 2022-23లో 7,395 టన్నుల మేర పురుగుమందుల వాడకం తగ్గింది. పురుగు మందుల్లో బయో ఫర్టిలైజర్స్, తెగుళ్ల మందులు, కలుపు మందులు, పురుగుమందులు, గ్రోత్ హార్మోన్స్ తదితర 7 రకాలు ఉన్నాయి.



ఈ చిత్రంలో కనిపించే రైతు పేరు తరుణ్‌కుమార్ యాదవ్. గూడూరుకు చెందిన ఈయన దాదాపు 130 ఎకరాల్లో పండ్ల తోటలు అభివృద్ధి చేశారు. మామిడి, జామ, చీని, అంజూర, దానిమ్మ ఇలా అన్ని రకాల పండ్లతోటలు సాగు చేస్తున్నారు. దాదాపు దశాబ్దం క్రితం నుంచి ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. అంతకు ముందు రసాయన ఎరువులు, పురుగుమందులు ఎక్కువగా వాడేవారు. ఏటా దాదాపు 700 బస్తాల ఎరువులు వాడేవారు. ప్రకృతి వ్యవసాయంలోకి వచ్చిన తర్వాత రసాయన ఎరువుల జోలికెళ్లలేదు. దీంతో పెట్టుబడి వ్యయం బాగా తగ్గి నికరాదాయం గణనీయంగా పెరిగిందని చెబుతున్నారు.



ఈయన పేరు కృష్ణ. కోసిగి మండలం కోల్‌మాన్‌పేట. 135 ఎకరాల భూమి ఉంది. వరి, కంది, వేరుశనగ, పెసర, మినుము, పత్తితో పాటు వివిధ రకాల పండ్లతోటలు సాగు చేశాడు. 2012 వరకు రసాయన ఎరువులు, పురుగు మందులు వాడేవారు. ఎకరాకు సగటున 10 బస్తాల చొప్పున 135 ఎకరాలకు 1350 బస్తాల వరకు ఎరువులు ఉపగించేవారు. కెమికల్స్ వాడటం వల్ల కలిగే అనర్థాలను గుర్తించి 2012లో ప్రకృతి వ్యవసాయం వైపు వెళ్లారు. నాటి నుంచి రసాయనాలు లేకుండా పండించిన పంటలను కర్షక్ బ్రాండ్‌తో మార్కెటింగ్ చేసుకుంటున్నారు. ప్రకృతి వ్యవసాయంతో తనకు పెట్టుబడి ఖర్చు తగ్గడంతో పాటు భూ ఆరోగ్యం మెరుగుపడిందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఎరువుల వాడకం తగ్గడం సంతోషించే విషయం

ఏడాదికేడాది ఎరువుల వాడకం తగ్గుతూ వస్తోంది. రసాయన ఎరువులు మోతాదు మేరకు వాడితే మంచిదే. కానీ అధిక దిగుబడుల కోసం విచ్చలవిడిగా వాడుతున్నారు. దీంతో అనేక అనర్థాలు ఏర్పడుతున్నాయి. జిల్లాలో పెట్టుబడిలేని ప్రకృతి వ్యవసాయానికి ఆదరణ పెరుగుతోంది. రసాయన ఎరువుల వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరించి 2023-24లో వాటి వాడకాన్ని మరింత తగ్గిస్తాము.

-పీఎల్ వరలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి

కర్నూలు(అగ్రికల్చర్)

ఏటేటా ప్రకృతి వ్యవసాయానికి ఆదరణ పెరుగుతోంది. ప్రభుత్వ ప్రోత్సాహంతో రైతులు క్రమంగా ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గుచూపుతున్నారు. దీంతో గతంలో ఎప్పుడూ లేని విధంగా రసాయన ఎరువుల వాడకం తగ్గుతోంది. 2021-22తో పోల్చితే 2022-23 లో ఇటు వ్యవసాయ పంటలు, అటు ఉద్యాన పంటల్లో రసాయన ఎరువుల వాడకం భారీగా తగ్గింది. జిల్లాలో నీటిపారుదల సదుపాయం తక్కువగా ఉండటంతో వరి సాగు తగ్గి పత్తి సాగు గణనీయంగా పెరిగింది. పత్తితో పాటు మిర్చి కూడా విస్తారంగా సాగు కావడం విశేషం. రసాయన ఎరువుల్లో యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు ప్రధానమైనవి. 2021-22 సంవత్సరంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో 5,36,648 టన్నుల రసాయన ఎరువులు వినియోగించారు. 2022-23లో విభజన తర్వాత ఏర్పడిన కర్నూలు జిల్లాలో 2,57,696 టన్నుల ఎరువులు వినియోగించినట్లు స్పష్టం అవుతోంది. కెమికల్స్ వాడకం తగ్గుతుండటంతో భూమి ఆరోగ్యం .

2022-23లో జిల్లాలో ఎరువుల వినియోగం ఇలా

ఎరువు పేరు	2021-22 ఉమ్మడి జిల్లా లో వినియోగించింది	2022-23లో వినియోగించిన ఎరువుల వినియోగం
యూరియా	1,60,950	92,948
డీఏపీ	48,858	16,943
ఎంఓపీ	11,779	1,768
కాంప్లెక్స్	3,05,040	1,45,947
ఎస్ఎస్‌పీ	8,346	--
కంపోస్ట్	1,675	--
మొత్తం	5,36,648	2,57,696

పెట్టుబడి లేని వ్యవసాయానికి ఆదరణ

రసాయన ఎరువుల వినియోగంతో ఎన్నో అనర్థాలు ఉన్నాయనే విషయాన్ని రైతులు గుర్తించారు. విచ్చలవిడిగా ఎరువుల వినియోగిస్తుండటం ద్వారా పెట్టుబడి వ్యయం పెరిగి వ్యవసాయం గిట్టుబాటుకాని పరిస్థితి ఏర్పడింది. అలాగే భూమి స్వభావం కూడా దెబ్బతింటూ చౌడుబారుతున్నాయి. పర్యావరణం కలుషితం అవుతోంది. పంట ఉత్పత్తుల్లో కెమికల్స్ అవశేషాలు ఉంటుండటం ద్వారా గిట్టుబాటు ధరలు లభించని పరిస్థితి ఏర్పడింది. కంపెనీలు రసాయన ఎరువుల ధరలను అడ్డుగోలుగా పెంచేస్తున్నాయి. ఒక్క యూరియా మినహా అన్ని రకాల ఎరువుల ధరలు భారీగా పెరిగిపోయాయి. దీంతో పెట్టుబడి ఖర్చు పెరిగిపోవడంతో పాటు అధిక ఎరువుల వాడకం వల్ల కలుగుతున్న అనర్థాలను గుర్తించిన రైతులు స్వచ్ఛందంగా పెట్టుబడిలేని వ్యవసాయంవైపు మొగ్గుచూపుతున్నారు. అదే సమయంలో ప్రభుత్వం కూడా ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోంది. 2022-23లో 31,634 మంది రైతులు 35,772 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943